
5042



దీపావళినాటికి వెలువడుతుంది

స్వతంత్ర

ద్వితీయ వార్షిక సంచిక (ఇంగ్లీషు)

ముచ్చట గొలిపే త్రివర్ణ ముఖచిత్రం

అఖిల భారత ప్రఖ్యాత

రచయితల అమూల్య వ్యాసాలు

ఇంకా మరెన్నో కొత్త ఆకర్షణలు గల

120 పేజీల ప్రతి

వెల 1-8-0

ప్రకటన రేట్లకు వెంటనే వ్రాయండి

మేనేజరు, స్వతంత్ర


156, లాయడ్స్‌రోడ్ — మద్రాసు-14.

తెలుగు స్వతంత్ర

సంపుటి 1. సంచిక 13.

శుక్రవారం, అక్టోబరు 29, 1948

విషయ సూచిక



రాష్ట్రపతి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య

స్వతంత్ర

సంపుటి-1
సంచిక-1

అక్టోబరు 29, 1948

ప్రచురణ:
ప్రతిశుక్రవారం:

పట్టాభి విజయం

కాంగ్రెసు అధ్యక్షత పోటీలో పట్టాభి విజయం సాధించినాడు. ఈ విజయం నిజానికి ఆయన చిరకాల ప్రజాసేవకు విజయం. కాంగ్రెసు అధ్యక్ష స్థానానికి ఇంతవరకు జరిగిన పోటీలలో ఎన్నదగినవి త్రిపురా కాంగ్రెస్, జయపూర్ కాంగ్రెస్ ఎన్నికలే. త్రిపురా కాంగ్రెస్ ఎన్నిక సిద్ధాంతాల మీద నడచింది. ఎవరెన్ని చెప్పినా చివరకు గాంధీజీ నిర్ణయించిన వ్యక్తి కాంగ్రెస్ అధ్యక్షుడవడం అంతవరకూ ఆచారమైంది. ఆయనను వ్యతిరేకించిన సుభాస్‌బాబు కూడ హరిపురా కాంగ్రెస్ అధ్యక్షతకు ఆయన ఆశీర్వాదాన్ని పొందవలసినాడు. మొట్టమొదట యీ సాంప్రదాయాలను వ్యతిరేకించి విజయము సాధించినది సుభాస్‌బాబు ఆనాడు పరాజయం పొందినది పట్టాభి. తర్వాత ఆ పరాజయాన్ని అపనయించుకున్నది గాంధీజీ. నాటికి నేడు మళ్లీ ఎన్నిక జరిగింది. లోగా గాంధీజీ హయాంలో నేడుగురు కాంగ్రెస్ అధ్యక్షులు మారినారు కాని, ఎవ్వరూ పట్టాభిమాట తలపెట్టలేదు. ప్రస్తుతం వున్న వర్కింగుకమిటీ సభ్యులలో వయస్సులోనూ, అనుభవంలోనూ, సేవా పరాయణత్వంలోనూ వ్వరికీ ఆయన తీసిపోక పోయినా పాత సాంప్రదాయాలను అనుసరించి వర్కింగు కమిటీ సభ్యుల పరిపూర్ణ ఆమోదముతో పట్టాభి ఎన్నిక జరుగకపోవడం విచారకరం అందుచేతనే ఈ విజయాన్ని పట్టాభి వ్యక్తి విశేషతకు ఆపాదించక తప్పదు.

ఈ సందర్భంలో ప్రస్తుతం వర్కింగు కమిటీవారు తమ నాయకత్వ ధర్మాన్ని పరిత్యజించారు. కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నికలలో ఎప్పుడూ లేని తాటస్థ్యం ఇప్పుడెందుకుండాలి? తోడి సభ్యుడొకడు, ఈ గౌరవాని కర్హుడని ఎంతోకాలం క్రిందనే గాంధీజీచేత నియమితుడైన సభ్యుడు అభ్యర్థిగా నున్నప్పుడు ఆయనను బహిరంగంగా సమర్థించి బలపరచడం తమ ధర్మం ఏకారణంచేతనైనా ఆయన అర్హుడు కాడని తోస్తే బహిరంగంగా ఆ సంగతి దేశానికి తెలియచేసి వేరొకరిని నిలబెట్టి ఏకగ్రీవంగా ఎన్నిక జరిపిస్తే బాగుండేది అలాకాక తాటస్థ్యంపేరిట ఈ రీతిగా ఎన్నిక జరిపించడం చాలా శోచనీయం.

ఉత్తర దేశీయులైన మన నాయకులకు ఇటీవల ఒక ధర్మపన్నం చెప్పే అలవాటు బాగా అయింది ఆంధ్రరాష్ట్ర నిర్మాణమన్నా, భాషారాష్ట్ర విభజనమన్నా ఇదంతా ఒక రాష్ట్రీయ స్వార్థమంటూ

...న్నారు. వింధ్యకు దక్షిణాన ఉన్న 'అవివేకుల' కాలక్షేపంగా దాన్ని త్రోసి పుచ్చుతున్నారు. ఈ విషయంలో అవలంబించిన ప్రాథమిక సూత్రానికి కూడా స్వస్తిచెప్పి, తమ చేతుల్లో ఉన్న పెత్తందారీ వదలుకోవడానికిఇష్టం లేదేమో అనే సంశయం ప్రజల్లో కలిగేటట్లు ప్రవర్తిస్తున్నారు పట్టాభి ఎన్నిక ఆయన ప్రతిభకే కాకుండా, ఈ భాషా రాష్ట్రసిద్ధాంతానికీ ఒక విజయం. ఇందుకుకూడా ఆయన అభినందనీయుడు.

ఇట్టి అపూర్వ పరిస్థితిలో, దేశంలోని కాంగ్రెస్ సేవకుల సుహృద్భావంచేత లభ్యమైన ఈ పదవిని పట్టాభి మరింత ఔన్నత్యానికి తీసుకు రాగలడని ఆశిస్తున్నాము. ఆయనకీ పదవి నాక్రమించడానికి ధీశక్తి, వివేచనాశక్తి, పరిపాలన దక్షత అపారంగా వున్నాయి. పట్టాభికి సామాన్యంగా అపోహాలకు పాలయ్యే అలవాటుంది. దానికి కారణం ఆయన వాగ్ధోరణి. ఉపకారంచేస్తూ అపకారం చేసేటట్లు మాటాడుతాడు. అందుచేతనే ఆయనకు సామాన్యంగా ఆయనవల్ల ఉపకారం పొందినవారే శత్రువు లవుతారు. ఇంత వయస్సు వచ్చాక చిరకాల గతమైన అలవాట్లను మార్చుకోవడం కష్టమే కాని లోక సంగ్రహణార్థం మార్చుకోవాలి. రెండవ విషయం, ఆయన తన స్వస్థానంలో బలం చేకూర్చుకోవాలి. ఇంట గెలిచి రచ్చ గెల్వాలికదా! ప్రస్తుతం ఔత్తరాహులైన నాయకులలో స్వస్థానంలో బలంకలిగినవారు పటేల్, రాజేంద్రబాబు లాంటివారు ఎందరో లేరు. గాంధీ ఆశీర్వాదంతో కాంగ్రెస్ అధ్యక్షుడైనా, కృపలానీకి 'నా' అనే స్థలంలో ఎక్కడా ఎన్నదగిన బలం లేకపోవడంతోనే లోకువై రాజీనామా ఇచ్చుకో వలసి వచ్చింది. అలాంటి [illegible] పట్టాభి తన రాష్ట్రాన్ని ఏకీకరణం చేసుకుని తన తోటి పెద్దలను చిన్నలను నడిపించుకో గలిగితే, ఆయన తన పదవిని నిర్మోహమాటంగానూ, నిర్దుష్టంగానూ, ప్రతిభతోనూ నడుపగలుగుతాడు. రాష్ట్రంలోని తంత్రాలలో చిక్కుకోకపోతే యావత్తు రాష్ట్రంయొక్క బలాన్ని పొందగలుగుతాడు.

ఈ ఎన్నిక ఆంధ్రదేశానికెంతో సంతోషాన్ని చేకూర్చినా, ముప్పై ఆరుగురు సభ్యులు పట్టాభికి ప్రతికూలంగా ఓటు చేసినారనే విచారాన్ని కూడా కలిగించక మానదు. అభ్యర్థి దగ్గిరవాడైనప్పుడు, అందులో రాజకీయంలో అందరికీ ఉపకారమే చేయడం అసంభవమైనపుడు, ఇంత మాత్రం ప్రాతికూల్యం ఉండడం విశేషం కాదు. కాని ఈలాంటి అసాధారణ సమయంలో కూడా విశాలదృష్టిని కనబర్చలేక పోయారని మాత్రమే చింతించవలసి ఉంటుంది. ఎవరీ ముప్పై ఆరుగురు? అనే విమర్శవల్ల ప్రయోజనం లేదు. కొంతకాలంగా ఆంధ్రదేశాన్ని ఆవహించిన ఒక సంకుచితత్వమే ఇందుకు కారణము. నాకు లేకపోతే సంతోషమే కాని, ఎదుటివాడి కెందుకుండాలి అనే దుఃఖమే ఈ విపరీత చేష్టకు కారణం. 1946 సంవత్సరంలో శాసనసభా నాయకత్వానికి ప్రకాశంతో పోటీచేసిన ముత్తురంగ మొదల్యారుకు వోటుచేసిన ఆంధ్రశాసన సభ్యుల నైతిక పతనమే ఈ ముప్పై ఆరుగురికిన్నీ సిద్ధించింది. కనుక ఈ విషయాన్ని మథించి కొత్త శత్రుత్వాలు సృష్టించుకోవడంకన్న ఆంధ్రుల నావహించిన ఈ ఈర్ష్యా పిశాచాన్ని పెద్దలు పోగొట్టకలిగి అందరిని సమన్వయం చేయగలిగితే దేశానికి మంచిరోజులు.

యథాలాపం ::

యీ కాంగ్రెస్ ప్రెసిడెంటు ఎన్నికల్లో శ్రీ పట్టాభి సీతారామయ్య గారికి వ్యతిరేకంగా శ్రీ వల్లభాయి పటేల్ గారు తీవ్ర కృషి చేశారు. వీరిద్దరికీ యిటీవల పరస్పర విరోధభావము జాస్తీగా పెరిగింది. షణ్ముఖం చెట్టిగారిని వెళ్లగొట్టడంలో పట్టాభిగారు గట్టి పట్టు పట్టారు. సంస్థానములలో పటేల్‌గా రేర్పరచిన నూతన ప్రభుత్వ నిర్మాణమును పట్టాభిగారు విశ్వసించలేదు. వింధ్య ప్రదేశ సంస్థానములో ప్రజావిరోధమునకు పాత్రులైన సర్దార్లను మంత్రులుగా పటేల్‌గారు నియమించారు. యీ విపరీత చర్యను పట్టాభిగారు కఠినంగా ఖండించారు. శ్రీ వి. పి మీనన్‌గారు లేకుంటే సర్కారు రథం ఒక్క నిమిషంకూడా నడవలేదనే వ్యామోహం దేశమంతా వ్యాపించిపోగా, వారికి పెన్షనిచ్చి పంపివేయడమే యుక్తమని పట్టాభిగారొక్కరే ధైర్యంగా నిలిచి చెప్పగలిగారు.

* * *

ద్వంద్వతత్వ శిఖామణి నెహ్రూ సందేహ సముద్రంలో మునిగి రాజకీయాలను విజయవంతంగా నడపలేకపోతున్నాడనే వదంతి నొకదాన్ని కొంతమంది లేవదీశారు. దాని ప్రతిధ్వనులతో ప్రస్తుత వాతావరణమంతా నిండిపోయింది. ప్రభుత్వంలో తన్ను మించిన బలవంతుడు లేడనే కీర్తి పటేలుగారు సంపాదించ గలిగారు. యీ కీర్తి నిరంకుశత్వంగా పరిణమించింది. కాంగ్రెస్ పార్టీలో పటేల్ గారి అనుగ్రహం లేనిదీ పదవులు దొరకవనే విశ్వాసం అందరి హృదయాల్లో నాటుకుపోయింది. వారిని విమర్శించగలిగిన ధీరులే అరుదైపోయారు. వారు పెట్టిందే భిక్ష అని తమ మనస్సుల్లో తాము నిర్ణయించుకొని అభ్యర్థులందరు పై పోటీతో వారికి మొక్కుబళ్లు నర్పించి దౌర్బల్యం పాలయారు. యీ దౌర్బల్య విముక్తి నాశించిన వారి అంతరాత్మలు బహుశా ఆత్మగౌరవ స్థాపనకై పరితపించుచున్నాయేమో. ఒక విధంగా శ్రీ పట్టాభిగారి విజయము ప్రజాసామాన్య దౌర్బల్య విమోచన సూచనగా పరిగణింపవచ్చునేమో.

* * *

దేశ స్వాతంత్ర్య సంరంభంలో దక్షిణ దేశానికి యింతకాలం నాయక స్థానం లేకపోయిందనే చెప్పవచ్చు. శ్రీ చక్రవర్తి రాజగోపాలాచార్యులు గవర్నర్ జనరల్ అన్నమాట వాస్తవమే. కాని యీ పదవి వారికి వ్యక్తిగత రాజకీయ బలము వల్ల లభించలేదు. పటేల్ నెహ్రూల అనుగ్రహంవల్ల లభించింది. అనుగ్రహ ఫలితములు అశాశ్వతములు.

* * *

శ్రీ పట్టాభిగారి విజయంవల్ల మద్రాస్ రాజకీయాల్లో త్వరలో గొప్ప మార్పులు రావచ్చు. యీ ఎన్నికల్లో కామరాజ్ నాడార్, ప్రకాశం, రంగాగార్లు ఆంధ్ర మంత్రులతో కలిసి పట్టాభిగారిపక్షం శ్రద్ధ వహించి పనిచేశారు. వీరందరు ఏకమైతే వీరిని మించిన రాజకీయ శక్తి రాజధానిలో వుండదు. ప్రముఖ వర్గాల్లో పరస్పర శత్రుత్వం నశించి, తద్వారా ప్రస్తుత దౌర్బల్య

నాయకత్వం కూడా తొలగక తప్పదు. మంత్రులకును ప్రజలకును అన్యోన్య స్నేహ భావం లేనందున ప్రభుత్వం ప్రజల నుద్ధరించ లేకపోయింది. మంత్రుల యావచ్ఛక్తి పర్మిట్లద్వారా బలం సేకరించడానికి సరిపోతూ వచ్చింది.

* * *

రాష్ట్ర ప్రభుత్వ స్వరూపం మార్చడం శ్రీ పట్టాభిగారి ప్రథమ విధి. శ్రీ ఓమందూరి నాయకత్వం అన్ని విధముల హాస్యాస్పదమైపోయింది. నాయకుని ప్రధాన విహితుడు విద్యాశాఖమంత్రి విద్యావిధానాన్నే తారుమారుచేసేశాడు ఆహార శాఖా మంత్రి పరిపాలనవల్లనూటికిముప్పాతికజ: ఒకూడు లేక దిక్కులేనివారై పోయారు హరిజనశాఖ మంత్రి విపరీత వృథా ప్రయాణాలతో దుబారా వ్యయం చేయడం తప్ప యితర పరిపాలన చాతుర్యమేమీ యింతవరకూ కనపరచలేదు ప్రభుత్వం అసమర్థుల పాలైనందున ప్రజాహితం శూన్యమైంది. పనికి మాలినవారు ప్రభువులయినందున కాంగ్రెస్ యిప్పటికే అపకీర్తి పాలయింది. కాంగ్రెస్ కీర్తి పునః ప్రతిష్ఠాపన చేయడం శ్రీ పట్టాభిగారి ప్రథమకర్తవ్యం —(ఖాసా)



ఆంధ్రకేసరి కంచు విగ్రహ ప్రతిష్ఠాపన

విజయవాడనుండి శ్రీ కం విష్ణువర్ధన రావుగారిట్లు ప్రకటిస్తున్నారు:-

శ్రీ ఆంధ్రకేసరి కంచువిగ్రహ నిర్మాణమునకు పదకొండువేల రూపాయిలు, వేదిక నిర్మాణము, తదితర కార్యరూపములకు ఐదువేల రూపాయిలు, మొత్తం పదహారువేలకు పైగా ఖర్చు అగును. లోగడ మేము అంచనావేసుండగ యాభై వేల రూపాయిలకు పైగా అగునని ప్రకటించితిమి. విగ్రహనిర్మాణకంపెనీలనుండి రేట్లను తెప్పించితిమి. అందు శ్రీ ఎం. ఆర్. నాగప్పకంపెనీవారు, మద్రాసు పదకొండువేల రూపాయిలకు విగ్రహం నిర్మాణము చేసి యిచ్చెదమని చెప్పుటచే కమిటీ సమావేశమై మూడువేలు అడ్వాన్సు పంపినది. విగ్రహ నిర్మాణము చేయించబడుచున్నది.

శ్రీ ప్రకాశం పంతులుగారి 78 వ జన్మదినోత్సవమునాడు విగ్రహప్రతిష్ఠాపన చేయ నిశ్చయించితిమి. ఇంతవరకు సుమారు యేడువేల రూపాయిలకు పైగా వసూలైనవి. విశాఖపట్నం, ఏలూరు, బందరు, నర్సారావుపేట మునిసిపల్ సంఘములవారు తమ విరాళములు పంపియున్నారు. తెనాలి మునిసిపల్ సంఘమువారు రెండువందల రూపాయిలు, విజయవాడ మునిసిపల్ సంఘమువారు వెయ్యినూటపదహార్లు విరాళములు ఇచ్చుటకు తీర్మానించి గవర్నమెంటువారి అనుమతికొరకు వ్రాసియున్నారు. ఆంధ్రదేశమునందలి అన్ని మునిసిపల్ సంఘములకు విరాళముకొరకు అర్జీ పంపబడినది. మునిసిపల్ సంఘ అధ్యక్షులును, యితర మునిసిపల్ సభ్యులును తమతమ మునిసిపల్ సంఘములనుండి విరాళములు పంపే ఏర్పాటు చేయగలందులకు కోరబడుచున్నారు. సుమారు 250 మందికిని, సంఘసభ్యులకును విరాళములకొరకు రసీదు పుస్తకములు పంపబడినవి. వసూలు అయినంత వరకు విరాళములు వెంటనే పంపుచు మిగతా విరాళములు సాధ్యమైనంతవరకు వసూలుచేసి పంపగలందులకు కోరుచున్నాను.





సామాన్యుని సందేహాలు

“ఏది హింస? ఏదహింస ?”

సభల్లో ఉపన్యాసాలకూ, సాంఘిక సమావేశాల్లో సంభాషణలకూ వస్తువుగానే అహింసా సిద్ధాంతం వుపయోగించబడుతోంది. లా అండ్ ఆర్డర్ అనే మిషతో లాటీచార్జీలు కాల్పులూ జరపే ప్రభుత్వ సభ్యులూ, శేరు మాంసమయినా లేనిదే దినం గడవని మాంసభుక్కులూ, అందరూ “అహింస, అహింస, గాంధీజీ సిద్ధాంతాలను మనం అమలు జరపాలి” అని ఉపన్యసించడం ఆత్మవంచన; జగద్వంచన !

ఆహారానికీ ఆత్మసంరక్షణకు హింసావిధానం చాలా అవసరం. ఒక న్యాయసూత్రాన్నో నీతి సూత్రాన్నో అనుసరించి హింస జరిగినప్పుడు అది సహ్యమూ పూజ్యమూ అవుతున్నది. దేశసంరక్షణ అనే నెపంమీద యుద్ధంలో వేలకువేలు సైనికులు చచ్చిపోతుంటే అది హింసకాదా ?

ప్రపంచవిఖ్యాత పురుషుల్లో చాలామంది శాకాహారులు. హిట్లరు, బెర్నార్డుషా, సర్ స్టాఫర్డు క్రిప్సు కాని అది వారి అభిరుచి ననుసరించిందా? లేక వారి గొప్పతనానికి శాకాహారం మూల కారణమా ? అంతవారూ అంతకన్నా గొప్పవారూ మాంసాహారుల్లోనూ వున్నారు.

గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని శాసన రూపంగా మద్యపాన నిరోధంలాగా అమలు జరిపితే, ఏ ప్రభుత్వమూ తట్టుకోలేని ఉద్యమం బయలుదేరుతుంది. ప్రపంచంలో బహుసంఖ్యాకులు మాంసాహారులు.

శరీరంలో శక్తికి పిండిపదార్థములూ, వృద్ధికీ రోగనిరోధకశక్తికీ మాంసకృత్తులూ అవసరం. రసాయనికంగా మాంసకృత్తులయిన కారణంచేత శరీరంలో అవి జీర్ణమై ఆహారించబడవు. జంతుజములయిన మాంసము, పాలు, గ్రుడ్లు మొదలయిన వాటిలో నూటికి 37 వంతులు జీర్ణమై ఆహారించ బడుతున్నవి. శాకములయిన మాంసకృత్తులు యీ సంఖ్యకు ఏవిధంగానూ సమీపించవు. వానికి రోగ నిరోధకశక్తి శూన్యము. శాకాహారులమని చెప్పుకుండేవారుకూడా మాంసకృత్తులకు జంతుజములయిన పాలమీద ఆధారపడుతున్నారు.

బుద్ధిపరిశ్రమ చేసేవారిలో శాకజములయిన మాంసకృత్తులు సరిపోయినా, కాయకష్టం చేసే వారిలో కండరముల పునర్నిర్మాణానికి జంతుజములయిన మాంసకృత్తులు అవసరం.

అయితే, తనకన్న బలవత్తరుడైన మానవుడు క్షున్నివారణకై ప్రాణాలు కోల్పోతున్న జంతువర్గం బాధపడకుండా మరణించే విధానం జ్ఞానవేత్తలుకల్పించాలి. జీవకారుణ్యము ప్రధాన సిద్ధాంతమయిన క్రైస్తవ జాతులన్నీ ఆహారం కోసం చంపితే పాపం లేదని, జీవుల బాధతో విముక్తమనే ఆత్మలను శాంతి పుచ్చుకొంటున్నారు. జంతువధ ఆహారరీత్యా అవసరమయినా, బాధ తెలియని స్థితిలో జంతువుల్ని వధించే విధానాన్ని విజ్ఞానవేత్తలు కనిపెట్టడం అవసరం.

ఆహారానికే గాక సంఘ పరిపాలనకూ శాంతి సంరక్షణకూ హింసావిధానం అవసరమే. ఆస్తి మీద ఆశవల్లనో అహంభావంవల్లనో హత్యచేసిన, హింసచేసిన నేరస్థుడికి హింసాత్మకమయిన శిక్ష విధించకుండా ఉపన్యాసం యిచ్చి వొదిలిపెట్టడం, స్వామిత్వమూ, స్వార్థమూ, విద్యాశూన్యత ప్రధానమయిన మన సంఘంలో సాధ్యంకాదు. దురావేశంతో ఒక చెంపమీద ఒకడు దెబ్బకొడితే, ప్రతిఘటించకుండా మరొక చెంప చూపించినప్పుడు పశ్చాత్తప్తుడై హింసావాది మానుకొంటానికి అతనికి విద్యా ఆధ్యాత్మిక సంస్కారమూ కావాలి. అది లేనివారిదగ్గిర యీ విధానాన్ని అవలంబించడం, బూడిదలో పన్నీరుపోయడం.

ఏ ఆదర్శం సర్వజనానికీ, సర్వకాలములలో అనుసరణీయమూ అనుసరణ సాధ్యమూ కాదో

దానిని జనం నెత్తినరుద్దడంలో అర్థంలేదు. వల్లసరించలేని వ్యక్తులు నాయకులమీద గౌరవం అను ఆసూత్రాలనుఅనుసరించినట్లు నటిస్తూ,ఆడంబరాలు చేస్తూ చాటున తద్వ్యతిరిక్తంగా ప్రవర్తిస్తారు. హిందూసంఘంలోనూ, ముఖ్యంగా నేటి కాంగ్రెసు వాదుల్లోనూ త్రికరణశుద్ధి లేకపోవడానికి యిదే కారణం. జీవశాస్త్రీయసూత్రములకు వ్యతిరిక్తములయిన ఆదర్శముల బోధ జాతిని వంచనకు వశం చేస్తోంది. ఏ సత్యాన్ని వ్యాప్తిచేయడానికి మహాత్ముడు ఆందోళనపడ్డాడో ఆ సత్యమనేది నేటి వారిలో శూన్యమైపోయింది.

కాగా దైనిక జీవితంలోనూ, ప్రభుత్వ విధానంలోనూ అహింస ఎంతమాత్రమూ ఆచరణీయం కాదు. స్వామిత్వమూ స్వార్థమూ వున్న సంఘంలో ధనాశకు దురంతాలు మరీ విపరీతంగా వుంటవి.

కాని మహాత్ముని అహింసావిధానం సాయుధమై, పశుబలంతో, తమ అభిప్రాయాలకూ, ఆదర్శాలకూ,ఆర్థికవిధానాలకూ వ్యతిరిక్తమయిన ప్రచారమూ ఆందోళనా చేసేవారిని అణచివేసే ప్రభుత్వం మీద నిరాయుధులయిన రాజకీయ విప్లవకారులు అవలంబించదగిన చక్కని విధానం. ఎందుకంటే ఎంతపెద్ద ప్రభుత్వంలో వున్నవారికి అంతో యింతో సంస్కారం వుంటుంది. అనవసరములయిన దొమ్మీలూ, కూసీలూ, సమ్మెలూ, దౌర్జన్య విధానాలు వదలిపెట్టి కమ్యూనిష్టులు తమ ఆదర్శప్రచారానికి మహాత్ముడి సత్యాగ్రహ విధానాన్ని అవలంబిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏంచేస్తుంది? ఇప్పుడు నిస్సంకోచంగా అమలుపరుస్తున్న నిర్బంధ విధానాన్ని, దమననీతిని అప్పుడు అమలు పరచగలదా?

"ఏది నీతి? ఏది నేతి?"

సామాన్య ప్రజానీకానికి, ఆచరణసాధ్యంకాని మహాత్ముని ఆదేశములలో బ్రహ్మచర్య ప్రచారం వొకటి. దీన్ని జీవశాస్త్రదృష్టితో పరిశీలించాలి.

సృష్టిక్రమానికిజననమరణములు అవసరం. ప్రకృతిలోవున్న శక్తి ఒకేపరిమాణంకలది. అది చలితమూ, స్థబ్దమూ,అయి అధికంచేయడానికీ,నాశనంచేయడానికీవీలు లేనిదై రూపాంతరములనుమాత్రమే పొందుతుంది. జన్మలేనిది మరణంలేదు. మరణంలేనిది జన్మలేదు. జననమరణముల పరిభ్రమణం ప్రకృతి సూత్రాలననుసరించే జరుగుతున్నది. ఏది ప్రకృతి ధర్మాన్ననుసరించి జరుగుతున్నదో దాన్ని గురించి సిగ్గుపడడం గానీ, దాన్ని నిరోధించడం గానీ, సాధ్యమూ కాదు, సాధ్యమయినా యోగ్యమూ కాదు.

ఆచరించే మనుష్యులులేని నాడు నీతి సూత్రాలకు అర్థంలేదు. అవసరంలేదు. అందుచేత మానవుల వ్యుత్పత్తికి ప్రధానకారణమైన జాత్యసంయోగం సర్వమానవులూ, విద్యావివేకముల ప్రమేయం లేకుండా చేస్తున్నారు. చేయక తప్పదు. దాన్ని నిరోధించడం ఆదర్శంగా ప్రచారం చేయడం సృష్టిక్రమానికే మహాపరాధం. రోమన్ కేథలిక్కు మత గురువులకు యీఆదర్శం అవసరంగా నిర్దేశింపబడింది. వీర్యస్తంభన తేజస్సుకు బుద్ధికీ బలం కలిగించేదనీ, శరీర సంబంధం సహజంగా పవిత్రమైన శరీరాన్ని పాపలం చేసేదనే విశ్వాసంవల్ల యీ నిబంధన జరిగింది. మన స్వాములవార్లకూ యిదే నిబంధన. ఈ మత గురువుల అంతరంగికజీవితం విజ్ఞులందరికీ విదితమైందే! ఇదే కోవలో గాంధీజీ పడ్డాడు. అజీర్ణానికి నిరశనవ్రతం మందైతే,జాత్యవిషయాల్లో అవినీతికి బ్రహ్మచర్యం నివారణా అవుతుంది. ఈ విధమయిన బోధ నీతిని కాపాడ్డంకంటె తెరవెనక అవనీతిని వృద్ధిచేసేది. ధైర్యంగా బహిరంగంగా జరిగే 'అవినీతి'కి నైతికమయిన పునాదులుంటవి. ఆ విషయంలో బుద్ధిమంతులలో అభిప్రాయభేదం యేర్పడుతుంది.

జంతువుల్లో లేని జాత్యనీతిరాహిత్యం మానవుల్లో యేర్పడడానికి వారిలో జాత్యసంయోగం సంతానేతరమైన కారణములవల్ల జరగడం, అందువల్ల అది ఋతుగతి తప్పడం. ఈ ఋతుగతి తప్పడానికి స్వామిత్వంవల్లా, స్వామిత్వకాంక్షతో కలిగిన స్వార్థంవల్లా జాత్యాకర్షణ లేకపోయినా శరీరసంయోగం సాంఘిక ఆర్థిక ప్రయోజనాల

నాశించి జరగడం ప్రబలమయిన కారణం. జంతువుల్లో జాత్యసంయోగం నైసర్గిక స్వయంవరంవల్ల జరుగుతున్నది. ఏ యితర ఆశలూ ఆకర్షణలు యీ నైసర్గికాకర్షణను జయించలేవు. ఒక వ్యక్తిని గాఢంగా ప్రేమించినా, యితర కారణాలవల్ల ప్రేమించని వ్యక్తిని ఎంతమంది వివాహం చేసుకుంటున్నారు? ఇది నైతికంగా వ్యభిచారం కాదా? ఇందుకు కారణమేమిటి? ఈవిధమయిన నైతిక వ్యభిచారం ఆధారంగా గల వివాహసంస్థ యే విధంగా జాత్యనీతిని కాపాడుతుంది? నిజమయిన యేకగామిత్వం ఆశించేవారికి వివాహం సహజమయిన జాత్యాకర్షణమీదనే జరిగినప్పుడు గాని అది ఆదర్శంగా సాధ్యంకాదు. నీతికోసం బ్రహ్మచర్యం అవలంబించడం దారిద్ర్యసమస్యాపూర్తికి ఆత్మహత్య చేసుకోమంటం లాంటిది.

ఇక యిది ఆరోగ్యశాస్త్రరీత్యా ఆలోచిస్తే ప్రపంచంలో వైద్యశాస్త్రజ్ఞులందరూ ఏకగ్రీవంగా ఆరోగ్యానికి బ్రహ్మచర్యం అవసరంలేదని నిరూపించారు. సంయోగానికీ సంయోగానికీ మధ్య వ్యవధి యెంత వుండాలనే విషయంలో అభిప్రాయభేదమున్నదేగాని, జాత్య సంయోగావసర విషయంలో ఏ అభిప్రాయభేదమూ లేదు.

ప్రకృతి అవయవాలను వినియోగానికి యేర్పరిచింది. అది అతివినియోగాన్ని సహించదు. అవినియోగాన్నీ సహించదు. సహజమయిన వినియోగం నైతికమూ నైసర్గికమూ అయిన ధర్మం. యౌవన ప్రాదుర్భావం అయిన తరవాత నైసర్గికమయిన భౌతికాకర్షణతోను, మానసిక సమన్వయంతోనూ యేర్పడిన ప్రేమతో జరిగే జాత్యసంయోగం వైవాహికమయినా వైవాహికేతరమయినా నైతికమూ సహజమూ అయివుంటుంది. అల్లా కాక అయిష్టతతో కూడుకున్న జాత్యసంయోగం నీతి సూత్రాలను లోబడినదయినా ప్రత్యక్షవ్యభిచారమే అవుతుంది. స్త్రీ పురుషుల మధ్య సహజాకర్షణకు దోహదం, సాంఘికమూ ఆర్థికమూ అయిన స్వాతంత్ర్యం. కులమత విచక్షణలూ, ఆర్థికవ్యత్యాసాలూ పోయిననాడే కేవలం యీ ఆకర్షణ వైవాహిక జీవితానికి పునాది అవుతుంది.

ప్రజాబాహుళ్యం జీవితావసరములయిన ఆహార జాత్యవ్యవహారములలో గాంధీజీ బోధనలు సామాన్యులకు అర్థంకానివీ, అనుసరణసాధ్యములు కానివి అయినవిగా వున్నవి. ప్రయత్నించి అనుసరించినా అందువల్ల వచ్చే మేలుకన్న ఉపద్రవములు యెక్కువవుతవి.

ఈ బోధనలు విని ఒక పురుషుడు బ్రహ్మచర్యం ప్రారంభిస్తే జాత్యవాంఛ ప్రకోపించిన భార్య ఏమి కావాలి? అల్లా భార్య భర్తను నిరాకరిస్తే పురుషుడి గతి యేమిటి? ఈ విధమయిన దాంపత్యవైరుధ్యమూ ఆదర్శవ్యత్యాసమూ కలిగినప్పుడు ఆ జీవితం యితరుల జీవితంకన్నా యేవిధంగా అధికమైనది?

జాత్యనిరోధం స్త్రీపురుషుల్లో అనేక మానసిక దైహిక రోగములకు దారితీయగలదు. ఆచరణా సాధ్యమే కాకుండా, యీ బ్రహ్మచర్య బోధ జాతికి ప్రమాదహేతువుకూడా కావచ్చును. అయితే గాంధీజీ బోధలన్నిటిలో యీ బ్రహ్మచర్యోపదేశం ప్రజాబాహుళ్యంలో కనిష్ఠవ్యాప్తి పొందడం ముదావహం. అందులోనే అది జీవితానికి ఎంతదూరమైందో విరుద్ధమైందో గోచరించగలదు.–"సామాన్యుడు

తోడేలు జగత్తు

సి. వి. కృష్ణారావు

ప్రొద్దున లేచినప్పుడు కాఫీహోటల్ దగ్గరనుంచి రాత్రి రెండో ఆట సినిమా టిక్కెట్టు దొరికే వరకూ నేడు పట్టణాల్లో జనానికి వత్తిడి ఎక్కువైంది. ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో, యినుప కొటాల్లో, యిటుక బట్టీల్లో, రష్ ఎక్కువైంది— ఒక సిగరెట్ పదిమంది స్మోకర్స్.

మొన్న పుయ్యూర్ బస్ స్టాండుకు నేను వచ్చేప్పటికి మధ్యాహ్నం మూడు గంటలైంది. ఒక్కొక్క బస్ రావటం, వందమంది జనం ప్రధానమంత్రి వస్తే తోసుకున్నట్లు ముందు కురకటం—టిక్కెట్లు దొరక్కపోవటం—పస్సులు ఖాళీ చేసుకోవటం!

అందులో నేనొకణ్ణి-నలుగురుతో పాటు నారాయణుణ్ణి. ఫ్రాన్సులో సినిమాకు వెళ్ళినప్పుడు ఇంగ్లీషు అమెరికన్ సోల్జర్లు 'క్యూ' లో నిలబడ్డ తీరుకు లోపల మెచ్చా, మన ఆంధ్రజనావళిని కొత్తగుంపుగా పోల్చుకుంటూ తిట్టా.

బందరు దిక్కునుంచి బస్ వస్తూంటే 'అదిగో!' అని వంద మనోవృక్షాలు చిగురించాయి. బస్ ఆగీ ఆగకముందే కండక్టరు సీటు వైపు చేతి సంచుల వాళ్లూ, ఖద్దరు లాల్చీలవాళ్లూ కళ్లజోడు చేత్తో పట్టుకున్నవాళ్లూ, చెప్పు కాళ్లతో పాదాలు నలగదొక్కేవాళ్లూ!

నలుగురు దిగారు—టిక్కెట్లు లేవన్నాడు, కండక్టర్. ప్రాధేయపడ్డారు అందరూ. 'నేను చాలా అత్యవసరంగా పోవాలె మానాయన గదూ'— అని వేళ్లాడబడ్డారు యింకొందరు. ముఖాలు వేలవేశారు మొత్తానికి అందరూ.

"నలుగురు దిగితే ఒకటీ లేదంటాడేమిటండీ," అన్నాడు ఒకాయన.

"అదే నేడు దేశంలో జరిగే వ్యాపారం" అన్నాను దక్షిణంవైపు జూస్తూ.

"ఒరే నువ్వట్రా" అన్నాడు అడిగినాయన.

ఎవరా? అని ఆవ్యక్తిని చూశా; మా క్లాస్ మేట్ కోటి. అవీ యివీ మాట్లాడుకొని టిక్కెట్లు దొరికేందుకు ఎన్నో ఉపాయాలు ఆలోచించాం యిద్దరం. పత్రికలు-అమ్మే కుర్రాడు వస్తే 'మాకు పేపర్లొద్దుగాని, ఒక పావలా తీసికొని బెజవాడకు టిక్కెట్లిప్పించు—నీకు మంచి ఆదాయం," అన్నాడు మావాడు.

ఇక ప్లాన్ చెప్పటం మొదలెట్టాడు-"నీవు యింజన్ ముఖంగారా, నేను 'ఫ్లోర్' వేపునుంచి వస్తా: ఎవరికి దొరికినా రెండు తీసికొందాం."

ఒకటీ దొరకదని లోపల నమ్మకంతో "ఇద్దరికీ దొరుకుతే" అన్నాను విపరీతంగా.

"ఇంకోరికిద్దాం" అన్నాడు దయాసంధతతో.

ఇంతవరకూ నామనసులో చంటిపిల్లల మీదు పైన ఎండకు పైట చెంగుకప్పుకొని వున్న నిత్తేపులూ, గొడుగూ, సంచీ వుత్తరీయం కాచుకుంటూ టిక్కెట్టు తీసికోవాలని తహతహపడి టిక్కెట్టు దొరక్కపోగా ఏదోఒకటి పోగొట్టుకున్న వశిష్టులూ, మాటిమాటికీ జేబులో కలంమీదికి పోయే నాచేతి చాలన శాస్త్రమూ, మాత్రమే వున్నాయి. ఇక యిప్పుడు రెండు టిక్కెట్లు ఒకడికి యిస్తారా అనీ, ఒకటే అడుగుతే నన్ను మావాడు మోసకారి అనుకుంటాడేమోననీ, నేనొక్కణ్ణీ కారెక్కితే మళ్లా వాడికినాముఖం ఎల్లా చూపించాలనీ ఆందోళన. ఎలాగైనా కానీ రెండూ అడగాల్సిందే—యివ్వకపోతే ఎలానని ముఖం వేలవేస్తే అప్పటికన్నా నన్ను అనుమాన రహితుణ్ణిగా అనుకోడా? అని తృప్తిపడ్డా.

కారు వచ్చింది. కండక్టర్ దిగాడు. చుట్టూ గుమిగూడారు-మేమనుకున్న ప్లాన్ మెదడు మూల మలుపుకు నెట్టి, ఆ కిళ్లీకొట్టు ఆయనద్వారా ఏమన్నా పని జరుగుతుందేమో చూసివస్తానన్నాను. 'సరే'నన్నాడు కోటి.

నేను ముఖం విఫలుణ్ణయి వేళ్లాడేసుకొని వచ్చేప్పటికి వీడు వెనక సీటుమీద ఎక్కి కూనో బోతున్నాడు. 'విముక్తి లభించిం' దనుకొన్నా— రెండూ తీసికున్నాడుగదా అనుకొని.

"కోటీ, టిక్కెట్టు దొరికిందిరా!" అన్నా.

"ఏం దొరికిందో, డబ్బుమాత్రం కండక్టరు ముఖాన బారేశా" అన్నాడు చెక్క పేడు ముఖంతో చంటి పిల్లవాడి తెలియమి చూపించాలని ప్రయత్నిస్తూ.

రెండింటికీ అలాగే పారెయ లేకపోయినావా? అని నేను అడగలేక పోయినాను—వాడు చప్పుడు కాకుండా కూర్చున్నాడేగాని నాకు దొరకనందుకు విచారంగాని, రెండింటికీ ప్రయత్నం చేస్తే దాని ఫలితం గాని, పెదిమకదిల్చి చెప్పలేదు!

"రైట్" అన్నాడు కండక్టర్.

గ్రామపంచాయతీల భవిష్యత్తు

గుడిపాటి శ్రీహరికృష్ణ

గ్రామ జీవితాన్ని అన్నివిధాలా బాగుచేయడానికి గ్రామ పంచాయతీలు ఎంతో ఉపకరిస్తాయి— సమర్థుల చేతిలో పడే పక్షంలో, సదుపాయాలు కలుగ చేసేటట్లయితే. ఇందుకై సరి క్రొత్త బిల్లు తయారుకావలసి వుంది. ఒక ముసాయిదా బిల్లు తయారుకావడం, అన్ని రాష్ట్రాల స్థానికశాఖా మంత్రులు ఈ మధ్యనే న్యూఢిల్లీలో సమావేశమై చర్చించి పరిశీలించడం జరిగింది. మదరాసు మంత్రివర్గం త్వరలోనే ఈ బిల్లుపై చర్చ జరిపి అంతిమ నిర్ణయాలను రాదలచిందని తెలుస్తోంది.

ఈ బిల్లు నిర్మాణంలో ఎంతో అప్రమత్తతతో మదరాసు మంత్రివర్గం, శాసనసభ్యులు, ప్రజాహితైక సంస్థలు వ్యవహరించాలి. ఈబిల్లు మీదే గ్రామాల బాగోగులు పూర్తిగా ఆధారపడి వుండడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఈక్రింది విషయాల పరిశీలన అందుకు ఉపకరిస్తుంది.

గ్రామపంచాయతీ:

ప్రస్తుతం అమలునందున్న ఉత్తర్వుల ప్రకారం 1000 జనాభాగల ప్రతి గ్రామం, దీనికితోడు ల్యాండుసెస్సు రు 200 లకు తక్కువగాని పక్షంలో (రాయలసీమలో నైతే రు 120 లు ఉంటే చాలును) గ్రామస్థులు పంచాయతీ కావాలని పై అధికార్లకు తెలుపుకోవాలి. అందుకు వివరాలను పరిశీలించి లోకల్ బోర్డు ఇనస్పెక్టరు ఆమోదాన్ని తెలుపవలసివుంది. గ్రామస్థులు కోరితేగాని పంచాయతీ నెలకొల్పే అవకాశంలేదు.

1000 జనాభా ఉన్న గ్రామంలో పూర్వపు లెక్కల ప్రకారం 200 లోపు ఓటర్లే దానూపానివుంటూ వుండడం జరిగేది. ఇప్పుడో వయోజన ఓటర్ల జాబితాలు తయారు అయినాయి. ఇప్పట్లో 1000 మంది వయోజన ఓటర్లు వున్న గ్రామానికి ఒక పంచాయతీని గ్రామస్థులు కోరినా, కోరకపోయినా నెలకొల్పడం ఉచితమేకాకుండా అవసరంకూడాను. రాబడి చాలా ముఖ్యం. ల్యాండు సెస్సు పెరిగింది. అసలు జిల్లాబోర్డులను పూర్తిగా రద్దుపరిస్తే, ఇంకా పంచాయతీల రాబడి పెరుగుతుంది. జిల్లాబోర్డులు ప్రస్తుత పరిస్థితిలో కేవలం దండుగ. పెద్ద రహదార్లు, పెద్ద వంతెనలు అన్నీ హై-వేస్ శాఖద్వారా రాష్ట్రప్రభుత్వాల అధీనంలో పని చేయడం జరుగడంలోనే పనులు త్వరితంగా ముగిసేటానికి హెచ్చుగా వీలుంది. ఇక విద్యాశాఖనుకూడా రాష్ట్రప్రభుత్వాల అధీనం క్రిందకే తీసుకోవచ్చు. కొంత మేర మునిసిపాలిటీలను, పంచాయతీలను అప్పగింత చేయవచ్చు. మొత్తంమీద జిల్లాబోర్డులు ప్రస్తుతంలాగ వుండనవసరం ఏమాత్రం లేదు. జిల్లా పరిశీలక కమిటీ ఒకటి ప్రతి జిల్లాను, అవసరమని భావిస్తే, పంచాయతీల, మునిసిపాలిటీల నుండి ఎన్నుకోబడిన ప్రతినిధులతో ఒక జిల్లా కమిటీని నిర్మాణం చేయవచ్చు. జిల్లాబోర్డులను పూర్తిగా రద్దుపర్చడంతో పంచాయతీల రాబడి పెరుగగలదు.

ఇక రిజిస్ట్రేషన్ ఫీజుపై సర్చార్జి ఒక అదనపు ఆదాయం. ఇది చాలా హెచ్చుగా వుంటూవుంది.

ఇళ్లపన్నులు, బళ్ళపన్నులు, వినోదపు పన్నులు మొదలైనవి విధించడం, ఆ రాబడిద్వారా గ్రామాలలో సౌకర్యాలు సంపాదించడం సులభమే. మొదట్లో కొలదిగానే విధించవచ్చు. పంచాయితీల రాబడి విషయం చాలా ముఖ్యం. ల్యాండుసెస్సు రు 500/- లకు పైగా వున్న గ్రామంలోనే పంచాయతీ వుండాలి. ఆర్థిక స్తోమతలేని పంచాయతీ నిష్ప్రయోజనం. జనాభా ఆధారంగా తీసుకోవడంకన్నా, హెచ్చురాబడి ప్రాతిపదికగా పంచాయతీల నిర్మాణం ముమ్మొందు జరగాలి. గ్రామ పంచాయతీల ఆదాయాన్ని ఆధారంగా తీసుకొని, ఆ కొలకబద్దకు అందుబాటులో వుండే అన్ని గ్రామాలలో చట్టరీత్యా వీటిని స్థాపించాలి. ఆ

కొలకకు అందని గ్రామాలను, వాటికి అందు బాటులో వుండే గ్రామాలతో కలిపి పంచాయ తీల ఏర్పాటు చేయవలసి వుంది. మొత్తంమీద ఏ ఒక్క గ్రామంకూడా పంచాయతీ లేకుండా వుండకూడదు.

జిల్లాబోర్డులు రద్దు కానిదే పూర్తిగా గ్రామ పంచాయతీలు బలీయం కాలేవు.

కాలపరిమితి:

ప్రతి మూడు సంవత్సరములకు ఒకసారి "సాధారణ ఎన్నికలు" జరపడం ప్రస్తుత ఆచారం. నేటి పరిస్థితులలో ఈ కాలపరిమితిని అయిదేళ్ళవరకు పెంపుదల చేయడం అన్నివిధాలా మంచిదేమో అని చాలామంది అనుభవజ్ఞులు భావిస్తున్నారు. ఈ పెంపుదల ఒకరీత్యా మంచిదైనా, పెక్కు అనర్థాలకు కొన్ని వేళలలో దారితీయవచ్చు. కాలపరిమితి పెంపుచేస్తూ, మూడేళ్ల అనంతరం అప్పటికి వున్న పంచాయితీబోర్డుపట్ల ఓటర్లకు విశ్వాసం సన్నగిలిన పక్షంలో, దాదాపు రెండువంతుల మందికి తక్కువ కాకుండా సంతకాలు గాని, వేలిముద్రలుగాని వేసి (వయోజన ఓటర్లు) మహజరు పంపే పక్షంలో అధికార్లు పరిశీలించి, అవసరమని తలిచే పక్షంలో, తిరిగి ఎన్నికలు జరిపే ఏర్పాటు చేయడంవలన నష్టం అంతగా వుండకపోవచ్చు.

సభ్యులు:

ప్రాతినిధ్యం కూడా సంస్థకు సహజంగా ప్రాముఖ్యంగా వుంటుంది. ప్రస్తుతంలో మెంబర్ల సంఖ్య ఇలా నిర్ణయమవుతోంది.

జనసంఖ్య		మెంబర్లు
1500 లోపు ...	...	8
1500–2000 మధ్య	...	9
2000–2500 ...	...	10
2500–3000 ...	...	11
3000–3500 ...	...	12
3500–4000 ...	...	13
4000–4500 ...	...	14
4500–5000 ...	...	15
5000 మించిన ...	...	16

పై క్రమంలో 8 మందికి తగ్గకుండా 16 గురికి పెరగకుండా మెంబర్లు వుంటారు. ఈ సంఖ్యలో నాలుగోవంతుకు మించకుండా నిమ్న జాతులు, ఇండియన్ క్రైస్తవులు, ముస్లింలు వుండవలెను. ఈ స్థానాలను పంచాయితీలు ప్రత్యేకించే ఏర్పాటు వుంది. సామాన్యంగా అలాటి ఏర్పాట్లు పంచాయితీలలో ఎక్కడా వున్నట్లు కనిపించదు.

ప్రస్తుతం అమలులోవున్న విధానంలో సరైన ప్రాతినిధ్యం లేదు. ఉదాహరణకు-2500 జనాభాకు పైగా వున్న గ్రామంలో దాదాపు ప్రస్తుత జాబితాల ప్రకారం 1400 మంది ఓటర్లు మాత్రమే వున్నారు. ఈ గ్రామంలోని పంచాయతీలో 11 మంది సభ్యులు వున్నారు. జనాభాదృష్ట్యా యిప్పటి రూల్సు ప్రకారం ఈ సంఖ్య సరైనదే. ఓటర్ల జాబితాలో చేరని (మునుపటి రూల్సు ప్రకారం) వారు పోనీ మరో 200 మంది వున్నారనుకుందాం. అలా చూచినా 1600 ఓటర్లకు ఇద్దరు ప్రతినిధులు వుండడం జరుగుతోంది. ఈ గ్రామంలో వయోజన ఓటర్లు దాదాపు 1800 పైగా వుండడం జరుగుతుంది. జనాభా 3500 లకు మించుతుంది. ప్రస్తుత చట్టప్రకారం 13 మందినే జనాభా నాధారం చేసుకొని పంపవలసివుంది. ఓటర్ల దృష్ట్యా చూస్తే 1000మందికి(మునుపటిలెక్కలప్రకారం) 2మంది చొప్పున 1800 మందికి 36 మంది సభ్యులు వుండవలసివుంది. ఈ లెక్కప్రకారం 36 మంది సభ్యులు వుండడం కూడా మంచిదికాదు. కనుక ఈ ప్రాతినిధ్యం విషయంలో ఒక క్రొత్త విధానం అవలంబించక తప్పదు.

వెయ్యి ఓట్లు లోపుగాగల గ్రామంలో వంద మందికి ఒక ప్రతినిధి ఎన్నుకోబడాలి. ఓటర్ల సంఖ్యను బట్టి అల్పసంఖ్యాకుల, ఇతరుల ప్రాతినిధ్యం వారి సంఖ్యల నిష్పత్తిలో వుండేలాగ ఏర్పాటుచేయడం అవసరం. ఉదాహరణకు-ఒక గ్రామంలో 1000 మంది ఇతరులు వుంటే, అల్పసంఖ్యాకులు (నిమ్న జాతులు,హరిజనులు, ఇండియన్ క్రైస్తవులు, ముస్లింలు) 250 మంది వుంటే వెయ్యికి 10 మంది జనరల్ స్థానాలకు వుండడం, వెయ్యికి 10 అయే పక్షంలో 250 కి 3 స్థానాలు అల్పసంఖ్యాకులకు లభించడం జరగవలసివుంది. ఈ నిష్పత్తిలో కాకుండా ఒక బంద సంఖ్య నియమించదలిస్తే ప్రాతినిధ్యం అంతగా వుండకపోవచ్చు. ఒకే ఒక

సంఖ్య నియమించేటప్పుడు, అల్పసంఖ్యాకుల ప్రతినిధులు మొత్తం సభ్యులలో కనీసం మూడవవంతైనా వుండేలా నిర్ణయించాలి. ఇక ఓటర్లలో సగానికి సగం స్త్రీలు వున్నా, వారికి ప్రాతినిధ్యం అసలు లేకుండా చేయడం ఎలా భావ్యమవుతుంది? పెక్కు పల్లెలలో చాలామట్టుకు ముందుకువచ్చే స్త్రీలు బహు తక్కువ. అయినా స్త్రీలకు ప్రత్యేకస్థానాలు అసలు లేకుండా చేయడం కన్నా, ఒక స్థానాన్నయినా ప్రత్యేకించక తప్పదు. అవసరమైనచోట్ల మరో కొన్ని ఏర్పాట్లుచేసే సదుపాయంకూడా కలుగజెయ్యాలి.

ఇక ఈక్రింద విధంగా ప్రాతినిధ్యం పెంచబడవలసి వుంది. మొదటి వెయ్యి ఓట్లకు నూటికి ఒక ప్రతినిధిచొప్పున, ఆపైన మూడు వేల వరకు, వెయ్యికి పైబడ్డ ప్రతి 150 ఓట్లకు ఒక ప్రతినిధి చొప్పున, మూడువేల పైన ప్రారంభించి అయిదు వేలవరకు, మూడువేలకు పైబడ్డ ప్రతి 200 కి ఒక ప్రతినిధిచొప్పున నియామకం జరగడం అవసరం.

వార్డులు:

ప్రస్తుతం రూల్సు ప్రకారం వార్డులు ఏర్పాటు అంతగా లేదు. ఇప్పుడు ఓటర్ల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. అందువలన వార్డుల విభజన అవసరం. ఓటర్లజాబితాలు తయారీకి ముందు, గ్రామాలలో ఇళ్లు బ్లాకులుగా విభజించి ఇళ్లకు నెంబర్లువేశారు. పల్లె గ్రామంలో దాదాపు నూరు ఇళ్లు ఒక బ్లాకుగా ఏర్పాటుచేశారు. శివార్లు ప్రత్యేక బ్లాకులుగా నమోదయాయి. ఒక్కొక్క శివార్లు బ్లాకులో ఏడు ఇళ్లు మాత్రమే వుండడం జరిగినా, అది ఒకబ్లాకు అయింది. అందువలన బ్లాకుల నాధారంగా తీసుకొని వార్డుల విభజన జరుప వీలుపడదు. కనీసం 100 ఓట్లకు తగ్గకుండా వుండేలాగ-అంటే నూరుఓట్లకొక వార్డుగా విభజన జరగాలి. 1000 ఓట్లలోపల అయితే పది వార్డులుగాను 1000 పైన, 3000 లోపు ఐతే వెయ్యికి మించిన పై ఓట్లకు కలిసి మొత్తం ఎందరు ప్రతినిధులు వుంటే, మొత్తం ఓట్లు అందరి మధ్య పంచి, ఆ పంపిణీప్రకారం వార్డుల విభజన జరపాలి. అలాగే 5000 వరకూను. వార్డుల విభజన జరిపే ఏర్పాటు క్రొత్త బిల్లులో ప్రవేశపెట్టాలి--పంచాయతీ కోరినా, కోరకపోయినా.

ఎన్నికపద్ధతి:

ప్రస్తుతంలో పంచాయితీల ఎన్నికలు "చేతుల నెత్తే" విధానం ద్వారానే జరుగుతున్నాయి. ఇది మున్ముందు సాధ్యపడదు. అసలు కూడదు కూడాను. బాలెట్ బాక్సుల ద్వారానే ఆయా వార్డులలో ఎలక్షన్లు జరపాలి.

అధ్యక్షుని ఎన్నిక:- ప్రస్తుతం సభ్యులను ఓటర్లు ఎన్నుకోవడం, ఆ ఎన్నుకోబడిన సభ్యులనుండి అధ్యక్షుని ఎన్నుకోవడం ఆచారం. వార్డుల పద్ధతి లేనపుడు ఇది కొంతవరకు మెరుగుగా వుండవచ్చు. కాని వార్డుల విభజన జరిగి సభ్యులు ఆయావార్డుల ఓటర్లచే ఎన్నుకోబడేటప్పుడు, ఆ సభ్యులే ఒక అధ్యక్షుని తమనుండి ఎన్నుకోవడం జరిగితే, ఆ వ్యక్తి సభ్యులలో పెక్కుమందిని కూడగట్టుకొని ఆ స్థానానికి రావచ్చు. కాని ఆ వ్యక్తిపట్ల ఆ గ్రామంలోని ఓటర్లలో పెక్కుమందికి విశ్వాసం లేకున్నా, ఆ స్థానంలో వుండడం జరగవచ్చు. విశ్వాసం లేకపోవడమే హెచ్చుగా తటస్థిస్తుంది. అటువంటప్పుడు ఆ అధ్యక్షుడు ఓటర్లపట్లకన్నా తన పదవికి కారణమైన సభ్యులపట్లనే ఎక్కువ శ్రద్ధతో వ్యవహరించడం జరుగుతుంది. ఈ పద్ధతి పూర్తిగా మార్చటం అవసరం. అధ్యక్షుని ఎన్నికలో గ్రామంలోని ఓటర్లంతా పాల్గొనే ఏర్పాటు జరగాలి. ఇలా పెక్కుమంది విశ్వాసాన్ని పొందిన అభ్యర్థి అధ్యక్షునిగా ఎన్నుకోబడడంవలన అతనికి ఎంతో బలం వుంటుంది. అధ్యక్షుని ఎన్నిక జరిగిన తర్వాత, ఆయా వార్డులలో (అధ్యక్షుని నివాసమైన వార్డులో కూడ) సభ్యుల ఎన్నికలు జరుపబడాలి. వ్యయ ప్రయాసలతో కూడిన పనైనా, సక్రమమైన, ఉచితమైన పద్ధతి ఇదే. అప్పుడే పంచాయితీలు సక్రమంగా పనిచేయగలుగుతాయి. అధ్యక్షుడుకాక మొత్తం నియామకమైన ప్రతినిధులు ఎన్నుకోబడవలసి వుంది.

పరిపాలన:

ఈనాడు పల్లెలలో నిరక్షరాశ్యత హెచ్చుగా వుంది. పెక్కుమంది నిశానీపద్దువాళ్లే ఎన్నిక అవడం జరుగుతుంది- ఏ కొద్దిమందో తప్ప. ఒకానొకప్పుడు అధ్యక్షుడుకూడా నిశానీపద్దు కావచ్చు. అనేకమంది నిశానీపద్దుదార్లలో పరిపాలనా దక్షత, ఇంగితజ్ఞానం కలవాళ్లు వున్నారు.

కాని చదువులేమిచే పరాశ్రయం తప్పదు. అందువలన అధ్యక్షుడు కాబోయే వ్యక్తి కనీసం మాతృభాషలో చదువను, వ్రాయను నేర్చి వుండేలాగ నియామకం చేయడం సముచితం. అప్పటికీ ప్రభుత్వ వ్యవహారాలు ఆంగ్లంలో జరుగుతాయి. భాషా రాష్ట్ర విభజన జరగడమే సంభవించినచో మరో పదేళ్లు పరభాష తప్పదు. ఈ పరిస్థితిలో ఒక గుమాస్తా అవసరం. ఆర్థిక స్తోమత బాగా వుండనిదే గుమాస్తాను భరించడం, పదిహేడు ఏళ్ళలో పంచాయితీలు తమ పనిని సక్రమంగా కొనసాగించడం సాధ్యపడదు- సరైన అవకాశాలు, సదుపాయాలుకలిగించకుండానే పంచాయతీలు పనిచేయటం లేదంటే, ఆ లోపం వాటి నిర్మాణంలోనే వుందనే సత్యం ఈపాటికే కాంగ్రెస్ పెద్దలు గ్రహించివుంటారు. ఆ లోపాలను సవరించి క్రొత్తబిల్లు తయారు చెయ్యాలి. కనీసం ల్యాండుసెస్సు రు 500/- వున్న గ్రామంలో పంచాయతీ పెట్టాలని పైన వివరించాను. దానికితోడు మిగతా ఆదాయాలు దామాషాని (ఎప్పుడూ వుండే ఆదాయం) రు 1000/-లకు తగ్గకుండా వుంటేనే పంచాయతీ పెట్టవచ్చు. సక్రమంగా పంచాయతీలు కొనసాగడమా? లేక పంచాయతీలు నామమాత్రం కావడమా? అనే ప్రశ్నను మంత్రివర్గం ఎదుర్కోవలసి వచ్చినపుడు, పంచాయతీకి అర్హుడైన గుమాస్తా లేనిదే పని సక్రమంగా జరగదు. గుమాస్తాకు నెలకు 75 రూపాయిలు చొప్పున ఇచ్చే పక్షంలో, ప్రభుత్వమే ప్రతి పంచాయతీకి ఒక ఎగ్జిక్యూటివ్ ఆఫీసరును నియమించడం మంచిది. ఇందుకై యస్. యస్. యల్. సి. పరీక్షలో కృతార్థులైన వ్యక్తులను ఎన్నుకొని, ఒక నెలపాటు ఆయా ప్రాంతీయ డిప్యూటీ పంచాయతీ ఆఫీసర్లవద్ద తర్ఫీదు ఇప్పించి నియమించే నిర్ణయం జరగాలి. వీరిని మూడేళ్ళకొకదఫా ట్రాన్సుఫర్ చేయడంకూడా అవసరమే. గుమాస్తాల నియామకానికీ ఆమోదించేపక్షంలో, ఆ గుమాస్తాల నిర్ణయం ప్రెసిడెంట్లకే వదలవచ్చు. ట్రాన్సుఫర్లు అనవసరం. రాబోయే పది, పదిహేను ఏళ్ళపాటు పైన సూచించిన రీతిగా తర్ఫీదు పొందిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల ద్వారానే పంచాయతీలు చాలా మేరకు సక్రమంగా పనిచేయ వీలు కలుగుతుంది. అలా కాని పక్షంలో పంచాయతీలు కుంటుబడడం తథ్యం. పరిపాలన విషయంలో నిరక్షరాస్యత తగ్గేలోపల గట్టి బందోబస్తు చేయడంలో ఏమాత్రం సంకోచించ వీలులేదు. అలా చేయటానికి తగిన ఆర్థికస్తోమతతోనే పంచాయతీలు ఏర్పడే సదుపాయాలు కలగించవలసివుంది.

గ్రామాధికార్లు:

వారసత్వాలు వున్నంతకాలం, ట్రాన్స్ఫర్లు లేనంతకాలం గ్రామాధికార్లను పంచాయతీ సిబ్బందిగా నియోగించరాదు. ముందు రివెన్యూలో పెద్దపెట్టున మార్పు జరగవలసివుంది. అప్పట్లో ఆవిషయం ఆలోచించుకోవచ్చు. ఈనాడు పెక్కుచోట్ల గ్రామాధికార్లకు, పంచాయితీలకు పొత్తు అంతంతగానే వుంటోంది. ఇదే పెద్ద లోపం. ఈద్వంద్వ పరిపాలనాపద్ధతిని పరికిస్తే, పంచాయతీల పట్ల ప్రభుత్వపు సవతి తల్లిప్రేమ చక్కగా ద్యోతకమవుతుంది. పంచాయతీకి అవసరమయే స్కెచ్చిలు, ప్లానులు గ్రామకరణాలు వారి పైఅధికార్ల ఉత్తర్వులు లేకుండానే, తయారుచేసే ఏర్పాటువుండాలి. పంచాయతీ సరిహద్దులలోని రోడ్లు మొదలైన పంచాయతీ ప్రాంతాలు ఆక్రమణ జరిగితే, కరణం 'బి' ఫారం తనంతటతానే తీసి, చర్యకై పంచాయతీకి పంపే నియామకం అవసరం. ఇక పంచాయతీల బాపతు పన్నులు గ్రామమునసబులే రివెన్యూలా వసూలుచేసే ఏర్పాటుకూడా ప్రవేశపెట్టాలి. గ్రామాధికార్లు, పంచాయతీ కూడా ప్రభుత్వంలో ఒక ప్రధానాంగమని, స్థానిక ప్రజాసంస్థ అని గుర్తించేరీత్యా శాసనంవుండాలి. శిస్తు వసూళ్ల రోజులలో, సాగుబడి రోజులలో మినహా, ఇతర మాసాలలో పంచాయతీ పనిని చేయమని ఆజ్ఞాపించవలసివుంది. ఈ విధుల నిర్వహణలో పంచాయతీలకు, గ్రామాధికార్లకు లంకె పడుతుంది. ఈపనులకై వారికి నెల కింత యనో, లేక ఆయాపనుల కింత యనో కొంతసొమ్ము పంచాయతీలచేత ఇప్పించవచ్చు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వున్నా, లేక గుమస్తావున్నా పైన విధులను వారు కొన్ని ఏళ్లపాటు నిర్వహించక తప్పదు. గ్రామాధికార్లు పార్టుటైమ్ పనివాళ్లు. అందువలన పంచాయతీకి సంబంధించిన, అవసరమైన పనులను ప్రెసిడెంటు కోరినంతనే గ్రామాధికార్లు కొనసాగించడం విధి అని చట్టరీత్యా శాసించవలసివుంది. పంచాయతీల పనులు తేలికగా జరగటానికి ఈ నియామకం అత్యవసరం.

ద్ర వ్యో ల్బ ణ ము-ప్ర భు త్వ ప థ క ము

* కె. సన్యాసయ్య *

మొన్న మన కేంద్రప్రభుత్వం ద్రవ్యోల్బణం గురించి చేసిన ప్రకటన ఆశాజనకంగానూ, ఉత్సాహకరంగానూ లేకపోవడంలో ఆశ్చర్యం లేదు. ఏ సమస్యనైనా సక్రమంగా పరిష్కరించడానికి నిర్దుష్టమైన పరిష్కార సూత్రాలని బట్టి విధానాన్ని నిర్ణయించాలి; నిర్ణయాల ననుసరించి ఆచరణను పూనుకోవాలి. ఈ ద్రవ్యోల్బణం విషయంలో ప్రభుత్వం పారిశ్రామికుల, ఆర్థిక వేత్తల, కార్మిక నాయకుల అభిప్రాయాలని సేకరించింది కాని-వారి సలహాలను సమీకరించి నిర్దుష్ట నిర్ణయానికి ప్రభుత్వం రాలేకపోయినదని ప్రభుత్వ ప్రకటన రుజువు చేస్తున్నది.

ఈ సమస్య విషయమై ప్రభుత్వ విధానానికీ, కార్యక్రమానికీ ఆశయాలు నాలుగు:

1. ప్రభుత్వం పెట్టే ఖర్చు అవసరమైన పనులను భంగం లేకుండా సాధ్యమైనంతవరకూ తగ్గించడం; ప్రభుత్వాదాయాన్ని వృద్ధి చెయ్యడం;

2. ధరలలోనూ, దైనందిన జీవితం గడపడానికి అవసరం అయ్యే ఖర్చులోనూ ఇకపైన హెచ్చుదల లేకుండా చెయ్యడం;

3. సాధ్యమైనంత త్వరలో ధరలు న్యాయ సమ్మతంగా తగ్గించడం; వస్తువులు విరివిగా ఉత్పత్తి అయ్యేటట్లూ, దొరికేటట్లూ చూడడం;

4. ప్రజలలో ఉన్న కొనుగోలుశక్తి ఇంకా పెరిగిపోకుండా జాగ్రత్తపడడం. ఈ ఆశయాలు మంచివే. కాని ఈ ఆశయ సాధనకి అవలంబించే విధానాలు లక్ష్యాలను సాధించలేవేమోననే భయం వ్యాపించి వుంది.

కేంద్ర ప్రాంతీయ ప్రభుత్వాల బడ్జెట్లలో ఈ సంవత్సరానికి కొరత సాధ్యమైనంతవరకూ తగ్గించాలనీ, వచ్చే సంవత్సరం ఆదాయమే ఖర్చుకంటె ఎక్కువగా ఉండేటట్లు జరగాలనీ నిర్ణయం జరిగింది. ఈ విషయాన్ని గురించి పర్యాలోచనలు జరపడానికి మంత్రుల కమిటీ ఒకటి ఏర్పాటు అయింది. ప్రాంతీయ ప్రభుత్వాదాయాలని వృద్ధి చెయ్యడానికి ఎస్టేటు డ్యూటీ బిల్లు కేంద్ర శాసన సభలో ప్రవేశపెట్టనున్నది; వ్యవసాయ ఆదాయాల మీద పన్ను విధించవలసినదిగా ప్రాంతీయ ప్రభుత్వాలకి సలహా వచ్చింది. కాని ప్రభుత్వాల ఆదాయం ఖర్చును మించే అవకాశం ఉన్నదా? కేంద్ర ప్రభుత్వం సైన్యానికయ్యే ఖర్చును తగ్గించడానికి అవకాశాలు లేవు. కాశ్మీరు సమస్య ఇంత త్వరగా తేలేదికాదు. విదేశాంగ రాయబారవర్గాల కయ్యే ఖర్చుకూడా తగ్గించడానికి కేంద్రప్రభుత్వం నిర్ణయించే సూచనలు కనుపించడంలేదు. ప్రస్తుత కాలాల పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం వ్యయాన్ని తగ్గించడం అసంభవం. ఇక ప్రాంతీయ ప్రభుత్వాలు మద్యపాన నిషేధాన్నీ, జమీందారీల రద్దుచట్టాన్నీ కొంతకాలం వరకూ వాయిదా వెయ్యాలని కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ ప్రభుత్వాలకి సలహా ఇచ్చింది. మధ్యపరగణాల వంటి కొన్ని ప్రాంతీయ ప్రభుత్వాలు ఈ సలహాను ఆమోదించాయి; మదరాసు ప్రభుత్వం మొదటే దీని నిరాకరించాయి. ఈ విషయాలలో దేశమంతటా ఒకే రకమైన పద్ధతి అవలంబించవలసిన అగత్యం ఎంతేనా ఉంది. ఏ ప్రాంతీయ ప్రభుత్వ విధానంవల్లనైనా అక్కడ ధరలు హెచ్చుగా ఉంటే, ఆ హెచ్చు ధరలు దేశంలో అన్ని భాగాలకీ పాకుతాయి. ప్రభుత్వం పెట్టే ఖర్చును తగ్గించడం విషయంలో సామాన్య ప్రభుత్వోద్యోగుని దుస్థితి ప్రభుత్వం సానుభూతితో చూడాలి. ప్రభుత్వపు ఖర్చును సామాన్య ప్రజల కంటె, దేశంలోని ధనాఢ్యులు, వ్యాపారస్థులు ఎక్కువగా భరించేటట్లుగా చూడాలి. అంతేకాదు. ఇంగ్లాండులోవలె దుబారా ఖర్చును అందరూ తగ్గించుమని, నిరాడంబరత్వాన్ని స్వీకరించేటట్లుగా ప్రభుత్వం ఆదేశించాలి. ప్రభుత్వాదాయాన్ని వృద్ధి చెయ్యడంకోసం భూమి శిస్తులవంటి పన్నులు హెచ్చు చెయ్యడానికి అవకాశం ఉంది. ఇంకా ఇతర మార్గాలను ఎన్నో వెదకి, ప్రభుత్వాదా

యాన్ని వృద్ధిచేస్తేనే కాని బడ్జెట్టులో ఆదాయం ఖర్చును మించడం కష్టం.

నేడు దేశంలో అవసరాలకి మించిన ధనం చలామణి అవుతోంది. ఆ అనవసపు ధనాన్ని ఆకర్షించడంకోసం ప్రభుత్వం కొన్ని సదుపాయాలను కలుగచేస్తోంది. పోస్టాఫీసులలో నిలువ వేసుకోడానికి కొత్త సౌకర్యాలు ఏర్పాటు అవుతాయి. వివిధ సంస్థలలో తాత్కాలికంగా ఉండే అవసపు ధనాన్ని 6, 9, 12 నెలల వరకూ గవర్నమెంటు ట్రెజరీలలో డిపాజిట్ చెయ్యడానికి కూడా సౌకర్యాలు కలుగుతాయి. ఈ సందర్భంలో ఉద్యోగస్థులంతా నిర్బంధంగా ఆదాయంలో కొంత భాగం దాచుకునే పద్ధతి అమలులో పెట్టాలనే సూచన ఒకటి ఉంది.

ఆహారపదార్థాల ధరలను స్థిరీకరించి, సరియైన హద్దులలో ఉంచడానికి ప్రభుత్వం కొంతకాలం కిందట ప్రకటించిన విధానం ఉపయోగపడుతుందని ప్రభుత్వప్రకటనలో ఉంది. పంచదార, కిరసనాయిలు, ఇనుము, ఉక్కు, సిమెంటు- వీటి ధరలను నిర్ణయించి అమలులో పెట్టడాన్ని గురించి ఆలోచనలు జరుగుతున్నాయి. కంట్రోళ్లను విధించడంవల్ల ధరలు హెచ్చకుండా చూడవచ్చు; వస్తువులు అందరికీ న్యాయంగా దొరికేటట్టు చూడవచ్చు. వస్తువుల కొరత ఏర్పడినప్పుడు పై రెండు ఆశయాలూ కంట్రోళ్లద్వారా మాత్రం సాధించగలం. కంట్రోళ్లను రద్దుపరచడం మన జాతీయ ప్రభుత్వం చేసిన గొప్ప పొరపాటు. కంట్రోళ్లను సరిగా అమలులో ఉంచలేకపోడానికి, వాటిని పూర్తిగా రద్దు చెయ్యడం ఎప్పుడూ పరిష్కారమార్గం కాదు. కాని కంట్రోళ్లను సక్రమంగా అమలులో పెట్టడం కష్టం అని అనుభవంవల్ల తేలింది. కంట్రోళ్లు తిరిగి ప్రవేశపెట్టేటప్పుడు వ్యాపారస్థుల నీతిరహిత వర్తనా, ఉద్యోగుల లంచగొండితనం, అధికారుల దుష్పరిపాలనా రూపుమాపాలి.

ఉత్పత్తిని హెచ్చించడంకోసం పారిశ్రామికులకు ప్రోత్సాహం కలిగించే నిమిత్తం వారికి కొన్ని లాభాలు చేకూర్పబడ్డాయి. వారికి అనుకూలంగా అరుగుదలకు సంబంధించిన నిబంధనలలో మార్పులు చేస్తారు; కొత్తగా స్థాపించబోయే పారిశ్రామిక సంస్థలకు కొంతకాలంవరకూ ఆదాయపుపన్ను ఉండదు; ముడిపదార్థాలూ, యంత్రాలూ దిగుమతి అయేటప్పుడు దిగుమతిసుంకాలు ఇయ్య నక్కర లేదు. ఈ సౌకర్యాలవల్ల పారిశ్రామికులకు కొంత ప్రోత్సాహం కలుగుతుందని ఆశ. పారిశ్రామిక లాభాలు వాటాదార్లకు పంచిపెట్టేటప్పుడు, ఆ లాభాలు కిందటి రెండుసంవత్సరాలలోనూ పంచిపెట్టబడినలాభాలనుకాని, నూటికి ఆరురూపాయిలవంతును కాని మించకూడదు. ఈ నిబంధన ఆశయం పారిశ్రామిక లాభాలు దేశంలో చలామణి అవుతూన్న ధనాన్ని హెచ్చించకుండా, ఉత్పత్తి సాధనాల వృద్ధికోసం ఉపయోగింపబడడం. కాని ఈ ఆశయం సాధించడానికి పారిశ్రామికులకు రాదగిన లాభాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయంలో సమగ్రమైన పరిశీలన జరగవలసిన ఆవశ్యకత ఉన్నది. పారిశ్రామిక వివాదాలు ఉత్పత్తి నిరోధకాలు కాకుండా ఉండటానికి ప్రభుత్వం త్వరలో శాసనాలను ప్రవేశ పెట్టబోతూన్నది.

ప్రభుత్వం నిర్ణీతపథకంవల్ల ఆశయాలను సాధించగలదా? ఈ ప్రశ్నకు సమాధానం భవిష్యత్తులో తేలాలి. ధనోల్బణానికి పరిష్కారమార్గాలు రెండు: దేశంలోఉన్న అవసరపుధనాన్ని తగ్గించడం; ఉత్పత్తిని హెచ్చించడం. ప్రభుత్వ ప్రణాళికలో ఉత్పత్తికంటే, ద్రవ్యచలామణికే ఎక్కువ ప్రాధాన్యం ఇయ్యబడింది. పారిశ్రామిక వస్తూత్పత్తికి సంబంధించిన హంశాలు అధికోత్పత్తికి తోడ్పడడం సందేహాస్పదం. అంతేకాక, పారిశ్రామికులకు ప్రోత్సాహకరమైన విధానం అవలంబించి నంతమాత్రాన ఉత్పత్తి హెచ్చదు; కార్మికుల సహకారము కావలసి ఉన్నది. యంత్రపరికరాలూ, ముడిపదార్థాలూ, విరివిగా దొరికేటట్లు చూడాలి. పదార్థాల ఎగుమతి దిగుమతులు కూడా ఈ విషయమై ఆలోచించాలి.

ప్రాంతీయ ప్రభుత్వాలు కేంద్రప్రభుత్వంతో సహకరించవలసిన అగత్యం సువ్యక్తం. ఈ సమస్యను ప్రకటనలతోనూ, ఆశయాల వ్యక్తీకరణంతోనూ సాధించ ప్రయత్నించడం అవివేకం. ప్రగాఢంగా పాతుకొనిఉన్న ఈ సమస్యను ఎదుర్కోడానికి నూతన దృక్పథం, ధైర్యం, పట్టుదలా కావాలి. విషమవ్యాధులు మంత్రోచ్చాటనంతో నివృత్తికావు.

"మ్యూజింగ్స్"

చలం

సత్యం? సత్యం ఏమిటి? ఎక్కడ వుంది? అన్నది అనాదిగా వొస్తున్న ప్రశ్న. ఈ ప్రశ్నని పట్టుకుని జీవితాన్ని తరిస్తే, అంతరాంతరాలుగా సత్యం కనపడ్డట్టు వుండీ, ఒక 'లేయర్'నించి ఒక ప్లేన్‌నించి ఇంకో ప్లేన్‌కి దూరంగా వెడుతుంది. ఏదో ఒక మాయలో అబద్ధంలో ఇదే సత్యమని ఆగవలసిందే గాని అది ఎన్నటికీ దొరకదు. సత్యమనే ఒక ప్రాంతి వుందనుకొందాం. వుంటే దానికి రూపమూ, రంగూ లేవు. ఒక ఆకారం రంగూ ఏర్పడ్డవంటే అది అబద్ధమే — నీ ఇంద్రియాల సహాయంతో నీ మనసు నీకందిచ్చే వార్తల సత్యాన్నించి నువ్వు ఎన్నడూ తప్పించుకోలేవు. కాని ఆ మనసే క్షణ క్షణమూ మారుతుంది. ఇంకో మనసు నీ మనసు నించి వేరు. మనసులేంది సత్యం లేదు. మనసు స్వభావ సంకల్పాల. ఇంక సత్యం ఎట్లా దొరుకుతుంది మానవుడికి?

ఇద్దరం సత్యాన్ని గురించి వాదించుకున్నామంటే, వాస్తవంలేని 'బేసిక్ ప్రిన్సిపిల్స్' ని కొన్నిటిని ఆధారంగా పుచ్చుకుని వాదించుకుంటున్నామన్న మాట. ఆ సూత్రాల వాస్తవాన్నికూడా ప్రశ్నించవచ్చు. వాటిల్లో సమన్వయం కుదరకపోతే అసలు వాదనే లేదు. ప్రజల మనసులకీ, అందులో దేశాల సంఘాల మనుషులకీ మనస్సులకీ కామన్‌గా కొన్ని బాహ్యవిషయాల్లో సామరస్యం వుంది. వొస్తువులూ, రంగులూ, ఒకొక్కప్పుడు కొన్ని అభిరుచులూ. వాటిని మించి మాట్లాడామా మన మనస్సు మనకే తప్ప, ఇంక దేనికీ ప్రమాణం కాదు. అట్లాగే ఇది గోడ, ఇది ఆవు, ఇది నీలం అంటే చాలా మనస్సులకి ఏకమైన అభిప్రాయం కుదరవొచ్చు. కాని ఇది రుచి, ఇది అందం, ఇది మంచి, ఇది సత్యం అనేప్పటికి ఆ మాటల అర్థాలే భేదం మనుషులకీ మనుషులకీ. స్థూలమైన వస్తువులతో చాలా నిజంగా వున్నాయనే అలవాటు కలిగింది కాని, అంతకు మించిందంటే ఎక్కడా వాస్తవమనేది లేదు—అర్థం చేసుకునే ఆ మనసులో తప్ప. ఇది దూరం, ఇది ఆలస్యం, ఇది పొడుగు అనేప్పటికే వ్యత్యాసాలు బైలుదేరతాయి. ఇది గోడ అన్నప్పుడు కూడా పశువులకీ చీమలకీ గోడ కాదు, పిచ్చివాడికి కాదు, పసిపిల్లకి కాదు, రోగికి కూడా కాదేమో! ప్రేమకి గోడ అడ్డవుతుందా? అనే కవికీ కాదు. దేవతలకీ కాకపోవచ్చు. కనక గోడ వాస్తవం ఎక్కడుందంటే దాన్ని చూసే అనేకమంది మనసుల్లో వుంది. అంతకన్న లేదు. ప్రపంచంలో మనుషులు లేకపోతే గోడలూ లేవు.

అనాదిగా వస్తున్న నమ్మకాలనూ, సెంటిమెంట్లనూ, ప్రమాణాలను ప్రశ్నించగలిగిన తెలివీ ధైర్యం ప్రపంచంలో ఎక్కువైనకొద్దీ, సంఘనిర్మాణపు పునాదులే వూగిసలాడటం జరుగుతోంది.

సినిమాలలో, కథలలో, కష్టాలన్నీ గడిచి వాళ్లు హాయిగా వున్నారు- అంటే తృప్తిపడతాము. మంగమ్మ అనే సినిమాలో కొంతభాగం నేను చూడవలసిన పరిస్థితి కలిగింది. దాంట్లో కొడుకుకి ఇరవై ఏళ్లు వచ్చిందాకా, అంటే ఆ తల్లికి నలభై ఏళ్లు వచ్చిందాకా, (తెరమీద ఆమెకి ఏళ్లు రావడం ఆగిపోయినాయి లెండి) ఆమె జైలులోవుంది. అప్పుడు ఆమెకీ భర్తకీ రాజీ ఐ ఇద్దరూ పడవలో పాటలతో షికారు వెళ్లారు. బాలనాగమ్మలో కూడా అంతేగావచ్చును. యౌవనమంతా ఇట్లా జైళ్లల్లో గడిపి చచ్చేముందు అన్ని పరిస్థితులూ చక్కబడ్డాయంటే సంతోషించమని కథకుల ఉద్దేశ్యం. చిన్నప్పుడు రామాయణం కథ విని, చివరికి శ్రీరాముడికి పట్టాభిషేకమయిందంటే, పాండవులు రాజ్యం చేశారంటే నా మనసు తృప్తిపడక శ్రీరాముడికోసం, పాండవులకోసం ఏడ్చేది. జీవితంలో కూడా అంతే. ఏ ఇరవై ఏళ్లో గుమస్తాగానూ తాబేదారుగానూ తాసిల్దారుగానూ నలిగి

ఎప్పటికో కలెక్టరైనాడంటే ఎంత అదృష్టం అంటారు. కాని ఈలోపల అతను యెంత భయంతో, జాగ్రత్తతో తన కాలం, తన శక్తి, తనవాంఛ తనవికాకుండా, ఎక్కడా మాట పడకుండా బతికాడంటే, ఆమనిషి ఇంకా మనిషిగా మిగిలా డంటారా? సినిమాసంస్థ మనుషుల్ని దుర్మార్గుల్ని చేసినా, చంపడు. రాక్షసుల్ని చేస్తుంది. కాని గవర్నమెంటు నౌకరీ, ప్లీడరుపనీ మనిషిలో ఏ విలువల్నీ మిగల్చకుండా ఒక అచ్చులో నొక్కేస్తాయి. ఎన్నడూ వాళ్ళు నోటునీ, హృదయాన్నీ విప్పి మాట్లాడరు. ప్రతివాడిమీదా అనుమానమే, భయమే. వాళ్ళల్లో అసలు ఘనతకి లేవలేనివాళ్ళని భరించగలంగాని, అధికారాన్నీ ఆస్తినీ సంపాయించిన మనుషుల్ని ఒక్కనిమిషం భరించలేము. దోపిడి దొంగల్లో, ఘాతుకులలో స్వేచ్ఛమైన దుర్మార్గం వుంటుంది. పూర్తి దుర్మార్గుడిలో ఆత్మచావదు. ఏనాడో, ఏ పరిస్థితిలో అతని హృదయాన్ని పలికించగలను. కాని నిమిషనిమిషం తమ స్వేచ్ఛని, ఇన్‌స్టింక్ట్సుని, సరదాలని మర్యాద కోసం, పైకి పాకడంకోసం అణచే యీ విద్యానాగరికులు ఎటువంటి చావులు చస్తున్నారో ఊహించడం వాళ్ళకే చాతకాదు.

స్వతంత్రం రావడంతోనే ఓ జబ్బు, సహజమైన జబ్బు పుట్టింది దేశానికి. విజయంతో అది ఇంకా ఎక్కువౌతున్నట్టుంది. ఏ దేశస్థుడన్నా ఏమన్నా అనగానే 'కబడ్దార్! ఎవర్నంటున్నావో కొంచెం జ్ఞాపకంవుంచుకో. రెండేళ్ళకిందటి బానిస దేశమనుకున్నావా!' అని వెయ్యికంఠాలు లేస్తున్నాయి. ఇది 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్' కి ఒక ముఖ్యలక్షణం. ఆత్మవిశ్వాసం పూర్తిగా వున్న మనిషి ఎన్నడూ చెయ్యడు ఈ అల్లరి. అమాంతంగా సిరిపట్టిన మనుషుల్లో, రెండు ఇంగ్లీషు ముక్కలు మాట్లాడగలిగిన యౌవనవతుల్లో కనపడుతుంది ఈ సంస్కారలోపం. చప్పున ఇతరుల ఆత్మశుద్ధిని శంకించడం అవివేకం దూరాన్నున్న మనుషులకి అన్నివిషయాలూ విపులంగా తెలీవు. నీదెంత శుభ్రమైన న్యాయమైన వాదన ఐనా, జడ్జికి రెండుకళ్లు వుంటాయని మరిచిపోకూడదు. ఇతరులు తనని శంకిస్తే, దూషిస్తే, తప్పర్థం చేసుకుంటే, బలహీనుడు కుళ్ళి ఏడుస్తాడు; బలవంతుడు తంతానంటాడు. మనం బలవంతులం అనుకుంటే ఆర్థికంగానో, సైనికంగానో తన్నడానికి బలం సంపాయించాలన్న మాట. ఇట్లాంటి నేషనల్ స్పిరిట్‌వల్లనే ఇన్నిదేశాలు ఇట్లా ఘోరమైన యుద్ధాలలోకి దిగి నశించాయి. ఇంకోరి జోలికి వెళ్ళి అనడంతో ఆగదు అహింస. నిజమైన ధీరత్వం, బలం. వీటికి చాలావయతో చిరునవ్వే శక్తి వుంటుంది. ప్రతిమాటకీ, చూపుకీ సెన్సిటివ్ కావడం చాలా బలహీనం.

ఆ లోపలి బలహీనానికి పైన బలం పడితే, చాలా త్వరలో కాడీ ఐపోవడానికి ఎక్కువ అవకాశం వుండదు. తమని తాము రక్షించుకునే వుద్దేశ్యంతోనే దేశాలు సైన్యాల్ని పెంచుకుంటాయి. ఇతరుల సేనల్నించి కాక, మాటల్నించికూడా రక్షించుకోవాలంటే, ఇంకా చాలా సైన్యబలం కావాలి. పెద్దగా అరవగల రాయబారులు కావాలి. గాంధీగార్ని మనమే చంపుకున్నది అన్న సంగతి అప్పుడే చాలా మరిచిపోయినారు ప్రజలు. గాంధీగారితో సన్నిహితమున్న యీ వృద్ధులంతా పోయిననాడు, ఈ దేశానికి 'బ్యాలెన్స్' ఇచ్చి, ఎప్పుడైనా ఒకప్పుడు అహింస (మాటలో, చేతలో) జ్ఞాపకం చెయ్యగల జ్ఞానులు ఎవరుంటారా అని ఆలోచన వొస్తుంది. హైద్రాబాదు విషయంలో మన ప్రభుత్వం కనపరిచిన, కనపరచనున్న ఉదారత్వంకన్న, విశాలత్వంకన్న, నాలుగు రోజుల్లో జయించామన్న మన సైన్యబలానికి ప్రజలు పొంగిపోతో వుంటే గాంధీగారు ఎందుకు పుట్టినట్టు, ఎందుకు చచ్చినట్టు?

సినిమాలలో మీటింగుల్లో తలుపులు మూసి బలవంతంగా ప్రజలచేత జండాకి మొక్కించి, బళ్ళల్లో చిన్నపిల్లలకి ఇంక పేట్రియాటిజం నూరిపోసి, పాటలు పాడించి, చరిత్ర బోధించి, ఇంత గొప్ప దేశం ఇంక ఎక్కడా ఉండబోదని, ఈదేశంలో పుట్టడమే మహాద్భాగ్యమని బలవంతంగా నమ్మించి ఉచ్చరింపచేసి, దేశానికై మనుషుల్ని త్యాగాలు చేయించి, మట్టికోసం మనుషుల జీవితాల్ని బలితీసుకుని— ఇదంతా పాశ్చాత్యదేశాలు చేసిన మూర్ఖపు దుర్మార్గపు బాటలో నడవడంకాక ఇంకేమవుతుంది? ఇతర దేశాలను గెలిచామనే, దోచుకున్నామనేది ఆ ఒక్కటే గర్వంకాదు. మేము సత్యవంతులం, ఆధ్యాత్మికపరులం, మేము నమ్రత కలవాళ్లం, అన్ని సద్గుణాలూ మాకేనన్న

గర్వంకూడా తప్పతాగించినంత పనీ చేస్తుంది: అన్నిగర్వాలలోకీ. గొప్ప హానికరమైన గర్వం నేను ధర్మపరుణ్ణి అనేగర్వం. గాంధీగారు చివరి ఉపవాసం చేసే రోజుల్లో, గాంధీగారిని గొంతులు చించుకుని ఆరాధించే, యీ శిష్యుల, యీ కవుల, యీ నాయకుల హృదయాలలో, ఆయన క్షమ మతానికి, ధర్మానికి, సంస్కృతికి ద్రోహం చేస్తున్నారని ఎంతెంతమాటలు లేచాయో ఒక్కసారి ఆత్మపరీక్ష చేసుకోకూడదా? ఒక ఘోరం జరిగిందంటే, అది ఒక్కడివల్లనే జరుగుతుంది పైకి. కాని దానివెనక పైకి అనని అనేకుల నిశ్శబ్దకంఠాలు దానికి బలమిస్తాయి.తనని చంపినదేశం ప్రపంచరాజ వీధుల్లో తనని ఎంత ఎడ్వర్టయిజ్ చేసుకుంటోందో చూడగలిగితే గాంధీగారు!

నా 'పురూరవ'ని విమర్శిస్తో చివుకుల నరసింహంగారు నాకు గొప్ప మిత్రులు రాస్తున్నారు. "అదే పార్వతీపరమేశ్వరుల, సీతారాముల, అరుంధతీవశిష్ఠుల, శచీపురందరుల లీల——...... ఈ సృష్టి లీల ఇంకో రిహార్సల్ వేసింది. ఎన్ని రిహార్సల్సు వేసినా తీరని ఆనందం గనక, ఎన్నోసార్లు వేస్తోంది. దానికోసరమే ఈ విశ్వం ప్రయాణం చేస్తోంది. అనంతముఖాలతో ముద్దు పెట్టుకుని, అనంత హృదయాలతో ప్రేమించి, అనంత సముద్రాలలో మునిగి మాయమై పోతోంది..." అని. ఆ మాటలు చదువుతోవుంటే ఏ వేదంలోనో, లోకంలో అందాన్నంతా 'అంతవిహీన లీలా తమాష్' అని ఒక మాటలో ఇముడ్చగల ఠాగూరు గారి కవిత్వం జ్ఞాపకం వొచ్చింది. రాత్రి ఒక్కవాన కురిసింతరవాత తెల్లారి లేచి మా దొడ్లో చూస్తే, "వొచ్చాం, వొచ్చాం" అని చప్పట్లు కొడుతో పకపక నవ్వుతో నృత్యం చేస్తున్నట్టుంటాయి, గడ్డి మధ్యనించి లేచిన వేలకొలది కొత్త మొక్కలు. అవి అడివికాకుండా పీకెయ్యవలసిన అవస్థపట్టినప్పుడు, ఆకుల్ని విరివిగా తెరుచుకుని తెల్లారి వెలుగులో, చల్లని గాలిలో వూగే ఆ మొక్కల్ని పీకే నిమషంలో పీనిగని చెయ్యవలసి వొచ్చిన నా దురదృష్టానికి దిగులు పుడుతుంది. అలలు అలలుగా పైకి పొంగిస్తుంది గడ్డిని, మొక్కల్నీ, పువ్వుల్నీ భూమి. ఇట్లా పుట్టడం, ఎక్కడా ఏ నీతి నియమాలూ ఆపలేని ఉద్రేకంతో సంయోగించడం, మళ్లీ పుట్టడం—ఇంతబలం, ఎన్ని విఘాతాలు కలిగినా లక్ష్యంచెయ్యని ఎంతేనా తీరని ఉత్సాహం ఈ సృష్టి. సృష్టిపరిణామం చూచినకొద్దీ ఏదో గొప్ప ఆనందశక్తి చేస్తున్న 'ఎక్స్‌పెరిమెంట్' అను కుంటాను. ఒక్క అడివి మొక్కని, చిన్న రెక్కల పురుగుని ఏవిధంగా అమిర్చి, మార్చి, కొత్త సంబంధాలు ఏర్పరిచి, ఎట్లా ఒక స్తిమితమైన దశకి తీసుకవొద్దామా అని గట్టి ఆలోచన జరుగుతోందేమో! ఎన్ని నాగరికతాభ్యంతరాలు మానవుడు కల్పించుకోనీ, ఎన్ని నియమాల్ని ప్రభుత్వాలు సాహసాలు విధించనీ, యీక్రీడ అనేకమైన రంగుల భావాలతో, ఉద్రేకాలతో, కాంక్షలతో, ప్రేమలతో, కవిత్వాలతో, ఏదో ఒక విధంగా, సృష్టిలీల జరగక మానదు. ఎన్ని గొప్పమాటలు మాట్లాడినా, ఎంత ఆకాశంలోకి ఆత్మల్ని ఎత్తివేసుకున్నా, ఎన్ని గోడలతో, పహారాలతో, నిరంకుశ ప్రాకారత్వాలతో అణిమినా, స్త్రీపురుషులులు కలుసుకోక మానరు. ఎంత ఏం జరగటం లేదని వాదించినా, పిల్లలు పుట్టక మానరు. కాని తిరిగి తిరిగి యీ కావిలింతలని ఏర్పరిచే సృష్టికి విసుగులేదు. పుట్టుకకి- ఎన్ని విధాలుగా పుట్టించడానికివీలుందో, 'ప్రొటొప్లాజమ్' రెండు ముక్కలై వృద్ధిపొందుతుంది. గుడ్లల్లోంచి పిల్లలు, పువ్వుల్లోంచి కాయలు, మృగాల మనుషుల గర్భాల్లోంచి పిల్లలు- ఈ విధంగా ఎన్నిసార్లు పుట్టినా, ఆ పుట్టుకలో ఎంత సంతోషాన్ని వెద జల్లుతుందో, అట్లానే తేనెటీగ పుష్పరజాన్ని మోసుకుంటూ వాలనీ, చేపలగుడ్లు నదుల్లో కొట్టుకుపోయి కలుసుకోనీ. మృగాలుమృగాలవైపు చూడనీ, పక్షులు ఉల్లాసంగా పాటతో ఐక్యం కానీ, విపరీతాకర్షణతో, గొలుసులు తెంచుకుని సైన్యాన్ని నడిపించుకుని, లక్షలాది ప్రజల్ని హింసించి, ప్రియురాల్ని పొందనీ, అడుగుమీద నిద్రించే గడ్డి బిచ్చగాడు పిచ్చి మురికి మనిషిని ఏం చేస్తున్నాడో తెలీకుండానే సగం నిద్రలో దగ్గరకు లాక్కునీ, తిరిగి తిరిగి అంత సుఖాన్ని వెదజల్లించనే సంతోషంతోనే గాలి స్పందించినట్లు పొంగిపోతుంది సృష్టి. మామూలుగా రెండుభాగాలై బలికే 'సెక్స్' నించి, గొప్ప ప్రేమలో ఐక్యమై ఉమరత్వం పొందిన ప్రియులవరకు నిరంతరం తిరిగి తిరిగి ఆ ఆనందంకోసం సృష్టి ప్రయత్నిస్తున్నట్టుంటుంది. అనుభవించే ఆ ప్రాణిగాక ఆ సుఖాన్ని ఆ

ప్రాణిని సృష్టించిన శక్తి కూడా అనుభవించి ఆనందిస్తోంది గావును.

పూర్వం 'కీ' ఇస్తే పనులుచేసే బొమ్మలు అమ్మే వాళ్లు. ఓ పెద్ద పురుగు వుండేది ఓ సొప్పుగా— అది బల్లమీద ఇటూ అటూ తిరుగుతూ వుంటుంది. ఓ అరగంటసేపటిదాకా. దానికి 'కీ' ఇవ్వడం చూడకుండా వుంటే, అదేదో పురుగనీ దాని ఇష్టప్రకారమే, దాని అవసరంకొద్దీ అట్లా తిరుగుతోందనీ అనుకుంటాము. కాని దాని చలనమంతా దాని ఏర్పాటులోనే నిర్దేశించారు. మనుష్యుల్ని చూసిన కొద్దీ ఆ బొమ్మలు జ్ఞాపకం వొస్తాయి. ఏదో ఆలోచించామనీ, విప్లవాలు చేస్తున్నామనీ, నీతిగా వున్నామనీ, అవినీతిగా వున్నామనీ, వివేకంగా అవివేకంగా ప్రవర్తించామనీ, బడాయిలు పోతో, దిగుల్లుపడుతో ఇట్లా బతుకుతారు గాని— అసలు ఎప్పుడో వీళ్లందర్నీ ఎవరో 'కీ' యిచ్చి లోకంలో వొదిలారు గావును: అంతకన్న అర్థం ఏమీ కనబడదు. ఏదన్నా అర్థం వుంటే, ఈ బొమ్మల్ని చేసే ఓ బ్రహ్మకో, శక్తికో వుంటే, దాంట్లో వుండాలి అర్థం. అదీ చాలా అనుమానమయితే ఇంక ఎక్కడ వుంది ఓ అర్థం, అర్థం వుందని మాయపడే మనుషుల మనసుల్లో తప్ప- ఏదో చేస్తున్నామనే అహంభావపడే కార్యశూరుల హృదయావేశాల్లో కాక!



మత్కుణోపాఖ్యానం

పూ ఖా.

రకరకాల రంగురంగుల మానవుల రక్తాన్ని పీల్చి మదించిన మత్కుణాలు ప్రయాణాయాసంలో నున్నాననైనా, ట్రెయిన్ తప్పిపోయాననైనా సొంతు భూతిమాపక సూదులవంటి మూతులతో గుచ్చుతున్నాయి. ఎన్నోశతాబ్దాలనుండీ అంటే వాట్సన్ దొరగారు స్టీమ్ యింజన్ కనిపెట్టక పూర్వంనుంచీ ఉన్న మత్కుణకుటుంబాలు భారతదేశంలో అయోమార్గం వేయబడ్డ తరవాత కట్టబడ్డ స్టేషన్ చేరుకుని వంశపారంపర్యా అనుభవిస్తున్న తమ శాశ్వత హక్కుల్ని యీనాడు యీ మొనగాడు స్టేషన్లో పడుకున్నాడని దయ తలుస్తూ ఊరుకుంటామా! సినిమాకదంబంలో చూపించినట్టు ఎగిరి పొడుస్తున్నాయి మాయ నల్లులు. ఆలోచించి చూస్తే జనమేజయ మహారాజువంటి శుద్ధ తెలివితక్కువ పెద్దమనిషి ఎవరూ కనిపించలేదు. లేకపోతే నిత్యం బాధపెట్టే యీ నల్లుల్ని వదిలేసి, ఎప్పుడో ఒకసారి తారసిల్లే పాములమీదకి పరిగెత్తేడు-'సర్పయాగం' అంటూ మత్కుణయాగం చెయ్యకూడదనూ తెలివి తక్కువా అని.

'మేస్త్రిగారూ! నల్లులు యిలా చెలరేగుతూంటే మీరు తగినచర్య తీసుకోకపోవడం శోచనీయం' అన్నా అప్పుడే భోజనంచేసి వచ్చిన చిన్న మేస్త్రితో.

'నల్లులాండి!' చుట్ట ముట్టించి ప్రారంభించాడు. 'ఏమిటిచెయ్యడం సార్, యీ స్టేషన్నే చూసుకుంటామా, టిక్కెట్లో యిస్తామా, వచ్చే పోయే ప్రయాణీకుల్నే చూసుకుంటామా, ఎర్రని పచ్చని ఝండా బత్తీల్నే చూపుతామా, యీ నల్లుల్నే చూచుకుంటామా. అందులో యీ యుద్ధం వచ్చిన సమహాతనాంషి, గోచిపాతరాయుడికి కూడా పని ఎక్కువైపోయిందంటే నమ్మండి. ప్రతివాడికీ పనే. అందులోనూ అర్జంటుపని. చివరికి రైలు మాడనివాడుకూడా ఫస్ట్క్లాసులోనికి తయారు. ఇంత శ్రమపడి చమటలు కక్కుకుంటూ వస్తే స్టాప్ ఒకరిగు. ఆ పెద్దమనిషి యింటిదగ్గరనుంచి తీసుకువచ్చిన నల్లుల్ని యిక్కడ దిగుమతి చేసి చక్కాపోతాడు...'

చిన్న మేస్త్రెవడో ఘటికుడిలాగే ఉన్నాడు. యిన్నాళ్లకి అగ్నిహోత్రుడికి తగినవాడు దొరికాడని కరకట శాస్త్రుల్లు అన్నట్టు యిలా కబుర్లు చెప్పేవాడు చాలారోజులకి కనుపించాడు,

ఆరిపోయిన చుట్టకి అగ్గిపుల్ల కొట్టి బుగ్గలతో గాలిమికొడుతూ చప్పుడు చేస్తున్నాడు.

'పాడుచుట్టలండి. కాల్చి తగలేద్దామన్నా కాలకుండా వున్నాయి. ప్రపంచం అంతా డీజనరేట్ అయిపోతున్నట్టు యీ పొగాకు లోనూ నిర్లక్ష్యం ఏర్పడి చివరకి ఫైర్‌ప్రూఫ్ అవుతోంది...'

మేస్టరు చెప్పింది నిజమల్లే తోంది. వెలిగించామంటే మసి అయిపోయేదాకా ఆరని కత్తెర సిగరెట్లుకూడా యీమధ్య మధ్యమధ్య ఆరిపోవడం మొదలెట్టాయి.

'ఏం చుట్ట' అంటూ విసిగిపోయి గిరవాటు ప్రారంభించాడు. 'ఎవడో నీరసించిన బక్కనాయన చుట్టినట్టున్నాడు. రేషన్‌బియ్యం తినేవాడికి అంతకన్నా ఎక్కువ బలం వస్తుందా ఏమిటి. అదేమిటోగాని పంతులుగారూ !... మీరు పంతుళ్లేనాండి... కాకపోయినా ఫరవాలేదులెండి. యీ మధ్య పాశ్చాత్యులుకికూడా జ్ఞానోదయం అయి రినన్‌సియేషన్, డిటాచ్‌మెంట్ మొదలైన ముక్కల్ని పట్టుకుని ముక్కుమూసుకుని హక్స్‌లే ప్రభృతులు బ్రాహ్మణులమైపోయామంటున్నారుట. అలాంటప్పుడు వేదవేదాంత విద్యానిలయమైన భారత దేశంలో బ్రాహ్మణుడికి తక్కువైనవాడు ఎవడూ ఉండడనే నా నమ్మకం...'

కీ యిచ్చి వదిలేస్తే చాలన్నట్టుంది, మాస్టరు వరుస. మా లిస్టులో తప్పకుండా చేర్చుకోవలసిన మనిషల్లే ఉన్నాడు.

'అలాంటప్పుడు మీరు పంతులుగా రవడానికి అభ్యంతరం ఏముంది. పంతులుగారూ! యీ కంట్రోలన్న పేరు ఏ దుర్ముహూర్తాన వాడుకలోనికి వచ్చిందో కాని, ఏ వస్తువుని కంట్రోలనండి– చివరకి గోమయాన్నికూడా యింక అది ఏమైపోతుందో? చచ్చినా దొరకదు. ఇక రేషనంటారా– దాని పేరు బలంకూడా అలాగే అఘోరిస్తోంది. మీరు నమ్మినా నమ్మకపోయినా చెపుతున్నా–గుణంపురంసన్నాల్ని రేషన్ అనండి అవి అమాంతంగా చెత్తయి ఊరుకుంటాయి. ఒకవిషయానికి అభినందించాలిలెండి. అజీర్ణవ్యాధి కాస్త అణిగినట్టుంది, యీ రేషనింగు వచ్చాక.'

ఫ్లాస్కు తీసి 'టీ' నాకొక్కస్త యిచ్చి తను కాస్త తాగాడు.

'పంతులుగారూ! యిక్కడి నల్లులకే మీరిలా అయిపోతున్నారే. మీ రెప్పుడైనా రంగురంగుల నల్లుల్ని చూశారా ?'

ఇంతలో గంట మోగితే లేచి వెళ్లి ఏదో ఫోగట్టా అందుకునివచ్చి కూర్చుని ప్రారంభించాడు. 'మీబండీ గంటలేటు. లేటుగా రావడం దానికి మామూలే లెండి. నే నీమధ్య ఫలానా స్టేషన్‌లో ఉండేవాణ్ణి. ఆ స్టేషను కొత్తగా వేశారు లెండి. ఏరోడ్రోమ్‌కి చాలాదగ్గర. ఆకాశంలోంచి నేరుగా ఊడిపడ్డ సైనికుల్ని రవాణా చెయ్యడమే ఆ స్టేషన్ పని. అక్కడుండేవండి నల్లులూ... పంచరంగుల నల్లులు. కేవలం విదేశాల నుండే వచ్చాయనుకుంటా నవరత్నాల్లా నిగనిగలాడుతూండేవి. అంతర్జాతీయ సైనికబృందం తీసుకువచ్చిన వనుకుంటా...'

'అయితే ఏ డీ. డీ. టీయో కొని ఎందుకు జల్లరండి మాస్టరుగారూ' అన్నా.

'మహానీయా! ఆ రహస్యాన్ని చెప్పమన్నారా. ఎవరికీ చెప్పనని మీరుమాత్రం హామీ యివ్వాలి. యుద్ధానంతర పునర్నిర్మాణంలో రైల్వేశాఖ రహస్య ప్రణాళికలో ఏం ఉందంటే– యీ నల్లులున్నాయే, రైల్వేశాఖవారికి ఆప్తమిత్రములున్నూ, జీతం బత్తెం లేని నౌఖర్లున్నూట. ఎందుచేతనంటారా రైల్వేశాఖలో పనిచేస్తున్న బద్ధకస్థుల్నీ, సోమరిపోతుల్నీ పొడిచిపొడిచి మీపని మీరు సక్రమంగా చేసుకోండి అని హెచ్చరిస్తూంటాయిట. అంతే కాదు. నిద్రపోయి రైలు తప్పిపోకుండా ప్రయాణీకుల్నికూడా జాగ్రతిలో ఉంచుతాయట. అందుచేత నల్లులు మన శ్రేయోభిలాషులు అని ఆ రహస్య ప్రణాళికలో విస్పష్టంగా ఉందిట.'

ఇంతలో తిరిగీ గంట మోగింది.

'పంతులుగారూ! యింక టిక్కట్లు యిచ్చుకోవాలి' అని లేచాడు.

నేనూ టిక్కట్టు తీసుకుని యింతవరకూ ఊసుపోయినందుకు సంతోషిస్తూ, ప్లాట్‌ఫారంమీద పచారుచేయడం మొదలెట్టాను.

తెలుగు భాషకు దేవనాగరి

పి. వెంకట్రామశాస్త్రి

కొద్ది కాలం క్రిందట ఆంధ్రప్రభలో కాబోలు ఒక సంపాదకీయ లేఖలో ఆంధ్రభాషకు దేవనాగరిలిపి బాగుంటుందని వ్రాయబడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు దాన్ని గురించి ప్రజానీకంలోకాని సాహితీసీమలోకాని కలగబోయే సంచలనంగూర్చి మౌనం వహించాను. ఇంతవరకు మన సోదరులలో కదలిక కల్పించలేదు. ఆ లేఖ కుంభకర్ణనిద్రలో హోమశబ్దంవలె ఆకాశంలో లీనమయింది.

'తెలుగు స్వతంత్ర'లో శ్రీ వేణుగారి వ్యాసం ఈ విషయంలో చదివితిని. వారు తన వ్యాసంలో తెలుగుభాషకు దేవనాగరిలిపి అవసరం స్పష్టపరిచారు. నేను చేయకపోయినా ఎవుటివాడు చేస్తూన్నప్పుడు సహాయం అయినా ఎందుకు చెయ్యకూడదని ఈ విషయంలో నా ఉద్దేశ్యాలను క్రింద వ్రాస్తున్నాను-

శ్రీ వేణుగారి ఉద్దేశ్యానుసారంగా దేశానికి ఏకభాషవలె ఏకలిపికూడ అవసరమే. అది దేవనాగరిలిపి అని చెప్పుటకు నాకేమీ సందేహము లేదు. మన దేశపు లిపులలో దేవనాగరి మన లిపి. వైజ్ఞానికమైనది. నిర్దిష్టోచ్చారణ కలది. వర్ణాత్మకము. సుందరమైనది. వేగము కలది. మన దేశావసరములను తీర్చునది. మహారాష్ట్రులు, అస్సామీలు, రాజపుత్రులు వగైరాలు ఇంతకంటే వేగవంతమైన తమ లిపులను వదలి దీనినే గ్రహించారు. సులభమైనందున, మన వేదాలు, వేదాంగాలు, వేదాంతాలు, పురాణాలు, కావ్యాలు, ధర్మశాస్త్రాలు, శాస్త్రాలు ఒకటనేమి మన సంస్కృతి సామ్రాజ్యమంతా దేవనాగరియందున్నది. దేవనాగరి మన పూర్వులందరు పరమ భక్తితో అభ్యసించేవారు. మనదేశంలో ఇంచుమించు 25 కోట్లమందికి దేవనాగరిలిపి తెలియును. ఇతర భాషలవారు కూడ ఒక్కొక్కరే అతి త్వరలో దేవనాగరి లిపిని గ్రహిస్తారు. మనం కూడ దేవనాగరినే తెలుగుకు లిపిగా గ్రహించి ఏకలిపి సమస్యకు దోహదం ఇస్తే బాగుంటుంది.

తెలుగులిపికి అందం లేదని కాని, వేగం లేదని కాని నా ఉద్దేశ్యం కాదు. అది సులభ సాధ్యం కాదు. దేవనాగరి లిపిలో అనేక సంస్కరణలు జరిగినవి. జరుగుతున్నాయి. తెలుగు అచ్చుకు ఇంచుమించు 720 రకాల ముద్రలు కావాలంటారు. తెలుగు టైపురైటరు సంగతి కూడ అలాగే ఉంది. ప్రపంచంలో దీనికంటే దేనికీ కూడా ఎక్కువ ముద్రలు అక్కరలేదు. పైగా దేవనాగరలిపికి అనేక పరిశోధనలు జరుగుచున్నవి. రాజ్యాంగ సభలో ఆమోదించబడిన సంస్కృత దేవనాగరిలిపి ప్రకటించబడగలదు. శ్రీ కాకా కలేల్కరుగారు దేవనాగరీ వర్ణమాలను సంస్కరించారని, టైపు వగైరాలకు రోమనులిపి కంటె ఎక్కువ వేగవంతము కాగలదని రెండు సంవత్సరముల క్రింద చెప్పారు. అది ఎలాగున్నా కొద్ది మాసములలో దేవనాగరీ సంశోధనము వెలువడుతుంది. అన్ని ప్రయోజనములను సుకరముగ చూచునటుల సవరణ చేయబడుతోంది. తెలుగు లిపికి ఆ యోగం పట్టలేదు సరికదా మన పండితులు ప్రవేశము పట్టనివ్వరు. కావున దానిని విడిచి దేవనాగరిని గ్రహించడం అన్యధా ఆర్థిక ప్రయోజనకరం.

తెలుగు లిపి విడువమనేటప్పటికి మన సంస్కృతిని నశింపచేసి అన్యసంస్కృతిని గ్రహించమంటున్నానని నక్కరలేదు. తెలుగు లిపి బ్రాహ్మీ లిపినుంచి పుట్టింది. దేవనాగరికూడ బ్రాహ్మీ భవమే. రెండూ మనవి. సజ్ఞగ పుట్టుబడితే పేరుగు అన్నా వినరూ! తెనుగు విడిచి దేవనాగరి గ్రహించడంతో ఆంధ్రత్వానికి భంగం వాటిల్లదు. మహాత్ములు గడ్డాలతోటి, సన్యాసులు కాషాయ వస్త్రాలతోటి, పండితులు నామాలతోటి, ఉద్యోగస్తులు యూనిఫారాలతోటి, గాంధీవాదులు ఖద్దరుతోటి ప్రకాశించేటట్లు ఆంధ్రమాత దేవనాగరి అనే బనారసు పట్టు చీర కట్టుకుంటే వికాసం పొందదా? అతుకుల బొంత విప్పి క్రొత్త చీర కట్టబెడితే తప్పేమిటి? సంస్కృతం ముందర తెనుగును హీనభాషగా చూసే విద్వాంసులను అన్నీ పరాయిగానే కన్పి

స్తాయి. దేవనాగరిలిపి విదేశీలిపి అయినప్పటికీకూడ దానివలన మనకు నష్టంలేదు. అది మన దేశైక్యతకు భంగం కలిగించేదికాదు. పోషకము కావున దేవనాగరి విదేశీలిపి అయినప్పటికి దానిని గ్రహించడంలో నష్టంలేదు.

ప్రజలకు దీనియందలి లాభాలాభాలు తెలియవు. ఈ ఉద్దేశ్యం ఉన్నవారందరుకలసి పనిచేసి ప్రజలలో చైతన్యంకలిగించి ప్రజలచే యీ విషయం ఒప్పించినచో దేవనాగరిలిపిని అమలుజరిపే పద్ధతులనుగూర్చి తరవాత ఆలోచించవచ్చును. ఉద్దేశ్యంఅంటూ కలిగితే ఉపాయాలు అప్పుడే తోస్తాయి. పైగా ఇతర భాషాభాషులు ఈ లిపిని ఎప్పుడో గ్రహించివున్నారు. ఆ పద్ధతులను పరిశీలించి ఆవిధంగా మనం అమలు జరుపవచ్చునో కూడదో ఆలోచించవచ్చును. అసలు ప్రజలలో ఈ విషయంలో ఉత్సాహం కలిగించడం అవసరం.



ఆంధ్రభాషకు అన్యలిపి

జోశ్యుల సూర్యనారాయణ

“ఆంధ్ర భాషకు దేవనాగరిలిపి” అను శీర్షికతోడి వ్యాసము 24—9— న వెలసిన స్వతంత్రలో ప్రచురితమైనది. అది యీ వ్యాసమునకు హేతుభూతమైనది. భారతీయ భాషలు చాలగలవు. రాజకీయమగు నుపయోగమునకే కాక సామాజిక శ్రేయమునకును జాతీయభాష యావశ్యకము. అసలు జాతీయభాషయొక్క ముఖ్యోద్దేశ్యమేమనగా ప్రాంతాంతర ప్రజలుకూడ మనతో సానుభూతి గల్గియుండుటకు సర్వప్రాంత సంవేద్యమగు నుపకార మొకటి కల్గియుండుటయే. ఇట్టి యోగ్యత గలది ‘హిందీ’ యని యభిజ్ఞులయూహ.

కాని యీయాంధ్రమాభాషతో సన్నిహితత్వమును సంపాదించుకొనగల్గుటకు యత్నించినచో నొక్క నాగరిలిపిని బోధించినంతమాత్రాన కృతార్థయగునా? అసలింతకు మనకు నాగరిలిపి-యందలి యభిమానము చేతగాని, “ఆంధ్రమునకసలే స్వతంత్రలిపి లేదుగదా! ఇక నాగరినే యాశ్రయించి యీ ముద్రణాదులకు శ్రమ కల్గించు లిపియేల?” అని భావించిన నది యెంతటి సాధ్యమో?

లిపి కేవల సంజ్ఞామాత్రప్రయుజ్యమానము. శబ్దముల సంబంధము, భాషల సంప్రదాయము, వ్యాకరణాది సాజాత్యము మొదలగు విషయముల నెన్నినచో సామాన్యముగ భారతీయ భాషలన్నిటికిని పోలిక లేకయుండదు. కాని దక్షిణదేశ భాషలన్నియు నొక్కరీతి నియమములతో మిక్కిలి దగ్గఱగా నుండగలవు. సంస్కృతముతోడి సంబంధమొక్క తెలుగునకే తీవ్రముగనున్న దనుకొననక్కఱలేదు. తమిళభాషలోని విశ్వస్వభావమును నూటు ఎంటలుగా ఏ భాషల సంస్కృతము లే. దని సంప్రదాయములు వేరు. దీనికేమంటిరియు.

రాష్ట్రము సంపాదించుకొని ఆంధ్రులు మద్రాసీ వలన బాపుకొని బాగుపడనున్న మనకీ యన్య దాస్యమేల?

కన్నడసంబంధమున్నను మన లిపి యొక్క ప్రత్యేకతయు భావించి కొన్ని శతాబ్దములనుండి యలరాలు ముత్తెముల సరముల వెలయుచున్నది. ఒక్కలిపి నాగరమైన యీ నాగరకత మనకేల సబ్బగలదు? కన్నడ తమిళ మళయాళాది భాషలతోడి సంబంధమా యాంధ్రమున కొక్క తీరునదా? భాషా సంప్రదాయము తెలుగునకు దానికి నొకరీతిదే. చాలపదములు చాలసన్నిహిత రూపములు గల్గి ద్రావిడభాష లున్నవి. సంస్కృత శబ్దములు మాత్రము తెచ్చి యుపయోగించుకొంటిమేగాని యొక్క మిశ్రమ సమాసము చేసి చూడు డెంత బాధగ దోచునో? ఈమధ్య నొక కవిశేఖరుడు — కోకిల “సపకూత” యని ప్రయోగించినాడని మేము (పొట్టుబుబ్బ) నవ్వితిమి. ఆ పదములమాత్రము నుపయోగించిన మాత్రాన నాలిపి నంటుకొనగలమా? పైగా భా[illegible] గ్రంథములు కూడ తెలిసికొను[illegible] లేక పోవుననుకొను[illegible] పొరపాటు. “దేశి” [illegible] పెల్లున్నదే? [illegible] చున్న

నేమి లాభము? నాగరిలో వ్రాసిన దేశి ఉత్తర దేశీయుల కర్థమగునా? నాగరిలిపి వచ్చినంత మాత్రాన మనకుత్తరభాషలు వచ్చుననుట భ్రమ. సంస్కృత పండితుడు హిందీ చూచి నేర్చుకొనలేడు. ఆ భాషారీతులు గుర్తించుటకు శ్రమింపక తప్పదు. కాని కొంతవరకా భాషలు (యత్తచ్ఛబ్దములు సంస్కృతమునవలె హిందీలో "జో" "వహ్" అనునవి వాడవలెను) పరిభాషలలో నైక్యత నందినవి. ఇక తెలుగు పరిభాషయంతయు హిందీకి వేరేగాని సన్నిహితముగాదు. దగ్గర ఎంత వరకనిన నానా భాషలు బాగుగ చదువనివారను కొనునట్లు సంస్కృత శబ్దబాహుళ్య మాంధ్రమున నుండుటయే.

భారతదేశమంతయు జాతీయభాషను హిందీని గల్గియున్నదే, మన గతియేమి? అని మనమా లిపి నాశ్రయించుటయా? మనలిపిని రక్షించుకొని దేశి తెలుగు నభివృద్ధిపరచుకొనుటయా? అన్ని ప్రాంతములకు గల్గిన సంబంధమును రాజకీయోద్యోగులు నిర్వర్తింతురు, వారి కది యావశ్యకము. ఇక ప్రాంత సానుభూతికిగాని స్వీయావశ్యకతలకుగాని అనతికాలములో హిందీయో హిందూస్థానియో నేర్వగలము. లిపిగోలకంటె మూర్ఖాపదికు లలనాటు పడుట లేదిక.


సాహిత్య దృష్టితో జూచినను, సంస్కృతశబ్ద బాహుళ్య మున్నంతవరకు సరియైనను, తెల్గెట్లు పొసగును?


"ఏచిన పొదల బడల్పడః
ద్రోచుచు ముండ్లను నల్ల దొలంగుచు నిక్కల్
గాచును గొడదురుచు వ్రాల్గుచు
వేమచు లలితాంగి సంచలించుచు నరిగెన్"
(నన్నయ)

ఈ పద్యము నాగరిలిపిలో వ్రాయబడిన నెట్లుండును? ఇట్టివి తెల్గులో నెన్ని యుండునో తెల్పగలమా? ద్రుతాది సంధు లెట్లు? పైగా నింట వాకిట నుపయోగించుకొను మాట లెన్నో జాను తెన్గులున్నవే, వీని నా నాగరిలిపిలో వ్రాసి క్రొత్త యుచ్చారణ గల్గగా చివరకు మరల నీని కపభ్రంశ రూపము గల్పించవలయునా? కొన్ని మాట లెట్లు ఆంగ్లములో వ్రాయబడి సంస్కృతములుగాని తెల్గులుగాని విపరీత రూపముల నంది హాస్యాస్పదము లైనవి? కొన్ని పట్టణముల పేర్లుమారుటకు కారణము పరభాషా దాస్యము పరదేశీయోచ్చారణాసమర్థతయు గాదా? అది వదలినప్పుడే దేశ భాషలు స్వతంత్ర స్వీయరూపముల నందలేక సంకర వక్రత నంది యేమి పొమ్ముగొనగలవు?

మన భాషా పదములు మరొక లిపిలో జూచి వికృతముగ నుండును. అవి వాని సరియైన దుస్తులతో లేకపోవుటచే గదా! ఇట్టితరి నింక మన తెల్గుమాట లితరులచే నాగరిలో జదువబడి దురుచ్చారణములకు లోనైన నని యందమని ఇంగ్లీషున కలవడినట్లు పరానుకరణ పండితులమై మనము దాని వికృత రూపమునే యుచ్చరింతుము.

ఈరీతిని మన కిది శ్రేయోదాయక మగునా? ఇక నాంధ్రులలో జాలమందికి నాగరిలిపి వచ్చును గదా యని చూచినచో నెట్లు వచ్చును? హిందీ రూపములో వచ్చును. ఒక్కసంగతి మన మిక్కడ గుర్తింపవలెను. హిందీ పండితునికి సంస్కృతగ్రంథ మిచ్చినచో నాతడద్దానిని త్వరగ జదువలేడు. (అర్థము సంగతి యట్లుండుడు) ఏల? సంస్కృత శబ్దములు చాల సంయుక్తాక్షర భూయిష్ఠములు. అవి కలుపుటకు తెలుగులిపిలోకన్న నాగరిలో వేరిక యున్న దనుకొన్నను ఉచ్చారణ సాగదు. దానికాలిపితోనేగాక యా భాషతో బరిచితి పూర్తిగ నుండి తీరవలెను. అనగా నాగరి తెలిసిన యాంధ్రులలో నెక్కువమంది యాంధ్రము నాగరిలో వ్రాసిన తిరిగి నేర్చినంత పని కాక తప్పదు. సంస్కృతపద భూయిష్ఠము గావుననే యీ బాధ. ఇక తెలుగు పదములు దింపలగును. అలవడునంత వరకు గష్టమన్నచో నింక నీ లిపినే సంస్కరింపరాదా? ఒక ప్రసిద్ధ ప్రవృద్ధ భాషను కేవలము లిపిహీనముగా జేసివేయుటకంటె దానికొక స్వతంత్ర లిపిని కొద్దిమార్పులతో నుంచుట శ్రేయస్కరము కాదా? అక్క, బిడ్డ, మెట్ట, పల్లము, ఇల్లు, తల్లి, మాటలా లిపిలో మాత్రము వ్రాయుటకు క్రింద వ్రాయవలసియే వచ్చుచున్నదిగదా! ద్విత్వములు? ఇంతకు సాంప్రదాయములు సన్నిహితములేమో యనుకొన్నచో బొత్తుగ భిన్నములు.





డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్య

కర్ణాటక సంగీతమును గరపుటకు కేంద్ర కళాశాలను స్థాపించుటకొఱకు ఇండియా కేంద్ర ప్రభుత్వమువారొక తాత్కాలిక సంఘము నేర్పరచినట్లును, నా సంఘమునకు నీ క్రింది పెద్దమనుష్యులు మెంబర్లుగ నియోగింపబడినట్లును ఆక్టోబరు 1వ తేదినాటి మదరాసు దినపత్రికలలో ప్రకటితమైనది.

మెంబర్లు:—

1. శ్రీ టి. యస్. అవినాశిలింగం చెట్టియార్, మదరాసు గవర్నమెంటు విద్యాశాఖమంత్రి, అధ్యక్షుడు.

2. శ్రీ న్యాయాధిపతి పి. వి. రాజమన్నార్, మదరాసు ప్రధాన న్యాయాధిపతి.

3. శ్రీ మదరాసు విశ్వవిద్యాలయపు వైస్ ఛాన్సలర్.

4. శ్రీ కె. శ్రీనివాసన్, మేనేజింగు ఎడిటర్, హిందూ.

5. శ్రీ కె. వి. కృష్ణస్వామి అయ్యర్, మదరాసు మ్యూజిక్ అకాడమీ ప్రెసిడెంటు.

6. శ్రీ టి. కె. చిదంబరనాథ మొదలియార్.

7. శ్రీ పి. సాంబమూర్తి, మదరాసు యూనివర్సిటీ సంగీతశాఖ తలమనిషి.

8. శ్రీ యస్. వెంకటేశ్వరన్, ఐ. సి. యస్.

9. శ్రీ (పెద్దపులి) కె. వరదాచారి, అడయార్ కళాక్షేత్రపు ప్రధానోపాధ్యాయుడు.

ఈ తొమ్మండ్రయందును ఎనమండ్రు అరవలు. ఒకడు ఆంధ్రుడు. ఈ నియోజక వర్గముయొక్క మెంబర్లనుబట్టి చూడగా, కర్ణాటక సంగీత కేంద్ర కళాశాల కేవలము మదరాసునందే నుండవలయునని తన్నిర్మాతలగు ఇండియా కేంద్ర ప్రభుత్వమువారి యుద్దేశమైనట్లు తోచుచున్నది; కాని వాస్తవముగ నీ యభిప్రాయము వారిది కాదు; ఈ యుద్యమము మదరాసు గవర్నమెంటువారిది; వారి ప్రేరేపణ మూలననే కేంద్ర ప్రభుత్వమువారు కర్ణాటక సంగీత కేంద్ర కళాశాలను స్థాపింపదలచిరి. పై నుదాహరింపబడిన తాత్కాలికసంఘ సభ్యుల పట్టికయు వారిచే నియామకము సేయబడినదే. ఇప్పుడు మదరాసు రాష్ట్రమును పాలించెడి ప్రభుత్వ మరవప్రభుత్వము. అరవ ప్రభువులు నియామకముచేసిన తాత్కాలికసంఘ సభ్యవర్గ మరవ జనబాహుళ్య మగుట సహజమే కదా! నీరు నిట్టవంకను ప్రవహించును గాని మిట్టకెక్కి పారదుగదా!

కర్ణాటక సంగీతము కేవలము అరవ కళయైన, పై పట్టికనుగూర్చి ఏమియు నధిక్షేపించుట కవకాశముండదు. కాని యది యరవల కాణాచి కాదు. దాక్షిణాత్యులకందఱకు దీనియందభిమానాదరములు సమానము. మఱియు నరవలకు దీనితోడి సంబంధము కడు నాధునాతనము. దాని యభ్యుదయముతోడ వారికి విశేషించి చెప్పదగిన సంబంధమేమియు లేదు. కర్ణాటక సంగీతమందలి కర్ణాటక శబ్దమును గాంచి యది కన్నడదేశమున నుత్పత్తినంది యభివృద్ధినొందెనను తలంపు కొందరికి కలుగవచ్చు; కాని యది వట్టి భ్రమ. కనకదాసు పురందరదాసు ప్రభృతులు కన్నడిగలు కొందఱు కీర్తనలు రచియించుట నిశ్చయమే; కాని వీరికి పెక్కు శతాబ్దములకు పూర్వమే ఈ సంగీత పద్ధతి యాంధ్ర

దేశమున నభివృద్ధి నందియుండుటచే, వీరిమూలమున దానికాపేరు వచ్చెననుట చెల్లదు. ప్రాచీన దాక్షిణాత్య సంగీత చరిత్ర మన కింకను జక్కగ తెలియదు; ఇంకను చాల పరిశోధన జరగవలసి యున్నది. లభించిన గ్రంథసాక్ష్యమునుబట్టి చూడగా కాకతీయయుగమప్పటికి యది చాల పెంపొంది యుండెనని తోచుచున్నది. కర్ణాటక సంగీతము తామర తంపరగ వృద్ధియైనది విజయనగర రాయల సంస్థానమునందు-విజయనగర సామ్రాజ్యమునకు కర్ణాటక సామ్రాజ్యమని నామాంతరము; ఈసామ్రాజ్యమున విశేషముగ నభివృద్ధిచెందుటచే దీని కాపేరు వచ్చినది. విజయనగర సామ్రాజ్యమును స్థాపించిన వారు తెనుగువారు; కర్ణాట సామ్రాజ్యమున గాంధర్వకళ నభ్యసించి పెంపొందించినవారును తెనుగువారే: రాయలను పోలి రెడ్డి వెలమరాజులు సంగీతకళను పోషించిరి-కావున కర్ణాట సంగీతమునకును కన్నడదేశమునకును విశేషసంబంధ మేమియు లేదు. కర్ణాట సంగీత మాంధ్ర సంగీతమే కాని యన్యముగాదు. శ్రీనాథుని కవిత్వము కర్ణాట భాష యైనట్లు ఆంధ్ర సంగీత శాస్త్రజ్ఞులచే వివరింపబడినదియు నాంధ్రగాయకులచే నభ్యసింపబడినదియునైన యాంధ్ర సంగీతము కర్ణాటక సంగీతమైనది. అనగా కర్ణాట సామ్రాజ్యమున వాడుకయందుండిన కారణమున దాని కాపేరు వచ్చెను.

విజయనగర సామ్రాజ్యమున గాంధర్వ కళ యభ్యుదయ మందకపూర్వమె యాంధ్రదేశమున ప్రాముఖ్యము నందినది. రాచకొండ రాజధానిగ క్రీ. శ. ౧౪ వ శతాబ్దాంతమున తెలింగాణమున పాలించిన సర్వజ్ఞ సింగభూపాలుడు శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరముపై నొక వ్యాఖ్యను రచించెను. అతని సమకాలికుడు కొండవీటి రెడ్డిరాజు కుమారగిరి భూపాలుడు వసంతరాజీయమను సంగీత గ్రంథమును వ్రాసెను; ఇతని సమకాలిక క్రీ. శ. ౧౫ వ శతాబ్దారంభమున కొండవీటి సింహాసనము నధిష్ఠించిన పెదకోమటి వేమారెడ్డి సంగీత చింతామణియను గ్రంథమునువిరచించెను.విజయనగరసామ్రాజ్యమున సంగీత గ్రంథరచన యప్పటి కింకనా రంభముగాలేదు; కాని యచట సంగీత విద్యా విశారదులు పెక్కండ్రుండిరి. పెద బుక్కరాయల కుమారుడు సుప్రసిద్ధ కవయిత్రి గంగాదేవి భర్తయు నగు నిమ్మడి కంపరాయలు 'సంగీతైకసిద్ధ' యను బిరుదాంకితుడు; ఇతనికొలువున మఱి యిద్దరు గాంధర్వ కళోపాసకు లుండిరి. ఒకడు సోమయ దండనాయకుడు. ఇతడు కుమార కంపరాయల ప్రధానమంత్రి. సంస్కృతమున మంచి కవిత్వము చెప్ప నేర్పుగలవాడు; మఱియు సంగీత సాహిత్యార్ణవుడు, గానపరమ మాహేశ్వరుడు-రెండవ వాడు బయకార అల్లాళనాథుడు. ఆ కాలమున నితని పాట సుప్రసిద్ధి నందె-కేవలము వాగ్గేయ కారకు డగుటచే నితని కళావైదుష్య మితని తోడనే నశించిపోయినది. విజయనగర సామ్రాజ్యమున సంగీత గ్రంథరచన క్రీ. శ. ౧౫ వ శతాబ్ద పూర్వార్ధమున ప్రారంభమైనది. కొండవీడు రాచకొండలతోటి పొత్తు విజయనగరసంస్థాన సంగీత విద్వాంసులను గ్రంథరచనకు ప్రేరేపించి యుండవచ్చును. విజయరాయల యల్లుడును నిమ్మడి దేవరాయల బావమఱదియునగు సాళువ గోపతిప్పయ మొదటి సంగీతశాస్త్రగ్రంథకర్త. ఇతడు తాళదీపికయను గ్రంథము రచియించె-ముమ్మడి ప్రౌఢరాయ నామాంకితుడగు మల్లికార్జున రాయల యాస్థానమున కల్లరసు డను సంగీత విద్వాంసు డుండెను; స్వరమేళకళానిధి కర్తయగు రామయామాత్యుని కితడు బంధుడగుటచే నితడు నాంధ్రుడనుట నిస్సంశయము- ఇతడు శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరముపై సుప్రసిద్ధ వ్యాఖ్యానము నొక్క దాని రచియించె- ఇతని కిమ్మడి నెన్నదగినవాడు సంగీతసూర్యోదయ గ్రంథకర్త భండారు లక్ష్మీనారాయణ. ఇతడు శ్రీ కృష్ణరాయల ఆస్థాన విద్వాంసుడు; మఱి యీరాయలవారి అంతఃపుర స్త్రీలకు సంగీతము నరపు నుపాధ్యాయుడు- లక్ష్మీనారాయణ తరువాతివాడు రామయామాత్యుడు- ఇతని బయకార రామప్పయని నామాంతరము- కృష్ణరాయల యల్లుడు అళియ రామయ్యకు మంత్రి. ఆప్తమిత్రుడు- స్వరమేళ కళానిధియను సంగీతగ్రంథము నితడు వ్రాసెనని పైజెప్పియున్నాను.

క్రీ. శ. ౧౫౬౪-౬౫ సంవత్సరమున జరిగిన రక్కసి తంగిడి మహాసంగ్రామమునకు తరువాత రాయసంస్థానము కాలముగాక పోయినను విజయనగరము క్రమ క్రమముగ క్షీణింపసాగినది. రాయ రాజధాని మొదట పెనుగొండకును తరువాత చంద్రగిరికి కడపట రాయవేలూరునకును మార్చబడినది.

దక్షిణమున అరవదేశమున జింజీ తంజాపుర మధురా నగరములయందు తెలుగునాయకరాజ్యములు బలిసినవి- విజయనగరమునుండి కవిగాయక నటాది కళోపాసకులందఱును దక్షిణ రాజ్యములను జేరి యచట నాయకరాజుల నాశ్రయించిరి. నాయక రాజ్యము లన్నిటియందును తంజాపురము సుప్రసిద్ధమైనది. ఇతరనాయక రాజులకంటె తంజాపుర ప్రభువులకు కళాభిమాన మెక్కుడు. వీరి యాశ్రయమున తంజాపురమొక్క గొప్ప యాంధ్ర విద్యాపీఠ మాయెను. నాయకరాజులలో పేరెక్కినవాడు తంజాపుర రఘునాథ నాయకుడు. ఇతడాంధ్ర గీర్వాణముల రెంటియందును ప్రతిభాశాలియైన కవి; చక్కని విద్వాంసుడు; వైణికుడు; ఇప్పుడు ప్రచారమునందుండు రఘునాథ వీణ నితడేర్పరచినదే. సంగీత సుధ యను సంగీతశాస్త్ర గ్రంథ మీ రఘునాథ కృతమే. మఱియు నితని మంత్రి గోవింద దీక్షితుడును నతని పుత్రులు యజ్ఞనారాయణదీక్షిత వెంకటమఖులును సుప్రసిద్ధ విద్వాంసులు. వీరు బడగలనాటి కన్నడిగులు; ఆంధ్ర బ్రాహ్మణులయందొక శాఖకు జెందినవారు. సంగీతమున నిపుణులు. వెంకటమఖి చతుర్దండి ప్రకాశిక యను సంగీతశాస్త్ర గ్రంథమును వ్రాసెను. తంజాపుర రఘునాథునివలె నతని పుత్రుడు విజయరాఘవుడును కవి, కళాప్రియుడు. ఇతడు పెక్కు యక్షగానములను, ద్విపద కావ్యములను, గేయములను వ్రాసెను. ఇతని భార్య రంగాజమ్మ మన్నారుదాసవిలాసమను యక్షగానమును వ్రాసెను. మఱియును దక్షిణాపథము నందంతటను నద్వితీయ సంగీత విద్వాంసుడని ప్రఖ్యాతి వడసిన క్షేత్రయ విజయరాఘవుని సమకాలీనుడు. ఇతడు తంజాపురమునకు బోయి విజయరాఘవుని మెప్పించి సత్కారము వడసెను. నాయకరాజుల కృషిచే తంజాపురము కళలకాకర వాయెను; గాంధర్వకళ కోటపట్టాయెను. కాని యచటి కవులు, గాయకులు, పాఠకులు, భరతశాస్త్ర బోధకులు, నటులు వీరు వారననేల లలితకళోపాసకు లందఱును తెనుగువారే. ఈ కారణముననే నాయకరాజులు గతించిన వెనుక వారి స్థానమున రాజ్యపాలన మొనర్చిన మహారాష్ట్ర ప్రభువులు గూడ తెనుగును నేర్చి తెనుగున గ్రంథములను రచించి గాంధర్వాది లలితకళా విశారదుల నాదరింపవలసి వచ్చెను. కీర్తనబ్రహ్మ త్యాగరాజు ఈ మహారాష్ట్ర ప్రభువుల కాలమున వెలసెను. అప్పటి వఱకును అరవల గాంధర్వకళ గొట్టిదో తెలియజేయు సాధనము లెవ్వియు లేవు. ఒక అరవ గాయకుని పేరుగాని, కృతికర్త నామముగాని తెలియదు. సంగీతశాస్త్ర గ్రంథకర్తయును లేడు. ఆంగ్లేయ యుగముననె ఇతర విషయములందువలె సంగీతమునందును వీరి మాహాత్మ్యము వెల్లివిరిసినది. కర్ణాటక సంగీతము నుద్ధరించుటకు వీరు చేసిన కృషి యంత విపరీతముగ ప్రశంసింపదగినది కాదు.

ఇంతదూర మీవట్టున కర్ణాట సంగీత చరిత్రను వ్రాసినచెయదె యరవల కాణాచి కాదని ఋజువు సేయుటకు—ఈ విషయమును వారుగూడ యొప్పుకొనుచున్నారు. ప్రస్తుత మరవదేశమున బహుజనసమ్మతమైన ఇసై తమిళ ఉద్యమమే దీనికి ప్రబల నిదర్శనము. విషయ మిట్లుండ, ఇండియా కేంద్రప్రభుత్వము నాడు మదరాసు అరవ దొరతనమిచ్చిన సలహా నంగీకరించి, మదరాసు కర్ణాటక సంగీత కళాశాలను స్థాపించుట కేర్పఱచిన తాత్కాలిక సంఘమున మెంబర్ల నందరిని యరవలనుండియే కూర్చుట యందేమి సబబుకలదు! ఆంధ్ర దేశము గొడ్డుపోయినదా? ఒక్క సంగీత విద్వాంసుడేనియు లేడా? పాఠకవాదకులలో పేరెక్కినవారు లేరా? సంగీత సంస్థలు లేవా? లేకేమి - అధికార గర్వాంధులైన మదరాసు మంత్రివర్గమునకు గానిపింపదుగాని.

నాదమును విని సంతసింపక యందులో నక్షరములున్నవని దానిని ముక్కలక్రింద గొట్టనేల? ఉదయపర్వతముపై గెంపుల సింహాసనముపై గెందామరల కిరీటముతో దల చూపుచున్న భానుబింబమును గాంచి మహానందభరితమై భక్తి పారవశ్యసహితమై భరతపక్షి గానము చేయుచున్నది కాదా?—(పానుగంటి)



అందుకే చెట్టంటే ఎంతో నా కిష్టం; ఎక్కడికీ చెట్టు ఎప్పుడూ వెళ్ళదు కాబట్టి.

ఇవాళ ఉదయం ట్రాముకోసం తపస్సు చేస్తూ చెట్టుకింద నిలబడ్డాను. "ఎక్కడికి నేస్తం" అని చెట్టు నన్నడిగినట్టనిపించింది. ఇంకెవరైనా నా ప్రశ్న అడిగితే "మైలాపూరు" అని జవాబిచ్చేవాణ్ణి. నిజానికి మనం కొలిచే పొడుగు వెడల్పుల పరిమితిలో నా జవాబు నిజంలాగే కనబడేది. కాని చెట్టు వేసింది నున్న ప్రశ్న కాబట్టి "మైలాపూరు నా గమ్యం" అని ఏ మొగం పెట్టుకొని జవాబివ్వగలను? "తెల్లారగట్లే లేచి ఇందుకా ఈ స్థానంలో నిలబడ్డావు?" అని చెట్టు గద్దిస్తే ఏమయిపోవాలి నేను?

చెట్టుతో ఎవరూ మాట్లాడలేరు. మనం ఎంత కొలిచికొలిచి జవాబు చెప్పినా అది అబద్ధపు వాసనే కొడుతుంది. చెట్టుని ఎవ్వరూ కొలవలేరు. మన ఆస్తుల్ని కొలుచుకోగలం! ఏదో ఒక పందాగ పేరు చెప్పి ఎవరో ఒక దేవుణ్ణి కొలుచుకోగలం. కాని, ప్రపంచ పర్యాప్తమైన చెట్టు తాలూకు ఆకుపచ్చని అహింసాత్మక సామ్రాజ్యపు వైశాల్యాన్ని ఎవ్వరూ కొలవలేరు. ఇంతలో ట్రాంబండి వచ్చింది. నాకు నిలబడ్డానికి చోటు దొరికింది. నిలుచున్న పాటుగా నేనేమీ కదలకుండానే ఒక చోటునుండి ఇంకో చోటు చేరుకున్నాను. నిలుచున్నంతసేపూ నా ఆలోచనలన్నీ చెట్టును గురించే! చెట్టులో నువ్వు చూసే నిశ్చలత్వం శిలదికాదు. శవానిదీ కాదు. అది కదలదనుకోవడం భ్రమ. క్షణం క్షణం చెట్టు కదుల్తూనే ఉంటుంది. అయితే దాని ప్రయాణం ఔన్నత్యంవేపు. ఆకాశాన్ని అందుకోవాలని ప్రతీచెట్టూ ప్రతీక్షణం ప్రయత్నిస్తూనే ఉంటుంది.

ధ్వనికన్నా ఎక్కువవేగంతో ప్రయాణంచేసే విమానం ధన్యమైనదే. కాని శ్రావణమంగళవారపు నోముర్రోజున సెనగగింజలోనుండి ఎగిరే మొక్క సాధించే వేగానికి నేను ఆశ్చర్యం పొందకమానలేను. చిన్నప్పుడు నేను పారేసిన చింతపిక్కల సంతానం ఇప్పుడు సకల ప్రపంచాన్నీ నిండిపోయిందన్న విలాపం కేవలం నిరాధారమైనదికాదు. శ్మశానాలమీద వానకురిసినప్పుడు ఎంత వేగంగా పచ్చగడ్డి ఎదుగుతుందో ఎందుకు నేను వేరే చెప్పడం?

నీ, నీ ఒక్కొక్క రోమానికి ఉదాహరణగా ఒకొక్క చెట్టుని చూడగలవు.

"కోరికవెల్ల ధనాశిబడ గోల్పడి,
దిక్కుల శూన్యదృక్కులంజేసి
యేటా వృథా శిశిరజీవన భారము
బుచ్చుచున్న భూమిరుహ మేను..."

అన్నాడు ఒక కవి.

"శ్రీమంతంబగు స్వర్గమున్ విడిచిలన్
నేమంతి నేమంతిమున్
హేమంతుండను కాంతారాకోర కాం
తే విరతమారంగ వని
భూమిన్ మేన నలంకరించుకొను కాం
పుల్, సిలముల్, వజ్రముల్
గో పుంభంబులు నాపెలంగ్ నాం గా
గుల్ గల్గు పుష్పావళుల్॥

అన్నాడు ఇంకో కవి.

ఇక్కడ నా ఉద్దేశంలో కొమ్మా, రెమ్మా, మొగ్గా, ముల్లూ, ఆకూ, వేరూ అన్నీ చెట్టే!

అందుకే చెట్టంటే ఎంతో నా కిష్టం. ఎక్కడికీ చెట్టు ఎప్పుడూ వెళ్లకపోతేనేం? ఏరోప్లేనులో ఎక్కినా ఎక్కడికి వెళ్లగలం మనం? ఎక్కడికీ వెళ్లని చెట్టు ఎప్పుడూ మనలోనే, మనలోనే ఉంది. ఇందుకే నాకంటే చెట్టంటే ఇష్టం.

కథానిక

ఏకాంతంలో....

'సుధ'

ఏకాంతం ఒక్కటే ఈ నా జీవిత అసంతృప్తికి శరణ్యమని విశ్వాసం కుదిరింది. ఈ కల్లోలిత నగర వాతావరణం, నిత్యసాంసారిక జీవితం వదలి—ఎలాగో లాగ—చాలా రాత్రివరకూ, ఎవరో కాని కనబడని, మూల బెంచీ మీద కూర్చోడం అలవాటు చేసుకున్నాను.

రాత్రి పదకొండు గంటలు—చీకటి జడ విరబోసుకుని వికటాట్టహాసం చేస్తోంది. మామూలు బెంచీ మీదే పడుకుని ఉన్నాను. కళ్లూ మనసూ తెరచే వున్నా రెండూమాత్రం ఒకచోట లేవు. కళ్లకు కనపడనివి ఎన్నో చూస్తుంది, మనసు! పొగతో మేఘాలు తయారుచేసి ఆకాశంలోని మేఘాలకు జతపరుస్తూ చీకటిని మరింత పెచ్చుగొడుతున్నాను.

నా ఏడుపు ఎవ్వరూ విని బాధపడ కూడదనే నా ఏకాంతం! ఆ ఉగ్రకెరటమూర్త సాంద్రఘోషలో నా రోదన నాకే వినిపించదు. ఆ ఘోషను శ్రుతిగా చేసుకుని నా మనసు శోకగానంచేస్తూ తన్మయతనొందింది. ఆకాశంలా పరిమితి లేని మనసు—నక్షత్రాల్లా లెక్కలేని ఆశలు! ఆకాశంలో మినుకు మినుకు లాడే ప్రతి నక్షత్రం, మనసులోని ఒకో ఆశను చేయూతనిచ్చి లేవనెత్తుంది. సముద్రం, ఆకాశం కలిసేచోటుకి దృష్టి దగ్గరయే కొలదీ నక్షత్రాలు కిందకు దిగిపోతున్నాయి! అనంత మహా సముద్రంలోంచి ఆకాశం అంటుదామని బయలుదేరిన కెరటాలు నిరాశతో నుగ్గి, ముక్కలై ఘోషిస్తున్నాయి! నా జీవిత సాగరంలోని ఆశాతరంగాలకు అధఃపతనం?...నక్షత్రాలు-కెరటాలు! ఆశ—నిరాశ!... నేను నిరాశా వాదినా?—ఎంత మాత్రం కాదని నాకు తెలుసు. అయితే, ఆశావాదానికి తగిన వాతావరణ సృష్టికి నిరోధకాలైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ సంక్షోభమే, ఆశానిరాశల నిరంతర చాంచల్యమే—ఒకోసారి—నేను నిరాశావాదిననే సందేహానికి తావిస్తే ఈయనూవచ్చు.

'చీకటి! పొడుగాటి చీకటిముద్ద! అటూయిటూ తిరుగాడుతుంది!...ఏకాంతం!' చిత్తచాంచల్యపు భ్రమచేసనేమో? అనుకుని, ఒణుకు నణచి పెట్టడానికి నిప్పుచేస్తున్నాను.

"పారేయకండి—పారేయకండి"— త్రుళ్లిపడి, తిరిగి చూచాను. చాచిన చెయ్యి! తెలియకుండానే నిప్పుపెట్టె, చేతిలో ఉంచాను. ఆ చెయ్యిమరొచేతి సహాయంతో నిప్పుచేసి చుట్ట నంటించింది. ఇంక భయంలేదు—నా లాంటి మనిషే. నిప్పుపెట్టె నాచేతిలోనే వుంది. ఎవరు?...ఎవరైతే నాకేం?— అయితే, అతనలా అనుకుంటేనా? నేనెవర్నయినా అతనికి కావాలని నాకేం తెలుసు! తూర్పు రంగంలో పొగతో మేఘాలు కల్పిస్తున్నాను. వెనుకనుంచి మేఘాలు వచ్చి, వాటితో చేరి. రెండూ కలసి ప్రయాణం చేస్తున్నాయి. తిరిగి చూచాను. నేను పడుకోగా మిగిలినచోటు అతనిది. అటువైపు ముఖంపెట్టి, పొగ వదులుతున్నాడు.

'ఎవరు?' నామనసు ఊరుకోదలచలేదు.

'ఎవరు?' అని మనసూ అంటేననుకుంటా. రెండు ప్రశ్నార్థకాలు. రెండు జతల కళ్లూ దాగుడు మూతలు. నేను చూస్తున్నట్టు అతనికి తెలియకూడదు...దొంగ పట్టు బట్టాడు—రెండు జతల కళ్లూ కలుసుకున్నాయి.

"ఎవరు బాబూ...?" నా గొంతు ఊడబట్టలేకపోయింది.

"క్షమించండి- మీరు...?" నన్నింకా విశ్వసించని ధ్వని గ్రహించాను. నేనెవర్నో తెలుసుకుని తనకేమీ అపకారంచెయ్యననే నమ్మకం కుదిరితేనే గాని, తానెవరో తెలుసుకోలేను.

"ఎవరో... ఇలా, ఒక్కరూ..." ఎంతో బరువుగా మాట్లాడుతున్నాడు. వెనుకనుండి 'తళుక్' మని మెరుపులా—

"ఇప్పుడే వస్తా..." చటుక్కున లేచి, ఆకాంతి వచ్చినవేపు పోతున్నాడు:

'ఎవరతను!... ఆ గొంతు ఎప్పుడో, ఎక్కడో పరిచితమైనట్టే తోస్తుంది, అతను మాట్లాడుతున్నంత సేపూ. ఇంత రాత్రివేళ- నేనే అనుకుంటే- ఈ సముద్రపు వొడ్డుకి ఎందుకు వచ్చివుంటాడు? ...ఎవరై ఉంటాడు? పెద్దింటికి చెందినట్టు తోస్తుంది...!' నా మనసుకు మరో ఆలోచన లేదు. ఆ గొంతు పరిచితమైనదిగానే తోస్తూంది. కాని మనసు ఆ వ్యక్తిని స్థిరపరచుకోలేని సందిగ్ధంలోనే కొట్టుకుంటూంది!

ఇంతలో- మరో మనిషి టార్చిలైటుతో దారి చూపుతూంటే- తిన్నగా నా బల్లదగ్గరకే వచ్చాడు మళ్లీ. లైటు, అతని రెండో చేతిలోనివేవో (ధ్వనిని బట్టి సీసాలనుకుంటున్నా) బల్లమీదుంచేసి చక్కా పోయాడు, కొత్తగా వచ్చిన మనిషి: నవుకరు అయివుంటాడు. ఇప్పుడు కాంతిలో నడచి రావడంలో స్వరూపంకూడా చూడగల్గేను. ఇంతలో తను బల్లమీదున్న వాటిమీద వేసిన లైటు, అతనెవరో తెలియని చీకటిలో క్షోభించుకుంటున్న నా మనసుకు కూడ కాంతినిచ్చింది. అతణ్ణి గుర్తుపట్టేను- నా కళ్లు నన్ను నమ్మలేకుండా వున్నాను!

అతని గురించి నాలో స్పష్టమై ఉన్న కొన్ని నిశ్చితాభిప్రాయాలను ఈ దృశ్యం కదిలించింది. ముఖ్యంగా ఈ విషయంలోనే నాకు అనేకమందితో భేదాభిప్రాయం- అతను ఈ బ్రాందీలాంటి మత్తుపదార్థాలు వాడడనే నేను ఇంతవరకూ నమ్ముతూవచ్చాను.

అతను నా ఆలోచనని ఆక్రమించుకోడానికి కారణం, అతని చేతలూ భావాలూ గురించి నేను అభిప్రాయాలు ఏర్పరచుకోడమే. నిజానికి నాకు అతనితో పరిచయం లేదనే చెప్పాలి- ఏదో పని మీద వెళ్లి ఒకటి రెండుసార్లు మాట్లాడేనంతే. తరువాత అతనిగూర్చిన ప్రజాభిప్రాయాలు, అతను చేసే ప్రజోపయోగ కార్యాలు, పాల్గొనే ప్రజా సంస్థలు, ఉపన్యాసాలు, వ్యక్తపరచే భావాలు, మొదలైనవి అన్నీ నాకు పరిచయంచేసి నాలో కొన్ని అభిప్రాయాలను ఏర్పరచినాయి.

అతడి గురించి సంఘంలో రెండు విరుద్ధ భావాలున్నాయి. అతనిని మహాత్యాగిగా స్వార్థరహితునిగా భావించి, 'దేవుడిలాంటివాడు- ప్రజల కోసం ప్రాణమైనా సరే ధారపోస్తాడు- మానవులలో ఉత్తమోత్తముడు' అనేవారొక తెగ. అతను చెప్పే మాటలు, చేసే కార్యాలు, అంతా స్వార్థంతో కూడినవిగానూ; అతని వినయం, కలుపుగోలుతనం, అంతా నటనగానూ భావించి, అదంతా బూర్జువాతత్వపు బూటకమనీ- అతను గోముఖవ్యాఘ్రమనీ- ఈ కార్యాలన్నీ ప్రజలను తనవశం చేసుకుని వారిచేత పొగడబడుతూ కీర్తి గడించుకోవాలనే ఉద్దేశ్యంతోనే అనీ- అతని దగ్గర చేరి, అతని బలపర్చే విజ్ఞానులూ పెద్దలూ కూడ అతని ధనానికి దాసులైనవారే అనీ అనే వారిది రెండో తెగ. చాలమంది అతనొక తాగుబోతూ, జారుడూ అనికూడా అంటారు.

నా అభిప్రాయాలు ఈ రెండురకాలకూ వ్యతిరేకం. అతను తన జీవితాన్ని చక్కగా అర్థం చేసుకుని, ఒక ఉత్తమపంథాలో జీవితం నిర్మించుకున్న వ్యక్తి, నా అభిప్రాయంలో. కీర్తి గడించుకోవాలనే సహజమైన దౌర్బల్యం కొంతవరకూ ఉండవచ్చును. కాని, తను చేసే ప్రతి కార్యమూ అందుకేనని నేననుకోలేను. స్వార్థరహితుడనిగాని; ఇతరులకోసం ప్రాణమయినా ధారపోసే త్యాగని, దేవుడిలాంటివాడనిగాని నేననుకోలేను. తన సౌఖ్యం, క్షేమం చూసుకుంటూ ఇతరులకు చేయగలిగిన సహాయం చేయడం అతని ఆశయంగా భావించుకున్నాను. ముఖ్యంగా, మానవుడు పొందే ఆనందానికి, సుఖానికి ఎక్కువ సహాయపడడానికి పూనుకుంటాడు. తను ధనికుడు అయినంతమాత్రాన అదంతా ధనికస్వపు [illegible]గా నేను భావించలేను. తను ధనికుడు కావచ్చు- కాని, ధనాశ వున్నట్టు రుజువు చేయగల సంఘటన ఒకటీ లేదని చెప్పొచ్చు- తన ధనానికి ఇంకా ధనం చేరుద్దామనే తలపే లేదతనికి. విజ్ఞానులు, వివేకులు, అతనికంటె గొప్పవారు, కళారాధకులు కూడ అతనితో కలిసి మెలిసి తిరుగుతారంటే అతని సుస్వభావం, మంచి అలవాట్లు, అతనిలోని స్వారస్యం, నైర్మల్యం, అతని ఆదరాభిమానాలే కారణం.

నేను ఆ సీసాలకేసీ తనముఖంకేసీ చూస్తున్న ఆశ్చర్యం పసికట్టేవుంటాడు.

"క్షమించండి-మీ ఏకాంతానికి అడ్డువచ్చానను కుంటా. అయితే ఇక్కడికి రావడం తప్పులేదు. ఈ సీసా చూసి నన్ను మరోలా భావించరనే నమ్ముతాను- తాగుబోతును కాను, నేను. నా దౌర్బల్యం

దీన్ని అపసరంగా చేసుకుందంటే...... ఈ రోజు నే చనిపోయినరోజు! నాలుగేళ్లనుండీ ప్రతి సంవత్సరం ఈనాడుయీ బెంచీదగ్గరకి వస్తున్నాను."

నాకేమీ అర్థంకాక ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను. చనిపోయినరోజు! పిచ్చెత్తిందేమో?

సీసాలోది గ్లాసులో పోసి మూడు గుటకల్లో మింగేశాడు-"అమ్మా..." అంటూ, నాకు ఎదంగా చతికిలబడ్డాడు. అంతా అగమ్యగోచరంగా ఉంది-ఏదో భయంలాంటిది నాలో బయలుదేరింది.

"క్షమించి, ఏమీ అనుకోకపోతే..." అంటూ ఆ బెంచిమీదే, నావేపు తలపెట్టి పడుకున్నాడు, 'భగవాన్!' అంటూ. నేను జరుగుదామనుకున్నా జరగలేక పోయాను. కళ్లు రెప్ప పడకుండా అతన్నే చూస్తున్నాయి.

"మీరెవరో... నేనింకా గుర్తించుకోలేక పోయాను—అయితే నాకదంతా అవసరంకూడా కాదు. ఈ సమయంలో, ఇక్కడ యీ స్థితిలో ఉన్న మిమ్మల్ని అర్థంచేసుకోగలను. నేను. నాల్గు సంవత్సరాల హృదయభారం మోయలేక బాధపడే నాకు ...ఈ రోజున విముక్తి ...లేకపోతే, సముద్రంతో చెప్పుకోవలసి వచ్చి ఉండునేమో! ఎన్ని సంవత్సరాలు కన్నీరైతే సముద్రానికి అర్థమవుతుంది! తన ఘోషలో అసలు నేను వినిపిస్తేనా?...

నాల్గు సంవత్సరాల క్రితం:

ఈ రోజునే, నేనే తనుగా భావించే నాభార్య పోయినరోజు—ఆ రోజే నేను చనిపోయినట్టు భావించుకున్నా..."

మాటల్లో, లోనుంచి ఉబికివచ్చే బాధ వ్యక్తమవుతూంది.

"ప్రపంచంలో మహాభాగ్యమనుకునేవన్నీ లేక పోలేదు. కాని నాభాగ్య నాకు అంతకన్న ఎక్కువ! మహాభాగ్యం! అమాయకపు కళ్లూ, చిరునవ్వు ముఖం, నిర్మల హృదయం...ఆవిడలోని శాంత సహనాలు, మరపురాని సంభాషణలు......తనని గురించి ఏమి చెప్పబోయినా ఉన్నదానికి తక్కువే అయిపోతుంది.

"పుట్టుకతో ధనిక కుటుంబీకురాలు కాకపోవడంచేత మొదటిలో ఎలా నడుచుకోవాలో తెలియకపోయినా, నాదగ్గరకు వచ్చిన కొన్ని నెలలకే అన్నీ తెలుసుకుంది. గొప్ప యింటపడడం తన అదృష్టమనుకునేదో, నేను భర్త కావడం తన కోర్కెలు ఫలించినట్టు భావించుకునేదో, ఎప్పుడూ మురిసిపోతూ, జీవితం ఆనందమయం చేసుకున్నట్టుండేది-...

"పెళ్లికాక ముందటి నాచెడు అలవాట్లన్నీ ఒక్క సంవత్సరంలో రూపుమాపింది! మా తల్లిదండ్రులుకూడ ఒక దేవతలా చూచుకున్నారు--నన్నెంతో తీర్చి దిద్దిందని. ఎక్కడికిపోయి ఏ రాత్రివచ్చినా కనిపెట్టుకుని ఉండేది. నాకోసం భోజనం చేయకుండా ఎందుకున్నావంటే 'ఆకలి లేదు--మిమ్మల్ని తలుచుకుంటేనే నాకు నిండుగా వుంటుంది. అందులో, మీరు వస్తారని ఎదురు కాచుకోడంలో నాకు ఆకలే వుండదు...' అంటూ, ఏదో చెప్పేది-ఎంత కోపంతో వచ్చి మాట్లాడినా నవ్వుతూ, నన్ను చల్లార్చేసేది! చివరకు నాకు జాలివేసి నన్ను నేనే మార్చుకునేటంత శాంతంగా ...మధురంగా...పాపం! ఎన్ని అబద్ధాలు చెప్పేవాడిని! నేనంటే ఎందుకో అంత నమ్మకం!...నా తిరుగుళ్ళగురించీ, అలవాట్లగురించీ, అంతకుముందు అనేకవిధాలుగా చెప్పుకునే వారంతానీ-వాళ్ళకు వాళ్లే-సిగ్గుపడి, నమ్మలేనంతగా...వాళ్ళ మాటల ధోరణి మార్చగలిగింది!...ఒక సంవత్సరం చదువు అలవాటుచేసుకుని ఎన్నో మంచి పుస్తకాలు చదివి, అనేక జీవితాలకు అర్థం చెప్పేది.

"నాకు తెలుసు, నేను వట్టి మోసంలో బతుకుతున్నానని. నాదగ్గర కొచ్చేవాళ్ళలో నేనంటే కిట్టనివాళ్లే ఎక్కువ. వీలుచిక్కితే నొక్కి వేయడానికీ, నా స్థానాంచయానికీ ప్రగ్రహానికే వస్తారు. అయితే, వాళ్ళతో నే-ఎంతో ఇష్టంగా, ఆప్యాయంగా మాట్లాడగల్గుతాను. అమాయకులు-పాపం, పైవాళ్ళకు నాకు నిజంగా స్నేహితులెవరో తెలీదు!...పెద్దలూ, పండితులూ, విద్యావంతులూ, వాళ్లూ వీళ్లూ వచ్చేరంటే నామీద ప్రేమ విశ్వాసాలతో కాదనీ, నా ఉద్యోగపు హోదాలోని అధికారపు ఆశ్రయంకోసమనీ, ధనాశతోననీ తెలుసు. అలానే ఇష్టం లేనివాళ్ళతో మరీ యిష్టంగావున్నట్టు నటిస్తూ మొత్తంమీద అనేక దిక్కులనుంచి అందరినీ కాచుకుంటూ, ఎంతో మోసంగా గడుపుతున్నా. లోపలి నావుద్దేశ్యాలూ, ఆశయాలూ ఎలావున్నా, లౌకికంగా ఇంత మోసం ఉంటేనేగాని జీవితంకాదు! ఇలాంటప్పు డెప్పుడైనా అలాంటి నా జీవితాన్ని తలుచుకునే ఏదు

స్తాను-ఏదో కొంతబరువు తగ్గినట్టవుతుంది. ఎప్పుడూ కుతకుతలాడే ఊపిర్లు, మోసం మధ్య కొట్టుకుంటూ ఎప్పుడేంచేయాలో అనే ఏదో ఆలోచనే...... దీనికితోడు నేను మళ్లీ పెళ్లిచేసుకోవడం...పిల్లలు ఛీ!... అన్నీ మర్చిపోయి, ఒక్కరోజైనా, నా దివ్యజ్యోతి నన్ను విడిచిన (సంవత్సరానికి) ఈ ఒక్కరోజైనా, ఆవిణ్ణి స్మరించుకుంటూ, నా మోసపు బ్రతుకు క్షమించమనీ, బాధపడవద్దనీ, ప్రార్థించుకుందామని...... ఈ నాలుగేళ్లనుంచీ ఇలానే వస్తూంటా— అన్నీ మర్చిపోడానికి. నా దౌర్బల్యం ఈ మత్తుసీసాని అవసరంగా చేసుకుంది ఈ ఒక్కరోజే... పాపం, ఎంత బాధతో ఉందో ఏమో— కడసారి కనుమూసేముందుకూడ చిరునవ్వుతోనే నాతో 'మీరు బాధపడకూడదు తెలుసా! హాయిగా వుండాలి!...' అంటూ, 'మీ యిష్టం వచ్చినట్టూ... కాని, ఈ చిట్టితల్లినిమాత్రం, నేనుంటే చూచుకున్నట్టే చూచుకోవాలి—' అంటూ కళ్లుమూసుకుంది.

"వాళ్లకేదో ముంచుకుపోయినట్టూ, నేనలా బ్రతకడమే సంఘ రథానికి అడ్డువచ్చినట్టూ...ఒక రేమిటి, తల్లిదండ్రుల దగ్గరనుంచి ప్రతివారూ, మతి పోగొట్టేశారు. నాకు మళ్లీ పెళ్లి, పిల్లలు. పాపం ఈమె కూడా నన్నెంతో నమ్మినట్టే తోస్తూంది. తెలివైనది కావడంవల్ల నిజవిషయాలు కొన్ని తెలిసినా, తెలియనట్టేవుండి, మొత్తానికి నాకు బాధ కలిగేలా సంచరించకుండా వుండాలనే ప్రయత్నిస్తుంది. కాని ఈ పిల్లలూ... నా చిట్టీ... నా దివ్యజ్యోతి వప్పజెప్పిన నా చిట్టితల్లీ... పాపం ఆవిడుంటే ఎంతబాగా, ఎలా చూసుకుని తయారు చేసుకునేదో... నే నేం చేస్తున్నాను, నా చిట్టికి!"

అంతకంతకూ స్వరం హీనమైపోతూంది. ఒకో మాట వినిపించడమే లేదు.

"హే! భగవాన్ అంటూ పక్కకు ఒత్తిగిలేడు.

"చిట్టీ... మీ అమ్ముంటే— ఎలాచూచేదో!... మోసగాణ్ణి... నిన్నూ మోసంచేస్తున్నా—నో... ఏమో!... అమ్మా!..."

ప్రకృతంతా నిశ్చలంగా- నిశ్శబ్దంగా- విచారంగా... ఎంతరాత్రయిందో ఏమో!

* * *

ఇంతసేపూ అతని బాధా జీవితంలో కరిగి కన్నీరైన నాకు మళ్లీ ఏకాంతం, అలము ఆకున్న విషాదమధ్యాన! ఆ విషాదం, నా జీవితపు దుఃఖ సంఘటనలలో ప్రతిబింబిస్తూంది! నా జీవిత దుఃఖమంతా ఒకేచోట పోగు పడిపోతున్నది!

పోయిన నా భార్య- చిట్టిబాబు!...పాడైన ఆర్థికపరిస్థితి- నా చిట్టిబాబుని పెంచే దాది... నన్నుగురించిన అపవాదులు- పెళ్లిబలవంతాలు- చక్కబడిన ఆర్థికపరిస్థితిలో చిట్టిబాబును తయారు చేసే నా ఆదర్శం- మళ్లీ పెళ్లిళ్ల గోల... దుష్ప్రచారాలు-! హా! హా!... కుతకుతలాడే కుళ్లుకంటెకూడ...

ఏదో ఏడుపులా వినిపించింది- నా చిట్టిబాబు కళ్లలో ఉన్నాడు- గతం ఏదో వచ్చి నా మెదడును తాకింది- "మీ రేం చేసినా... నా చిట్టిబాబునుమట్టుకు ఎలా చూసుకుంటారో"! పోయిన చిట్టిబాబుతల్లి- నా జీవితం!...

చిట్టిబాబు ఏడుస్తున్నాడేమో!

ఇక స్మృతికాలం ఉండలేకపోయాను.



అపేక్షత

"అవంతి"

శాక్యముని గౌతమ బుద్ధుడు తన మనసెరిగిన ప్రియ శిష్యుల్ని ప్రపంచపు నలుమూలలకూ మత ప్రచారానికి పుత్తెంచేటపుడు వారికి విపులంగా సూచనలిచ్చి పంపించాడు. ఇంతవరకూ ఏ మత ప్రవక్తా యివ్వని సూచనకూడా ఒకటిచ్చాడు. ఏ పరిస్థితులలో కూడా మహాద్భుతాలూ, మానవాతీత ప్రదర్శనలూ చేయవద్దని. బుద్ధదేవుడు నియమించిన యితర సూత్రాలు ఆచరించడంలో ఒక్కొక్కప్పుడు ఆతని శిష్యులు విఫలులైనా మానవాతీత ప్రదర్శనలు చేయవద్దన్న నిర్ణయాన్ని మాత్రం, ఒక్క ఆనందుడు తక్క, మిగతా వారంతా తు. చ. తప్పకుండా ఆచరించారు. ఆనందుని గురించి, యీ కింది కథ లనుశ్రుతంగా వస్తూన్నవి.

ఆనందుడు మగధ సామ్రాజ్యంలో తన ప్రచారం మొదలుపెట్టేడు. జీవహింస, కులభేదాలు, బ్రాహ్మణుల అహంకారం క్రింద మూలుగుతూన్న హిందూ ప్రజలకు బౌద్ధమతం ముక్తిసాధనకొక నూతన మార్గం చూపించింది. ఆనందుని వాక్చాతురి, గంభీర విగ్రహం, బౌద్ధ సూత్రాలు ప్రజలను నచ్చి బౌద్ధమతంవేపు బాగా మొగ్గసాగారు. ఈ ప్రథమ విజయంతో ఆనందునికి తల కొంచెం తిరిగింది.

"శాస్త్రీయ హేతువాదంతో, నిర్దుష్ట జీవితంతో, వాక్చాతుర్యంతో, ముక్తిమార్గం బోధించే మతప్రవక్త- మొండివాదనలతో, పాపభీతితో ప్రచారం చేసే యీ బ్రాహ్మణులకన్న ఎంత ధన్యుడో కదా!" అనుకున్నాడు.

గర్వీభూతమైన పైమాటలు పలకడంతోటనే, ఆనందుని కీర్తికాంతులు పదహారు యోజనాల మేర తగ్గిపోయాయి. ఆనందుని సుగుణపుంజంకూడా సన్నగిల్లింది. మరునాడు ఆనందుడు తన బోధనలు మొదలిడినపుడు, ప్రజలు మొదట వెక్కిరించారు, తరువాత అల్లరి చేశారు. చివరకు రాళ్లుకూడా రువ్వేరు.

అదే సమయానికి, మూర్ఛపోయిన ఒక కుర్రవానిని కొందరు బ్రాహ్మణులు కింద పడవేసి, తెలివి తెప్పించడానికి నానా అవస్థలూ పడుతూండడం చూశాడు ఆనందుడు. ఇంతలో ఒక ప్రబుద్ధుడు యిట్లా అన్నాడు:

'వీణ్ణి యేదో దయ్యం ఆవేశించింది. వీడి శరీరాన్ని బాధలు పెడితే, ఆ దయ్యం పారిపోతుంది."

అందరూ కలిసి, ఆబాలుని బాదడం మొదలెట్టారు. ఆనందుడు వెంటనే కలగజేసుకొని, ఆ బ్రాహ్మణుల్ని తరిమేశాడు. తను మోకాళ్లమీద పడి, దేవుని ప్రార్థించడం మొదలెట్టాడు. ప్రార్థన ఆఖరయినా, ఆతడింకా లేవలేదు. ఆ కుర్రవాడికి, మామూలుగా తెలివి వచ్చేవరకూ ఆనందుడు ప్రార్థనలు చేస్తూనేవున్నాడు.

ఇది చూసిన, ఆ మూర్ఖప్రజలు "మహాద్భుతం! మహామాయ" అని అరుస్తూ ఆనందుని చుట్టూ చేరి, ఆతని మతం స్వీకరించారు. ఆనందుడుకూడా, తన పోయిన గౌరవాన్నీ విధంగా సంపాదించినందుకు సంతోషించి, "మన ఆశయమే ముఖ్యమైంది; దానిని సాధించే విధానంకోసం విచారించనక్కరలేదు-" అనుకున్నాడు.

ఈ ఒక్కపనితో, ఆనందుని సుగుణసంపద పూర్తిగా నశించింది. కాని, కరుణామయుడు-బుద్ధ దేవుడు మాత్రం, తన శిష్యుని చర్యలింకా క్షమా దృష్టితో పరిశీలిస్తున్నాడు.

ఆనందుని కీర్తి ఆ రాజ్యమంతా పాకింది. రాజు కూడా విన్నాడు. ఆనందుని పిలిపించి, దయ్యాన్ని తరిమివేసిన మాట నిజమేనా అని అడిగేడు. ఆనందుడు నిజమే అన్నాడు.

"అయితే నా అదృష్టం పండింది. మీ శక్తుల మూలంగా, ఇరవైతొమ్మిది రోజులనుండి తెలివి తప్పి, మృత్యుముఖాన్నున్న నా కుమారుని బతికించాలి" అన్నాడు రాజు.

"ఒక సామాన్య బాలకుని బాధా నివారణ చెయ్యగల్గిన నా స్వల్పశక్తులు, రాజ మార్తాండులైన తమ పుత్రుల కేవిధంగా సహాయకారి కాగలవు ప్రభూ?"

"ఆశక్తులు ఏవిధంగా సంపాదించ గల్గుతారు?"

"కామక్రోధమదమాత్సర్యాలను జయించటం వల్లా, యోగాభ్యాసంవల్లా ఆ శక్తులు సమకూరుతాయి. వాటిలో పరిపూర్ణుడు అయినవాడు, ప్రచండవాయువుల్నీ సముద్రజలాల్నీ సూర్యచంద్రుల్నీకూడా శాసించగలడు."

"అయితే మీరు నా కుమారుని వ్యాధి కుదర్చలేక పోవడానికి కారణం, శక్తిలేకపోవడం. కనక, మిమ్మల్ని, బ్రాహ్మణుల అధీనం చేస్తాను. మీసాధనకు సహాయాలు వారు సమకూరుస్తారు" అన్నాడు రాజు.

భయంతో ఆనందుడు చెప్పబోయేదేదీ వినకుండానే, అక్కడి బ్రాహ్మణులతని నొక దేవాలయానికి లాక్కుపోయారు. బట్టలన్నీ వూడతీసేశారు. ఆనందుని శరీరంమీద ఒక్క మచ్చగాని, గాయపు ఆనవాళ్లుగాని ఏమీ లేవు. ఆ బ్రాహ్మణుల కత్యాశ్చర్యం వేసింది, ఈ మానవుడు, శరీరాన్ని కష్టపెట్టకుండానే స్వర్గానికి పోదామనుకుంటున్నాడని. వెంటనే ఆనందుని బోర్లగిలా పడుకోబెట్టి, నడ్డిమీద చర్మం అంతా లేచిపోయేటట్లు కమ్చీలతో బాదేరు. తరువాయి, మరునాడు తీర్చడానికి నిర్ణయించుకుని అతని నక్కడే పడవేసి, గుడికి తాళంవేసి వెళ్లిపోయారు.

ఆనందుడు అర్ధ మరణావస్థలో పడివున్నాడు. ఇంతలో, అక్కడ స్వయం ప్రకాశమానమయిన దయ్యం ఒకటి సాక్షాత్కరించి ఆనందుని పలకరించింది.

"ఆనందా, నీ తెలివితక్కువ కిప్పటికేనా పరితపిస్తున్నావా? లేదా?"

ఆనందుడు మాట్లాడలేదు.

"నే చెప్పిన మాట వింటే, నీ గాయాలు మానిపోతాయి. పైగా ఈ రాజ్య ప్రజలంతా నీమతం స్వీకరిస్తారు."

"ఏవిధంగా?" అన్నాడు ఆనందుడు.

"నీ గురువాక్యనిరాదరణ, ఆ న్యాయం-పీటిలో పూర్తిగా మునిగితే సరి."

ఆనందుడేమీ మాట్లాడలేదు. ఆ దయ్యమే యింకా సంభాషణ సాగిస్తూంది.

"రాజకుమారుడు, ముప్పయిరోజులు పూర్తి అయేసరికి ఆ మూర్ఛలోంచి లేస్తాడు. ఆసమయం సరిగా చూసి నీవు వెళ్ళి, రాజకుమారుని పర్యంకం మీద కూర్చుని నీ యిష్టం వచ్చిన మంత్రాలు చదువు. ఇంతలో అతడికి తెలివి వస్తుంది. అది నీ మహిమే అనుకుంటారు. యావన్మగధరాజ్యమూ, నీ శిష్యు లవుతారు. కాని ఒకటిమాత్రం జ్ఞాపకం వుంచుకో, ఇప్పుడు నేను చెప్పినట్లు చెయ్యటానికి నీ వంగీకరిస్తే, అది నీవు కళ్లు తెరుచుకునే చేస్తూన్న పని. పైగా, దీనివల్ల నీకష్టాలింకా అభివృద్ధి అవుతాయే కాని తగ్గవు."

"ఒప్పుకున్నాను" అన్నాడు ఆనందుడు బాధ పడలేక.

దయ్యం అతని నడ్డి నిమిరింది. వెంటనే బాధలుపోయాయి, కొత్తచర్మం వచ్చింది. "నీ కవసరం అయినప్పుడు "హూంగ్, పద్మె, మాని, ఆముణా" అని పిలవ"మని చెప్పి, ఆ దయ్యం మాయమయిపోయింది.

ఆనందుని చర్మం రెండోసారి వొలిచివేయడానికి, బ్రాహ్మణులు, ఒక రాజాధికారితో సహా వచ్చి, గుడి తలుపులు తెరిచారు. ఆనందుడు మామూలుగా వుండడం చూసి, ఆ బ్రాహ్మణులకు మితిలేని కోపం వచ్చింది; కాని ఏమీ చేయలేకపోయారు. ఆ రాజాధికారి, ఆనందుని రాజసన్నిధికి క్షేమంగా చేర్చాడు. రాజకుమారుడింకా అదే అవస్థలో పడివున్నాడు. తనకు ఆ దయ్యం చెప్పినట్లు, సాయంత్రం యింకా కాలేదు. కనక ఆనందుడు రాజుగారికీ, వారి అనుచరులకీ మహాద్భుతాలమీద, వాటి నితరు లేవిధంగా నెరవేర్చలేరో, ఒక్క బౌద్ధమత గురువు లే ఎల్లా చేయగలరో, మొదలగు విషయాలమీద

ధ్యానాభ్యాసం యిస్తూ, సమయంకోసం కాలయాపన చేస్తున్నాడు. ఇంతలో సూర్యుడు అపరాద్రిలో క్రుంకే సమయం ఆసన్నమయింది. ఆనందుడు రాజకుమారుని గుండెలమీద చెయ్యిపెట్టి, కళ్లు మూసుకుని ఏవో జపిస్తున్నాడు. వెంటనే అతడు కళ్లు తెరిచి, ముప్ఫయి రోజుల క్రిందట తాను జూదం ఆడుతూన్నపు డీరోగం వచ్చి ఏ వాక్యాన్ని మధ్యలోనే ఆపేసిందో, ఆ వాక్యం పూర్తిచేశాడు.

అక్కడున్న వారందరూ నిశ్చేష్టులయిపోయారు. "ఈయన మానవాతీత శక్తులను చూస్తే, యీయన మతంకూడా చాలా గొప్పదిలాగే కనిపిస్తూంది!" అన్నారు రాజుగారు. ఆయనతో పాటు యావ న్మగధప్రజలూ బౌద్ధమతం స్వీకరించారు. రాజు వెంటనే, హిందూ దేవాలయాలకూ, మఠసంస్థలకూ యిచ్చిన ఆస్తులన్నీ లాగేసుకుని, బ్రాహ్మణహింస మొదలుపెట్టేడు. ఆ పాత మతం కొన్ని శతాబ్దాలలో చేసిన అన్యాయాన్ని కొన్ని రోజుల్లో యీ కొత్తమతం పేరిట చేసేశారు.

ఈ విజయంతో, ఆనందుడు పూర్తిగా గర్వి అయిపోయాడు. రాజుగారు ఆనందుని తమ కుమారునికి గురువుగా నియోగించారు. బౌద్ధ ధర్మాల సారానికి బోధించాలని ఆనందుడు చాలా తాపత్రయపడ్డాడు కాని, కుదరలేదు. ఎందుచేతనంటే, రాజకుమారుడికి, చిన్నచిన్న పురుగుల్లో సూదులు గుచ్చి ఆనందించడం సరదా; యింక మరి, అహింసాధర్మానికీ, ఆ సరదాకీ ఏవిధంగా సమన్వయం?

కొన్ని నెలలు పోయిన తర్వాత, రాజసముఖానికి ఆనందుడు ఆహ్వానితుడయాడు. రాజుగారికి కొంచెం దూరంలో, ఇద్దరు భయంకరంగా వున్న తలారులు నించున్నారు

"వీడు మాతలారి. వీడు చిత్రవధచేసే తలారి" అని రాజు వారిద్దరినీ ఆనందునికి పరిచయం చేశాడు. అటువంటి గొప్పవారితో పరిచయం కల్గినందుకు ఆనందుడుతన సంతోషం తెలియచేశాడు.

"మహాశయా! ఇంద్రియనిగ్రహమూ, యోగాభ్యాసమూ మీరు మళ్లీ అనుష్ఠించవలసిన అవసరం వచ్చింది. మాకన్న బలవంతుడైన శత్రురాజొకడు మామీద దండెత్తేడు. మా సైన్యాలు వోడి పారిపోతున్నాయి. మీమీదే ఆశలు పెట్టుకున్నాం. సాధ్యమైనన్ని ఎక్కువ శక్తులు, తక్కువ కాలపరిమితిలో, మీరు కూడబెట్టవలసిన అవసరం ఎంతేనా వుంది. మీ పాత స్నేహితులు బ్రాహ్మణ్ని మీకు సహాయం చెయ్యడానికి పిలుద్దామంటే, నాకు మనస్కరించలేదు. అందుచేత వీరిద్దరినీ పిలిపించాను. వీళ్లిద్దరిలోకూడా, సరిగా పోత్తు కుదరలేదు. ఒకడేమో, తల్లకిందులుగా మంటమీద వ్రేలాడగట్టి ముక్కుల్లో కారంపెడితే చాలు అంటున్నాడు. రెండోవాడు కొంచెం క్రూరుడు. మొదటే చర్మం వొలిచివేసి గాలంతో రాయాలంటున్నాడు. ఈ రెండిటిలో మీకేది అంగీకారమో చెప్పండి." ఆనందుడు, ఆ రెండు పద్ధతులుకూడా అట్టేమంచివి కావని తెలియచేశాడు.

"సరే! దానికేం! ఆ రెండు పద్ధతుల్లో ఏదీ అంగీకారం కానప్పుడు, రెండూకూడా ప్రయోగిద్దాం. మీకు రేపు సూర్యోదయందాకా, ఆలోచించడానికి వ్యవధి యిచ్చాను. యింక మీరు వెళ్లవచ్చు!" అన్నాడు రాజు.

ఆనందుడికి ఒంటినిండా ముచ్చెమటలు పోసి, తలకాయ దిమ్మెక్కిపోయింది భయంతోటి. అయినా ఆ దయ్యం, తనకిచ్చిన వాగ్దానం జ్ఞాపకంవచ్చింది. వెంటనే ఒక నిర్జన ప్రదేశం చేరుకుని, ఆ మంత్రం పఠించాడు. ఇంతలోకే- తనపక్క భయంగొల్పే ఆ దయ్యం కాదు కాని- కావిగుడ్డలూ, జడలూ, విబూది ధరించిన ఒక ముసలిజోగి కన్పించాడు.

"నీ కాట్టే కాలవ్యవధి లేదు. త్వరగా నాతో రా! జోగివేషం ధరిద్దువుగాని" అన్నాడు.

సౌమ్య జీవితం, వేషధారణా అలవాటయిన యీ బౌద్ధభిక్షువుకి, బైరాగి వేషం అంటే పరమాసహ్యం. అయినా ఏంచెయ్యగలడు? తప్పదు. ఆనందుని తన యింటికి తీసుకుపోయి, అతడి బోడిగుండుకూ, పాముగాటి గోళ్లులేని వేళ్ళకూ-చింతిస్తూనే, తప్పదుకనక- విభూతి, రుద్రాక్షలు, వేరు కడియాలూ కృత్రిమ జటలూ, మొహాన రంగులూ పూసి, మొత్తంమీద అతణ్ణి పండుగనాటి పెద్దపులిలా తయారుచేశాడు.

చీకటిపడ్డాక, తనతో శ్మశానానికి తీసుకుపోయాడు. అక్కడ ఆనందుని మెడలో, చిన్నపిల్లల పుర్రెలదండ మెడలోవేసి, పెద్దకపాలంఒకటి

ఎడమచేతిలో పెట్టి, కుడిచేతికొక పెద్ద తొడ ఎముక ఇచ్చాడు. అంతక్రితమే ఎవరినో దహనంచేసిన ప్రదేశంలో ఆనందుని కూర్చోబెట్టి, తనతోపాటు మంత్రాలు జపిస్తూ, పుర్రె మీద ఎముకతో వాయించమన్నాడు. ఆపని మొదలెట్టడంతోనే, తుపాను ప్రారంభమయింది. మెరుపులు, ఉరుములు, పిడుగులు, ఏనుగుతొండపు ధారలతో వర్షం ప్రారంభమయింది. నక్కలు, తోడేళ్లగుంపులుగా శ్మశానంలో షికార్లు కొడుతున్నాయి. శ్మశానంలోనుంచి అస్థిపంజరాలు లేచి మాంసవిముక్తమైన చేతులు ఆనందునికేసి చాస్తున్నాయి. ఆనందుడు భయంతోటి ఇంకా గట్టిగా వాయించడం, మొదలెట్టేడు. హఠాత్తుగా ప్రారంభమయిన తుపాను హఠాత్తుగానే ఆఖరయింది. ఇంతలో రాజధానినుండి జయధ్వానాలూ, సంగీతం సన్న సన్నగా వినిపించాయి.

"శత్రురాజు చనిపోయాడు. అతని సైన్యం చెల్లాచెదరైపోయింది. ఇదంతా నీ ప్రభ-అనుకుంటున్నారు రాజు. వస్తారు జనం అంతా. మరి నేనెలవు తీసుకుంటాను. మళ్ళీ నీకవసరం అయిందాకా" అని, అజోగి మాయమైపోయాడు.

ఊరేగింపుసవ్వడి దగ్గర్లోనే వినిపించింది. ఇంతలో దగ్గరకు వస్తూన్న కాగడాల కాంతి మందగొడిగా కనిపిస్తూంది. వాన కురిసి వెలిసిన ఆ తెల్లవారుజామున, తన ఏనుగునుండి దిగి, రాజు ఆనందుని కాళ్లముందర సాష్టాంగపడి, "మహానుభావా! మీరు సిద్ధిగలిగిన జోగులని తెలియక నేనేమైనా అపరాధంచేస్తే క్షమించాలి. మీరీ శ్మశానంలో వున్నంతకాలం నాకీ శత్రువుల భయం లేదు" అని స్తుతించాడు.

వెంటనే రాజాజ్ఞప్రకారం, పాడుపడిన సమీప దేవళంలోంచి నక్కల్ని నిర్దయగా బయటికీడ్చేశారు. బూజులు దులిపి, అది ఆనందునికి ఆవాసంగా బహూకరించారు. రాత్రంతా నిద్రలేని కళ్లతో, నీరసంతో, విభూతి- జడలతో ఆనందుడే దయ్యంలా వున్నాడు. ఇంక కొంతసేపటికి వార్తాహరుడొకడు—రాజుగారికి చాలా జబ్బుగా వుందనీ, వెంటనే తగ్గేటట్లు చెయ్యవలసిందనీ-ఆజ్ఞ తీసుకొచ్చాడు. ఆనందుడు కపాలం-ఎముక బయటికి తీసి మంత్రాలు చదువుతూ వాయించ నారంభించాడు. ఆ చప్పుడుకి బెదిరి, వొకటి, రెండు గబ్బిలాలు బయటికొచ్చేశాయి తప్ప, ఏ దేవతకాని, దయ్యంకాని ప్రత్యక్షమవలేదు. ఇక లాభంలేదని, ఆ పనిలోంచి విరమించేటప్పటికి నేలలోంచి పుట్టుకొచ్చినట్లు, హఠాత్తుగా ఒక మనిషి ఆనందునిపక్క నిలబడి వున్నాడు. అతడి చేతిలో ఏదో దండంకూడా వుంది. రాజో యోగి కాబోలు.

"సలసల కాగుతున్న నూనె సిద్ధంగావుంది" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాడు ఆనందుడు.

"మిమ్మల్ని ముంచేందుకు."

"నన్ను నూనెలో ముంచడం దేనికి?"

"మీ మంత్రతంత్రా లేమీ రాజుగారి బాధను తగ్గించలేకపోయాయి. పోనీ మీకు శక్తి లేదేమో అనుకుందామంటే, ఇదివరకటి రెండుపనులూ మీ శక్తిని వేనోళ్ల చాటుతున్నాయి. కనక, ఇప్పుడు తగ్గకపోడానికి కారణం, మీ విముఖతే అని రాజుగారు అనుకుంటున్నారు. ఈ వెధవ, రాజవైద్యుణ్ణి, నా శక్తిని వేసుకోడం ఎందుకని, రాజుగారి వుద్దేశానికి తాళం వేశాను. ఈ సాయంకాలందాకా, నూనె మరుగుతూనే వుంటుంది. అప్పటికీకూడా తగ్గకపోతే, మీరు ఆ నూనెలో ప్రవేశించవలసి వుంటుంది."

"అయ్యో! దైవమా! ఇప్పుడేమిదారి నాకు!"

"ఏదారీ లేదు. శ్మశానంచుట్టూ సైనికులు కాపలావున్నారు."

"అయితే నా ప్రాణానికి రక్షణ ఎలాగ!"

"ఇదిగో! ఈ పాత్రలో!" అన్నాడు రాజవైద్యుడు. "దీంట్లో విషం వుంది. నీశత్రువులవల్ల, ఇంమందు సంపాదించానని చెప్పి, రాజుగారికియ్యి. ఆయన చనిపోతారు. అతని వారసుడు, నిన్ను బహూకరిస్తాడు."

"నా ప్రాణం పోయినాసరే కాని, ఈ హత్య నేను చెయ్యను. నన్ను ఆపదలోంచి తప్పించడానికి ఇంకా నాకు వుపాయం వుంది. "హూంగ్ పద్మమూని ఆముహా?" అని జపించాడు.

కాని ఎవ్వరూ ప్రత్యక్షమవలేదు. రాజవైద్యుడు కూడా, ఆనందునికేసి జాలిగా చూసి, చీకట్లో కలిసిపోయాడు. తన దుస్థితి తలుచుకుంటూ, కన్నీరు కారుస్తూ అట్లాగే ఆనందుడు కలతనిద్దర చెందేడు. ఆనిద్దరలో ఒక్క కల వొచ్చింది.

ఈ లోకాలు దాటి ఆనందుడు, నరలోకపు టంచుల వద్దనుంచుని, చూస్తున్నాడు, వైతరణి మీదుగా. నరలోకం అంతా, ఏదో వుత్సవంలో మునిగినట్లు, హుషారుగా వుంది. నరకంలోని రాక్షసుల్లోని, కుర్రకారంతా, నరకముఖ ద్వారంపగ్గర, విద్యుద్దీపాలు, పూలమాలలు, రంగుకాగితాల అలంకరణలో నిమగ్నులై వున్నారు. పెద్దరాక్షసులు కిందనుంచుని, అవసరమనితో చినపుడుకుర్ర రాక్షసుల తోకలకు కాగడాలతో అంటిస్తూ చురుకుగా పని చేయిస్తున్నారు. ఆనందుడికవుండబట్టలేక, వారిలో ఒకణ్ణి యీ సన్నాహం అంతా ఎందుకని అడిగేడు.

"గౌతమబుద్ధుని ప్రియశిష్యులలో ఒకడైన ఆనందునికోసం. ఆయనకోసం ఎదురు చూస్తున్నాం. ఇక అరగంటలోనో, గంటలోనో వస్తాడు!" అన్నాడు.

ఆనందుడికి గుండెలు బరువెక్కాయి. గొంతు తడి ఆరిపోయింది. అయినా, ప్రయత్నంమీద అడిగేడు: ఏ కారణంచేత, ఆనందుడు నరకలోకానికి వస్తున్నాడని. "విషంయిచ్చి, హత్య చేసినందుకు" అనిసమా సమాధానం వచ్చింది. ఆనందుడే వో అనుగుదామని నోరు తెరిచీలోగానే, ప్రక్కనేవున్న యిద్దరు రాక్షసపెద్దల సంభాషణ వెవినిపడింది.

"ఆనందుని రౌరవ నరకంలోనే వుంచాలి" అన్నాడొకడు.

"కాదు పెద్దనరకంలోనే" అనాడింకొకడు.

"క్షమించాలి. పెద్దనరకం, రౌరవ నరకం అంటేఏమిటో నేను తెలుసుకోవచ్చా?" అన్నాడు, ఆనందుడు మధ్యలో వారి సంభాషణకుఅడ్డువచ్చి.

"తప్పకుండా, దానికేం! పెద్దనరకంలో సలసలకాగే ఇనుములో పడవేసి, కరిగించిన సీసం నోట్లోపోస్తారు. రౌరవనరకంలో కరిగించిన సీసంలో పడవేసి, కరిగిన యినుము నోట్లో పోస్తారు. మా అతిథి ఆనందునికి ఏది తగినదని మేం ఆలోచించుకుంటున్నాం" అన్నారు.

ఆనందుడికి కలత నిద్దురలోంచి మెలకువ వచ్చింది. వొళ్ళంతా వణికిపోతోంది, భయంతోటి. చెమటలు కారిపోతున్నాయి.

"హా! బుద్ధదేవా! ముక్తిబోధకుల దారి ఇంత కంటక సమన్వితమని యిప్పుడు తెలిసింది. నా గర్వానికీ, అహంభావానికీ, గురువచనాతిక్రమణకు ప్రతిఫలం యిప్పు డనుభవిస్తున్నాను— బ్రతికే వుండగానే నరకం. బుద్ధం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!! ధమ్మం శరణం గచ్ఛామి!!! అని ఆక్రోశించాడు, ఆనందుడు పశ్చాత్తప్త పరిశుద్ధ హృదయంతో.

"నీతప్పు యిప్పటికి తెలుసుకున్నావా? ఆనందా" అని ఒక సుపరిచిత శాంతస్వరం పలకరించింది. ఆనందుడు తిరిగి చూసేసరికి, శాక్యముని గౌతముడు నిల్చుని వున్నాడు. ఆనందుని కంటి మబ్బు తెర తొలగిపోయింది.

"దేవా! నాగతి ఏమిటి? తమ పరిశుద్ధసాన్నిధ్యాన్ని సమీపించుట అనర్హుణ్ణి. పాపిని."

"పాపులు నన్ను సమీపించడానికి జంకనక్కరలేదు. ఆనందా! నీ ధూర్తత, గురువాక్యాతిక్రమణ యివే నిన్ను దూరంగా వుంచుతున్నాయి. ఈరోజునే, నా శిష్యులంతా దేశ దేశాలనుంచి వచ్చి శ్రావస్తి నగరంలో సమావేశ మవుతున్నారు. ఆ సమావేశంలో, నీ చర్యలగూర్చి నీవే చెప్పుకుంటావో, లేక నే చెప్పవలసి వుంటుందో అడగడానికే యిక్కడికి వచ్చాను."

"నేనే చెపుతాను. నా దుశ్చరితాన్ని చెప్పుకుని, ఆ అవమానాన్ని నేనే భరిస్తాను" అన్నాడు ఆనందుడు దృఢనిశ్చయంతో.

"సత్యంపలికేవు. ఆనందా! ఇప్పుడు నువ్వా వేషం వదలి, బౌద్ధభిక్షువుకు సరిపోయే వేషం ధరించు. నేను చేసిన నియమాన్ని నేనే యీ వొక్కసారికీ అతిక్రమించి, నిన్ను క్షణంలో సమావేశస్థలానికి చేరుస్తాను. లేకపోతే, యీ ప్రజలు నిన్ను క్షణమే హతమారుస్తారు, తమ రాజును విషంయిచ్చి చంపేవనే నెపంతో" అన్నాడు తథాగతుడు.

"అయ్యో! గురుదేవా! నా తప్పిదం మూలాన, మగధలో బౌద్ధమతం నాశనమయిపోతుంది కదా!" అని ఆనందుడు విలపించాడు.

"దేవదేవుడు వచించిన పరమ సత్యమయినా సరే— అసత్యపు వాదనలతో, మాంత్రికాలతో వ్యాప్తి చేసినపుడు నశించక తప్పదు. నీ యీ అనుభవజ్ఞానంతో, పరసీమలలో ప్రజల మాధ్యాన్ని పారద్రోలి, ముక్తిమార్గం బోధన చేయుదువుగాక! నీవుచేసినపని కంత అవమానపడ నవసరంలేదు. ఎందుచేతనంటే, నువ్వు నిజంగా నా మాట నతిక్రమించలేదు; నువ్వు మహాద్భుతాలూ, మానవాతీత ప్రదర్శనలూ చేయలేదుకనక."

దేశి సాహిత్యం

సంపాదన: యర్రోజు మాధవాచార్యులు

కిర కిర చెప్పూ లోడ
కిన్నెర మోతా లోడ
పిలచీనా పలుక వేర
నిలచీ మాటాడరో
ఓ నీటుకాడ!

నువ్వు
నిలచీ మాటాడరో
ఓ నీటు కాడ!

నూగు మీసా మోడ
రాగాల నాయూడ
కత్తెర జులపా లోడ
కలిసీ మాటాడరో
ఓ నీటుకాడ!

నువ్వు
కలసీ మాటాడరో
ఓ నీటుకాడ!

మువ్వల మోతాలోడ
గువ్వల గున గున లోడ
ఈడూ జోడూగ మనము
కూడీ పోదామురో
ఓ నీటుకాడ!

మనం
కూడీ పోదామురో
ఓ నీటుకాడ!

కోర పాగా వోడ!
ఓర చూపుల వోడ!
దారి మలుపుల కాడ
తారా సిల్లాలిరో
ఓ నీటుకాడ!

మనం
తారా సిల్లాలిరో
ఓ నీటుకాడ!

పూత రేకుల వోడ
లేత నవ్వులవోడ
అందాల చిందుల్లో
ఆడూ కుందామురో
ఓ నీటుకాడ!

మనం
ఆడూకుందామురో
ఓ నీటుకాడ!

పండు వెన్నెల సూడు
నిండు జాబిల్లి సూడు
కొలనులో కలువపూల
కిల కిలలూ సూడరో
ఓ నీటుకాడ!

ఆ
కిల కిలలూ సూడరో
ఓ నీటుకాడ!

నీటుకాడ! నీటుకాడ!
నిన్నే తలచీనార!
మనసూలో నువ్వెంతో
మసలూ కొలిపావురో
ఓ నీటుకాడ!

నా
మసలూ కొలిపావురో
ఓ నీటుకాడ!

కావీ చూడని పూవు
కావీ పండిన మోవి
వలపూల తే నెల్లు
కలిసీ జుర్రేద్దము రో
ఓ నీటుకాడ!

మనం
కలిసీ జుర్రేద్దమురో
ఓ నీటుకాడ!

జీవితము-నేను

హరీంద్రనాథ చట్టోపాధ్యాయ

ఏకాంతవాసి

ధ్యానం దివ్య సాక్షాత్కారానికి హృదయం పడే ఆవేదన. అది తీవ్రతరమైనపుడు, చలనశీలమైన మనస్సు స్వాధీనమవుతుంది. చెదరిపోయే మనస్సును తిరోముఖం చేసి, అంతరాత్మ మీద సంలగ్నం చెయ్యడానికి దాని ప్రయత్నం. ఋషులు శాశ్వతావస్థగా అభివర్ణించిన నిర్వికారమైన అచంచలత దాని ఫలం.

దయ్యాల కొంపనుంచి ఉద్వాసం చెప్పడం జరిగాక, ఇంక అక్కడికి వెళ్లడమే మానుకున్నాను. పొద్దుటిపూట షికారుకు వెళ్లినప్పుడుమాత్రం బయట నిలబడో, ఇంకా ఉండబట్టలేకపోతే — ఇవతలి మెట్లెక్కి వరండాలోకి వెళ్లో, ఈ ప్రవాసానికి ముందు అక్కడికి అభిమానంగా వెళ్ళివచ్చే ఆ వెనకటిరోజుల్ని తలుచుకుంటాను. అప్పుడప్పుడు పగిలిపోయిన కిటికీ అద్దంలోంచి నిర్మానుష్యమైన ఆ హాల్లోకి కుతూహలంతో దొంగతనంగా తొంగి చూస్తాను. అక్కడింకా రామదాసస్వామీ, నేనూ ఓ పులి-చాపమీద ఒకరి సరసనొకరం కూర్చుని తీవ్రంగా ధ్యానిస్తున్నట్టే ఉంటుంది. మనకు ఆత్మీయంగా పరిణమించిన చోట్లల్లా, మన సంస్కారాంతరంలోని అమూల్యమైన వ్యక్తిత్వాన్ని కొంత భాగం విడవిడుస్తూన్నదానికి నాకు దాఖలా కనిపించింది; మనస్సుకు సంబంధించిన పైపొరలు, ఈ వ్యక్తిత్వం చిక్కని నీడలా, పలచని అభ్రకపు బెత్తులా సన్నసన్నని పొరలుపొరలు కలిగి వుంటుంది. ఇంకా చెప్పాలంటే, అభ్రకంలాగే దీన్నికూడా వ్యయప్రమాదాల కోర్చి చీకటిగనిలోంచి తవ్వి తియ్యవలసివుంటుంది. ఈ వ్యక్తిత్వం కాలనిపటిలో ఖరీదు తెచ్చేది కావచ్చు, కాకపోవచ్చు. మా ఇరువురి వ్యక్తిత్వాలు స్పష్టమైన ఛాయలు విడిచిపెట్టి వెళ్ళినట్టు, అవి ఆ ఇంటిని అభిమానంతో పట్టుకుని వేళ్లాడుతోన్నట్టు అనిపించింది. అలవాటైన సన్నికర్ష ప్రభావంవల్ల అనురాగము, ఆత్మీయత ఏర్పడ్డ స్థలంగాని, వ్యక్తిగాని దుస్త్యజమే. పాతుకొన్న అభ్యాసం గర్భంలోంచి దేహాన్ని బలవంతంగా వెలికిలాగి, అంతశ్చేతన సంబంధియైన నాభిపాశంతో బంధించే అనుభవాలతో తెగతెంపులు చేసికోడం లాంటిది, ఇది. యాటంబాంబుతో ధ్వంసం చేసి విడిచాక, కొంపగోడు తుడిచిపెట్టుకుపోయి, చెట్టుచేమ లదృశ్యమై, ప్రాణిసంచార మెరగకుండా మైళ్ళకొలదీ పరచికొన్న నగరంలో హిరోషిమావాసులు దయ్యాలై నివసిస్తూండడం కనిపించినా నేను పూర్తిగా నమ్మగలను. యాటంబాంబు ప్రేలుడు కల్పించిన పరిస్థితిలోంచి ఆ నగరం హఠాత్తుగా — మృతజీవుల నగరంగా కాకుండా — జీవచ్ఛాయల నూతనరాజ్యంలా బయలు వెడలినట్టు తోచింది. యాటంబాంబు రోడ్డు పక్కగారడీవాని పని చేసింది; 'హూఁ మహాంకాళీ' అని ప్రపంచానికి మాయచేసి చూపించింది. అంత ధ్వంసకారకమైన మందుగుండు కలిగివుండీ, అది-మనుష్యులకే కాకుండా - చెట్లకీ, ఇళ్ళకీ, శిల్పాలకీ, కొండలకీ, స్మారకచిహ్నాలకీ కూడా ప్రతిరూపాలు బయలుదేరకుండా మాయం చెయ్యలేకపోయింది. ఆ రూపాలు పట్టి ఇసుకనీ, గాలినీ సుకరబోధమైన అంతశ్చేతనానుభవాలతో నింపేశాయి. విశ్వంలో ఆకృతిదాల్చే ప్రతీదీ, అంతకంటె సూక్ష్మతరమైన ప్రతిరూపాల్ని దాచడానికి, ఆ ఆకృతిని ఆచ్ఛాదనంగా ఉపయోగించి తీరాలి. ఈ ప్రతిరూపాలు సూక్ష్మాతి సూక్ష్మాలై విశ్వచైతన్యమయమైన నిశ్చల నీరవతలో అదృశ్యమవుతాయి. ఈ అవస్థ శుద్ధశూన్యం కాదు; సమధిక సాఫల్యమే-సత్యమైన దివ్యత్వమే.

నేను, సంసారం మధ్య ఉంటూనే, ఇంట్లో అంతకంతకు ఏకాంతం అవలంబించ నారంభించాను. మా పడకగదిని అంటివున్న ఇరుకు గదిలో నా ఏకాంతవాసం చేసుకున్నాను. చుట్టూ ఉన్న

వాళ్ళకి, నాకింక వాళ్ళతో సంబంధము లేదని, నచ్చ చెప్పడం కోసం—నన్ను భద్రపరచుకోడానికి అనువుగా ఎర్రటి 'స్పెషల్' కోటిటూర్స్ తొడగడం మొదలుపెట్టాను. నన్ను అది రక్షణమే తక్కిన వాళ్ళనుంచి వేరుపరచింది. దానితోపాటే, తెల్ల దుస్తులు విడిచిపెట్టి కావిబట్టలు వేద్దామని కూడా ఉబలాటపడ్డాను. కాని యీ పరివర్తన యిప్పుడిప్పుడే కాదు, యింకా వుండాలి అని ఏదో ఉద్బోధించింది నాకు. ఎందుచేతనంటే, పెళ్ళి చేసుకోడంలాగే, సన్యాసం పుచ్చుకోడం కూడా—గుర్తింపవలసిన యీ విషయాన్ని ఎవరూ గుర్తిస్తోండకపోయినా—బాధ్యతతో కూడినదే, భవిష్యత్తు నిర్ణయించేదే అవుతుంది: కావిని కట్టుకోడం, ఆ రంగువల్ల సూచింపబడే పావనమైన అగ్నిహోత్రాన్ని 'కట్టుకోవడ' మనమాట. అందుచేత కావి తొడ్గడం అగ్నితో చెలగాటం వంటిది. కావితో చెలగాడే వాడు నరక బాధ అనుభవిస్తాడు. దానిని భక్తి జ్ఞానాలతో ధరించుకోలేనివాడు. ఎట్టకేలకు స్వయంసమర్పణ యోగ్యత సిద్ధించిన మహాఫలంగా, పవిత్ర్యం పొందుతాడు. అవును—నేనింకా ఉండాలి, ఇంకా ఉండాలి; నేను కాషాయం ధరించడానికి తెగువ చేసే ముందు, నా మనస్సును ఆ రంగులో ముంచవలసి ఉంది. మహాత్ముడు కబీరు సద్బోధలను చెప్పింది కూడా ఇదే.

ఇంచుమించు యిరవై నాలుగు గంటలు ఆ గుయ్యారంలో ఒంటరిగా గడుపుతూవచ్చాను. మనస్సునీ, దాని వృత్తుల్నీ నాలుగుగోడల మధ్య పట్టిబంధించి ఉంచుతూ, ఒక కొంపలో కాలంగడపడం అనుభవైకవేద్యమైన విషయం: మొదట్లో ఊపిరి ఆడకుండా చేసినా—క్రమంగా ఆ గోడలు స్ఫటికస్వచ్ఛంగా మారసాగి, విద్యుల్లతలనంతే విశాలమైన అవకాశాలను దృష్టిపథానికి తెస్తూ, స్వయంగా విధించుకున్న సంకుచిత సరిహద్దుల్ని దాటి వెలుగుతాయి. అందుకోసమే-జన సందోహంలో జీవితమని పేర్కొనే దానికి సంబంధించిన అనావశ్యకమైన అలజడికీ, అర్థహీనమైన అరుపులకీ దూరంగా, ఏకాంతులుగా ఏదో ఒకటి గుహలోనో వసించడానికి తీవ్రాన్వేషకులు తరచు అభిలషిస్తారు. దివ్యోపలబ్ధి కావడంతోటే ఆ గుహ అవసరం కూడా తీరిపోతుంది: అప్పుడు దేహావరణమే రక్షకమైన భిత్తికాభ్యంతరంగా ఉపకరించి, అంతర్యామియైన జ్ఞానం పరమాత్మకు సపర్యలు చేసే వధూటిగా అందులో ఉంటుంది.

నా జీవితంలో యీ ఘట్టానికి వచ్చేటప్పటికి, నాకింక త్రాగుడు అవసరం లేకపోయింది. నరాలు దానికోసం పరితపించడం లేకపోవడమే కాకుండా, నరాలకి ఉద్రేకం కలిగించి, యింద్రియాలను అవశం చేసే ఏ వస్తువన్నా వెలపరం పుట్టించింది. నేను మానసోల్లాసకరమైన ఓ పాటి శాంతి, స్థిరత్వాలు సాధించాను; వాటిని చేయిదాటి పోనివ్వదలచుకోలేను. ఒక్కొక్కప్పుడు మాత్రం, సామాన్యాసక్తి-స్పర్శ మీకి, స్త్రీవాంఛ కలిగి, తృప్తిపరచమంటుండేది-నాలోని శాంతి, స్థిరత్వాలు: "ప్రస్తుతానికి నిర్ణయమైన జీవితపు కార్యాలయంలో నీకు చోటులేదే" అని సమాధాన మిస్తూండేవి. అదిగాక నా బాల్యవాంఛలు పస్తుండవలసి వచ్చేవి—ఒక్కొక్కటి యిరుకైన కర్రకట్టు బోనులో గొలుసు వేసి బిగించిన ఒక్కొక్క శ్వానంలా కుక్కిపడుండాలి? వీళ్లే కూడా పడి ఉండేవి.

నా కుటీరాలు సీలమండమీద ఒక కురుపు లేచింది. స్వాతంత్ర్యం రావడానికి పూర్వం, బ్రిటిషువారు జయించినట్టు చూపిస్తూ ఇండియా పటంమీద ఉండే దేశభాగమంత ఎర్రగానూ ఉంది, అది. ఆ కురుపు చాలినంతగాను బాధకూడా పెట్టింది-అది అదే పనిగా సలపడం ద్వారా అంత శాంతిసిలగ్నమైన నా మనస్సును చలింపజెయ్యడానికి, చీల్చడానికి ప్రయత్నించింది. అయితే, దాని కోసం దేనికి— కొన్నాళ్ళపాటు దీర్ఘచింతకి, తీవ్రధ్యానానికి గురిచేసిన యీ చిన్నమచ్చ కారణంగా, మొట్టమొదటిసారిగా ఆధ్యాత్మికానుభవ మనే పెద్ద పంటనే చేసుకోగలిగాను. అప్పట్లో సంపూర్ణాత్మకమైన సంజీవనంతో మళ్ళీ సంబంధం పెట్టుకునే ప్రయత్నంలో లేననుకున్నాను. సీలమండమీది కురుపును గురించికూడా పెద్ద శ్రద్ధ తీసుకోదలచుకోలేను. అనుభవించిన కొద్దీ, బాధ అతిశయించడం-జీవితధర్మం. సౌందర్యంవిషయంలో కూడా యీ ధర్మమే వర్తిస్తుంది. అనుభవించిన కొద్దీ సౌందర్యం ఆత్మీయమవుతుంది. సౌందర్యం స్వచ్ఛమైనదైతే, అదే శాంతం—శాంతమే, సౌందర్యం 'కీట్సు' శాంతానికి బదులు సత్యమన్నమాట ఉపయోగించాడు. సత్యము, శాంతము పర్యాయపదాలు.



కథలో నాన్న అంటాడు: "నువ్వు టపాకాయలు కాల్చినంతమాత్రాన స్వరాజ్యం వచ్చేస్తుందిటే, వెర్రితల్లీ! నీ తోటి పిల్లలంతా కులాసాగా మతాబాలూ అవీ వెలిగిస్తూంటే, నువ్వు మొహం వేలాడేసుకుని రాబోయే స్వరాజ్యంగురించి ఆలోచిస్తుంటావా?" కథలో కూతురు సమాధానం చెపుతుంది: "ఎంత వెర్రివాడవు నాన్నా! చూస్తూ డబ్బు కాల్చేయమంటావా? దేశనాయకులంతా ఏం చెపుతున్నారో నువ్వు పత్రికల్లో చదవలేదా? ఝాన్సీ లక్ష్మీబాయిని తలుచుకో, సరోజినీదేవిని తలుచుకో! మహాత్ముడేమన్నాడు?"

రెండు శతాబ్దాల క్రితం ఏదో తెలుగుపత్రికలో పడ్డ పద్యాలకథకి ప్రారంభం అది. దీపావళి గురించి తండ్రీ కూతురూ సంభాషణ. వాళ్ల వయస్సులు కవిగారు సూచించినట్లు జ్ఞాపకం లేదు. కాని అమ్మాయిమాత్రం ప్రహ్లాదుడికివలె, చిన్నతనంలోనే- అంటే, నలుగురితోపాటు దీపావళికి మతాబాలు కాల్చవలసిన వయస్సులోనే- జ్ఞానోదయం కలిగింది: గాంధీజీభక్తురాలుకూడా. నాన్న మాత్రం అజ్ఞానం అనే చీకటిలోనే,- కథకుడి నిర్వచనం ప్రకారం- ఉన్నట్టుంది.

అప్పట్లో చిన్నపిల్లల్నికూడా ఉద్రేకపూరితుల్ని చేసి, టపాకాయలు కాల్చడం కూడా మాన్పించిన 'స్వరాజ్యం' అనేమాట ఇప్పుడెక్కడా కనిపించడం లేదు. తిలక్ లేవతీసిన "స్వరాజ్యము నా జన్మహక్కు" అనేనినాదంతో ప్రారంభించిన కథ, ఆగష్టు పదిహేను దీపోత్సవాలలో, జ్వాలాతోరణాలలో భరతవాక్యం పాడింది. స్వరాజ్యం ఏమయిందో మరి, ప్రస్తుతానికది స్వతంత్రం. అలాగే దీపావళికి టపాకాయలు కాల్చవద్దనే ప్రచారంకూడా క్రమేపీ హరించిపోయింది. అటువంటి ప్రచారం సాగించిన ప్రముఖులు కైవసం చేసుకున్న ప్రభుత్వమే నేడు ఉత్సవాలకి బాణసంచా కాలుస్తోంది.

'కాలమిది కాదు మన అలంకారములకు' అన్నట్టు అప్పటి పోరాటయుగంలో బయలుదేరిన ఆంక్షలు లక్షోపలక్షలు. పండగలూ పబ్బాలూ, వేడుకా వినోదమూ, సారంలో ఉప్పు, బట్టల్లో జరీ- అన్నీ ఆంక్షలే. నిరాడంబర జీవితం- అదీ ఆదర్శం. మహోన్నతులు చిత్తశుద్ధితోనూ, మామూలు కొందరు ప్రదర్శనకోసం అవన్నీ చేసి, మిగిలిపోయిన బహుళ ప్రజానీకంకంటె, నైతికంగా కొన్నిరెట్లు పొడుగై ప్రకాశించేవారు. భారతవర్షం అంతా కణ్వాశ్రమ శోభ అందుకోవాలని వారి స్వప్నం. ఖద్దరీ, వైద్యం, సేప్టరీ- చదవడం, వ్రాయడం అన్నీ ఒక్కుమ్మడి నిర్వహించడమే నాటి ధీరోదాత్తుడి ప్రథమ కర్తవ్యం. ఆ పోరాట పరంపరలలో గడియారాల ప్రకటనదార్లు బోధిస్తున్నట్టు కాలం మారింది. ప్రపంచ మహాయుద్ధం, మన జాతీయ స్వాతంత్ర్యసమరం జయప్రదంగా ముగిశాయి. ఎక్కడ లేని అలంకారాలకూ ఇదే తరుణమనీ, రానున్నదంతా ఆనందోత్సవమేననీ, పెద్దలప్పుడే గ్రహించారు. అందుకే, ఆంగ్లేయులు అధికార్లకిచ్చిన జీతాలు ఏమంత ఎక్కువకావనీ, అమాటకొస్తే ఇంకా కాస్త ఎక్కువున్నా ఫరవాలేదని తెలుసుకున్నాం.

అందుకే నేడు మన కన్ని పండుగలు, జయంతులు, వర్ధంతులు, సరికొత్తవి. పాతనాటికి కొత్త అన్వయాలు. నరకాసురుడు నిజానికి ఫాసిస్టు, పెట్టుబడిదారుడు. ప్రజల్ని నానా హింసలూ పెట్టాడు. తత్ఫలితంగా బ్రహ్మాండమయిన ప్రజా-ఉద్యమం బయలుదేరి శ్రీకృష్ణుడి నాయకత్వంకింద నరకాసురుణ్ణి సంహరించింది; దేశంలో నిజమైన ప్రజారాజ్యం స్థాపింపబడింది. ఇదీ దీపావళికి ఆధునిక వ్యాఖ్య. పాతపండుగల్లోని మూఢత్వాన్నీ, బానిస సాంప్రదాయాన్నీ విడమర్చి చెప్పే ఆధునిక వర్ధమానులు వాటిస్థానే కొత్త పండుగల్ని సృష్టించి ప్రజల్ని రక్షిస్తున్నారు. ఇంతకూ ప్రజానీకానికి కావలసింది వేడుకా, వినోదం. వినాయకుడి ఊరేగింపు కాకపోతే, నాయకుడి ఊరేగింపు. సంక్రాంతి కాకపోతే, క్రాంతి-మేడే. ఆలయంలో పురాణకాలక్షేపం లేకపోతే, గాంధీపార్కులో ఉపన్యాసధోరణి. జయపూర్ కాంగ్రెస్ పందిరికి ఏనులక్షలరూపాయి లెందుకునాన్నా అని కొడుకు ప్రశ్నిస్తే, తెలియదని తండ్రి అంటాడు. మానవుడున్నంతకాలం ఏదో రూపాన దీపావళికూడా ఉంటుంది. అందుకే అంత పెద్ద పందిరి.—(గోరా)

 పుస్తక సమీక్ష 

ఫ్రెడరిక్ ఎంగెల్సు—జీవితం, ఉపదేశాలు: రచన- వి. ఐ. లెనిన్, జెట్కోట్స్; అనువాదం- నిడమర్తి ఉమారాజేశ్వరరావు; వెల ఒక రూపాయి. (ప్రగతి ప్రచురణాలయం, నిడమర్రు, వయా పెంటపాడు, పశ్చిమ గోదావరిజిల్లా.)

మార్క్సిజం వయస్సు ఒక శతాబ్దం దాటింది. ప్రపంచాన్ని పీడించే అనేక బాధలకు నివారణ మార్గం చూపెడుతూన్న యీ సిద్ధాంతం ఆక్రమించినట్టు, శతాబ్దకాలంలో యింకేసిద్ధాంతమూ ప్రపంచాన్ని ఆక్రమించలేదు. ముఖ్యంగా గత ముప్ఫయి సంవత్సరాల్లో, మార్క్సిస్టు సిద్ధాంతాలపై ఆధారపడిన శ్రామికవర్గ మహోద్యమాలు ఉప్పొంగని దేశం, ప్రపంచంలో ఎక్కడా లేదని చెప్పవచ్చు. సోవియట్ రాజ్యనిర్మాణంలో, మార్క్సిజం స్పష్టమైన కార్యరూపం దాల్చింది. దీనికి గతంకంటె భవిష్యమే అధికంగా వుంటుందని, నేటి ప్రపంచ పోకడ గమనించేవారికి తెలియకపోదు.

ఈ సిద్ధాంతజనకులు కారల్ మార్క్సు, ఫ్రెడరిక్ ఎంగెల్సు అన్న మేధావులు. మార్క్సిజానికి ఆశయమైన సామ్యవాద సమాజాన్ని సిద్ధింపచేసినవాడు, సోవియట్ దేశనిర్మాత వి. ఐ. లెనిన్. ఆ సామ్యవాద సమాజాన్ని సుస్థిరం చేసి, పెంచి పోషిస్తున్నవాడు, నేటి సోవియట్ దేశ నాయకుడు జోసఫ్ స్టాలిన్. ఈ నలుగురు వ్యక్తులు గత శతాబ్ద చరిత్రలోకూడా చాలా ప్రముఖులు.

మార్క్సిజానికి భౌతికరూపం కల్పించడంలో లెనిన్, స్టాలిన్ల లాగనే- దానికి భావరూపం కల్పించడంలో మార్క్సు, ఎంగెల్సులు అమోఘమైన కృషి చేశారు. లెనిన్ స్టాలిన్ల పేర్లవలెనే, మార్క్సు, ఎంగెల్సుల పేర్లు ఒకదానితో ఒకటి పెనవేసుకుని పోయినవి. ఈ గ్రంథ విషయమైన ఎంగెల్సు జీవితం, యీ సిద్ధాంత నిర్మాణ చరిత్రను వివరిస్తుంది.

ఎంగెల్సు, మార్క్సుకు సహచరుడేకాక ఆప్త మిత్రుడుకూడ. యావజ్జీవితమూ పీడిత వర్గవిముక్తికి అర్పితం చేసి, ధనిక జీవిత విలాసాలను త్యజించిన మహాత్యాగి. మార్క్సు పరిశోధనలకు యీయన తోడ్పాటు సలహాలు ఎంతో సహాయపడినవి. మార్క్సుతో కలసి వ్రాసినవి కాక, మార్క్సు మరణానంతరం యీయన 'కుటుంబం, దాని పుట్టుపూర్వోత్తరాలు' అన్న ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. "ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" అన్నది ఎంగెల్సు యొక్క ప్రసిద్ధరచన. దీనిని వ్యాఖ్యానిస్తూ యీ గ్రంథంలో వ్రాసినది ఎంగెల్సు ఘనతను సూక్ష్మంగా తెలియజేస్తుంది:

"ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి" అన్న రచన ద్వారా ఎంగెల్సు చేసిన మహత్తరమైన సేవను పైని వివరించాం. ఎంగెల్సుకన్న ముందుగానే కార్మికవర్గ దుస్థితిని వర్ణించి, ఆ దుస్థితిని తొలగించి కార్మికవర్గానికి సహాయం చేయవలసిన అవసరాన్ని సూచించినవారు అనేకమంది వున్నారు. కాని కార్మికులు దుస్థితిలో వున్న వర్గమన్నమాత్రమే కాదని, యీనాడు ఎట్టి నీచమైన, నికృష్టమైన, నిస్సహాయమైన ఆర్థికదుస్థితిలో కార్మికులున్నారో ఆ దుస్థితే వారిని ముందుకు తోసి తమ అంతిమ విముక్తికై పోరాడునట్లు చేసితీరుతుందనికూడ చెప్పిన వారిలో ఎంగెల్సు ప్రప్రథముడు.

ఎంగెల్సు పేర్కొన్న పై సత్యాన్ని చరిత్ర నిరూపించింది.


జనత: పక్షపత్రిక; సంపాదకుడు- గంగినేని వెంకటేశ్వరరావు; విడి పత్రిక

ఎనిమిది అణాలు, సంవత్సర చందా పద్రెండు రూపాయలు. (మేనేజరు, జనత, బ్రాంచి- గవర్నరు పేట, విజయవాడ)

జనత మార్క్సిస్టు సిద్ధాంత పత్రిక. "ఆ సిద్ధాంతాన్ననుసరించి ఆచరించిన నాయకుల అమూల్య అనుభవాలతో కూడిన వ్యాసాలు సంభారము, నెల నెలా విదేశ స్వదేశ ఇంగ్లీషు పత్రికల్లో విరివిగా వస్తున్నాయి. ఈ అమూల్య గుణపాఠాలను ఆచరణతో కూడిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆంధ్రవిజ్ఞానులకు, ప్రజాసేవకులకు, ప్రజలకు ఆ నాయకుల ద్వారానే ప్రత్యక్షంగా తెలుగులో చెప్పటానికి"— జనత కృషి. తొలిసంచికలో 'హంగేరి కమ్యూనిస్టు పార్టీలో సిద్ధాంత కృషి' (మాటియాస్ రాకోసి), యుగోస్లావియా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంపై 'కామిన్ ఫారమ్' తీర్మానం, చైనా విముక్తి యుద్ధ సమీక్ష, యుగోస్లావియా కమ్యూనిస్టు నాయకులు 'మార్క్సిజానికి స్వస్తి చెప్పారు' (ఐ. లాట్), 'ప్రజలపోట్ల నొక్కేవాళ్ళు' రాబందులన్నీ చేరాయి. 'ప్రపంచ సామ్రాజ్యము కొరకు అమెరికా ఎత్తులు' (విలియం జడ్. ఫాస్టర్) అను 'ఉపదేశాలు' ఉన్నాయి. కాని ఇవి విదేశాల్లోని ఉద్యమ వార్తలుగాని, దేశానికి కావలసిన ఉపదేశ విషయాలు కాజాలవు. మార్క్సిస్టు మూలసూత్రాలేమిటి, వాటి దృష్ట్యా దేశ పరిస్థితులెలా ఉన్నాయి, వాటి కనుగుణంగా పరిస్థితులెలా మారాలి! అన్న రాద్ధాంత సిద్ధాంతాలకు ప్రాముఖ్యమిస్తేనే పత్రిక ఉపదేశాత్మకం కాగలదు. వెలుపట్టి చూసినా, విషయాలు పట్టి చూసినా కేవలం కావలసిన ప్రజాసేవకు లేకొద్ది మందికి తప్ప, చైతన్యం కలగవలసిన ప్రజాసామాన్యానికి పత్రిక ఉపయోగకారి కానిదనిపిస్తుంది. తను చూపించే 'రాస్తా' ముఖ్యం కాకుండా, మార్క్సిజాన్ని కయినప్పుడు జనత తప్పకుండా జనప్రియం అవుతుంది; మార్క్సిజాన్ని గురించి తెలుగులో వ్రాసే ఒకే ఒక పత్రికగా ఆంధ్రుల ఆదరాభిమానాలు తప్పకుండా చూరగొంటుంది. జనతకు హృదయపూర్వకమైన స్వాగతం.

ఆభాస క్రైస్తవము: రచన-కోట వెంకటాచలం; వెల రు 1-4-0. (కోట వెంకటాచలం, గాంధీనగరం, విజయవాడ.)

ఆభాసక్రైస్తవము జిజ్ఞాస రేకెత్తించే చురుకైన విమర్శనా పుస్తకం. క్రైస్తవమత విషయాలన్నీ 'లేనిపోని కల్పనలుగా ఊహించిన'వని దాని తాత్పర్యం. పరస్పర విరుద్ధమైన పాశ్చాత్య సిద్ధాంతాభాసాలు మూలలు అసాంప్రదాయములుగా చేస్తున్నాయి; అటువంటి సిద్ధాంతాలను బాగా విమర్శించి, సత్యాసత్యాలు నిరూపించి ప్రజలకు ప్రచారం చేయడం దేశానికి క్షేమం-అని రచయిత అభిప్రాయం. పై విలువగల సృష్టి కాలం వగైరాలు పందొమ్మిదవ శతాబ్దంలో గావించిన నిరాధారమైన ఊహలు. క్రీస్తు పుట్టుక, జీవితం, బోధలు, సిలువనెక్కుట, తిరిగి లేచుట, మొదలైన సంగతులు అభూతకల్పనలు. క్రీస్తు పుట్టినాడన్న సంగతి ప్రచారానికివచ్చిన మొదటి శతాబ్దాంతసే-అది పట్టి అబద్ధమనీ, మిషనరీల కల్పన అనీ వ్యతిరేక ప్రచారంచేసే గ్రంథాలు వెలువడ్డాయి. శ్రీకృష్ణుని కథ ఈజిప్టు, అక్కడి నుంచి పాలస్తీనాకు వ్యాపించింది. అక్కడి భాషలో కృష్ణుని పేరు 'క్రీస్తు' గా మారింది; కృష్ణుని మతం అనుసరించినవారు 'క్రిష్టియను' లయారు. క్రీస్తుకాలానికి పూర్వం రెండువేల సంవత్సరాలకి పైమాటే. ఈజిప్టులో 'క్రిష్టియను' మనమనేది ఉంది. పుస్తకం యీ విషయాలన్నిటినీ-ఆయా గ్రంథాలనుంచి సేకరించిన ప్రమాణ వాక్యాలతో-సహేతుకంగా, యుక్తియుక్తంగా వివరిస్తోంది; ఇదే ఇంగ్లీషులో వెలువడి ఉంటే, ఇంకా ఎక్కువ ప్రయోజనము, ప్రచారము ఉండేదేమో అనిపిస్తుంది.



సంపాదకునికి ప్రకటనార్థము పంపబడిన లేఖలు యీ శీర్షిక క్రింద ప్రచురితమవుతాయి. లేఖలు క్లుప్తముగా, కాగితానికి ఒక పక్క వ్రాసి పంపవలెను.

రేషనింగు

ఏప్రిల్ 1949 లోపుగా మన రాష్ట్రమంతటా రేషనింగు వ్యాపింపజేయుట ప్రభుత్వోద్దేశముగా రాష్ట్ర ఆహారమంత్రి ప్రకటించుట ముదావహము. దేశంలో ఉత్పత్తి తగ్గి దిగుమతులు సన్నగిలినప్పుడు, రేషనింగు నమలుపరచుట తప్ప వేరే గత్యంతరము లేదు. కాని గాంధీజీ పేరుపై మన మంత్రివర్గాలు రేషనింగును రద్దుపరచి ప్రజల కెనలేని యిక్కట్లు పాల్జేసి, బ్లాకుమార్కెటుదార్ల సర్వతోముఖాభివృద్ధికి కారణభూతమయాయి. ఎంతమంది చెప్పినా, యెన్నిపత్రికలు ఘోషించినా లెక్కచేయకుండా కాంగ్రెసు మంత్రివర్గాలు ఆ తప్పునే నేటివరకూ కొనసాగించడం మరింత శోచనీయము. కంట్రోళ్లను రద్దు చేయుటతో పరిస్థితులు విషమించి కాంగ్రెసుప్రభుత్వాలను కలవరపరిచాయి. ఇప్పటికైనా రేషనింగునకు మరల వలసిన ఆవశ్యకత గుర్తించకలిగినందుకు ప్రభుత్వాన్ని అభినందించవలసిందే. మిగులుజిల్లాలలో ప్రజలు తరుగుజిల్లాలవారికి సహాయం చేయుటలో వెనుకాడరు. కాని మిగులు జిల్లాలలో ధాన్యసేకరణ వెనుకటివలె నిర్బంధవిధానాలలో జరిగినట్లయితే పరిస్థితులు విషమించగలవు. రేషనింగు అమలు పెడతారంటే ఇక్కడి ప్రజలంతా అప్పుడే భీతి చెందుతున్నారు. వెనుక ధాన్యసేకరణ పేరుతో అధికారులు చెలాయించిన జులుం, సల్పిన అక్రమాలు, చేసిన అన్యాయాలు వర్ణింప శక్యము గాదు. ప్రజలను ఒప్పించి, వారివద్దనున్న యెక్కువ ధాన్యాన్ని సేకరించడం సమంజసము. కాని ప్రజలను బెదిరించడం, ఇళ్లల్లో చొరబడటం, విత్తనానికైనా కాకుండా పంటలను పూర్తిగా కొల్లగొట్టుకొని పోవటం మొదలయిన అక్రమాలను యే ప్రజాప్రభుత్వమూ సలుపరాదు. యిట్టివి ప్రజలు సహించలేరు. మిగులుజిల్లాలనుంచి మంచిపంటను పూర్తిగా తరుగుజిల్లాల కిచ్చి, ప్రజలలో అసంతృప్తిని కల్గించడం ఆశయనిర్వహణకు అనుకూలించదు. తన్నుమాలినధర్మము చేసే రోజులు కావివి. అవి ఈ ప్రభుత్వాల హయాములో రావని చెప్ప సాహసిస్తున్నాను. సేకరణవిధాన సక్రమనిర్వహణ పైనే ఆశయసిద్ధి ఆధారపడి వుంటుందని ప్రభుత్వాలు గుర్తించాలి.

రాజమండ్రి — యమ్. ఆర్. కృష్ణ

ఊరి పేర్ల మార్పు

మదరాసు ప్రభుత్వమువారు కొన్ని పట్నాల పేర్లను మార్చినట్లు ప్రకటించారు. ఉదాహరణగా బెజవాడ "విజయవాడ గాను" రాజమండ్రి, "రాజమహేంద్రవరము" గాను, మార్చినట్లు చెప్పారు. ఉత్తరువులయితే అతిసులువుగా జారీ చేయ కలిగారు కాని, ఆచరణ విషయాన్ని ఆలోచించి యుండలేదు. ఇంతటి ప్రకటన చేసినవారు, వాటిని స్టేషనులలో క్రొత్త పేర్ల ప్రకారము బోర్డులు ఎందుకు రాయించకూడదు? పోస్టాఫీసు, రైల్వే ముద్రలు ఎందుకు మార్చకూడదు? ఇతరత్రా గవర్నమెంటు ముద్రలు క్రొత్త పేర్ల ప్రకారము




హైదరాబాదు ఆంధ్రాభ్యుదయం

శ్రీ కె. ఐ. విద్యాసాగర్, ఎం. ఏ., హెచ్.సి. ఎస్. (ఎడమపక్క) శ్రీ ఐ. రామచంద్రరావు, బి. ఏ. బి. ఎల్., హెచ్. సి. ఎస్.(కుడిపక్క) మొదటివారు హైదరాబాదు ప్రభుత్వపు సప్లయి సెక్రటరీ, రెండవవారు రెవెన్యూ సెక్రటరీ: వీరిద్దరు యీ పదవులకు తొట్టతొలుతటి ఆంధ్రులు; ప్రథములు సెక్రటరీ లందరిలోకీ చిన్నవారు.

ఎందుకు తయారు చేయించకూడదు ! ఆచరణ జరుపలేనివారు యింటువంటి క్రొత్త పంథాలను సృష్టించడము దేనికి? సృష్టించినను ఒకటే. సృష్టింపక పోయినను ఒకటే.

విజయనగరము — యస్. వేంకటరాజు

ఆంధ్రరాష్ట్రం

"ఆంధ్రరాష్ట్ర నిర్మాణం తిరిగి వాయిదా పడగల ప్రమాదం"-ఆంధ్రపత్రికలో అక్టోబరు 19 వార్త చూచిన ప్రతి ఆంధ్రుడి హృదయం స్పృహతో, దీర్ఘంగా నిట్టూర్చక తప్పదు. అసలు ఈ ప్రకటన, ఆ భాషాప్రయుక్త రాష్ట్రాల సమితి ప్రతినిధి చేయటంలో అంతరార్థం ఏదో వుండి తీరాలి. తమపని తాము చేసుకోక యిటువంటి అసమయపు ప్రకటనలు చేయటం ఎందుకు? ఇంతవరకు జరిగిన ఆలస్యానికి, ఆంధ్రప్రజానీకంలో అలజడి బయలుదేరింది. దానిని భాషాప్రయుక్త కమీషను యేర్పాటు అనే మిషతో కొంత ఆపారు, ఓర్పుతో సహించాం. అసలు కమీషను యెదుట సాక్ష్యము యిచ్చే జాబితా తయారు చేయటంలో కొంత ప్రస్తుత మంత్రివర్గంలో జరిగిందని తెలిసింది. అయినా మా సహనస్వభావంతో మమ్మల్నే అస్వతంత్రులుగా జేయాలని ప్రయత్నాలు జరుగుతూన్నట్లు ఈనాటి ప్రకటనతో వెల్లడి అయింది. అసలు ఈ తెరవెనక భాగవతం యింకెన్నాళ్లు? ఇప్పట్లో-అంటే నూతన రాజ్యాంగ చట్టం అమలులోకి వచ్చేలోపుగా, రాష్ట్రం వస్తుందా? ప్రకాశం పంతులుగారు, ఆచార్య రంగా గారు ఏమంటారు? మన కేమైనా మోక్షం వుందా! లేదా! అనవసరంగా కాలయాపన చేయక నాయకులంతా నడుం కడతారా?

యద్దనపూడి సూర్యనారాయణమూర్తి.

బియ్యంమిల్లులు ప్రభుత్వాధీనం కావాలి

ఇటీవల అనేక-చోట్ల బియ్యం సరిగ్గా దొరక్క ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉత్పత్తి, కౌలుదారుల సహకార విక్రయ సంఘములను ఎత్తివేయుటచేత ఉత్పత్తిదారులు తమ బాధ్యత సక్రమంగా నిర్వహించుకోలేరు. ధాన్య సేకరణ ఎవరు చేసినా, మిల్లులు ప్రభుత్వమువారు తమ అధీనములోకి తీసుకుని వ్యవహరిస్తే పెర్మిట్ల దుర్వినియోగము, బ్లాక్ మార్కెట్టూ చాలావరకైనా తగ్గుతాయి. పంపిణీ సక్రమంగా జరుగుతుంది. మిల్లులు ప్రైవేటు యాజమాన్యం క్రింద ఉన్నంతకాలం స్వార్థబుద్ధితో వారు బియ్యం పంపిణీకి ఏవో వక్రమార్గాలు కల్పిస్తూనే ఉంటారు. బియ్యంమిల్లులు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, సేల్సుటాక్సు, సర్చార్జి మొదలైనవాటిలో దొంగలెక్కలుకూడా తగ్గుతాయి. కాబట్టి ప్రభుత్వము వెంటనే చర్య తీసుకొని ప్రజలకు సహాయము చెయ్యడము కనీస ధర్మము.

పోలవరం కేశవరపు సత్యనారాయణరావు

హరిజనోద్ధరణ

"హరిజనాలయ ప్రవేశం—గౌ॥ వేముల కూర్మయ్య నాయకత్వం క్రింద తిరుపతి ఏడుకొండల వాడిలో; గౌ॥ మరొకరి క్రింద-ఇంకొకరి క్రింద-కంచి కామాక్షిలో-మధుర మీనాక్షిలో" అన్న పత్రికా వార్తలు చదవడానికి ప్రాణం విసుగెత్తి పోతోంది. హరిజనోద్ధరణకు ఆలయ ప్రవేశమేనా మన మద్రాసు ప్రభుత్వానికి తోచిన ఏకైక మార్గం? ఈ పాటి ఘనకార్యానికేనా ప్రకాశం ప్రభుత్వం కోటి రూపాయలు ప్రత్యేకిస్తే? ఇందు నిమిత్తమేనా గాంధీమహాత్ముడు కోట్లాదిగా హరిజననిధి వసూలుచేస్తే?

హరిజన ప్రవేశమైన ఆలయాలకు ప్రతినిత్యం ఎంతమంది హరిజనులు వెడుతున్నారు? ఆలయాలు తమకు కావని ఇంకా ఎంతమంది హరిజనులు తలపోయడం లేదు? ఎంతమంది హరిజనులు నివాసానికి స్వస్థలాలు లేక పరాశ్రయులై జీవించడం లేదు? తగిన వైద్యసౌకర్యాలు అందుబాటులో లేక అకాలంలో మరణించడం లేదు! ఎంత శ్రమపడి పనిచేసినా గడవక అర్థాకలితో నిద్రించడం లేదు? జీతాలు కట్టనక్కరలేకపోయినా భోజన వసతి సదుపాయాలు లేక ఎంతమంది హరిజన విద్యార్థులు తమ చదువులకు స్వస్తిచెప్పడం లేదు? ఒక్క ఆలయ ప్రవేశంతో ఈవిధమైన ఆపత్తులన్నీ తీరగలవా?

పుల్లేటికుర్రు వాడ్రేవు రామచంద్రుడు

కష్టమొకరిది- ఫలమింకొకరిది


బ్రిటిష్ వారి కాలంలో- అప్పట్లో వీరవిహారం చేస్తున్న కరువుకక్కసిని రూపుమాపుటకని- చెరువులూ, బంజరుభూములూ, పోరంబోకులూ ప్రభుత్వం బీదప్రజలకిచ్చిన విషయం అందరికీ తెలిసినదే. అప్పటినుండీ బీదప్రజలు తమ రక్తమాంసాలు ధారపోసి బంజరుభూముల్ని బంగారు పండే పొలాలుగా తయారు చేశారు. అధిక ఆహారోత్పత్తిద్వారా బెంగాల్, రాయలసీమ కరువులను కొంతవరకూ ఆ కష్టజీవులు నివారించగలిగారు.

కాని, ఇప్పుడు జాతీయప్రభుత్వం ఆ పొలాల్ని కైవసం చేసుకుని, రాజకీయ బాధితులకు పంచుతోంది. దాంతో కష్టజీవుల ఆశాజ్యోతులు ఆరాయి. "జాతీయత" అనే ముసుగుతో బీద ప్రజల్ని దోచుకున్నారనేదానికి వేరొక నిదర్శనం ఏం కావాలి? ఇతరులు కష్టించి సాగుచేసిన భూములను ఒక్క కలంపోటుతో తీసుకుని అనుభవించడానికేనా, యీ రాజకీయ నాయకులు త్యాగం చేసింది?

ఈ రాజకీయ బాధితులు కష్టించి సాగుచెయ్యదలచుకుంటే దేశంలో బోలెడు బంజరుభూములున్నాయి. వాటి సాగుకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందిగదా! వాటిని వీరు ఎందుకు సాగుచేయకూడదు? ప్రభుత్వం రాజకీయ బాధితులకు బంజరుభూముల నిచ్చి, వారిచే ఆ భూములను సాగుచేయించాలి. అధికాహారోత్పత్తికని బీదలకిచ్చిన భూములను ప్రభుత్వం యిదివరలో సాగుచేస్తున్న బీదలకే పట్టాలివ్వాలి.

ఈ విషయంలో మద్రాసు మంత్రివర్గం. రెవిన్యూ మంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు "కష్టించేవాడికే ఫలం" అన్న (కాంగ్రెసు) ముఖ్యసూత్రాన్ని మరోమారు గమనించాలి.

గుంటూరు పాలడుగు రంగనాయకులు



విషయసూచిక

సంపుటి 1. సంచిక 30
శుక్రవారం, ఫిబ్రవరి 25, 1949

గీతం

శ్రీ.శ్రీ.

చిన్నపిల్లల సర్కస్‌లో
ఫిడేళ్లు ధరించిన నర్తకులు
కష్టాలన్నీ మైమరచిన
కాలం అనేది ఉండేదా ?

గ్రంథాలమీద పడి వాళ్లేడ్చే
కాలం ఒకటి ఉండేది,
కాలం అయితే వాళ్లమీదకి
కాష్ఠాన్నే ఉసికొల్పింది.

ఆకాశపు అర్థవలయంకింద
ప్రమాదమైన బతుకు వాళ్లది.
అజ్ఞేయం మాత్రమే ఈ లోకంలో
అత్యంత సురక్షితమైనది.

ఆకాశపు సంజ్ఞలకింద
హస్తాలు లేనివాళ్లవే
అతిశుభ్రమైన చేతులు!

గుండెల్లేని శవానికి
గాయాలబాధ లేనట్టు
గుడ్డివాడు మాత్రమే
జాస్తీగా చూస్తాడు

(*Dylan Thomas* రచనకి అనువాదం)

స్వతంత్ర

సంపుటి-1
సంచిక 30

ఫిబ్రవరి 25, 1949

ప్రచురణ
ప్రతి శుక్రవారం

ఉచిత నిర్ణయం

అఖిలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, సమ్మె ప్రయత్నం ప్రస్తుతానికి విరమించి, ప్రభుత్వానికీ తమకీ మధ్యనున్న సమస్యలు సామరస్య మార్గంలో పరిష్కారం చేసుకుందికి నిశ్చయించడం- రాజకీయసిద్ధాంతాల ఉద్దేశాలకి లొంగక, దేశక్షేమమే కోరేవారందరినుండీ అభినందన పొందితీరతుంది. ఈ వివేకవంతమైన నిర్ణయానికి, సూక్ష్మంగా పరిశీలిస్తే, సమర్థులైన యిద్దరు నాయకుల సుహృద్భావ ప్రకటనే కారణం. వారు శ్రీ జయప్రకాశనారాయణ గారూ, శ్రీ గోపాలస్వామి అయ్యంగార్. ఒకరేమో తను రాజకీయప్రజ్ఞనంతా వినియోగించి, పరిస్థితి తను భుజాలపై వేసిన గురుతర బాధ్యత శ్లాఘనీయంగా నిర్వర్తించారు. జాతీయ పోరాటంలో కాకలుతీరిన వీరుడు జయప్రకాశ్. అటు గాంధీవాదంలోని ధర్మాభిరతీ, అహింసా - యిటు సామ్యవాదంలోని మానవ సౌభ్రాతృత్వం కూలంకషంగా ఆకళించుకున్న వాడు. పార్టీ రాజకీయాలూ, పదవీతృష్ణా- వీటికంటె దేశక్షేమమే ముఖ్యమని ఆచరణలో చూపించినవాడు. గోపాలస్వామి అయ్యంగారికి పరిపాలనా వ్యవహారంలో అపారమైన అనుభవం ఉంది. అధికారం ప్రజాసేవకేకాని స్వార్థంకోసం కాదని నిరూపించిన కొద్దిమంది నాయకుల్లో ఆయనొకరు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో, రైల్వే పనివారల సమ్మె సంఘాషణలు వేరే నాయకులు నడిపివుంటే, అవి ఏ పరిణామాలకి దారితీసి ఉండేవో ఊహించడం కష్టం

ఈ సందర్భంలో భారతసోషలిస్టుపార్టీ కూడా అగ్నిపరీక్షకి గురిఅయింది. పరీక్షలో నెగ్గింది. కాంగ్రెస్‌నుండి సోషలిస్టులు చీలిపోయినప్పుడు, ప్రత్యేకంగా వారిని అభినందించవలసిందేమీ లేకపోయింది. కాంగ్రెస్ సంస్థ యీనాడు దాల్చిన స్వరూపాన్ని గమనిస్తే, దేశాభ్యుదయం వాంఛించేవారు అందులోంచి తప్పుకున్నారంటే ఆశ్చర్యంగాలేదు. తప్పుకున్న తరువాత వారి ప్రణాళిక ఏమిటి అనేదే ప్రశ్న. యింతవరకూ భారత సోషలిస్టులు స్వతంత్రంగా ఏ కార్యక్రమానికీ నాయకత్వం వహించలేదు. మొదటిసారిగా యీ బాధ్యత వహించి కృతకృత్యులయారు. దేశంలోని వామపక్షాలన్నిటిలోకి ఒక్క సోషలిస్టు పార్టీయే భవితవ్యంలో తోడ్పడగలదని స్పష్టమయింది

సమ్మె చెయ్యమని కార్మికులను ప్రోద్బలించడం ఏమంత కష్టంగాదు. దేశంలో ముమ్మరంగా ఆవరించిన అశాంతీ, ఆహారసమస్యా, అధిక చలామణీ, వీటివల్ల ధనికవర్గం తప్ప ప్రజానీకం అంతా దుర్భరమైన జీవితం గడుపు

తున్నారు. ఓర్మికూడా ఒక అంతు అనేది ఉంది ఎటుచూసినా నిరాశ, అంధకారం-యివే కాని ఆశాకిరణలేశమైనా కనబడదు అటువంటప్పుడు పనిముట్లు కింద పడేసి, జీవనానికి ఆసరా చూపించమని కార్మికవర్గం పట్టుపట్టడం సహజం అటువంటి సమయంలో వారికి నాయకత్వం వహించడం అసిధారావ్రతం వంటిది. సమ్మెతోసమస్తకార్యాలూ చక్కపడతాయనుకునేవారు యిప్పట్లో దేశాపకారులే అవుతారు.

రెయిల్వే కార్మికులు భూలోకస్వర్గం అనుభవిస్తున్నారని ఎవరూ అనరు. వారికి సమస్యలు లేకపోలేదు కాని యీనాడు కార్మికవర్గా లన్నిటిలోనూ రెయిల్వే పనివారికి అధిక వేతనాలూ, ఎక్కువ సదుపాయాలూ ఉన్నాయని గ్రహించకపోవడం బుద్ధిపూర్వకమైతే దేశద్రోహం; అజ్ఞానంవల్లనైతే క్షంతవ్యం అసలు సమస్య వేతనాలు అధికం చెయ్యడంవల్ల పరిష్కారం కాదు; వస్తువుల ధరలు తగ్గాలి. సమ్మెలతో నష్టాలవల్ల జీవితావసర వస్తువులకి మరింతకొరత ఏర్పడుతుంది. ధరలు మరింత పెరుగుతాయి. ఈ విషవలయానికి అంతెక్కడ?

రెయిల్వే సమ్మె ఎవరికీ లాభించకపోవడం అటుంచి, భీకరపరిస్థితులకి దారితీస్తుంది అసలే అధ్వానంగా ఉన్న ఆహారపుకొరత మరింత క్లిష్టతరం అవుతుంది. అటువంటి తరుణానికే కాచుకుని ఉండి, దేశాన్ని అరాజకంలో ముంచుదామని ప్రయత్నించే అతివాదులకి తప్ప, ఇంకెవరికీ సమ్మె ఉపయోగించదు. అరాజకంవల్ల, కరువు కాటకాలూ, తత్ఫలితంగా తిండిదోపిడీలూ సంభవిస్తాయి. అతి చాకచక్యం ఉపయోగించి భారతదేశాన్ని ఇంకో బర్మాగానో చైనాగానో మార్చడమే అతివాదులఅభిమతం: అలజడి వారి జీవితం; ఆందోళన వారి రాజకీయాలు. ప్రజానీకం క్షేమం పెదవులతో ఉచ్చరిస్తూ, దేశాన్ని అరాజకం పాలుచేస్తే,విశేషంగా నష్టపడేది ఆ ప్రజలే అని అతివాదులు గ్రహించకపోవడం శోచనీయం

రైల్వే సమ్మెలలో గర్భితమై వున్న ప్రమాదా లన్నిటినీ పాట్నా సమావేశంలో జయప్రకాశ్ వేర్కొన్నాడు. ఈ సంధిఘుడియల్లో ప్రభుత్వం మేల్కొని తన కర్తవ్యాన్ని నిర్వర్తించకపోతే పరిస్థితి విషమిస్తుందని హెచ్చరించాడు నిర్మలమైన ప్రజాస్వామిక విశ్వాసాలు కలవాడు గనక, ఇటు ప్రభుత్వమూ, అటు కార్మికులూ, యిద్దరి కర్తవ్యాలూ స్పష్టీకరించాడు. ఉత్పత్తి అధికం చెయ్యమని కార్మికులను ప్రబోధించడంతో ప్రభుత్వం చేతులు దులుపుకో కూడదు. అధికచలామణీ అరికట్టి, వస్తువుల ధరలు తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. ఉపన్యాసాలవల్లా, ప్రబోధాలవల్లా పరిస్థితులు చక్కబడవు. జయప్రకాశ్ నాయకత్వంక్రింద భారత కార్మికవర్గం ప్రభుత్వంపట్లా, దేశంపట్లా ఔదార్యంగా ప్రవర్తించింది. ప్రజాస్వామికా రెండ విశ్వాసాన్ని ప్రకటించింది. ఈ సదవకాశాన్ని ప్రభుత్వం సరిగా అర్థం చేసుకుని ప్రవర్తించకపోతే, జయప్రకాశ్ చెప్పినట్లు, "ఏది ఎలాఉన్నా, సమ్మెకోసం సమ్మె జరిగితీరాలి" అనేవారిది పైచెయ్యి అవుతుంది. అప్పుడు దేశంలో ప్రజాస్వామికమనేదే ఉండదు.

యథాలాపం ::

ఈ ప్రపంచంలోని చాలా విషాదాల్ని చూసి, మనం చిరునవ్వు నవ్వడం తప్ప యింకేం చెయ్యలేం. అయితే, ఆ చిరునవ్వుకి బుగ్గ మీద సొట్టలు పడవు; ముఖంపై ముడుతలు పడతాయి.—ఓ. డబ్ల్యు. హోమ్స్

జస్టిస్‌పార్టీకి చెందిన కొందరు ప్రముఖ [illegible] గవర్నర్ జనరల్ [illegible] చూపిన అభ్యంతరంపై 'స్వరాజ్య' పత్రిక చేసిన విమర్శలో వ్యతిరేకిస్తూ, 'సీపీ' అనే పేరుతో ఒక [illegible] వ్యక్తం చేశారు. బ్రిటిష్ రాజ్యాంగ పట్టాభిషిక్త రాజు ఏవిధంగా [illegible] విమర్శలకు అతీతుడో — అదేవిధంగా మన గవర్నర్ జనరల్ కూడా గౌరవించబడాలని 'సీపీ' అభిప్రాయం. [illegible] వివేకవంతమైనది. [illegible] రాజ్యాంగబద్ధుడైన రాజు [illegible] ప్రవర్తించవలసిన విధంగా [illegible] గవర్నర్ జనరల్ [illegible] [illegible] 'సీపీ' [illegible] [illegible] రాజు చెయ్యగలడు [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ఆ [illegible] ఎంత హాస్యాస్పదం. [illegible] [illegible] [illegible] వచ్చిన [illegible] [illegible] [illegible] రాజగోపాలాచారి [illegible] హోదాకు [illegible] వ్యక్తి [illegible] [illegible] ఆహారం [illegible] [illegible] తీర్చిదిద్దినట్టు [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] తాత్పర్యాన్ని [illegible] ఆయనకున్న నేర్పు, కేవల మేధాశక్తి ప్రదర్శనకోసం సహజంగా లేకపోవడం, నెమ్మది, నిబ్బరం, అప్లాంబప్రియత్వానికి ప్రాముఖ్యం ఇవ్వగల్గడం— ఇన్ని సామర్థ్యాలు రూపించిన ఆయన గవర్నర్ జనరల్‌గా ఉంటే, అది అవశ్యప్రాయమైన ఎన్నిక అవగలదు. అంతేకాక, మనం పదేపదే నొక్కి వక్కాణిస్తున్న మన ప్రభుత్వపు లౌకిక రాజ్యాంగస్వాతంత్ర్యానికి ఆయన వ్యక్తిత్వం చిహ్నంగా ఉండగలదు.

* * *

శ్రీ రాజగోపాలాచారిగారివి పరిపాలనా దక్షత, ప్రచారానికి పనికివచ్చే ప్రత్యేకశక్తులు. రాజకీయాధికారం కోసం పోరాటం సాగించిన యిన్ని సంవత్సరాలలోను, [illegible] ఆయన అభి[illegible] ప్రభుత్వాధికారం [illegible] తాను ఉత్తమమని నమ్మిన మార్గాన ప్రణాళికలు నిర్మించారు. హోదా కాని అధికారం లేని గవర్నర్ జనరల్ పదవివల్ల ఆయన [illegible] స్వప్నం భగ్నమైంది. [illegible] వ్యక్తిగత [illegible] గాని ఆ [illegible] లేదు. [illegible] [illegible] [illegible] సంతోషంగా స్వీకరించవలసి వచ్చింది. [illegible] స్థానం [illegible] ఉన్న [illegible] [illegible] ఒక నిర్లిప్త [illegible] ఆయనకు తెలుసు. కాని సదా [illegible] [illegible] ఆధ్యాత్మిక [illegible] ఆయనను [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ఆయన [illegible] రాజకీయవేత్త స్థానం ఆయన [illegible] ఎన్నికల [illegible] క్షేత్రాల నమునిస్తాయి. [illegible] అపారమైన [illegible] [illegible] మునిసిపల్ మేయరు ఎన్నికలలో గెలిస్తే అభినందనలు పంపించే సాధారణ [illegible] ఆపుకో లేకపోయాడు.

తా నాక్రమించిన ఉన్నతస్థానంవల్ల బహిరంగ ప్రదర్శనకి వీలులేని ఆయనలోని సుహృద్భావం, నేడు ప్రతీకారరూపం దాల్చి ఉండవచ్చు. తత్ఫలితంగానే, తాను ప్రతిఘటించిన ప్రముఖ-కాంగ్రెస్ ప్రతికక్షులకు నేడు ఆయన, ఉపకారాలు చెయ్యడానికి పదేపదే ప్రయత్నించవచ్చు. ఇలా ఉపకారాలు పొందినవారి గతకాలపు ప్రవర్తన (బ్రిటిష్ వారి పక్షాన ఉండటం) సమర్థించడానికి పూనుకున్న విశేషరీతి 'సాసి' వాదం అసలు పరిస్థితికే అపార్థం కల్పిస్తుంది. దేశం దాస్యంలో ఉన్నపుడు కాంగ్రెస్ వారికీ ఇతరులకూ ఉన్న సంబంధాన్ని తేలికగా తీసుకుని, ఆవ్యక్తులపట్ల యిప్పుడు కూడా అలాగే ప్రవర్తించమని ఎవరూ అనరు. దేశానికి లభించిన స్వాతంత్ర్యంలో అందరికీ భాగం ఉంది. అయితే, కులతత్వవాదులు మాత్రం యీ ఔదార్యానికి అర్హులుకారు. కులతత్వవాదం స్వాతంత్ర్యరక్షణకే ముప్పు. ఎచ్చుతగ్గులు లేకుండా అందరినీ సమదృష్టితో చూడాలనే సూత్రం కులతత్వవాదులు అంగీకరించరు. ద్వేషపూరితమైన తత్వాన్ని ప్రబోధించే వీరు, బహిరంగంగా 'నల్ల కాకుల' పార్టీకి చెందినా, రహస్యంగా కాంగ్రెస్ ముసుగు వేసుకుని ప్రచారం చేసినా—వీరి చర్యలు రాజ్యక్షేమానికే ముప్పు తెచ్చి, ఐకమత్యాన్ని భగ్నపరుస్తాయి. ఇటువంటి పేరెన్నికగన్న కులతత్వవాదుల్ని ఎన్నో ప్రముఖ స్థానాల్లో ఉంచేందుకు గవర్నర్ జనరల్ ప్రయత్నించడమే దురదృష్టం. ఆ ప్రయత్నమే యీ పత్రికలో విమర్శించబడింది.

* * *

దేశభక్త శ్రీ కొండా వెంకటప్పయ్యగారి ఎనభైవ జన్మదినోత్సవం యీ వారంలో జరిగింది. వార్థక్యంవల్ల జవసత్వాలు తగ్గి ఆయన విశ్రాంతి తీసుకోవలసి వచ్చినంత వరకూ, ఆంధ్రదేశపు ప్రజాహిత జీవితంలో ఆయన ఒక అనన్యమైన నాయకుడు. బీహార్ లోని రాజేంద్రబాబు, గుజరాత్ లోని సర్దార్ పటేల్, తమిళనాడులోని రాజగోపాలాచారి—వీరి వలె, ఆంధ్రనాయకులెవరూ గాంధీజీ హృదయానికి దగ్గరగా వెళ్ళి ఆయన విశ్వాసాన్ని చూరగొనే అదృష్టానికి నోచుకోలేదు. దేశభక్త వెంకటప్పయ్య ఒక్కరే అది సాధించగల్గారు. అయితే మహాత్ముని ఆదరణలో ఉన్న రాజకీయపు విలువను తేలికగా తీసుకుని, తన పలుకుబడిద్వారా రాష్ట్ర నాయకత్వం అందుకునే మార్గంలో దేశభక్తుడు కృతకృత్యుడు కాలేదు. కారణం అందుకు కావలసిన దారుఢ్యం, కార్యదీక్ష, కూడకట్టుకునే చాతుర్యం ఆయనలో లోపించడమే. గాంధీజీ విధించిన సహాయనిరాకరణ సూత్రాన్ని పాటించడమే కాక, ఎక్కువగా ఆయన చేసిన కృషి రాజకీయేతర - సాంఘిక ధార్మిక రంగాలకి చెందినది. అదైనా నిష్క్రియమైనది కాదు. తీవ్రమైన ముక్కోపితనానికి అప్పుడప్పుడు లొంగిపోయే స్వభావం ఆయనది. అయినా, అనంతరం ఆత్మపశ్చాత్తాపం పడి, కోపానికి గురి అయినవారి అసంతృప్తి తొలగించగలిగే శక్తికూడా ఉంది. ప్రదేశ్ కాంగ్రెస్‌కి చెందిన నాయకత్వం సాధించలేకపోయాడంటే, అందు కవసరమైన కట్టుదిట్టతనం లోపించినందువల్లనే. దేశభక్తిపూరితుడైన దయాస్వభావుడుగా, సత్యప్రేమికుడుగా ఆయన ప్రజాహృదయంలో నిలుస్తారు.—(సాకా)



చైతన్యం గల సంఘంలో అభిప్రాయ భేదాలుండడం సహజం. వాటిని పరిష్కరించగల శక్తిసామర్థ్యాలు కలిగి ఉండడం సుసంఘటితమైన సమాజానికి గుర్తు. నేడు మనమంతా కలిసి కూర్చుని ఏకకంఠంతో మాట్లాడి సమిష్టిగా వ్యవహరించుకోగలమని మన కాంగ్రెసునుగూర్చి మనం చెప్పుకునే స్థితిలో ఉన్నామా? మన నియమావళిని మనం ఉల్లంఘించడంలేదనీ, మనం ఏర్పాటు చేసుకున్న సూత్రాల కనుగుణంగా వ్యవహరిస్తున్నామని మనం అనగలమా?—

—డాక్టర్ పట్టాభి.



హిందూ ధర్మాదాయాల చట్టం



టి. జె. ఆర్.

ప్రజాస్వామిక యుగంలో ఏ శాసనమైనా, ముఖ్యంగా మత సంబంధమైన శాసనం చెయ్యడానికి ప్రజల సానుభూతి ఉండాలి. ఒకవేళ ప్రజల సానుభూతిలేని శాసనంచేస్తే అది నిష్ప్రయోజనంగా పరిణమిస్తుంది. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా శాసన సభ్యులు శాసనాలుచేస్తే వారు తిరిగి ఎన్నుకోబడరు. అందుచేతనే ఎన్నికలకు ముందు వివిధ పార్టీలవారు తమ ప్రణాళికలను వివరిస్తూ ప్రకటనలుచేస్తారు. ఏపార్టీ ఎన్నిక ప్రణాళిక ప్రజలను నచ్చుతుందో ఆపార్టీ అధిక సంఖ్యాబలంతో ఎన్నిక కాబడుతుంది. కాని శాసనసభలో అధికసంఖ్యాబలం గలపార్టీ ఏదైనా శాసనం చెయ్యబోయేముందు తమపార్టీ ఎన్నికల ప్రణాళికలలో ఈవిషయం పొందుపరచిందో లేదో యోచించవలసివుంది. అమెరికాలో మద్యపాన నిషేధచట్టం జయప్రదం కాకపోడానికి కారణం ప్రభుత్వ శాసనంపై ప్రజాసానుభూతి లేకపోవడమే. అయితే శాసనసభ్యులు తమ ఎన్నికల ప్రణాళికలదృష్ట్యానే శాసనాలు చెయ్యాలనే కట్టుబాటులేదు. తమ యిష్టంవచ్చిన శాసనం చేసే హక్కు వారికుంది. తమ శాసనానికి ప్రజాసానుభూతి ఎంతఉందో అంతవరకే ఆ శాసనం సఫలం అవుతుంది. రాజకీయ శాసనాలకున్న ప్రజాప్రతిఘటన వెంటనే ప్రకటితంకాదు. దీనికి కారణం ఆ శాసనఫలితం తుదకెల్లా పరిణమించినా ప్రస్తుతానికి సామాన్యవ్యక్తి జీవితకంఠాలలో మార్పు కల్పించకపోవడమే. ఆ రాజకీయశాసనపు ఫలితం చెడుగా ఉన్నపుడు ప్రజాప్రతిఘటన తప్పకుండా బయలుదేరి తీరుతుంది. రాజకీయ శాసనాలకంటే ఆర్థికశాసనాలు ప్రజల మనసులలో మొదటిస్థానాన్ని ఆక్రమించుకుంటాయి. ప్రజల నిత్యకృత్యాలలో వెంటనే ఈ శాసనంద్వారా నూతనత్వం పరిణమించడమే దీనికి కారణం. వీటన్నిటికంటె మతసంబంధమైన శాసనాలు ప్రజల విమర్శలకు మరీ గురౌతాయి. అనాదిసిద్ధంగా వంశపారంపర్యంగా వస్తున్న సాంప్రదాయాలు ఆచారాలు అమాంతంగా మారడాన్ని సామాన్యుడు సహించడు. సాంప్రదాయాలు ప్రాతిపదికగా పెట్టుకు బ్రతికే హిందూదేశంవంటి దేశంలో మత సంబంధమైన శాసనాలు చెయ్యడం చాలా కష్టం. మతం మారడానికి ఒప్పుకొనుటకంటె ప్రాణపోకడకైనా ఒప్పుకొనేవారు అనేకమంది ఉన్నారు. కాని గతశతాబ్దాల చరిత్ర చూచుకుంటూవస్తే అన్నిరంగాలతో పాటు మతరంగం కూడా మారుకుంటూ వస్తోందనే చెప్పాలి. ఈ మార్పు మన దేశాన్ని ముందుకు తీసికెడుతోందో, వెనుకకు తీసికొనిపోతోందో నిర్ణయించవలసింది దాని ఫలితాలే. ఒకానొకప్పుడు మన తెలుగుగడ్డపై విధవా వివాహాలు చెయ్యడానికి వీరేశలింగంగారు చాలా శ్రమపడ్డారు, కాని నేడు విధవావివాహాలకు సంఘంలో అంతగా ప్రతిఘటన ఉండటంలేదు. అల్లాగే పూర్వం రజస్వలానంతరవివాహాలు జరుగనిచ్చేవారు కారు. చిన్నపిల్లల వివాహాలు నిరోధిస్తూ చేయబడ్డ శారదాచట్టం ఎంతోమందిచే విమర్శించబడింది. 'అష్టవర్షాత్ భవేత్కన్యా' అనే మత సాంప్రదాయాలకు భంగం కలుగుతోందని విమర్శించారు. కాని నేడు జరుగుతున్న వివాహాలలో నూటికి తొంబది తొమ్మిది వంతులు రజస్వలానంతర వివాహాలే. ఇటులనే నేడు జంతు బలినిషేధ చట్టం, బహుపత్నీనిషేధం, విడాకులచట్టం మున్నగునవి అనేకం చెయ్యబడుతున్నాయి.

హిందూమతానికి ఆయువుపట్టుగా దేవాలయాలు, మఠాలు వ్యవహరిస్తున్నాయి. ఇవి వెనుక విద్యాసంస్థలుగా కూడ వ్యవహరించాయి. వీటికి విశేషధనం, స్థిరాస్తి ఏర్పాటుచేసి విద్యాదానం, అన్నదానం చేయిస్తూవచ్చారు. ఒకానొకప్పుడు ఈ సంస్థల నిర్వాహకులు ఉదాత్తంగా, స్వార్థంలేకుండా వర్తించారు. రానురాను ధనం ఈ పవిత్ర సంస్థలలోగూడ దుర్మార్గతను మప్పింది. తమ స్వార్థరాహిత్యానికి స్వస్తిచెప్పి నిర్వాహకులు ఆస్తిని దుర్వినియోగం చేస్తూవచ్చారు. కొందరు సంస్థల ఆస్తిని పూర్తిగా ధ్వంసంచేసి

వాటి స్థాపనోద్దేశ్యాలనే భంగపరిచారు. మనం ఇప్పుడు చెప్పినట్లు ఈ పవిత్ర సంస్థలు అవినీతి స్థావరాలుగా పరిణమించాయి. కంపెనీవారి పాలనలో ఈ దుర్మార్గతను సహించలేక కొన్ని దేవాలయాలను స్వాధీనపరచుకోవడం జరిగింది. కాని అన్యమతాలలో కంపెనీ పాలకులు జోక్యం కలుగచేసికోరాదనే కారణాన్ని బట్టి దేవాలయాల నిర్వహణ ట్రస్టీల చేతిలోనికిపోయింది. ప్రభుత్వం ఈ సంస్థలవిషయాలలో జోక్యం కల్పించుకొని వాటి నిర్వాహణలోని అవినీతిని తొలగించాలనే ప్రచారం జరుగుతునే వచ్చింది. మొట్ట మొదటి సారిగా 1927 లో పానగల్లు రాజాగారు హిందూ ధర్మాదాయాల చట్టం చేసి మత సంస్థలలో ప్రభుత్వానికి ప్రవేశం కలుగచేశారు.

హిందూధర్మాదాయాల బోర్డు స్థాపించబడింది. ఈ బోర్డుకు ధర్మకర్తలకు సూచన చేసే అధికారమేగాని, అమలు జరిపే అధికారం లేదు. అందుచేత వ్యాఖ్యానాలు పెరిగాయి. ఆబోర్డు రద్దుపరచి ప్రభుత్వమే అధికారం స్వీకరించాలనే దృష్టితో ప్రస్తుత చట్టం తయారు చెయ్యబడింది. మఠాధిపతులకు భౌతిక దృష్టి తొలగించి ఆధ్యాత్మిక చింతన కలుగ చెయ్యడమే ఈ చట్టపు ముఖ్యోద్దేశం. ప్రధానిగారు చెప్పినట్లు నేను వందలకొలది లక్షల వరకు దైవం సొత్తు ట్రస్టీలు దుర్వినియోగం చేసిన కేసులు అనేకం ఉన్నాయంటే ఈబిల్లు చెయ్యవలసిన అగత్యం అగుపిస్తుంది. ఆ విధంగా ప్రభుత్వం జోక్యం కలుగచేసుకోవడం ఆ సంస్థల క్షేమదృష్ట్యా అనే చెప్పవలసివస్తుంది. ఈ బిల్లుపై బయల్దేరిన విమర్శలు ముఖ్యంగా మూడు. ఒకటి, ఈ సంస్థల కార్యాలు నిర్వర్తించడానికి ప్రభుత్వానికి తగిన సిబ్బంది ఉన్నదా? అన్నది. ప్రభుత్వానికి కావలసిన సిబ్బంది ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది. అసలు కావలసిన ప్రశ్న ప్రభుత్వానికి తగిన సిబ్బంది ఉన్నదా, లేదా అన్నది కాదు. ప్రభుత్వం ఈ సంస్థల యాజమాన్యాన్ని తీసికొని సక్రమంగా నిర్వర్తించకలదా? ట్రస్టీలలో ప్రబలిన అవినీతి ప్రభుత్వోద్యోగులలో ప్రబలకుండా ఎలాంటిచర్య తీసికొంటుంది?- అన్నవే అసలుప్రశ్నలు. కక్షలకు లోనుకాకుండా ఈసిబ్బంది పని చెయ్యాలి. అట్టి సిబ్బందిని ప్రభుత్వం నిర్మించ కలిగితే ఈ సంస్థలను ప్రభుత్వం వశపరచుకోడానికి ఆటంకం ఉండదు. తదనుగుణంగా సెలక్టు కమిటీ బిల్లు మార్చవలసివుంది. రెండు, ఈబిల్లు రాజ్యాంగ చట్టానికి భంగకరము - రాజ్యాంగ చట్టములో నిర్వచించబడి వున్న ప్రాథమిక సూత్రములకు హక్కులకు భంగకరంగా ధర్మాదాయాలను ప్రభుత్వం తీసికొనవచ్చునా? చెన్నరాష్ట్ర ప్రభుత్వం ఈశాసనం చెయ్యబూనడం సర్వస్వతంత్రమైన రాజ్యాంగ పరిషత్తువే ఆమోదించబడ్డ ప్రాథమిక సూత్రాలకు భిన్నంగా వర్తించడమే. ప్రాథమిక హక్కులలో 20 వ సూత్రంలో ప్రతి మతవర్గానికి తమ శాఖాభివృద్ధి నిమిత్తం సంపాదించుకొని నిర్వహించుకొనుటకు హక్కు ఉన్నది. ఈ విమర్శ చాలా ఆలోచింపదగ్గదే. ఇండియా ప్రభుత్వచట్టం 13 వ సూత్రం ప్రకారం దానాలు గాని దానధర్మాలు, మత సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వాలకు శాసనం చేసేహక్కు ఉంది. ప్రస్తుతం చెయ్యబడుతున్న బిల్లు మత ప్రచారానికి ఉద్దేశింపబడింది కాదు. కాని శ్రీ వైద్యనాథయ్యగారు చెప్పినట్లు ఇప్పుడు ప్రాథమికహక్కులు వర్తింపబడేవి కాబట్టి ఈ బిల్లులోని సెక్షనులు ఎంతవరకు న్యాయపరీక్షకు నిలువగలవో చూడవలసి ఉన్నది. అడ్వొకేటు జనరలు గారి అభిప్రాయ ప్రకటనలో నూతనరాజ్యాంగ దృష్ట్యా ఈబిల్లు పూర్తిగా నిరాకరింపదగినది కాదు అన్నారు. అంటే అక్కడక్కడ నిరాకరించడానికి వీల్లున్నాయన్న మాట. అటువంటి సెక్షన్లను సెలెక్టుకమిటీలో తొలగించి రాజ్యాంగచట్టానికి అనుగుణంగా సవరించవలసివుంది. ఇక మూడవ విమర్శ- ఈబిల్లు ప్రజాభిప్రాయానికి పంపబడలేదని- ఈ విమర్శకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదు. ఎంతో కాలంగా జరుగుతు వస్తున్న వ్యవహారాలను అంత తొందరగా ఎవరో తరుముకు వస్తున్నట్లు మార్చబోవడం విపరీతంగా కన్పడుతుంది. అంతగా ముఖ్యం అని తోస్తే వెనుక నిర్మించబడ్డ బోర్డునకే కొన్ని విశేష అధికారాలు సంక్రమింపచేసి ప్రస్తుతపు బిల్లును ప్రజాభిప్రాయానికి పంపవచ్చును. ప్రజలంతా ఈ బిల్లునకు సుముఖులుగా ఉంటారనేమాట నిజమైనా, తగినట్లుగా ప్రజాభిప్రాయం తీసుకొనబడలేదనే నింద ప్రభుత్వం సహించకూడదు.

ఎవరు అభివృద్ధి నిరోధకులు ?

కిందటి సంచికలో 'అభివృద్ధి నిరోధకులెవరు ?' అనే శీర్షికతో సామిశ్రేని సావిత్రీదేవిగారు ప్రకటించిన వ్యాసం నాకు సమగ్రంగా అర్థం కాలేదు. ఆమె చెప్పదలచుకున్నదంతా చెప్పారో లేదో అని నాకు సందేహంగా ఉంది. 'ఇంటల జీవిత విధానంలో మార్పు తెచ్చే ఏ పని చెయ్యడానికైనా ప్రకృతి సూత్రాల మీద ఆధారపడ [illegible]డను. ప్రకృతి సూత్రాలను గురించి ఇదమిత్థమని తేల్చి చెప్పడం కష్టం. కనుక రాబోయే కాలంలో వాటిని క్రమానుగతంగా తెలుసుకునే [illegible] తాలే ప్రాప్తిస్తాయి'. ఇటువంటి వాక్యాలు ఇంకా వివరించి ఉంటే బాగుండేది.

'మానవుడు కేవలం ఆర్థిక సూత్రాల (సిద్ధాంతాల?) మీద మాత్రమే [illegible] ప్రగతిని. అనుభవాలు, [illegible] వెల్లడించాలని కట్టుబడితే [illegible] నవ వైజ్ఞానిక శాస్త్రీయ [illegible] సత్యాన్ని గుర్తించి అంగీకరించాలి. లేకపోతే 'అభివృద్ధి నిరోధకులవుతారు,' అన్నారు సావిత్రీదేవిగారు.

'సాంఘిక సంబంధాలకు ప్రధానకేంద్రం [illegible] కాకపోవచ్చు.' అన్నారు.

మార్క్సు సిద్ధాంతాలలో [illegible] ప్రశ్నలూ వేసుకున్నారు. '[illegible] ఆర్థిక సూత్రాలమీదే [illegible]? [illegible] ఉన్నవి వర్గసంబంధాలేనా?'

ఇటువంటి ప్రశ్నలు [illegible] ప్రశ్నలే కాని [illegible]. 'కేవలమూ [illegible] ఆహారం [illegible] మనిషి [illegible] బతుకుతాడా? [illegible] ఆహారం ప్రధానమైనది [illegible] అనవచ్చు. [illegible] మనిషి మిగిలిన [illegible] చెప్పవచ్చు. [illegible] తిన్నంత మాత్రాన మూగవాడుగా, మూర్ఖుడుగా, గుడ్డివాడుగా ఉండడని ఎవరూ అనరు.

మంచి మార్క్సిస్టులైన కళా చరిత్ర ప్రొఫెసరు హాల్డేను, 'ఏదైనా సాంఘిక సంఘటన జరిగితే దానికి కారణం పదింట తొమ్మిదివంతులు ఆర్థికమై ఉంటుందని మార్క్సిస్టులు నమ్ముతారు' అన్నారు.

మనిషి ప్రతిక్షణమూ ఆర్థిక కారణాల చేతనే ప్రేరేపించబడతాడని ఎవరూ చెప్పరు. ఎవరైనా చెప్పగలిగిందేమిటంటే ఆర్థిక ప్రేరణల చేత మనుషులు చేసే పనులే సాంఘిక వ్యవహారాన్ని అధికంగా నిర్ణయిస్తాయని. మనుషులు బతకడానికి గాలీ, నీరూ కూడా ఆహారం కంటె అధికంగా అవసరం. కాని మనుషుల బతుకు సమస్య అధికంగా [illegible] ఆహారపదార్థాలమీదనే ఆధారపడి ఉంటుంది.

మనుష్యులను నిత్యజీవితంలో ప్రేరేపించే [illegible]మూ, విశ్వాసాలూ, కామమూ, అహంకారమూ మొదలైన వాటన్నిటిమీదా డబ్బు సవారీ చేస్తున్నదని గ్రహించలేని వాళ్లు అనుభవం లేని వాళ్లే.

ఈ [illegible] విశ్వాసాన్ని ప్రతిఘటించేవారు ఒకటి [illegible] 'మధ్యతరగతిలో పుట్టి, [illegible] ఉన్నవాళ్లు కూడా శ్రామిక [illegible] ఎలా [illegible] జరుగుతుంది? కొందరు [illegible], శాస్త్రవేత్తలూ ధనిక వర్గాలను ఎదిరించడం ఎలా జరుగుతుంది?'

[illegible] అనుకున్నారు. ఒకటి [illegible]. మరొకటి [illegible]. ఉన్న వర్గ [illegible] [illegible] దానిని [illegible] స్పష్టంగా చూడలేని వీలవుతుంది. అసలు తీవ్రమైన వర్గ [illegible] ఉన్న దశలో డబ్బుకు సంబంధం లేనట్టు కనపడే [illegible] కూడా వర్గవ్యత్యాసాలు తెలుస్తాయి. [illegible] నిరోధించే వర్గాలకళలూ, మతమూ, శాస్త్రమూ ఒకపక్క, [illegible] సాధించే [illegible] కళలూ, మతమూ, శాస్త్రమూ మరోపక్క చేరి సంఘర్షణ సాగిస్తాయి.



ఇది ఇవాళ కనిపెట్టిన సత్యంకాదు. 'ధన మూల మిదం జగత్', అనేమాట చాలాకాలంగా అమలులో ఉంది. 'యస్యాస్తి విత్తం' అనే శ్లోకం కూడా చాలా పాతదే.

స్వంతవ్యవహారాలలో — భార్యా పిల్లలతో వ్యవహరించటంలో, పుస్తకాలు కొని చదవటంలో, సినిమాలు చూడటంలో—'ఆర్థిక' తత్వం ఏదీ కనబరచనివాడు కూడా, తనకింత రాబడి ఉన్నప్పుడు సంఘంలో ఉన్న వర్గసంబంధాలనూ, ఆర్థిక వ్యవస్థనూ 'తాత్వికంగా' బలపరుస్తాడు. ఆ మనిషినే సంఘంలో మార్పు తీసుకురావటానికి పాటుపడమంటే, 'నేను ఎద్దుప్రక్క పొడుచుకునేవాణ్ణి(లేదా వ్యాపారం చేసుకునేవాణ్ణి, లేదా ఉద్యోగం చేసుకునేవాణ్ణి) నాకీ గొడవలెందుకు?' అంటాడు.

ఇవాళ పరిస్థితి తీసుకుందాం. ధనికవర్గం ఉంది. సమస్త సాంఘిక అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి ఆవర్గం సర్వయత్నాలూ చేస్తోంది. ఈ ప్రయత్నం నైపుణ్యంతో సాగించే దక్షతా, ఫలితాన్ని సాధించే సమస్తశక్తులూ దాని చేతిలోనే ఉన్నాయి. కాని ఈవర్గాన్ని ప్రేరేపించేది డబ్బే, లాభాలే. కొన్ని 'ఆర్థికసూత్రాలను' బలపరచకపోతే వారి ఉనికికే ముప్పు వస్తుంది. సొంత లాభాలకు ఆటంకం రానంతవరకూ వారు దేశభక్తి లగాయతు వితరణవరకూ అన్నీ అవలంబిస్తారు. కాని వీరి నెదుర్కొనేవారు కొన్ని ఆర్థిక సిద్ధాంతాలమీద విప్లవం తీసుకు రావటానికి ప్రయత్నిస్తామనేసరికి కొందరు 'వైజ్ఞానికులకు' కుడుతుంది. 'ఇది ఫాసిజం' అని గోలెత్తేస్తారు.

నన్నడిగితే, 'నేను ఫలాని ఆర్థిక సిద్ధాంతాల మీద ప్రపంచాన్ని మారుస్తాను,' అన్నవాడు ఏం చేస్తాడో స్పష్టంగా ఊహించుకోవచ్చును. ఏసత్యాహింసలమీదనో సాంఘికపరిణామం సాధిస్తామంటే వాళ్లు ఎవరిని తుపాకులతో కాల్చిచంపటం సమర్థించబోతారో ఊహించటం కష్టం. హిందూమతాన్ని పునరుద్ధరించటానికి నడుములు బిగించిన నలుగురైదుగురు యువకులు బొంబాయి రాత్రిలో ఒక హిందువుడి ఇంట ముస్లిము దుస్తులతో ప్రవేశించి చోరీ చేశారు. ఇది హిందూమతాన్ని పునరుద్ధరించే ప్రక్రియ కాదనటానికికూడా మనకి ఆధారం లేదు.

'విప్లవాలవల్ల నిరోధాలుపోయి అభివృద్ధి నిరాటంకంగా సాధ్యం కాలేదు,' అని సావిత్రి దేవిగారంటున్నారు. కొన్ని నియమితమైన ఆటంకాలు అభివృద్ధి నిరోధకంగా ఉంటాయనీ, అవి పోగానే అభివృద్ధి నిరాటకంగా సాగిపోతుందనీ అనుకోవలసిన అవసరం ఏమీలేదు. సాంఘిక పరిణామంలో అడుగడుగునా ఆటంకాలు ఉత్పత్తి అవుతూనే ఉంటాయి, విప్లవ చర్యలవల్ల తొలగిపోతూంటాయి.

అభివృద్ధినిరోధకంగా ఉండే అంశాలెన్నయినా చూడవచ్చు. ప్రజల మూఢ విశ్వాసాలూ, అజ్ఞానమూ, ఆర్థికవ్యత్యాసాలూ, వర్గదోపిడీ, కృత్రిమ క్షామలూ, నాటకాలూ—ఎన్నయినా ఉన్నాయి. కాని సంఘంలో ఉండే ఆర్థికవ్యవస్థను మార్చకుండా ఈ ఆటంకాలను ఎవరూ తొలగించలేరు. అది సాధ్యమని ఎవరన్నా భావిస్తే ప్రయత్నించేసి చూడవచ్చు. 'నిండా మునిగినవాడికి చలేమిటి?' సంఘాన్ని మారుస్తామంటే లేనివాడా ఉన్నవాడా అభ్యంతరం చెప్పేది?



తత్కాలవిధానాలతో ఆహారసమస్య తీరదు





రావెళ్ల హనుమంతరావు

భారతదేశము రత్నగర్భ యని, పాడిపంటలకు, భోగభాగ్యములకు, సిరిసంపదలకు పుట్టినిల్లని సకల సౌఖ్యానందముల కాలవాలమని మన మాతృదేశముయొక్క ప్రాచీనపు ఔన్నత్యాన్ని కీర్తిస్తాం.

ఆసేతు హిమాచల పర్యంతంగల విశాల భూభాగాన్ని, సారవంతము-ఫలవంతమైనట్టి పంట ప్రదేశాలను, నురుగులు గక్కుచూ పరుగులెత్తే మహానదులను, ఖనిజసంపదలగూర్చి పెద్దగా చెప్పుకుంటాం.

ఇవన్నీ వేదికలమీద ఉపన్యాసము లిచ్చేటప్పుడు, పుస్తకాలు-పత్రికలు వ్రాసేటప్పుడు ఉపయోగించే ఊతపదాలుగా మాత్రమే తయారై పోయాయి.

ఈరోజు ఆచరణలో జరుగుతూన్న దేమిటి? కన్నులకు ప్రత్యక్షంగా కనుపించుతూన్న దేమిటి?

తినేందుకు తిండిలేక లక్షలకొలది ప్రజలు పొట్ట చేతపట్టుకొని, అంగో లక్ష్మణా అంటూ, పట్టెడు 'తిరిపెము' కోసరం పల్లెపల్లెకు తిరిగి ప్రదక్షిణాలు చేస్తూన్నారు. మలబారులో- ఆంధ్రలో- గుజరాతులో ఎక్కడజూసినా కరువు.

దీన్ని పరిష్కరించటం కొరకే ఢిల్లీలో ఉన్న మంత్రులు తల్లడిల్లిపోతున్నారు. పార్లమెంటు సభ్యులు ప్రశ్నలపై ప్రశ్నలు వేస్తూంటే సమాధానాలు చెప్పలేక నీళ్ల నములుతూన్నారు. గట్టిగా అడిగితే కాంగ్రెసు అధికారం జూపించి గదమాయించుతున్నారు.

గత సంవత్సరము భారతదేశము ఇతర దేశాల నుండి ముప్పైలక్షల టన్నుల బియ్యము దిగుమతి చేసుకుంటే యీసంవత్సరము నలభై లక్షల టన్నుల ఆహారము దిగుమతి చేసుకోవలసి వచ్చినదని ఆహారశాఖామంత్రి శ్రీ జయరామ్‌దాస్ దౌలత్ రామ్ చెప్పినపుడు పార్లమెంటు సభ్యులు నివ్వెరబోయారు.

నానాటికి విషమించుచున్న ఆహారసమస్యను శాశ్వతంగా పరిష్కరించటానికి అనేక మార్గాలను సూచించారు. ఇది క్రొత్తగాదు గత సంవత్సరము ముప్పైలక్షల టన్నుల ఆహారము అవసరము అనుకున్నపుడు, అనేక మార్గాలు ఆలోచించారు. అనేక ప్లానులు వేశారు. సంవత్సరం తిరిగొచ్చింది. ఆలోచించిన మార్గాలు అల్లాగే వున్నాయి. వేసిన ప్లానులు కాగితాలుమీదనే వుండిపోయాయి. మన ఆహారసమస్య యథాప్రకారం ప్రత్యక్షమైంది. 'ఎక్కడున్నావు కంబళీ- అంటే వేసినచోటనే వున్నా' నన్నట్లు వుంది.

ఈ సంవత్సరం ప్రపంచమంతటా అన్ని దేశాలలోనూ పంటలు పుష్కలంగా పండినాయని వార్తలు. మనదేశములో మాత్రము పంటలు కరువై పోయాయి.

కారణమేమిటి? మనదేశాన్ని పరిపాలించుతూన్నది విదేశీయ ప్రభుత్వమా? కాదు! దోపిడీ విధానమవలంబించే సామ్రాజ్యవాదప్రభుత్వమా? కాదు. అయినప్పుడు ఏటేటా విడువకుండగా యీ కరువు- కాటకాలు రావటానికి కారణమేమిటి? ఇది మన అసమర్థతని చెప్పకతప్పదు. ప్రభుత్వం ఒప్పుకోకతప్పదు.

ఇంతకుపూర్వము కరువు కాటకాలు వచ్చినపుడు వీటన్నిటికి కారణం—బాధ్యత విదేశీయ ప్రభుత్వముదేనని చెప్పేవాళ్ళము. మనము ఉపన్యాసవేదికలమీద నెక్కి మాట్లాడుతూ కరువు-కాటకాలకు, అంటురోగాలకు అన్నిటికి కారణం విదేశీయ సామ్రాజ్యవాద ప్రభుత్వమేనని చెబుతూ గంభీరోపన్యాసములిస్తూంటే వేలకొలది ప్రజలు ఔనంటూ తలలూపేవాళ్లు. బ్రిటిషు ఇంపీ[illegible]లిజం నశించాలని కేకలేసేవాళ్ళు.

బ్రిటిషు ఇంపీరియలిజం మనదేశంనుండి వెళ్ళిపోయింది. మన స్వతంత్ర భారతదేశాన్ని మన జాతీయ నాయకులే పరిపాలిస్తున్నారు. అయినా కరువు, కాటకాలు మాత్రం మన దేశంనుండి వెళ్ళిపోలేదు...

దీనికి ప్రభుత్వాధికారంలోనున్న జాతీయ నాయకులు సమాధానం చెప్పవలసివుంటుంది. 'మనకు స్వతంత్రంవచ్చి పట్టుమని పదేళ్ళైనా కాలేదు. అప్పుడే అదిచేయలేదు, ఇది చేయలేదు' ఆహార సమస్యను పరిష్కరించలేదంటే మేమేమి చెబుతాం. ఆగండి. ఓర్పుపట్టండి. చిన్న శిశువు జన్మించగానే పెద్దదవుతుందా? ఎంతో శ్రమపడి పోషణచేస్తేనేగాని ఆ శిశువు పెరిగి పెద్దదికాదు. గదా? అట్లాగే మేముకూడా స్వరాజ్య మనే శిశువును పెంచుతున్నాము. ఇంతలోనే కాశ్మీరు గందరగోళం వచ్చింది. హైదరాబాదు హడావిడి వచ్చింది. వీటన్నిటిని సర్దుకోలేక మేము క్రుంగిపోతూన్నా' మంటూ మన నాయకులు మహోపన్యాసా లిస్తారు.

ఈ ఉపన్యాసాలవల్ల, పత్రికలు చదవటంవల్ల ప్రజలకు కడుపు నిండదు. ఆకలి బాధకు గురై అలమటించిపోతూన్న ప్రజలకు ధర్మోపన్యాసములు చెవికెక్కవు. వారికున్నది ఆకలిమంట. వారి కడుపుకు కావలసింది పట్టెడు మెతుకులు. ముందు అది చూస్తే తరువాత ఏదిచెప్పినా వింటారు. దేశంకోసం ఏది చేయమన్నా చేస్తారు.

ప్రభుత్వాన్ని పరిపాలించటానికి కొత్త-పాతలేవు. 1938 నుంచి 1940 వరకు రాష్ట్రాల్లో కాంగ్రెసు మంత్రివర్గాలు పనిచేశాయి. తిరిగి నాలుగు సంవత్సరాలనుంచి రాష్ట్రాధికారాలు కాంగ్రెసునాయకుల చేతుల్లోకి వచ్చాయి. కేంద్రాధికారము, సంపూర్ణ స్వాతంత్ర్యము వచ్చి రెండు సంవత్సరాలు ఐంది. ఇంతకు ముందు ఇరవై సంవత్సరాలనుంచి స్వతంత్రభారతదేశంలో ప్రభుత్వం ఎలావుండాలో వేదికల మీదనెక్కి ఉపన్యాసా లివ్వటం - మీటింగులు జరిపి తీర్మానాలు చేయటం - నేషనల్ ప్లానింగు కమిటీ ద్వారా ప్లానులు తయారు చేయటం జరిగింది.

ఇంత అనుభవం గల నాయకులు ప్రభుత్వాధికారంలోకి రావటం తమకు క్రొత్తని చెప్పటం తగదు. చెప్పినా ప్రజలు నమ్మరు. నాయకులు అనాడు చేసిన ధర్మోపన్యాసాలు మరిచిపోయారు. నీతి వాక్యములు విస్మరించారు. అశేషంగావున్న ప్రజాసామాన్యంకై పాటుపడటం వదలుకున్నారు. ప్రజాసేవ చేయటమంటే అశ్రద్ధ - అలసత్వము ఎక్కువైంది. పెట్టుబడిదార్లకు — కోటీశ్వర్లకు లాభాలపై లాభాలు చేకూర్పటం దానంతటదే జరిగిపోతోంది. ఇదెవ్వరూ కాదన లేకపోతూన్నారు.

కరువురావటం మన దేశానికి క్రొత్తగాదు. మన దేశంలోనున్న విశాల భూభాగంలో అత్యధిక భూములు బంజర్లుగాను, ఎందుకూ పనికిరాని బీళ్లుగానూ జమీందార్లు - ఈనాందార్లు - మిరాసీదార్లు-మొఖాసాదార్లు మున్నగు భూస్వాముల క్రింద వుండటంవల్లనే మన దేశములో ప్రతి సంవత్సరము తప్పని సరిగా ఏదోమూల కరువుదేవత ప్రత్యక్షమౌతోందని అనేక సార్లు తెలుపుకున్నాం.

మనదేశాన్ని విదేశీయ సామ్రాజ్యవాదులు పాలించడానికి మూలస్తంభాలుగా వున్నది పై వర్గాలకు సంబంధించినవారే అని నిర్ణయించాం.

చేసిన తీర్మానాలు చేసినట్లుగానే వున్నాయి. వచ్చేకరువు వస్తూనేవుంది. ఇప్పటికైనా ముందెప్పుడైనా దేశంలో కరువు కాటకాలు రాకుండగా చేయాలంటే పీరి క్రిందవున్న భూమి నంతటిని జాతిపరం చేయాలి. ఆ విధంగా వచ్చిన భూమిని పేదరైతులకు, నిర్భాగ్యపు వ్యవసాయ కూలీలకు పంచాలి. ఈ విధంగా చేసి బంజరు భూములన్నిటిని సాగులోకి తెచ్చినప్పుడే పంటలు వస్తాయి.

మనరాష్ట్రం విషయంచూస్తే ఆంధ్రదేశంలో కృష్ణానదిలోని నీరు నూటికి ఆరుపాళ్లు, గోదావరిలోని నీరు నూటికి ఏడున్నరపాళ్లు మాత్రమే ఉపయోగించుకుంటున్నాము. మిగిలిన తొంభైపాళ్లపై చిల్లర నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతోంది.

ఈ నీరును ప్రజలు ఉపయోగించుకునేట్లు చేయడానికి, ఇంకనూ ఎక్కువ భూములు సాగునకు తీసుకరావటానికి తుంగభద్ర ప్రాజెక్టు-సంగమేశ్వరం ప్రాజెక్టు-పోలవరం ప్రాజెక్టు - నాగావళి వంశధార ప్రాజెక్టు-ఎర్రకాగు, తమ్మిలేరు ప్రాజెక్టు-మున్నేరు ప్రాజెక్టు - కాళింగనది ప్రాజెక్టు

ఎన్నెన్నో కష్టాలని ఎంతో కాలంనుండి ప్రపోజల్సు జరుగుచున్నాయి. ప్రపోజల్సు జరుగుతూనే వున్నాయి. ప్లానులు వేస్తూనే వున్నారు. పనులుమాత్రము అలాగే వున్నాయి. ఇంకా చెరువులక్రింద నీటితో సాగయ్యే భూములున్నాయి. ఇలాంటి చెరువులు మరమ్మతు చేయాలి. ఈ చెరువుల్లో కొన్ని జాగీర్దార్లు-జమీందార్ల స్వాధీనంలో వుంటాయి. చెరువులు బాగు చేయించుటకని రైతులనుండి నీరు డబ్బు తీసుకుంటారు. కాని మరమ్మతు చేయించరు. ఇలాంటి చెరువుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మరమ్మతులు చేయించాలి.

పంటకాల్వలు ఎంత అవసరమో భూములను మురుగునీరు పోవు కాల్వలు కూడా అంతే అవసరము. మురుగునీరు చేలనుండి సకాలములో పోవక పోవటంచేత పంటలు తరుగుతున్నాయని, భూములు నిస్సారంతో- చవుడు వేస్తున్నాయని అనేక మంది అనుభవజ్ఞులు చెబుతున్నారు.

ఎగ్రికల్చరల్ డిపార్టుమెంటువారు, పి. డబ్ల్యు. డి. వారు, రెవెన్యూ డిపార్టుమెంటు వారు అనేక తాలూకాలలో అనేక భూములను పరిశోధనజేసి ఇదే అభిప్రాయం తెలియజేశారు.

కొల్లేటి ముంపును తొలగించటానికి ఉప్పుటేరును వెడల్పు చేయాలని, ఐదుమైళ్ళ రెగ్యులేటరును నిర్మించాలని పెదలంక- గుండేరు- కొంపేరు- భట్టిప్రోలు మున్నగు మురుగుకాల్వలు త్రవ్వించాలని- ఇంకనూ అనేక గ్రామాలలోవున్న చిన్న మురుగుకాల్వలు మరమ్మతులు చేయాలని ఎంతో కాలంనుండి రైతు లాందోళన చేస్తూన్నారు.

ఈ మురుగు పోవకపోవటంవలన కొన్ని ప్రాంతాలలో మూడువంతులలో ఒకవంతు- కొన్ని చోట్ల సగానికి సగం పంటలు కూడా తగ్గిపోతున్నాయి. అయినా అధికార్లు ఈ స్కీములు వెంటనే అమలుపరచుటకు ప్రయత్నించటంలేదు. రైతులు కొండపడి ఆఫీసులుచుట్టూ తిరగలేక- లంచాలివ్వలేక సతమతమగుచున్నారు. ప్రభుత్వము ఇలాంటి స్కీములన్నిటిని వెంటనే అమలులోకి తేవాలి. పనులు త్వరలో పూర్తిజేయాలి.

ఈ సంవత్సరం పంటలు తక్కువగా పండటానికి కారణం గత తొలకరిరోజులలో సకాలములో వర్షాలు కురియకపోవటమేనని ఆహారశాఖామంత్రి గారు తమ రిపోర్టులో తెలియజేశారు.

నిజమే, డెల్టాప్రాంతాలలోని పరిస్థితులను పరిశీలించితే ఊడ్పుల సమయంలో వర్షాలు సరిగా కురియకపోవటం వలన, రైతులు చాలా కష్ట-నష్టాలకు గురయ్యారు. వర్షాలు కురిసి, చెరువులు నిండిన తరువాత సాగుచేసుకునే రైతులు మరీ బాధపడ్డారు. అప్పుడు రైతులు తమ పొలాలలో పైరులు లేతగా వడ్డాయని, వాటికి ఎరువులు అవసరమని ఎంతో ఆందోళన చేశారు. అయినా యీ ఆందోళన- రైతులుజేసే యీ ఆక్రందన ప్రభుత్వాధికార్లనుగాని, మంత్రులనుగాని వినిపించలేదు. కంట్రోలు రేటుకు ఎరువులను రైతులకు సప్లయి చేయలేకపోయారు 1942-44 సంవత్సరాలలో విదేశీయప్రభుత్వం చేసినంత మాత్రము కూడా చేయలేకపోయారు. ఇక రైతులు బ్లాక్ మార్కెట్టులో కొనలేక ఎరువు వేయటమే మానేశారు. ఫలితం పంటలు తగ్గాయి.

ఇక పండిన పంటల ధరల విషయంచూస్తే మరీ అన్యాయంగావుంది. రైతు పరిస్థితి అయోమయంగావుంది. దేశం కరువుతో మాడిపోతోంది. ఈ కరువునుండి ప్రజల్ని రక్షించటానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. జమీందార్ల క్రింద- భూస్వాముల క్రిందవున్న బంజరు భూములను తీసుకొని రైతులకు- పేద ప్రజలకివ్వాలి. ఆనకట్టలు నిర్మించాలి. మురుగు కాలువలు త్రవ్వించాలి. ఎరువులు సప్లయిజేయాలి. ఎగ్రికల్చరల్ డిపార్టుమెంటు- పి. డబ్ల్యు. డి. మున్నగు డిపార్టుమెంటులు రైతుల కనుకూలంగా పనిజేయునట్లు చూడాలి. ఇలా చేస్తేనే మనదేశము తిరిగి పూర్వపు ఔన్నత్యాన్ని నిలబెట్టుకోగల్గుతుంది. మన ప్రజలకు పుష్కలంగా తిండి లభించుతుంది. స్వతంత్ర భారతదేశము సిరి-సంపదలతో, భోగ-భాగ్యములతో పాడి-పంటలతో కలకలలాడుతుంది.

స్థానికంగానున్న తమ ఇబ్బందులను తొలగించుకోవటానికి ఆయా ప్రాంతాలలోవున్న రైతులు,కూలీలు-ప్రజలందరు ప్రభుత్వానికి సాయపడుతూ సక్రమమైన పద్ధతులలో ఆందోళన చేయాలి. ప్రజాప్రభుత్వం పాలించుతోందని చెబుతున్న యీ సమయంలో ప్రజలు నిద్రపోక తమ కష్టాలు తొలగించుకోవటానికి తీవ్రంగా ప్రయత్నించాలి.

★ అదిగో, ఆంధ్రరాష్ట్రం! ★

"నడింపల్లి"

వంకర్లు తిరిగిపోతూ, పొలాలుచాటుగా మాయమైపోతున్న పంటకాలవని చూస్తూ కూర్చున్నాను. పచ్చగా ఉన్నచేలు తల ఊపుతూ పిల్లవాయువుల్తో ఆడుకుంటున్నై. 'మళ్లీ ఆంధ్ర రాష్ట్రం వస్తుందంటున్నారు, ప్రకాశంగారు' అంటూ వెనకనించి వచ్చాడు రాము, చేతులో 'ప్రభ' పట్టుకొని. కడముట్టి సిగరెట్టు దమ్ము ఆఖరిసారిగా పీల్చి, కాలవలోకి విసిరేసి, వాడి వంక తిరిగాను. వాడు నా ప్రక్కగా కూర్చుని, సిగరెట్టు ముట్టిస్తూ అంటున్నాడు: 'కమిటీముందు ప్రకాశంగారేదో సాక్ష్యం చెప్పారటలే, తప్పకుండా వస్తుందట. రాకపోతే ఊరుకుంటారా మనవాళ్లు!' అన్నాడు, కార్యం అంతా కళ్లల్లోనే ఉందన్నట్టు చూస్తూ. నాకు అనుమానంగానే ఉంది, మనవాళ్లు ఏం చేస్తున్నారా, ఆంధ్రరాష్ట్రం రోజురోజుకి వెనక్కిపోతుంటే అని. కిందటిసారి యూనివర్సిటీలో శ్రీ ఉయ్యూరు కుమార రాజా గారు ఆంధ్రోత్సవాల్లో ప్రారంభోత్సవం చేస్తూ, 'భాషాప్రయుక్త రాష్ట్రాల విషయమై నిర్ధారణ జరగటానికి ఎప్పటికప్పుడు వెనక్కి పోతూనే ఉంది; ఆలస్యం గావటంకూడ మన మంచికే నేమోలే'అని ఒకనిమిషం ఆలోచించి, 'వాయిదా పడటం, ఆంధ్రరాష్ట్రం తప్పకుండా రావటానికే అని రహస్యంగా చెప్తున్నారు, కొంతమంది మిత్రులు' అని చిరునవ్వు నవ్వారు, అంతా నిజమే నన్నట్టు. మేమంతా ఆంధ్రరాష్ట్రం వచ్చేసినట్లే, సభనంతా మోగించేశాము. కాని, తరువాత మూడోరోజునో,నాలుగోరోజునో తెలిసిపోయింది. పాపం, రాజాగారికి సత్యమైన వార్త రాలేదని. అంతా మహా పెద్ద జాతీయవాదులైనట్టు, కమిటీ వాళ్లు అసలు ఈ సిస్టమే మంచిదిగాదన్నారు; వీల్లేకపోయిందికాని, 'ఇన్ని భాషలేమిటి? ఆ భాషలన్నీ మరిచిపోండి! ఒక్క హిందీ చాలు, ఇన్ని భాష లుండటం మంచిదిగాదు. అసలు ప్రపంచానికి ఒకేభాష లేకపోవటం వల్లనే, యుద్ధాలు వస్తున్నై'—అని అనటానికి జంకే భీరుల్లాగా తోచలేదు, కమిటీవాళ్లు. 'చాల ఆశాభంగం కలిగించింది' అన్నవాళ్లేగాని, 'అసలు ఇటు వంటివాళ్ళని, విచారణ చెయ్యమని పంపించిన వాళ్లెవళ్లయ్యా?' అని ఝాడించిన వాళ్లెవళ్లూ కనపళ్లేదు, పంపించిందెవరో అందరికీ తెలుసును గాబట్టి. ఇక ఇన్నాళ్ళకి మళ్ళీ ప్రకాశంగారు, ఆంధ్రరాష్ట్రం వస్తుంది తప్పకుండా నంటే, ఎవరు ఆశపడతారు?

నెహ్రూ గారు ఆంధ్రా యూనివర్సిటీలో మాట్లాడుతూ, 'కాంగ్రెసెప్పుడో ఒప్పుకుంది, భాషాప్రయుక్తరాష్ట్రాలకి. ఆంధ్రులికి తప్పకుండా రాష్ట్రం వస్తుంది' అనీ అనటంతోటే, అక్కడున్నవాళ్ళంతా గట్టిగా కొట్టేశాం,చప్పట్లు. 'ఆ: ఉండండి! తొందరపడ్తారేం? చెప్పేది పూర్తిగా విని చప్పట్లు కొట్టండి' అనీ కొంచెం సముదాయించి, 'అటు చూశారా, ఇటుచూశారా, ఎన్నెన్ని పన్లున్నయ్యో? విషయం చూట్టానికి ఇప్పుడెక్కడుంది తీరిక, చెప్పండి' అని మెల్లిగా తప్పుకున్నాడు. ఇక అక్కణ్ణుంచి, వెళ్ళినచోటల్లా ఉపన్యాసం చెప్పేటప్పుడు 'నో ప్రొవిన్షియలిజం' అనని చోటు లేదు. ఎన్నిమాట్లు. ఎంత మంది భాషాప్రయుక్తరాష్ట్రాలు కోరటం అందు వల్ల కాదని చెప్పినా, విని నమ్మలేకనో, నమ్మటానికి ఇష్టం లేకనో కాని ఆపాట మాత్రం మాన లేదు. ఇక ఆకలి తీరిన ప్రతివాడూ అదేపాట. ఒక సంవత్సరం కిందట విజయవాడలో మాట్లాడుతూ, 'మీ ఆంధ్రులంత వాళ్లు, ఇంకేవాళ్లూ. మీరు చాల కష్టపడ్డారు (పాపం!); కాబట్టి మీకు రాష్ట్రం తప్పకుండా యిస్తారు (కూలి ఇస్తున్నట్టు!)' అంటూ కబుర్లుచెప్పిన మున్షీగారుకూడ, 'ఇప్పుడు రాష్ట్రం వద్దు, ఏమీవద్దు. నోప్రొవిన్షియలిజం' అనటం సాగించారు. కమిటీ రిపోర్టు బైటపడ్డ తర్వాత దేశంలో రేగిన అసంతృప్తిచూసి, ఏమను కున్నారో ఏమో, 'భాషా ప్రయుక్త రాష్ట్ర వాదం నాటికి నూరుపాళ్లూ రైటే,' అని సర్టిఫై చేసిన నెహ్రూకూడ (ఈ వార్త పెద్దక్షరాల్తో

పెద్దది, ఆంధ్రప్రభ మొదటి పేజీలోనే) తను చెప్పిన అర్థంతులు దాదాపు పూర్తిగాతీరిపోయినా, మొదలకుండా ఊరుకున్నాడు. ఈమధ్య ఒకసారి మాట్లాడుతూ, తనపాటకి ఒక చిట్టి స్వరం తగిలించాడు: 'హక్కులకోసం అరిచేవాళ్లు, బాధ్యతల్ని తెలుసుకొని మాట్లాడాలి' అని. దీని భావం తిరుమలేశుడికైనా తెలుసునో లేదోగాని, మనభావం మాత్రం మహావేత్తగా పరిగణింపబడుతున్న నెహ్రూగారు అర్థంచేసుకోలేకపోవటం కొంచెం సూచించతగ్గ విషయమే. మద్రాసులో పట్టాభిగారు మాట్లాడుతూ, 'ముగ్గుర్లో ఇద్దరొప్పుకుంటే అయిపోతుంది' అన్నాడు, అంతా అయిపోయినట్టే. చూడాలి,ఎవర్ని ఒప్పించగలడో యీయన, ఆ ముగ్గురు మనుష్యుల కమిటీలో.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సొకచోట అన్నట్టు, ఎంత ఉదాత్తంగా పెట్టినా, బిచ్చం బిచ్చమే. ఆంధ్రులు ఒక విశ్వవిద్యాలయాన్ని నడుపుకోవాలంటే, ఒక ఆంధ్రేతర మహారాజు ధనసహాయం చెయ్యవలిసి రావటం! శ్రీ విక్రమ దేవవర్మగారి ఔదార్యాన్ని తృణీకరించటంకాదు, కాని మన చేతగానితనానికి మనం సిగ్గుపడాలి. డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారు మైసూరు విశ్వవిద్యాలయాన్ని బాగుచెయ్యటానికిపోయినారంటే, ఆంధ్రవిశ్వవిద్యాలయం దేదీప్యమానంగా ఉందని కాదు. ఆయన మేధస్సుకు తగిన పని చూపించటానికి యీ బీద విశ్వవిద్యాలయానికి శక్తిలేక. ఆంధ్రులకి ఒక బీద విశ్వవిద్యాలయం, బీద తనం! ఎక్కువ డబ్బు అయిపోతుందని, ఆంధ్రుల డబ్బుతో ఇంకెక్కడో, ఎవరో ప్రాజెక్టులు నిర్మించుకోటం! ఆంధ్రులు ఆకలితో మాడిపోవటం!

ఆంధ్రకేసరి మద్రాసులో ప్రధాని గద్దె నుంచి బలవంతంగా దింపివేయబడ్డప్పుడే, మాకు తెలిసిపోయింది, రాష్ట్రంలేని ఆంధ్రుల శక్తి ఏమైపోతున్నదో అని. పాపం– నెహ్రూగారు చాల బాధపడుతున్నాడు, ఆసియా రాజ్యాలకోసం. పటేలుగారు చాల దీక్షతో సంస్థానాల్ని కలిపేస్తున్నాడు, గుజరాతు పెద్దదిగా ఏర్పడేట్టు. పట్టాభిగారు మొగమాట పడుతున్నట్టున్నాడు, అటువంటి దేమీ లేదంటూ కబుర్లుచెప్పినా.

స్త్రీల కళాశాలలు

"ప్రభ"

చదువుకున్న యువతులను చూచి కొందరు ముసలమ్మలు 'యిదేమి మాయకాలం వచ్చిందమ్మా! ఆడది వెళ్ళి మగరాయుడులాగా యిస్కూలులో చదువుకోటం మన కాలంలో ఎరుగుదుమా' అనుకోడం మనం అప్పుడప్పుడు వింటూనేఉంటాము. ఇందులో కొంతవరకే నిజం. ఎందుకంటారేమో! పూర్వం స్త్రీలు కూడా పురుషులతో సమానంగా అన్నివిద్యలూ అభ్యసించేవారు. రాజ్యాలని నేర్పుతో పాలించిన రుద్రమదేవి వంటి స్త్రీలు ఉన్నారు. వారు యుద్ధసమయాలలో ధైర్యంగా సమరభూమిలో దుమికేవారు. ఝాన్సీ లక్ష్మి మొదలగు వీరవనితలు మనవారే కదూ! ఇంకా మొల్ల వంటి విదుషీమణులు కూడా ఉన్నారు. ఒకటేమిటి-మన స్త్రీలు అన్నివిధాలా పురుషులతోపాటు సమానంగావచ్చారు. కాని,కాలం కర్మం ఒకసారే కలసివచ్చిన వన్నట్లు, తదుపరి తురుష్కులు మన దేశానికి రావటం, బాలికలను తస్కరించి వివాహాలు చేసుకోవటం మొదలు పెట్టాక మన పూర్వులు వారికి భయపడి బాలికలకు చిన్నతనంలోనే వివాహాలుచేయుట మొదలు పెట్టారు. అదే నేటివరకూ జరుగుతూవచ్చింది. రానురాను స్త్రీలు బానిసలవలె చూడబడ్డారు.

కాని మరల యీ నవీనయుగంలో స్త్రీలు తమ అజ్ఞానములోనుండి మేల్కొన్నారు. తల్లిదండ్రులుకూడా తమ కుమార్తెలకు పుత్రులతో సమంగా విద్య నేర్పిస్తున్నారు. 'దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్య'దన్నట్లు బాలికలకు విద్య నేర్పించాలనే సదభిప్రాయం మనవారికి

కలిగినప్పటికీ, సరియైన అవకాశాలు ప్రస్తుతం మన రాష్ట్రములో లేవు. ముఖ్యంగా ఉన్నతవిద్య నభ్యసించటానికి అవకాశాలు లేవని చెప్పటంలో అతిశయోక్తి లేదనుకుంటాను. వారికి ప్రత్యేకముగా కళాశాలలు లేవు. అసలు వారిలో నూటికి ఏబదిమంది ప్రవేశపరీక్ష నిచ్చుటలోనే చదువు చాలించుకొని గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తున్నారు. మిగిలిన ఏబదిమందిలో కొందరు ద్రవ్యము లేక, కొందరు ఆసక్తిలేక చదువు మానుకుంటున్నారు. తక్కిన కొద్దిమందైనా చదవటానికి కళాశాలలు లేవు. వారు చదవదలచుకుంటే బాలుర కళాశాలలలో చదవాలి. కాని అందరికీ అలా యిష్టం ఉంటుందా? ఇష్టం ఉన్నవారెవరో తప్ప మిగిలిన స్త్రీలు అందరూ వృథాగా మానుకునేవారే.

స్త్రీకి విద్య కావాలి అనేవారేగాని దోహద మియ్యటానికి ఎవరూ సంకల్పించరు. కొన్నికొన్ని పట్టణాలలోని కళాశాలలలో బాలికలకు ప్రవేశ మిచ్చుటలేదు. ఆ పట్టణంలో స్త్రీలకళాశాల లేదనుకొండి. చదువ వలయు ననుకొనే బాలిక లెచ్చటికి వెళ్లాలి? స్వస్థలంలో చదువుకొనుట, యింకొక ప్రదేశంలో చదువుకొనుట ఒకటేనా? మన రాష్ట్రంలో ఒక్క గుంటూరులో తప్ప యింకెక్కడా స్త్రీలకళాశాలలు లేవు. దానిని గత సంవత్సరమే ప్రభుత్వమువారు తీసికొన్నారు. అందులోనైనా ఇంటరమీడియెట్ క్లాసు ఒక్కటే ఉంది. మద్రాసులో స్త్రీలకళాశాలలు ఉన్నప్పటికీ దూర ప్రాంతాలనుండి అచ్చటికి బాలికలను పంపుట సామాన్యగృహస్థులకు కష్టము. అందువలన మరికొందరు ఆగిపోతున్నారు. ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యముందు ముఖ్యనగరం కానుందనుకొంటున్న విజయవాడలో స్త్రీల కళాశాల లేకపోవటం శోచనీయం. ఆ పట్టణంలో బాలురకైనా ఒకటే కళాశాల ఉంది. ఈ విధంగా తెలివితేట లున్నప్పటికీ ఎందరో వివిధ కారణాలచేత తమ చదువు కొనసాగించుకొన లేకపోతున్నారు.

ప్రస్తుతం ఉన్న ఒక్క కళాశాలలోకూడా ఎన్నోమార్పులు చేయవలసివున్నది. ఆ కళాశాలకు పరిసర ప్రదేశాలనుండి వచ్చు బాలికలకు తగు సౌకర్యములు కలుగజేసి, ఆ కళాశాలనే అభివృద్ధిలోనికి తెచ్చి క్రొత్త కళాశాలలను స్థాపించవలెను. ఆకళాశాలలో అన్నిగ్రూపులూ లేవు. ఇంకా సాధ్యమయినన్ని కళాశాలలు స్త్రీలకు ప్రత్యేకిస్తే మరీ మంచిది.

తమిళనాడులో ఉన్నన్ని కళాశాలలు మన రాష్ట్రంలో లేవు. మన రాష్ట్రంలో ఒకటేగా వుంది! స్త్రీలు తగినంత ప్రోత్సాహము లేక నిస్పృహ చెందుతూ ఉన్నారు. ద్రవ్యలోపము చేత మానుకునే బాలికలకు విద్యార్థి వేతనాలు యిస్తే చాలా అనుకూలంగా ఉంటుంది. అన్ని సౌకర్యాలూ కలుగజేసి, చదవకాశాలుయిస్తే మన రాష్ట్రంలోని బాలికలుగూడా తమిళనాడులోని బాలికలను మీసిపోరేమో. అంతా మన చేతిలోనే వుంది. స్త్రీకి నేర్పిస్తేరాని విద్య వుంటుందా!

సంఘసామ్యం : స్త్రీపురుష భేదాలు



వర్తమానకాలంలో వ్యాప్తిలోవున్న సంఘసామ్య సిద్ధాంతాలప్రకారం జాతి మతకులలింగ భేదములు లేకుండా అందరూ సమానులు. అందరూ అన్నిపనులు చేయవచ్చును. సమానమయినపనికి సమానమయిన వేతనం లేక ప్రతిఫలం యివ్వబడుతుంది.

అయితే యీ సమానత్వం కేవలం ఆర్థిక వ్యవహారాల్లోనే సాధ్యం. ఆర్థిక వ్యవహారాల్లో స్త్రీపురుషులు సమానులుగా ఉండాలనే పద్ధతి వ్యక్తిస్వామ్యం ఉన్న చోట్లకూడా అమలులోకి వస్తోంది. సాంఘికంగా హిందూధర్మశాస్త్రవేత్తలు స్త్రీ కిచ్చిన గౌరవం, ఆమె రక్షణ విషయంలో పురుషుడికి విధించిన నిబంధనలు మరే సంఘంలోనూ కనుపించవు. కాలక్రమాన పురుషుడి స్త్రీ ధర్మకర్తృత్వం, బీదల విషయంలో ధనికుల ధర్మకర్తృత్వంగానే తయారయింది. ఆచరణలో యెల్లా ఉన్నా, సిద్ధాంతాలలో మాత్రం హిందూ సంఘంలో స్త్రీకి సాంఘికంగా ఏలోపమూ లేదు. ఆచరణలో పురుషుడు యీ విషయంలో నిర్లక్ష్యం చేయగలగడానికి కారణాలు, ఆవిడ ఆర్థిక పరాధీనత; సంఘంలో వ్యాప్తి పొందిన ద్వంద్వనీతి. ఈ రెండూకూడా, పురుషుడి స్వామిత్వసంక్రమణ కాంక్ష ననుసరించి యేర్పడ్డవే!

కాని శారీరకంగా స్త్రీ పురుషులకు మధ్య ఏ విప్లవమూ మార్చివేయలేని భేదా లున్నవి. ఆ భేదాలు వంశవ్యాపనకు సంబంధించి ఏర్పడ్డ జీవశాస్త్రీయములయిన భేదాలు. పితృత్వానికీ, స్త్రీ, సంతానం - వీటి పోషణకు అనుగుణంగా పురుషుడి శరీర ధర్మములు ఏర్పడ్డవి. అల్లాగే పత్నీత్వానికీ, దానిని అనుసరించి వచ్చే మాతృత్వానికీ, అనుగుణమయిన రీతిగా స్త్రీ శరీర నిర్మాణం జరిగింది. చాలా సాంఘి కాచారాలకు యీ జీవశాస్త్రీయమయిన భేదం మూలాధారం.

ఈ విభేదంవల్ల జాత్యవిజ్ఞానరీత్యా పితృత్వం పురుషుడికి జీవిత కార్యక్రమంలో ఒక భాగం కాగా, స్త్రీకి మాతృత్వం జీవితసర్వస్వం అయిపోయింది.

ఏదో సాంఘికఆర్థికవిప్లవం వచ్చి వివాహసంస్థ నశించి, సర్వస్వేచ్ఛలతో స్త్రీపురుషులుపశువులలా వ్యవహరించడానికి అవకాశం కలిగినా, స్త్రీకి మాతృత్వవిధులు తప్పవు. విపరీత ప్రయత్నంవల్ల వాటిని ఆమె తప్పించుకుందామన్నా ఆ ప్రయత్నం ఆరోగ్యనాశనానికీ, జాతినాశనానికీ కారణం అవుతుంది.

మానవజాతి అభివృద్ధికీ, వ్యాప్తికీ స్త్రీపురుష జీవాణువుల సంయోగంకన్నా వేరే మార్గంలేదు. స్త్రీపురుష సంయోగంకన్నా వేరేమార్గం లేదనే అనవలసిందిగాని, పురుషుడితో నిమిత్తంలేకుండా మాతృత్వాన్నిపొందే విధానములను కూడా విజ్ఞానం సాధించింది. అయినా ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానయినా, స్త్రీ తన మాతృత్వసాధనకు పురుషుడిమీదా, తన పితృత్వసాధనకు పురుషుడు స్త్రీమీదా ఆధారపడితీరాలి. అందుకు వేరేమార్గాంతరం లేదు.

అంటే మాతృత్వం సిద్ధించేవరకు, స్త్రీపురుషులు ఏపని అయినా చేయవచ్చును. ఏచదువు అయినా చదవవచ్చును. సాంఘికంగాను, ఆర్థికంగాను వారు సమానులు. మొగవాళ్ళతోపాటు ఆమె బస్ కండక్టరూ, ఇంజనీరూ, టాక్సీ డ్రైవరూ, పోలీసూ కావచ్చును. శిశువుకు పాక వయస్సు వచ్చి, ఆహారాదులలో అతడు తల్లిమీద ఆధారపడే స్థితి పోయింతరవాతా, మళ్ళీ మాతృత్వం తటస్థించకముందూ ఉద్యోగంచేయవచ్చును. అంతేగాని, పురుషుడిలా వసగా ఏపని చేయడానికి తల్లిఅయిన స్త్రీకి వీలులేదు.

సంఘీయులు లేని సంఘం లేదు. ఆ సంఘీయుల్ని కని, పెంచి, పోషించి ఉత్తమసంఘీయులుగా వారిని తయారుచేయడానికి సంఘం అంతా మాతృత్వం లభించిన స్త్రీలమీదనే ఆధారపడాలి.

అంటే, జీవితావసరములను ఉత్పత్తిచేసేవారు సంఘానికి ఎంత అవసరమో, ఆ జీవితావసరములను వినియోగించుకునే వ్యక్తుల్ని తయారుచేసే తల్లులూ సంఘానికి అంతే అవసరం. తల్లులు పిల్లల్ని కనకపోతే - కార్మికులూ లేరు, కర్షకులూ

లేరు, సైనికులూ లేరు, సామ్యవాదులూ లేరు. ఎవరూ లేరు. రెండు శతాబ్దాల్లో మానవజాతి అంతరించిపోతుంది. అంచేత పిల్లల్ని కని పెంచే తల్లి సంఘానికి అత్యవసరమూ, అనుల్లంఘనీయమూ అయిన సేవ చేస్తున్నది అవుతున్నది. ఆ సేవా నిరతిలో ఆమె ఆరోగ్యాన్నీ, అందాన్నీ, అప్పుడప్పుడు ప్రాణాల్నికూడా కోల్పోతున్నది. ఇందుకు సంఘమిచ్చే ప్రతిఫలం ఏమిటి? అందుచేత మాతృత్వానికి కారణభూతమయిన పత్నీత్వమే ఒక సాంఘికావసరమయిన కృషిగా సంఘం గుర్తించాలి. ఏ స్త్రీ కయినా శారీరక మానసిక వైపరీత్యాలవల్ల మాతృత్వం అంటే యిష్టం లేకపోతే ఆమె యిష్టంవచ్చిన వృత్తి అవలంబించి అల్లాగే వుండిపోవచ్చును. అటువంటి స్త్రీలు స్త్రీలు కారు. వారు పురుషతుల్యులయిన విచిత్రజీవులు.

కాని ఏ సందర్భంలోనూ - తల్లిపోషణ అవసరమయిన కాలంలో, జీవనోపాధికై తల్లి శిశువును విడిచి బయటికిపోయి పని చేయవలసిన అగత్యం కలిగించే సంఘం పరమకిరాతకసంఘంగాని నాగరిక సంఘంకాదు. ఏ దాదీ, ఏ శిశుసంరక్షణాలయమూ తల్లి స్థానాన్ని ఆక్రమించలేదు. మాతృవిధుల్ని నిర్వర్తించలేదు. సంఘంలో సర్వజీవులకూ కావలసిన జీవితావసరములను సృష్టించగల పురుషులు ప్రతిసంఘంలోనూ ఎప్పుడూ వుంటారు.

స్త్రీపురుషులు సమానులనే భావానికి విపరీత వ్యాఖ్యానంచేసి తల్లులచేత పనిచేయిస్తూ, పనిచేయడానికి అవకాశం యిస్తూ, అందుకు అనుగుణంగా కృత్రిమవిధానాలను, కృత్రిమ సంస్థలనూ నిర్మించడం జాతికి మంచిదికాదు.

ఉత్పత్తిసాధనాలకు సంఘస్వామ్యం రావాలనీ, స్త్రీ పురుషులు ఉభయులూ పనిచేయ గలిగిన సందర్భంలో పనిచేయాలనీ అన్నప్పుడు- గృహ వ్యవస్థ, మాతృత్వమూకూడా సాంఘికావసరములయిన పనులుగానే భావించడం అవసరం.

ఎక్కడికోపోయి పనిచేసి జీవించవలసిన ప్రతి కార్మికుడికీ, వేళకు తృప్తికలిగించే భోజనమూ, అందుకు సదుపాయాలూ అవసరం. అతనికి తృప్తి కలిగించేందుకు అతని అభిరుచులెరిగి వంట చేసే వ్యక్తి అవసరం. ఈ అవసరం నేటి కుటుంబవ్యవస్థలో భార్య తీరుస్తున్నది. శరీరసుఖంకన్నా, వంశవ్యాప్తికన్నా అన్నానికి పురుషుడు స్త్రీమీద ఎక్కువగా ఆధారపడుతున్నాడు. భర్తకూ, పిల్లలకూ ఆహారం సమకూర్చడం స్త్రీ మాతృత్వ విధుల్లో ఒకభాగం. నేను వంటచేయడానికి పుట్టలేదు; నాకూ హృదయమూ, మెదడూ వున్నవి; నాకూ స్వతంత్రం కావాలి అని తిరుగుబాటు సాగించేవారు యీమధ్య బయలుదేరుతున్నారు. కాని వారు తెగతెంపులు చేసుకుపోరు. వారికి చేతనయింది యీ తిరుగుబాటే. ఆర్థికంగా పురుషుడిమీద ఆధారపడుతూనే వారి తిరుగుబాటు సాగిస్తారు. ఈ దుస్థితికి కారణాలు చాలా వున్నవి. అందులో స్త్రీపురుషులు సమానులు అనే మాటను అపార్థం చేసుకోడం మొదటిది. మాతృత్వం ఒక వృత్తి అనుకుంటే, స్త్రీకి ఆర్థికస్వేచ్ఛ వస్తుంది; ఈ తిరుగుబాటూ పోతుంది.

భార్యగా అన్ని హక్కులూ కోరుతూ, అన్నం వండిపెట్టనని తిరగబడటంలో అర్థంలేదు. ప్రేమతో కలిగిన పత్నీత్వము, అందువల్ల ఏర్పడే మాతృత్వమూ ఉన్నప్పుడు యీ దుస్థితి యేర్పడదు. సాధారణంగా యీ తిరుగుబాటు ఆర్థిక స్వాతంత్ర్యం కలిగిన స్త్రీలు చేయడం చూచి, 'వీళ్ళకు ఆస్తిలో భాగం యిస్తే చెప్పినమాట వింటారా?' అనుకునేవారు కూడా వున్నారు. కాని, ఉన్నతవిద్యలు చదివి, ఉద్యోగాలు చేస్తూ కూడా మాతృవిధులకు ఏలోటూరాకుండా జీవితాలు గడిపేవారు అనేకమంది వున్నారు.

కుటుంబవ్యవస్థను భగ్నంచేసే ఆర్థికవిధానాన్ని మనవారు సహించరు. వ్యక్తిస్వామ్యాన్ని నాశనంచేసి, సంఘస్వామ్యాన్ని స్థాపించదలుచుకున్నవారు యీ విషయాన్ని మనస్సులో పెట్టుకోవాలి. ఆదిలో ఆర్థికేతరమయిన విషయాల్లో వారు జోక్యం కలిగించుకోకూడదు. ఆర్థికమయిన సంస్కారం రాగానే, తదనుగుణమయిన సాంఘికాచారాలకు కాలక్రమాన సంఘీయులు వాళ్లే అలవాటుపడతారు.

సమంజసమైన రీతిని విధి నిర్వహణ చేసినదానికి ప్రతిఫలంగా అధికారాన్ని స్వాయత్తం చేసుకోనడంవల్లనే స్వరాజ్యసిద్ధి.—గాంధీజీ.

మారని మనుష్యులు

తాడిమళ్ళ జగన్నాథరావు

శీతకాలంలో ఉపయోగించే వస్తువులు వేసంగిలో పనికిరావు. ఉత్తరాయణంలో గొడుగు నొకవైపునకు త్రిప్పిపట్టుకొంటే దక్షిణాయనంలో దానిని మరొకవైపునకు త్రిప్పిపట్టుకోవలసివస్తుంది. ఒకదేశంలో పనికివచ్చే పద్ధతులు మరొకదేశానికి పనికిరావు. ఒక శతాబ్దంలో ప్రబలిన సామ్రాజ్య వాదం మరొక శతాబ్దంలో భరింపబడదు. కొందరి ప్రజల్లో ఉపయోగించే కేపిటలిస్టు తత్వం, ధనిక వాదం మరొక తెగ బీదప్రజల్లో ఉపయోగించదు. ప్రజలు మూఢులుగా అజ్ఞానులుగా ఉన్నప్పుడు చెప్పవలసిన విద్యవేరు. వారిలో రాజకీయజ్ఞత, జ్ఞానం ప్రబలినప్పుడు చెప్పవలసిన విద్యవేరు. కాలానుగుణంగా ప్రపంచరీతుల గమనిస్తూ, ప్రజల అవసరాలు అభీష్టాలు దృష్టిలో పెట్టుకొని మసలాలి. కాలం ఎల్లా మారుతున్నా గమనించకుండా, తమ పురాతనభావాలకు స్వస్తిచెప్పకుండా కేవలం మూర్ఖంగా వ్యవహరించే వ్యక్తులకు- వారు మాట్లాడేమాటలకు, చేసే చేతలకు, నడిచే నడతలకు ప్రపంచకం సరియైన సమాధానం చెప్పి తీరుతుంది. ఒకరకం ప్రజలలో, అవసరాలలో, వాతావరణంలో చలామణీఅయ్యే భావాలు, మనస్తత్వాలు మరొకరకం పరిస్థితులలో పనికిరావు. చరిత్రనుబట్టిచూచినా, సామాన్యప్రపంచజ్ఞానాన్ని బట్టి యోచించినా మనకొక సత్యం గోచరిస్తుంది. మారుతున్న పరిస్థితులతో బాటు మనుష్యులు మారి తీరాలి. అల్లా మారకుండా మడిగట్టుకుని నేను పట్టుకున్న కుందేలుకు మూడేకాళ్లు అనికూర్చున్న వ్యక్తికిగాని, జాతికి గాని పతనం తథ్యం.

ఈమార్పు రెండురకాలు. ఒకటి బాహ్యాడంబరాలకు సంబంధించినది. శీతోష్ణపరిస్థితులు, దేశావసరాలు బాహ్యవేషాలను తదనుగుణంగా మారుస్తాయి. ఐతే వీటినికూడ లెక్కచేయని మనుష్యులు లేకపోలేదు. మంచి ఉదాహరణంగా మహాత్ముడే ఉన్నాడు. ఉష్ణదేశమైన ఇండియానుండి శీతలదేశమైన ఇంగ్లండుకుపోయినా దుస్తులుమార్చలేదు. తన మనోబలంతో చలినాపుకున్నాడు. ఇట్టి బాహ్యవేషాల్ని మార్చుకున్నా లేకపోయినా ఇతరులకు ఇబ్బందిలేదు. అవి వ్యక్తిగత అవసరాలకు సంబంధించినవి. ఒక సాధారణవ్యక్తి తన మనోభావాల్ని మార్చుకోనందువల్ల కలిగే లాభనష్టాల ననుభవించేది అతడే. కాని బాధ్యతగల వ్యక్తులు, నాయకుల విషయంలో మటుకు వారి మనోభావాలు కాలానుగుణంగా మారకపోతే మాత్రం కొంత కలజడి జరుగుతుంది. మహాత్ముడు తన భావాలు తప్పు అనితోస్తే మార్చుకోవడానికి సందేహించేవాడు కాదు. అందుచేతనే మహాత్ముని ప్రకటనలలో కొన్ని పరస్పర విరుద్ధములైనవి ఉండేవి. తన అభిప్రాయం తప్పు అని తెలిసికూడ మార్చుకోనివాడే మారని మనిషి. ఉన్న చిక్కంతా వీరితోటే ఉంది.

మారని మనుష్యుల మహాజన సభ జరిపితే అధ్యక్షస్థానం మహనీయుడైన చర్చిల్ కు ఇవ్వక తప్పదు. ఆయన ధోరణి ఎప్పుడూ ఒక్కటే. మెదడులో సామ్రాజ్యవాదం కరడు గట్టుకుపోయింది. బ్రిటన్ లో ఇంకా చర్చిల్ ప్రభుత్వమే సాగుతూఉంటే ఇండియాకు స్వాతంత్ర్యం ఇంత త్వరలోగాని, ఇంత శాంతియుతంగాగాని వచ్చేది కాదు. సామ్రాజ్యవాదం ప్రతిచోట ప్రతిఘటింపబడుతున్న ఈ రోజుల్లో ఇంకా చర్చిల్ సామ్రాజ్యవాదాన్ని బలపరుస్తున్నాడంటే అతనిని ఏమనాలో తెలియదు. 'అరాజకం, కమ్యూనిజం అనే పెనుభూతాలనుండి ఇండోనీషియాను రక్షించి సక్రమాభ్యుదయం లభించునట్లు చేయుటకు డచ్చివారు పట్టుదలతో కృషిచేస్తున్నారు' అని చర్చిల్ మొన్న లండన్ గిల్డు హాలులో జరిగిన సమావేశంలో అన్నాడు. చర్చిల్ మనస్తత్వం

అవగాహన చేసికొన్న ఏ ప్రపంచ పౌరునకు, ముఖ్యంగా ఇండియన్లకు ఆ ధోరణిలో ఆశ్చర్యం కన్పించదు. కొద్దిగానో, గొప్పగానో, హృదయ పూర్వకంగానో లేక బలవంతంగానో ప్రపంచం లోని దేశాలన్నీ ఇండోనీషియాపై డచ్చివారు సల్పిన దురాక్రమణను ఖండించాయి. చర్చిల్ మాటలపటుత్వం ఒకటే-'వీలైనంతవరకు వంచించు, చేతనైనంతవరకు జుర్రుకో'. చర్చిల్ ప్రభుత్వం ఇంకావుంటే ఇండియాలోకూడ 'అరాజకాన్ని' అణచడానికి, 'సక్రమాభ్యుదయం లభింప చెయ్యడానికి' బ్రిటిషు పటాలాలు యుద్ధం సాగిస్తూ ఉండేడివే. అరాజకాన్ని అరికట్టడానికి డచ్చివారు కృషిచేస్తున్నారో, అరాజకాన్ని అభివృద్ధి చెయ్యడానికి డచ్చివారు కృషిచేస్తున్నారో ఏ మాత్రం ఇంగితజ్ఞానం ఉన్నవారికైనా వెంటనే బోధపడక మానదు. పోలీసుచర్యఅనే పేరుతో ఇండోనీషియాలోఎక్కడా శాంతిభద్రతలను తావులేకుండా చేస్తున్నది డచ్చిసామ్రాజ్యవాదులు. ఇల్లాగే గోవా లో పోర్చుగీసువారు, ఫ్రెంచి ఇండియాలో ఫ్రెంచివారు ఇంకా తమ సామ్రాజ్యాల్ని నిలబెట్టుకొన చూడడం కాలానికి ఎదురీదడమే.

ఇంక మారని వ్యక్తులలో రెండోస్థానం దక్షిణాఫ్రికా ప్రధాని డాక్టర్ మలాన్‌కు చెందుతుంది. చర్చిల్‌ను సామ్రాజ్యవాదం బుర్రలో ఎల్లా చిల్లుం కట్టుకు పోయిందో అల్లాగే ఈయనకి బుర్రలో జాత్యహంకారం పాతుకుపోయింది. స్వజాతి అభిమానం సహజమే. ప్రతినాయకుడు తన జాతిని పైకి తీసికొని రావడానికి ప్రయత్నించవచ్చును. కాని స్వజాతి అభిమానం పెరిగిపోయి పరజాతిమీద కక్ష, ఈర్ష్య బయల్దేరితే అనిష్టాలు బయల్దేరుతాయి. అప్పుడు ఈ స్వజాతి అభిమానంఅనే పదం జాత్యహంకారంగా మారుతుంది. తన ఇరువదియవయేట మలాన్ మిత్రులతో మాట్లాడుతూ-దక్షిణాఫ్రికాలో తెల్లవారు తప్ప తదితరులెవ్వరూ ఉండకూడ-దన్నాడుట. ఇప్పటికీ అదేతీరు: తన తెల్లవారి ఆధిపత్యాన్ని నిలపడానికి ఆఫ్రికన్లకు, భారతీయులకు తగాదాలు పెట్టడం; సాధ్యమైనంతవరకు భారతీయులను అణగద్రొక్కడం రాజకీయలక్ష్యంగా పెట్టుకు పనిచేస్తున్నాడు మలాన్. ఇతని దుష్ట రాజకీయజ్ఞత ఎల్లకాలం కొనసాగదని చెప్పగలము. బంతిని క్రిందకు కొట్టినకొద్దీ పైకి ఎగిరినట్లు భారతీయులు అణగకొట్టబడినకొద్దీ తలయెత్తుతున్నారు; ఆఫ్రికన్లకు భారతీయులకు మధ్య వైషమ్యాలు ఆట్టేకాలం రెచ్చకొట్టలేరు. యథార్థత యిరుతెగలకు బోధపడుతోంది. రెండుజాతులవారు ఐకమత్యంతో జీవించడానికి సమావేశాలు జరుగుతున్నాయి.

మారనిమనుష్యులలో మూడవస్థానం ఇండియాలోని ముస్లింలీగు యావత్తూ చెందుతుంది. ముస్లింలీగు స్థాపించబడిన నాటినుంచి నేటివరకు ఒకేపంథాలో నడుస్తోంది. వారి జాతిద్వయ సిద్ధాంతానికి స్వస్తి అంటూ లేదు. పాకిస్తాన్ స్థాపనానంతరం ఈ ప్రచారానికి ఆస్కారంలేదు. ఇంకను ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని తహతహపడుతూ తీర్మానాలు చేస్తున్నారంటే వీరి మనస్తత్వాలలో మార్పు కించిత్తైనా కలుగలేదని తెలుస్తుంది. నిజమైన ఇండియా పౌరులుగా తయారవాలంటే తమదృక్పథాలను పూర్తిగా మార్చుకొనాలి. ఇండియాలో జిన్నా వారసులుగా ప్రవర్తిస్తే వృథాప్రయాసగా పరిణమిస్తుంది. తమ విపరీత రాజకీయాలకు స్వస్తి చెప్పవలసివుంది. లేనిచో వీరి మొరలు చెవిటివానిముందు శంఖం ఊదినట్లుగా పరిణమిస్తాయి, ఫలితం ఉండదు.

మారని మనుష్యులనన్న తీరనికోరికలు ఎన్నటికీ నెరవేరవు. చర్చిల్ మున్నగువారి సామ్రాజ్యవాదానికి, మలాన్ జాత్యహంకారానికి, ముస్లింలీగు వారి సంకుచితదృక్పథానికి ఇక ఆస్కారం లేదు. అందని ఫలాలకై ఆశించడం మాని, కాలంతోపాటు వీరు మారాలి. అయితే పుట్టుకతో పుట్టింది పుడకలతోగాని పోదనే సామెత ఒకటి ఉంది. వీరి యీ పుట్టుకతో పుట్టిన బుద్ధులను పుడకలతోంచి తి పేర్చవలసినవారు ప్రజలే.

అమెరికనులుగానీ, ఇంగ్లీషువారుగాని స్వతంత్రులని నేను భావించడం లేదు రంగుజాతులవారిని దాస్యంలో పట్టి వుంచినంతకాలం వారు స్వతంత్రులు కాజాలరు.—గాంధీజీ.



అవకాశవాది ఆత్మప్రశంస



చోడవరపు బాబూరావు

ఆమాంతంగా మంత్రినై పోయాను. ఎట్లా ఐపోయావా అని మాత్రం అడక్కండి; అదంతా చిదంబర రహస్యం. ఇదివరకు కాంగ్రెసులో ఎక్కడావున్నట్లు కనపడవే, మరి కాంగ్రెసు ప్రభుత్వం నీకు మంత్రిపదవి యెట్లా యిచ్చిందంటారా? అట్లా దారికిరండి చెపుతాను.

అవునయ్యా, కాంగ్రెసుకు వ్యతిరేకంగా పని చేసిన మాట నిజమే. అసలు మొదట్లో నా ఉద్దేశమేమిటీ అంటే, బ్రిటిషువాళ్ల ప్రభుత్వం లోనే కాస్త యేదో వాళ్ళకి ఆసరాగావుంటూ నాలుగురాళ్లు వెనకవేసుకుందామని ఆశించాను. వర్తకవ్యాపారం-అంటే ఇప్పటి కుర్రకారు నల్ల మార్కెట్టంటారే, అది-దాంట్లో ఏదో కాస్త వెనక వేసుకున్న మాట నిజమే. అసలు మళ్ళీ మాట్లాడితే నల్ల మార్కెట్ ఏమిటీ అని అడుగుతా! గింజ ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోటం తప్పంటారా? ఈ సంగతి యిట్లావుండగానే వాడు ఆనారాయణుడు-పాపం వర్తకంలో నాకు చాలా ఆసరాగా వుండేవాడు లెండి-ఓరోజున కనపడి గాంధీ టోపీ చేతి కిచ్చాడు. 'ఇదెందుకోయ్!' అన్నాను. 'నీ కింకా తెలీదూ! అయితే విను. బ్రిటిషువాళ్ళు వెళ్లి పోతున్నారుట' అన్నాడు. 'అయ్యో పాపం! అయితే యీ టోపీ యెందుకు?' అన్నాను. 'ఇంకా ఎందుకంటా వేమిటోయ్? రేపు కాంగ్రెసు వాళ్లు గద్దె లెక్కుతర్వాత ఈ టోపీ లేకపోతే యెందుకన్నా పనికి వస్తామా మనం?' అన్నాడు. 'మరి మన వర్తకంమాట?' అన్నాను. 'వర్తకం వర్తకంలానే వుంటుంది! కాకపోతే పేరు మారుతుంది' అన్నాడు. 'ఎట్లా మారుతుం దేమిటి?' అని అడిగాను. 'దేశసేవ-అంటే నీకు తెలియదే. అదీ చాలా లాభసాటి వ్యాపారమే. ఇప్పటికంటే ఆ వర్తకంలోనే ఇంకా బాగా కిట్టుబాటు కావచ్చును. సరేకాని ఇంకోమాట: నీకు గాంధీ స్లోగన్సు ఏమైనా వచ్చునా?' అన్నాడు. 'రా'వన్నాను. వెంటనే, 'అట్లాపనికిరాదు. రేపు ప్రజలముందర ఏమన్నా మాట్లాడాలంటే గాంధీ గారి సూత్రాలు బాగా రావాలి సుమా?' అని హెచ్చరించి మరీ వెళ్ళాడు. వాడి నోట్లో యింత బెల్లంకొట్టా, పాపం వాడు చెప్పిందంతా అక్షరాలా నిజమే అయింది. ఇప్పుడు కిట్టుబాటుకూడా మునుపటికంటె బాగానే వృద్ధిఅయింది. మొత్తానికి స్వరాజ్యం చాలా లాభకరమైందేనండీ!

సరే, యిది యిట్లా వుంటూండగానే అడ్డంకులు కూడా యెన్నోవున్నై మరి. ఈ ప్రజ లున్నారు చూశారూ? వూరుకున్నట్టే వూరుకుని అమాంతంగా లేస్తారండీ! 'అన్యాయం! దోపిడి! అక్రమం!' అంటూ అప్పుడప్పుడు లేస్తూనేవుంటారు. అయితే మనం వూరుకుంటామూ? 'అరాచకం' ప్రబలిపోతోంది—అని లాఠీ ప్రయోగిస్తే సరి! మొండిబండవాళ్లు ఒక్కొక్కప్పుడు అక్కడికీ వూరుకోరు. 'ఇదంతా కమ్యూనిస్టుల పన్నాగం' అని ఒక్కమాటన్నామంటే చాలు—అక్కడితో నోటికి తాళం పడిపోతుంది.

అంతా అనుకూలంగానే వుంది గాని, ఆవేవీ—పత్రికలో పెచ్చికలో,—వాటివిషయం మాత్రం కొంచెం అసాధ్యంగానేవుంది చెప్పొద్దూ! వాళ్ళ దేదో పడిపోయినట్లుగా మామీద రాస్తారు. ఆ గడుగ్గాయలు మొత్తానికదేమిటోగాని, సరిగ్గా చూసినట్లే అన్ని సంగతులూ వ్రాస్తారు. పాపం వాళ్ల ఉద్దేశం, అవన్నీ చదివి మనం మనస్సు మార్చుకుంటామని గావును! కాకపోతే చదవటానికి కాస్త బాగానే వుంటై. అప్పుడప్పుడు కులాసాకి చదువుతూ, నవ్వుకుంటూంటాను నాలో నేనే! వాళ్ళ ఉద్దేశం, కనీసం పై అధికార్లన్నా నిజం తెలుసుకుని సరైన చర్య తీసుకుంటారని గావును! అసలు పై అధికార్లెవరు? మేమంతా ఒక కుటుంబంలోని వాళ్ళంగాదూ! ఇంతకూ నిజమెవరికి తెలీదంటా! ఇదంతా బహిరంగరహస్యం. నే నిదివరకు కాంగ్రెసు వ్యతిరేకుణ్ణని వాళ్ళకి

తెలుసు; తరువాత కొద్దో గొప్పో వర్తకం చేస్తూంటాననీ వారికి తెలుసు. అయితే యేం, నావంటి పెద్దమనిషిని యేమడిరేం చెయ్యగలరు గనక! ఏదో వాళ్ళకూ, మనకూ లోపాయికారిగావున్న అవినాభావసంబంధాన్ని పురస్కరించుకుని వాళ్ళూ నడుచుకుంటున్నారు, మనమూ వుంటున్నాము- మధ్య యీప్రజ లెవరంటాను!

ఇట్లావుండగానే మొన్న నాగారాయుడు కనపడి మరోమాట చెవిని వేశాడు. వాడికీ ఈమధ్య పెద్దవుద్యోగమే అయిందిట—ఎమ్. ఎల్. ఏ. అనుకుంటా. మొన్న కనపడి 'ఏం, వ్యవహారం బాగా సాగుతున్నట్లేనా? నీకేమోయ్, మంత్రివి కూడా అయినావు! ఇహ పట్టిందల్లా బంగారమేగా?' అన్నాడు. 'ఆ, నీపనిమాత్రం తేలిగ్గా వుందా యేమిటి? ఈమధ్య భూమీ పుట్రా కూడా కొన్నావుటే?' అన్నాను. 'అవునోయ్! ఏదో కాంగ్రెసు చలవవల్ల ఇంటిదాని మెళ్లో నాలుగు నగలంటూ కూడా యేర్పడ్డాయి. కొద్దో గొప్పో డబ్బు వడ్డీమీద కూడా తిరుగుతోంది దనుకో. అయినా నీకూ నాకూ పోటీ ఎక్కడోయ్?' అన్నాడు. 'అదేమన్నమాట! కాంగ్రెసు పదికాలాలపాటు చల్లగా వుండాలే గాని నువ్వుమాత్రం ఆస్థితికి రాకపోతావా?' అన్నాను. 'మరో చిన్నవిషయం. గాంధీ మెమోరియల్ ఫండు డబ్బు పోగుచెయ్యటం నీద్వారానే జరుగుతోం-ది-టే......?' అన్నాడు. అప్పుడు మాకు జరిగిన సంభాషణ యిది.

'ఆఁ—నా ద్వారానే జరుగుతోంది, సలక్షణంగా.'

'చూడు......ఏమన్నా......?'

'గోడలకు చెవులుంటై సుమా! చెవులో చెపుతా దగ్గిరికిరా......!'

'ఆహా—! అసాధ్యుడివోయ్! అయితే...'

'మరేం భయంలేదు;...అదీ సంగతి! మరే, లేకపోతే నాకేం బట్టిందోయ్ సంత!'

అంతే; ఎక్కడి దొంగ లక్కడే—గప్ చిప్.

సరే ఆ విషయం అట్లా వుండనీండి. ఇప్పుడు కథ కొంచెం అడ్డం తిరుగుతున్నట్లుగా కనపడుతోంది. మన రహస్యాలు కాస్తా ఇట్టే బయటకు లాగేస్తున్నారు ప్రజలు. అయితే మనమేనా తెలివితక్కువ వాళ్ళం! మాట్లాడితే గాంధీగారిమీద వుపన్యాసం దంచేసి నోరుమూయిస్తున్నాం. అదికూడా యీమధ్య సాగేట్టు కనబట్టంలేదు. సరే కానీండి, ఎంతవరకు సాగితే అంతవరకూ సాగుతుంది. ఏ పార్టీ అయితే మనకేం. వ్యాపారం బాగా సాగాలేగాని! అంతగా ఏదైనా అవాంతరం వస్తే అప్పటి వుపాయం అప్పుడు!

అదుగో, ఎవరో పిలుస్తున్నట్టున్నారు - ఎవరో పెద్దవాళ్లే నాతో మాట్లాట్టానికి వచ్చివుండాలి. లేకపోతే, 'ప్రజల తరఫువాళ్ళం' అంటూ వచ్చే బికారి వాళ్ళకు దర్శన మిస్తామా యేమిటి? మన హోదా యెక్కడ, ప్రజలెక్కడ! ఒరే వెంకా, వాకిట్లో సోఫా శుభ్రం చెయ్యి. డబ్బునముందిట్లా వచ్చి ఆ గాంధీ టోపీ వెతికి యివ్వు. పక్కగదిలో రాట్నం, కదురూకూడా వుంటై —త్వరగా తెచ్చి నాముందర పెట్టు, పో. ఆవచ్చిన వారితో, 'అయ్యగారు నూలువడుకుతున్నారు లోపలికి దయచెయ్య' మని చెప్పు. త్వరగా, పో.

కథానిక

లోపలి రక్కసి

పి. శ్రీనివాసరావు

ఐతే విను మరి—ఆలకిస్తున్నావా? ... అడ్డు ప్రశ్నలు వేయకేం...ఆతర్వాత.

జనం కోలాహలంగా తిరుగుతున్నారు ... వొకటే సంరంభం! ఒకవ్యక్తికి రెండో వ్యక్తితో మాట్లాడే తీరికే లేదు. అటు యిటు పరుగులు తీసే వారి పదఘట్టనలతో ఆ నేల అరిగిపోదు గదా! యెవరినైనా పలకరించాలన్నా గొంతుచించుకుని బిగ్గరగా కేక వేయాలి...అంత కష్టపడ్డా అవతల వ్యక్తి వినిపించుకోవాలిగా అసలు.

పాకశాలనుంచి మధురమైన వాసనలు గాలిలో తేలివచ్చి వుక్కిరిబిక్కిరి చేస్తున్నయ్...యీ వాసనలకు తోడు రసికులపుణ్యాన అత్తరువాసనలు—నాకేం పాలుపోలేదు.

ఒక్కసారిగా చెవులు దిబ్బళ్లెత్తేట్టు మంగళ తూర్యారవాలు ప్రతిధ్వనించి ఆ కోలాహలాన్ని మింగివేసినై.

'హూఁ...లగ్నం సమీపిస్తున్నది...త్వరపడండి ...పెళ్లికొడుకు, పెళ్లికూతుర్నీ తీసుకురండి... యింకా చూస్తారేమయ్యా...త్వరగా...హూ!'

'రావయ్యా!' నన్ను యెవరో రెక్కపుచ్చుకు లాగారు.

'ఎందుకు? ఎక్కడికి?' అన్నాను.

'ఇదేం వేళాకోళం గాదు. వరుడివి, లగ్నం సమీపిస్తువుంటే వొకచెంప!' అతనెవరో నాకు తెలియదు. నన్ను యెందుకు వరు డంటున్నాడో అసలు అంతకీ తెలియదు. నిగ్రహిస్తుంటే గానుమరీ...? నేచెప్పబోయేది వినకుండా బరబర యీడ్చుకువెళ్ళి పెళ్ళిపీటలమీద కూలవేశాడు ... అప్పుడు నేనే మన్నా ప్రతిఘటించానా? ఏమో! పోనీ మాట్లాడానా అంటే అదీ గుర్తులేదు.

ఆడవాళ్లు గబగబ యెవరో అమ్మాయిని తెచ్చి నాప్రక్కనే కూచోబెట్టారు ... పెళ్ళని అర్థం చేసుకున్నా ననుకుంటాను అప్పటికి.

యథావిధిగా కార్యక్రమం నాయిష్టాయిష్టాల్తో ప్రమేయం లేకుండనే సాగిపోతున్నది...తలంబ్రాలు పోసేటప్పుడు గావాలి వధువుముఖం చూశాను... యెవరా అమ్మాయి?...యెన్నడు చూడలేదే? మనసు మారుమూలల్లో నిద్రిస్తున్న ఆలోచనలు కొన్ని మేల్కొన్నయ్...స్మృతిపథాన యేదో తళుక్కుమన్నది...మళ్ళీ చూశాను ... పరిచయ మున్న ముఖమే...అవును...నేను రోజూ చూసే ముఖమే...నాకు సన్నిహితమిత్రుల్లో వొకడైన నిరంజన్ భార్య పద్మ...యిదేమిటీ దుర్మార్గం? నన్ను 'అన్నయ్యా' అని పిలిచే ఆవిడ ... వొక మిత్రుడి భార్యతో నాకు పెళ్లిఎలా జరగడం?... ఐతే అంతకుక్రితమే వధువు ఆవిడగాదే...యెవరో చూడనిమనిషే...మరి ఆ అమ్మాయి యేమైంది? చెల్లాయి పద్మ వధువు కావడమేమిటి?...అంతా అయోమయం...కళ్లు గిర్రున తిరిగాయి...బ్రతికే వున్నానా! చనిపోయానా? అనుకున్నాను. ఆ తర్వాత యేం జరిగిందో జ్ఞాపకం లేదు...అదిరి పాటుతో లేచాను...అంతే!

...అదీ అబ్బాయ్! జరిగిన కల!...

నాకు ఆకలమీద యెంత కోప మొచ్చిందను కున్నావ్?...ఛీఛీ! అందులోనూ రోజూ 'అన్నయ్యా' అంటూ ఆప్యాయంగా పిలిచే చెల్లివంటి పద్మ...ప్రియమిత్రుడి భార్యమీద!... అందుకే రెండు రోజులవరకు మనసు కలవర పడింది...నిరంజన్ కనపడి గుచ్చిగుచ్చి అడిగాడు యింటి వేపు రావడం లేదేమని? చివరకు వాడి తోబాటు యింటికెళ్ళాను......పద్మ ప్రాణాలు తోడేసింది ప్రశ్న పరంపరతో.

ఉండు మరి...కాస్త గత చరిత్ర చెప్పనీ... వారికి నాకూ పరిచయ మెలా కుదిరిందో తెలుసు కునేందుకు కుతూహల పడుతున్నావ్ గదోయ్!

కొత్త ఆడవాళ్ళతో మాట్లాడ్డానికి నేను జంకు తానసే విషయం కొత్తగాదు. కొన్నాళ్ళవరకు వాళ్ళు కలిమిడితనంతో కబుర్లుచెప్పినా నేను తటపటాయిస్తూనే వుంటాను...నిరంజన్ బాల్య మిత్రుడే...వుద్యోగ రీత్యా నేను వాడున్న వూరు వెళ్ళడం తటస్థించింది...నిరంజన్ అప్పటినుంచీ నీడలా యెప్పుడూ నా వెంటే వుండేవాడు...ప్రతి రోజూ నేను వాళ్ళయింటికి వెడుతూవుండేవాణ్ణి.... భార్యాభర్త లిద్దరూ నన్ను వాళ్ళ కుటుంబం లోని వాళ్ళలాగే చూస్తుండేవారు...పద్మ అంతగా బిడియపడే రకం గాదు. 'అన్నయ్యా' అంటూ నన్నెంతో ప్రీతిగాచూసేది. నిరంజన్ వున్నా లేకున్నా నే నావిడకు పుస్తకాలు, పత్రికలు యివ్వడం, కబుర్లు చెప్పడం మామూలు...అయితే నాకున్న దుర్బలత్వం ప్రకారం పద్మ యెంత 'ఫ్రీ'గా మాట్లాడినా, నేను తడబడుతూ ముఖంయెత్త డానికి సంకోచించడం, యెత్తినా సూటిగా ఆవిడ ముఖంలోకి చూడ లేకపోవడం నాకే చిరాకు కలిగేది. అందుకని పద్మ, నిరంజన్‌లు నన్ను కొత్తలో అల్లరిపెట్టే వాళ్ళు.

ఆ రోజుల్లో నాప్రవర్తన నాకే అవగతమయేది గాదు. ఏ రోజైనా అవసరకార్యాల్లో నిమగ్నుణ్ణయివుండి నిరంజన్ యింటికి వెళ్ళకూడ దనుకున్నా, నాకు తెలియకుండానే, ఏదో అపస్మారంలోవలె, నా కాళ్ళు అటుకేసి దారితీసేవి.

మరో వింత విషయం! వాళ్ళిద్దరూ నాకు చిరపరిచితులయ్యారు గదా! కొత్త వాళ్ళ యింటికి వెళ్ళినట్టు, ప్రతిరోజు నిరంజన్ యింటికి పోయేటప్పుడు వేషం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోనడం నాకే అర్థమయ్యేదిగాదు. అంత శ్రద్ధ అప్రస్తుతం గాదూ? పద్మతో మాట్లాడుతూ మధ్య మధ్య మాటలకోసం కడుముకునేవాణ్ణి. సంబోధించేటప్పుడు వాక్యంచివరన 'అమ్మ' అనే తోక తగిలించడానికి శ్రద్ధతీసుకునేవాణ్ణి... ఐనా ఆ మాటవచ్చినప్పుడు కంఠం వణికేది... బయటికి వచ్చాక నాలోనేను తర్కించుకునేవాణ్ణి-యెందు కంత తికమక పడవలసి వచ్చిందో అని... అదేమన్నా భేషజమా?...పద్మ మెప్పుపొందాలనీ, ఆవిడ దృక్పథంలో ఆదర్శప్రాయుడిగా కన్పించాలనీ, ప్రయాసపడే అవసరం నా కెందుకు కలగాలో వూహించ లేకపోయాను.

ఏ వాదం వచ్చినా నేను, పద్మ ఒకతాటి మీదనే నడిచేవాళ్ళం...నిరంజన్ చిత్తుగాక యేం చేస్తాడు?

ఒకనాడు యేదో గృహకలహం వచ్చి నిరంజన్ కొద్దిగా చెయ్యి జేసుకున్నాడు...చాటుగా పద్మ నాకు ఆ విషయం వివరించింది. ఎప్పుడూ నిరంజన్ వాదమే క్రమమైందిగాదనేగా నా సూత్రం- పద్మ నోదార్చి, నిరంజన్‌ను మందలించాను...ఐనా ఆ కార్యంలో నా మీద నాకే సందేహం కలిగింది. హృదయపూర్వకంగా చేశానా? ఐతే యెందుకు మందలించినట్లు?...బహుశా చెల్లి తృప్తికోసం నేనలా ప్రవర్తించానేమో?...ప్రతి విషయంలోనూ అంత సూక్ష్మపరిశీలన, వాళ్లంత ఆప్యాయంగా ప్రవర్తిస్తున్నా, నేను నా హృదయంలోని ద్వారాలన్నీ పూర్తిగా తెరవలేనసే నా అనుమానం. అందుకే మాటిమాటికీ జిజ్ఞాసా?

అదిగాక సంభాషణ సందర్భాన పద్మను స్పృశించాలనిపించేది, చనువు ప్రదర్శించేటందుకని ...స్పృశించినంతమాత్రాన సన్నిహితత్వం పెంపొందుతుందా?...ఐనా ముట్టుకొనబోయి. తడబడి, ఆప్రయత్నం విరమించాను చాల తడవలు... ముట్టుకొనబోవడం, ముట్టుకొనలేకపోవడం, రెంటికీ అర్థంలేదు.

ఇక కొంచెం...సాంతంగా చెప్పనీ మరి.

ఒకరోజుఏముయిందంటే, మేంముగ్గురం సినిమాకని బయల్దేరాం...అప్పైనా నా బలవంతాన్నే ...'అందరూ బాగుందంటున్నారు ... విమర్శలు కూడా సుముఖంగా వున్నయ్..ముఖ్యంగా పాటలు చాల హాయిగా, శ్రావ్యంగా వున్నాయిట!' అని వాళ్ళిద్దరిలో కుతూహలం రేకెత్తించాను...పద్మ కూడా పట్టుపట్టింది...నిరంజన్ యిక తప్పదనుకుని బయల్దేరాడు...ముగ్గురమూ కలిసి యెక్కడికైనా వెళ్ళడం అదే ప్రథమం.

ప్రక్కప్రక్కనే కూర్చున్నాం. చిత్రం నడక మందకొడిగానే వుంది. కానీ సంగీతంమటుకు కొంత వరకు, హీరోయిన్ కొంతవరకు రక్షించారు. హీరోయిన్ కొత్త ముఖమైనా నన్ను గిలిగింతలు పెట్టింది. అందుకు కారణం ఆవిడలోని 'సెక్స్ అప్పీల్'—ముఖ్యంగా ఆ చిలిపి కళ్ళు. ఆ మధురమైన చిరునవ్వులు సినిమా చూస్తున్నంత సేపు నా హృదయాన్ని మథించినై. బ్రహ్మాచారి మనసులో

తీయని తలపులు పూచి పులకరింతలు కలిగించాయి. ఆ ముఖానికి, యింకో ముఖానికి సామ్యం యేదో మసక మసకగా స్ఫురించసాగింది. మనసు పూరికే ఆరాట పడసాగింది. సినిమా యెప్పుడైపోతుందా, యెప్పుడా తార కలిగించే బాధనుంచి తప్పించుకోవచ్చా, అని నిరీక్షిస్తూ కూచున్నాను. వాళ్ళిద్దరు నా వికారం గమనించినట్టు లేదు.

చిత్రం పూర్తయింది. లైట్లు అమాంతంగా వెలిగినై.

లైట్లు వెలిగిన వెంటనే పద్మనుచూశాను. కళ్లు, బుర్రలోని ఆలోచనలు వొక్కసారి గిర్రున పరిభ్రమించాయి.

పద్మ ముఖానికీ, ఆ తార ముఖానికి భేదం లేదు అంతగా! తార నాలో రేకెత్తించిన కోరికలన్నీ-పద్మ, తారల ముఖ సామ్యం గమనిస్తూనే నన్ను కుంగదీశాయ్.

పద్మ ముఖం చూడలేకపోయాను, నా తత్తరపాటు వారికి కయోమయంగా తోచింది.

కల అంతర్యం వెంటనే విశదమైంది! దాంతో బాటు నా ప్రవర్తనలో సూచితమైన ద్వంద్వత్వానికి కారణమై ప్రచ్ఛన్నరూపంలో వుండిన కోరిక నిజస్వరూపంకూడ దర్శించాను. నువ్వూ ప్రయత్నించు మరి!

నేటి యువకులు

జి. యస్. రామకృష్ణ

ఈమధ్య ఒక కాలేజీలో 'ఆంధ్రాభ్యుదయ వారం' జరిగింది. మొదటి రోజున కాలేజీ ఆవరణలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ఒక ఆంధ్ర రాజకీయ నాయకుడు ఉపన్యసిస్తాడని, విందామని నేను వెళ్ళాను. ఆయన ఉపన్యాసాన్ని విని-ప్రతి యువకునికి రాజకీయంగాను, ఆర్థికంగాను, వైజ్ఞానికంగాను, నైతికంగాను, మానసికంగాను, ఆధ్యాత్మికంగాను చక్కని బాట చూపుతోందని అనుకున్నాను. అది ముమ్మాటికి నిజం కూడాను. నేటి యువకలోకానికి ఇటువంటి ఉద్బోధలే చాలా అవసర మనిపించింది.

అయితే, నా కొక పిచ్చి అలవాటు వుంది. ఎక్కడైనా, ఎవరైనా ఉపన్యసిస్తోంటే - ఆ ఉపన్యాస సారాంశాన్ని గ్రహిస్తోండడమేగాక, అక్కడకు చేరిన ప్రేక్షకులు ఆవ్యక్తిని గూర్చి, అతని ఉపన్యాసాన్ని గూర్చి ఏవిధంగా తలపోస్తున్నారో వినాలని కూడా నా ఆశ. అందుచేత, ఈసభలో కూడా అదేవిధంగా, ప్రేక్షకులలో ఎక్కువమంది నైన యువకుల ధోరణి ఏవిధంగా ఉందో పరిశీలించాను.

కొందరు యువకులు సమూహంలో తలలు వంచి, ఈలలువేయడం మొదలెట్టారు. మరికొందరు మాటిమాటికి చప్పట్లు కొట్టడం—భజనలో ఏకతాళం మాదిరిగా—మొదలెట్టారు. ఒక ప్రక్కనుంచి పొలికేకలు వినవచ్చాయి. ఇంకో ప్రక్కనుంచి పొగ పైకి రావడం; మరో ప్రక్కనుంచి తాను కూర్చున్న బల్లలను వెనుకకు పడగొట్టి, అందరూ ఒక్కసారి గొల్లుమనడం; కొందరు ఉపన్యాసకుడు శాస్త్రులుగారివలె శాలువా కప్పాడని, మరికొందరు- ఆయన దగ్గితే- అందరూ దగ్గడం—ఈవిధంగా ప్రవర్తించడం జరిగింది.

నేనుకూడా ఒక యువకుడనే; నేను పెద్ద పెద్ద పట్టణాలలో నివసించినవాడినే; ఆధునిక నాగరికతా లక్షణాలు కలవాడినే; అల్లరిచేసేవారిలో నేను గొప్పవాడినే; రకరకాల ప్రవర్తనలు నాకూ తెలుసు కాని వాటిని ఆచరిస్తే నా జీవితచరిత్ర సులక్షణంగా వుండదనికూడా నాకు తెలుసు. మానవ సంఘంలో ఒక సభ్యతను పొందినాను. ఆ సభ్యతను గౌరవప్రదంగా కాపాడుకోటానికి, నా శక్త్యానుసారం కృషిచేయవలసినవిధి నా పైన ఎంతగానో వుంది. అల్లరిచిల్లరగా ప్రవర్తిస్తే, నా సభ్యత రద్దయిపోతుంది; నా సేవాఋణం, ఋణంగానే వుండిపోతుంది. ఆ ఋణాన్ని తీర్చలేని నా బ్రతుకు ఒక బ్రతుకా?

నేను మానవసంఘంలోకి వచ్చానంటే, నా

కొరకు ఒక లోటు కానుకొనివుంది. 'దానిని తీర్చాలి' అంటే–నాకు జ్ఞానం కలిగినప్పటినుంచి, నా జీవితనావ ఒడుదొడుకులు లేకుండా సాఫీగా నడవాలి. ఆ దృష్టితోనే ఎల్లప్పుడు మరవకుండా ఉండాలి. నాకు ఇష్టమైన చోటికి వెళ్లి పెద్దల బోధలను వినాలనే నా దృఢసంకల్పం. వారి ఉద్బోధలలో ఏది మన జీవిత చరిత్రకు అనుగుణంగా వుంటుందో పరిశీలించి, ఆ సద్గుణాన్ని తీసుకొని, ఇకనుంచి నా బ్రతుకుపుటలలో చేర్చాలని మరొక సంకల్పం. ఇవి వట్టి వట్టి సంకల్పాలే కాదు; ప్రస్తుతం ఆచరణ రూపేణా జరిగేదే ఇది.

ఇష్టంలేని చోటికి, వినాలనే కుతూహలంలేని వారు వెళ్లి, అసభ్య ప్రవర్తనను చూపుటవల్ల వారికి వచ్చే మహాభాగ్యమేమి? ఒక వ్యక్తి ఏ దుస్తులు ధరించినా, ఏ విధంగావున్నా, అతని ప్రవర్తన మంచిదైవుంటే, అతడు సదుద్దేశములను ఉద్బోధిస్తూంటే వాటిలో మనకు నచ్చిన మంచిని మాత్రమే గ్రహించాలి. అసలు ఇష్టంలేకపోతే, ఆ స్థలానికి మనం వెళ్ళకపోవడ మంత ఉత్తమం మరొకటిలేదు. వెళ్లామా, కొన్ని నిబంధనలకు లోను కావలసి వస్తుంది.

నేటి యువకుడు - ఇంట్లో ఏ విధంగా ప్రవర్తించాలో, మిత్రబృందంలో ఏ విధంగా ప్రవర్తించాలో, పెద్దలతో ఏ విధంగా మెలగాలో, ఎవరితో ఏ విధంగా మాట్లాడాలో - ఇవన్నీ మరిచినట్లు కనబడుతోంది. ప్రస్తుత ప్రవర్తనను నిత్యజీవితంలో ప్రతి యువకుడు మార్చుకోకపోతే, కొద్దికాలంలో మానవ సంఘం-ప్రవర్తనలో మానవ సంఘ మనిపించుకోదు. ఇది ముమ్మాటికి నిజం.

అందులో ఎవరికి వారు - నేనొక్కడినేగదా! నావల్లె ప్రపంచ ముందా? అని భావించరాదు. కొన్ని రేణువులు కలిస్తేనే ఒక మహాపర్వతము ఏర్పడిందనే నగ్నసత్యాన్ని, అలా భావించేవారు జ్ఞాపకముంచుకోవాలి. రోడ్డు ప్రక్కనున్న ఒక చెట్టు దారేపోయే అనేక మందికి చల్లని నీడ ఇస్తోంది. అడవిలో ఒక పులి వుండంటే, దాని భయంచేత అడవి ఛేదింపబడకుండా వుంటోంది. ఇంట్లో ఒక వ్యక్తి వున్నాడంటే, ఇంటి సామాను దొంగిలించడానికి వీలుండదు. అలాగే, ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి అవసరమే.

అవసరంలేని వ్యక్తిని భగవంతుడు సృష్టించడు. ఈ నమ్మకంతోనే నేను కృషిచేస్తున్నాను. అయితే, చెడు అబ్బినంత త్వరలో మంచి అబ్బదు. మంచి శాశ్వతమైనది గనుక, నెమ్మదిమీద కృషి చేస్తూంటే, అదే ఫలిస్తుంది. కాని, మంచిని అలవర్చుకొనే వ్యక్తి దానిపై దృఢ విశ్వాసముంటేనే లభిస్తుంది. లేకపోతే లభించదు.

సత్యం-శివం-సుందరం

★

రమణారెడ్డి

ఆరోపిస్తున్నాను నేను
ఈ నరహంతలమీద అభియోగం:
అరదండాలుమాత్రమే చాలవు;
మరణానికి మరణమే శిక్ష!

జేవురించిన ముద్దాయి కళ్ళు,
నెత్తుటిచారల గోళ్ళు,
పీడవాలకాలే అతని వాఙ్మూలం!

పడిపోయిన చెడిపోయిన మనుషులు,
పడిచిన పసుచులు,
కొరికితిన్న కసుగాయలు,

ఎండిన పాలిళ్ళు, పూర్ణతరాని పిండాలు,
విరిగిన అంగాలు, జరిగిన మానభంగాలు,
పంటపొలపు గుండెమీద పుక్కుముచ్చెముద్దర:
పిడికిటికి యముడని నడుమ్మీద
మూడుముడతల పొత్తిపొట్టమీద
పోరుపేనుమీద పేలమందమీద
మోకాలు మోచేయి నెమ్మోము మీద
నుదురు వీపు అరచేయి అరకాలిమీద,
పసుచుగాలి రేమి కోరి కూర్చిన
పసిడి యిసక అలల తిన్నెలమీద

ఉక్కుజోడు ముద్దర!
ఉక్కుసడిమ తొక్కుడి!

వినాశనం నేరానికి సాక్ష్యం!
వినాశనం నేరానికి శిక్ష!
క్రొత్తకాదు శిక్ష, క్రొత్తకాదు నేరం,
ఫారో, నీరో, ఖానులు,
సీజరు, జారూ, కైజరు,
కైజారుకు స్వాములు, దాసులు,
విక్టరీ విక్టిమ్ములు.

౨

సౌందర్యోంత్తరాళపు సింహావిశర్తిక మీద
కూచున్నాను కర్మసాక్షిని
మార్కెత్తాన్ని
నిహ్కలస్యాన్ని ప్రజను!
నేనే రాజ్యాంగాన్ని, సార్వభౌమాధికారాన్ని!'

పూవిరులు తురిమిన కేసరాల కొప్పును
కనికారం లేక కోసిన మంగలి కత్తిని,
క్షురిక వెనుక శాసించే పురాణాన్ని,
పిడకలలో కాల్చమని చెపుతున్నాను!
ప్రాకారాల వెనకాతల నిలువుటద్దాల నీడలుగా,
అవమానపు ముసుగులుగా,
వికారాకారాల సందిటిలో సందడిలో
ఊపిరి విడిచిన ఆడ జీవాల
కావిరి నిండిన కళ్ళు సాక్షులు!
ముడి పడకముందు మంచినీటి పూటను
ప్రసవించక మునుపే ఆనార్ద్ర క్షేత్రంగా
గొంపిగా కంపుగా
ఎడారి కావించిన పసరాన్ని, ఆడవి సీతిని,
ఆలిని అదలించి పూలపట్టణాలలో విహరించే
వైద్రిదాహాన్ని,
ముగ్గురు నలుగురు మూగజీవాల మధుకలశాలను
రోగాల మురికికాలువలు చేసే ద్రోహాన్ని,
నిందిస్తున్నాను నేను!

3

నిందిస్తున్నాను నేను అంకుశం కూడా నేనే:
అవవసరమైన పొత్తిపొట్టమీది మెత్తును,
అన్ని వేళ్ళకూ రవ్వల శృంగారాలను,
విస్తటిలో విడిచివేసిన భక్ష్యాలను,
వెయ్యమందిని చించుక వెడిపోయే కారును,
రెండెద్దుబళ్ళ నాగరికతలో రోల్సురాయిల్సును,
రాగిరూకల నడుమ విలువలేని ధర్మాన్ని,
పూరిగుడిసెలనడుమ ఎక్కలేనిహార్మ్యాన్ని:
విధిస్తున్నాను శిక్ష. బధిరుణ్ణి ప్రార్థనలకు:
కొవ్వును పసి-గొలిమిలో కరిగించండి!
ఉంగరాలు పంచుకోనండి!

కొట్టెలు ముక్కలు చేసి మెక్కండి!
ఒక కారువంటి కార్లు కొల్లలు నిర్మించండి!
మిద్దెమీది ప్రతిగదిలో జంటలుగావుండండి!

4

నిందిస్తున్నాను నేను పరిశుద్ధమైన గ్రంథాన్ని:
బూతులను వెల్లవేసే కలాలను

కట్టుకథలు కూసే కలాలను
కాలానికి అన్యాయం చేసే కలాలను,
వనమధ్యంలో ముక్కు మూసికున్న శాఖామృగాలను,
కొండకోనలమీద గుహలో కూర్చున్న
జాంబవంతులను;
మనుషులు మనుషులుగా బతకమంటాను.
పసరనీతి బోధించేవాళ్ళను చితకకొడతాను.

5

నిందిస్తున్నాను నేను దిగంబరన్యాయాన్ని:
పంజరాలను, చీకటిని, మంగళసూత్రాన్ని.
నిందిస్తున్నాను నేను,
బలహీనులను ద్రోహులను రాక్షసులను.
నిందిస్తున్నాను నేను,
కీతను రోతను పాతను ;
పాతను నిందిస్తే ఎగిరిపడే నాలుకను,
దుఃఖం పోవాలంటే దిగులుపడే గుండెను.
నిందిస్తున్నాను నేను :
నెమలి సింహాసనాన్ని, తాజమహలు శిల్పాన్ని ;
పిరమిడ్‌ను, మేడలమీది కేళికారామాలను ;
వీటికి శిక్ష, మ్యూజియములు కావడం.
నిందిస్తున్నాను నేను :
ఉండికూడ సిద్ధాంతం కోసం పస్తులు మాడేవాణ్ణి,
ఉండికూడ తృప్తిని చెప్పేవాణ్ణి, ధర్మం పాడేవాణ్ణి,
మర్మం కప్పినవాణ్ణి, చర్మం పచ్చటివాణ్ణి;
ఈ నరజంతువులకు శిక్ష, జంతుప్రదర్శనశాలజీవితం,
ముందుతరం దేవతలకుఆశ్చర్యంకల్గించడం.
నిందిస్తున్నాను నేను :
ఉన్నదానితో తృప్తిపడమన్న మతాన్ని,
లేనిదానికి ఆశించకూడదన్న మతాన్ని,
మనుష్యులను యంత్రాలుగా తంత్రంచేసినమతాన్ని
రాజులతో పూసుక తిరిగిన మతాన్ని,
అజ్ఞానం ప్రబోధించిన మతాన్ని.
నిందిస్తున్నాను నేను :
రాట్నాన్ని, ముతక నూలును, పాత నాగలిని
మోటుతనాన్ని, చిన్నితనాన్ని, ముసలితనాన్ని.
నిందిస్తున్నాను నేను :
లాభాలకు వ్యాపారాలను, తేలే నగరాలను,
విదేశ పెట్టుబడులను, విదేశ దురాక్రమణలను,
యుద్ధాలను, భీభత్సాలను, రాద్ధాంతాలను
లాభాలను రద్దుచేస్తున్నాను!
సేనలకు శాశ్వతవిరామ మిస్తున్నాను!
పూర్వపు సైనికులకు పనియిస్తున్నాను!
ఆయుధాలు జాతిపరం చేస్తున్నాను!
థార్ ఎడారిలో గోధుమ పండిస్తాను!
విమానంలో ప్రయాణికులకు అవకాశం
పెంపొందిస్తున్నాను!
ట్రాక్టరిస్తున్నాను, మెట్టపొలం
బెట్టపొలం రద్దుచేస్తున్నాను:
గట్లు, గనిములు, కరగోడలు
పడగొడుతున్నాను.
సుఖం పంపిణీ చేస్తున్నాను.

6

బహిష్కరిస్తాను. నరనివాస
గోళాంచలాల వెలికి తోలుతాను:
విషాన్ని విషాదాన్ని, నిషాను విషాదములను,
కషాయాన్ని కాషాయాన్ని, ఘోషాను
గోసాయీలను,
వేషమహిమను దోషపటిమను,
పాషాణాలను భోషాణాలను,
మఠాన్ని మతాన్ని వాద్యాన్ని,
మసీదు గుడిగోపుర చర్చీలను !
చక్రవర్తిని వక్రబుద్ధిని!
వ్యాకరణాలను ఆకలిమరణాలను
క్షరణాలను తలతిరుగుడుకరణాలను
దురాక్రమణాలను మతిభ్రమణాలను
విపణివీథి కుంభకోణాలను,
లంచగొండి మంత్రుల దానాలను,
ఎర్రబొట్టు అమ్మలపొడి బాణాలను.

7

ఆవిష్కరిస్తాను : తొలి వేకువ
ఎరుపు తెలుపు వెలుగులోకి :
అక్షరాన్ని అనశ్వర తృప్తిని
అచ్చరవంటి పంటపొలంతిని
రసాన్ని రాగాన్ని తడిని తమాషాని
కల్పనను కల్పకాన్ని కులుకు కులాసాలను,
పని, పాట, పడకలను !
ఇతి సత్యం, ఇతి శివ, మితి సుందరం !

నా దైనిక సమస్యలు

1

నేను చదుకొనే రోజుల్లో నా సహపాఠులందరూ నన్ను చూసి అసూయపడేవారు. ఇప్పుడు నేను వారి నందరినీ చూసి అసూయపడలసి వస్తున్నది. ఏ పరీక్షలోనైనా సరే ఫస్టుమార్కులన్నీ నేనే తన్నుకుపోతూన్నానని అప్పట్లో వారి బాధ. నేడు జీవితమే ఒక పరీక్షకాగా వాళ్ళంతా విజయవంతంగా పురోగమిస్తూంటే నేను పరాజితుణ్ణయి ఏ ఆశ్రయమూ లేక సన్యాసమో సురక్షిత స్థావరంగా తిరోగమించవలసి వస్తున్నదే అనే ఇప్పుడు నా దిగులు.

అప్పటికి పబ్లిక్ పరీక్షమీద రెండు దండయాత్రలు చేసి మూడోదైన అదృష్టవశాత్తు పరీక్షహాల్లో నాకు దగ్గరగా కూర్చోగలిగినందువల్ల ప్యాసుకాగలిగిన నా మిత్రుడొకడున్నాడు. వాడినే నేనుకూడ 'కాపీ' చేసినట్లయితే ఈనాడు నేనూ ఏ ఫిర్కా సప్లయి ఆఫీసర్నో ఐ పెద్ద పెద్ద భూస్వాముల, షావుకార్ల నమస్కారాల నందుకొనుచుండేవాడినే.

పరీక్షాధికారుల దయ కొనివేయడంలో కృతార్థుడు కాగలిగిన నా మిత్రుడు మరొకడున్నాడు. వాడినైనా మార్గదర్శకుడినిగా స్వీకరించి ఉంటే నేనుకూడా రైల్వేలో ఏ గూడ్సుషెడ్డు గుమాస్తానో ఐ, నా పెళ్ళాం మెడలో కనీసం కట్టెడు బంగారపు బరువైనా పడవేసి ఉండేవాడినే.

ముక్కుతూ మూలుగుతూ పరీక్షలో నెగ్గి ప్రస్తుతం పోస్టల్ శాఖలో పనిచేస్తూన్న నామిత్రుడింకొకడున్నాడు కదా—'ఏరా, అప్పట్లో నీ అంత తెలివిగలవాడెవరూ ఉండరు అనుకొనే వాళ్ళం. ఇప్పుడు చూస్తే నీ అంత తెలివి తక్కువవాడెవడూ ఉండడనిపిస్తోందిరా' అని.

నిజమే, కాకపోతే 'బ్రతుకలేక బడిపంతులు' అనే సామెత చిన్నప్పటినుంచీ 'ఎరిగియెరిగి' కూడ ఈ 'గంగాభాగీరథీ సమాన డిపార్టుమెంటు'ను వరించడమేమిటి? అక్కడికీ తన తప్పులేకుండా మా ఉపాధ్యాయవర్గమంతా చెపుతూనే ఉండేది: 'పొరబాటునైనా ఈ ఉద్యోగానికి రాకండి నాయనలారా' అని.

అసలు సంగతేమంటే 'ఉపాధ్యాయ వృత్తి యొక్క స్థితిగతుల నభివృద్ధి చేస్తామనీ, విద్యావంతులైన యువకులంతా ఈ వృత్తి స్వీకరించవలసిందనీ' విద్యాశాఖామాత్యుడు అప్పట్లో-ప్రస్తుతపాయనే-చేసిన ఉద్బోధను చూసి నమ్మి ఏమో భ్రవిష్య తలకెత్తుతారనే భ్రమలోపడి ఈ ముండ్లదారిలో అడుగుపెట్టాను.

ఐతే ఇపుడు పెద్దపెద్దలంతా 'మాకూ నీపట్ల సానుభూతి ఉన్న'దని మొసలి కన్నీరు కారుస్తూనే 'నీవుమాత్రం కేవల త్యాగబుద్ధితోనే పని చేయా'లని సెలవిస్తున్నారు. ఐతే తమ గురువని చెప్పుకొనే మహాత్ముడు నిషేధించిన నాలుగంకెల జీతాన్నీ, అంతకుమ మిక్కిలియైన భత్యాన్నీ తీసుకొనే మహనీయులే-వివేకానందుడు చెప్పినట్లు-కాలే కడుపులను గావించే వేదాంతబోధకు అర్థమేమో తెలిసికోలేకుండా ఉన్నాను.

'త్యాగమునకైన నొకహద్దు తగునుగాని
శలభ మట్టుల ఆత్మ నాశనము మేలె?'

అన్న స్వర్గీయులైన కవికోకిల వాక్యాన్ని స్మరిస్తూ, లేనిపోని ఆశలు పెట్టుకోవద్దని ఇప్పటికైనా తెగేసి ఖండితంగా చెప్పిన పెద్దలకు కృతజ్ఞత వెల్లడిస్తూ, త్యాగధనులైన వారినే మరికొంత త్యాగబుద్ధితో - ఉన్న తాసనాలూ, ఉపదేశాలూ, ఉపన్యాసాలూ వదిలి-ఖాళీ కడుపులతో విద్యాదానం చేయడంలోని త్యాగానందాన్ని అనుభవించడానికి ఆహ్వానిస్తూ, 'అన్నరూపమైన' పరబ్రహ్మాన్వేషణకు 'నయా రాస్తా'ను దేనినైన స్వీకరిద్దామా, వద్దా అనే సమస్యలో సతమతమయి పోతున్నాను.

నిజాంపట్టణం చన్నాప్రగడ తిరుపతిరావు

2

నాకు జీవితంలో ఒకటే సమస్యఉన్నది. జీవిత రంగంలో ఎదుర్కొనవలసివచ్చే ప్రతిచిన్న ఆటంకాన్ని నేనొక సమస్యగా పరిగణించను. నాకున్న సమస్య బాహ్యదృష్టికి అతి విచిత్రంగా కనుపించవచ్చు. కాని లోతుగా ఆలోచిస్తే అదే నిజమైన సమస్యగా గ్రహించటం కష్టంగాదు.

నన్నావరించుకున్న సంఘాన్ని నొప్పించకుండా ఆ సంఘంచేత మామూలుగా ధర్మంగా భావించబడే కొన్ని అభిప్రాయాలకు అనుగుణంగా నేను ఎల్లా జీవించటము అనేదే నాకు రోజూ ఉండే సమస్య. సంఘం అంటే నా నిర్వచనం దరిద్రంలో, అజ్ఞానంలో, అంధకారంలో, ధనవంతులైనవారి ప్రభుత్వాలయొక్క ఇనుపపాదాలక్రింద శతాబ్దాలుగా, వంశానుగతంగా అణగారిపోతూ ఉన్న పీడితప్రజానీకం కాదు. సంఘం అంటే, దేశంలో ఆర్థికరాజకీయాధికారాలనే పగ్గాలను హస్తాల్లో ఇరికించుకుని సామాజికరథాన్ని ముళ్ళకంచెల గుండా పతనగర్తాల్లోకి తోలుకుపోతున్న మహాత్ములయొక్క సమూహము. వారి అభిప్రాయాలే సంఘంయొక్క అభిప్రాయాలుగా చలామణీ అవుతున్నాయి. ధర్మానికి వ్యవస్థాపకులు వాళ్ళే. నీతికి శాసనకర్తలు వాళ్ళే. ఈ సంఘంలో నేను జీవించాలంటే (గౌరవంగా) వారి సహాయంతోనే, వారి ప్రాపకంవల్లనే, వారి కరుణారసంవల్లనే జీవించగల్గుతాను. వారి అభిప్రాయాలతో రాజీపడి, వాటినే ప్రచారం చేసినప్పుడు 'తెలివైనవాడు' వృద్ధిలోకొచ్చేవాడు, మంచివాడు' ఇత్యాది పొగడ్తలతో నన్ను సంఘం ఆదరిస్తుంది. ధరించుకునే దుస్తులదగ్గరనుంచి చేసే ప్రతిపనీ వారికిష్టం ఉండేటట్లుగా చేయాలి. నాకిష్టం లేకపోయినా వారి భావాల్ని సమర్థించాలి. నాకిష్టం లేకపోయినా, నాకిష్టంఉన్న వాళ్ళని వాళ్ళయెదుట దూషించాలి. వారి అభిరుచులకి తగినట్లుగా నా వ్రాతలూ (అవి అచ్చుపడాలనుకుంటే), చివరకు నా జీవితమూ మార్చుకోవాలి. ఇది ప్రపంచాన్ని వంచించటమే కాకుండా, ఆత్మవంచనకూడా అవుతుంది. కాని మనంకూడా సంఘంలో ఒక స్థానాన్ని సంపాదించాలంటే ఈ రెండు కళల్లోను ప్రావీణ్యం సంపాదించాలి. గాంధీజీతో అనేకసంవత్సరాలు సహవాసం చేసి, ప్రముఖ ఆంధ్రనాయకుల్లో ఒకడుగా పరిగణింపబడుతూన్న ఒకాయన 'అహింస అంటే ఏమిటో నాకింతవరకు అవగాహన కాలేదు' అన్నాడు. ఆయన జీవితంలో 'అహింస' అనే పదాన్ని కొన్ని లక్షలసార్లయినా వాడివుంటాడు. ఇతరులలో అహింసాతత్వం లోపించిందని అనేకసార్లు పత్రికలలో విలపించి ఉంటాడు. అది వంచనగాక మరేమిటి? కాని ఆయన గొప్పవాడనటంలో, ఏమీ సందేహంలేదు. మాజీ రెవిన్యూ మంత్రిగారు శాసనసభలో 'జమీందారీ బిల్లునుంచి ఈనాములను మినహాయించటం వెనుకంజవేయటంకాదా?' అని ఒక సభ్యుడడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'నిజమైన సత్యాగ్రహికి వెనుకంజ వేయటం అంటూ లేదు' అని గాంధీజీ పరిభాషను తాను తప్పించుకోటానికి ఉపయోగించుకున్నాడు. ఇటువంటివి అనేకం. వీటివల్ల మనకు గోచరిస్తున్న సత్యం ఏమిటంటే వంచన అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగితే తప్పు కాని, వ్యక్తికీ ప్రపంచానికీ మధ్య, వ్యక్తికీ ఆతనిఆత్మకూ మధ్య జరిగేటట్లయితే తప్పుగాదు. దాన్ని సంఘం ఆమోదిస్తుంది. ఆమోదించటమే గాదు. దీవించి గొప్పవాళ్ళనుచేస్తుంది.

నా జీవితంలోఉన్న ప్రధాన సమస్య స్వరూపం వివరించాను. నా జీవితం నేనుజయప్రదంగా సాగించగలనా లేదా అనే ప్రశ్న ఆ సమస్యా పరిష్కార విధానంపైనే ఆధారపడి ఉంది.

ఏలూరు స. వేరయ్యశాస్త్రి

3

నా వయస్సు 20 సం॥ మాత్రమే. మాది చాలా పేదకుటుంబం. ఆర్థికదారిద్ర్యంతో క్రుంగిపోతూన్న మా కుటుంబం నా విద్యాభివృద్ధికి తోడ్పడజాలని దుస్థితిలోఉన్నప్పటికీ, విద్యయందు నాకున్న అభిలాష కొద్దీ ఎన్ని యిబ్బందులు ఎదుర్కొంటూన్నా స్వల్పమాత్రంగానైనా చదువుకోగల్గి, ఆర్థిక కారణాలమూలంగా 3, 4 సంవత్సరములక్రితం చదువుకు స్వస్తిచెప్పి కుటుంబపోషణకై వేరే పనిలో నిమగ్నుడనయ్యాను. నేను రోజూ ఉదయం 7 గం॥ మొదలు సాయంకాలం 5½, 6 గం॥ వరకు పనిచేస్తూనే వుంటా (క్లెరింగ్). కొన్ని రోజుల్లో పనిలేక నిరుద్యోగంగా

ఉండవలసివస్తుందికూడా. మాకుటుంబాన్ని ఎదుర్కొంటున్న ఆర్థికదుస్థితిమూలంగా కుటుంబంలోని వారితోపాటు నేనూ సౌఖ్యమెరుగని దుర్భర జీవితం గడుపుతూన్నాను. నేను తీసుకుంటూన్న ఆహారం శరీరానికి బలాన్ని, దృఢత్వాన్ని యిచ్చేదిగాగాక, ఆకలిమంటలను చల్లార్చడానికి మాత్రమే ఉపయోగపడుతుందంటే అతిశయోక్తిగాదు. శరీరానికి బలాన్ని, దృఢత్వాన్ని చేకూర్చే విలువగల ఆహార పదార్థములు తీసికొన జాలక పోవుటకు కారణం నిత్యమూ వెంటాడుతున్న ఆర్థిక దారిద్ర్యమని వేరుగా చెప్ప నవసరంలేదనుకుంటా! ఇక బట్టలు వగైరా అవసర వస్తువులు మానవునికి కనీసం ఉండవలసినవాటిలో సగం మినహాయించి చూసుకున్నా మిగతా సగంలో సగం కూడా శూన్యం, విజ్ఞానాభివృద్ధి కోసం అభ్యుదయ సాహిత్యాన్ని. పత్రికలను చదవడమంటే నాకెంతో అభిలాష; ఇష్టం కూడాను. కాని పుస్తకాలు, పత్రికలు చదవడానికి కావలసిన విశ్రాంతిలేదు; కొనడానికి డబ్బు లేదు. ఈ రీతిగా నికృష్టజీవితం గడుపుతూన్న నేను, నాలాగే జీవితం గడుపుతూన్న కోట్లాది సోదరప్రజల దుస్థితిని చూస్తూంటే నా హృదయం పరితపిస్తూంటుంది— మానవసమాజాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రజల రక్తమాంసాల్ని జలగల్లాగా పీల్చుతూ రోజుల్ని గంటలుగా, గంటలను నిమిషాలుగా గడుపుతూన్న పరాన్నభుక్కులైన జమిందార్లు, పెట్టుబడిదార్లు, తదితర దోపిడీవర్గాల పీడనయే నా సోదరప్రజలయొక్క, నాయొక్క దుర్భరజీవితానికి మూలకారణమని నేను స్పష్టంగా తెలుసుకున్నా. ఈ దుర్భరజీవితం అంతరించి సౌఖ్యప్రదము, ఆనందదాయకమునైన ప్రశాంతమయ జీవనం చేకూర్చగల పీడనారహితసమాజనిర్మాణం జరగాలని; అందుకై దోపిడీవర్గాన్ని తుదముట్టించేటందుకు ప్రజాస్వామికశక్తులు సాగించే వీరోచిత పోరాటంలో శక్తివంచనలేకుండా నేను కూడా పాల్గొని నాబాధ్యతను నిర్వర్తించవలసి వుందని; అప్పుడే నా బాధామయజీవితం, నన్నెదుర్కొంటున్న దైనికసమస్యలు తొలగిపోయి వికాసజీవితాన్ని చవిచూడ గల్గుతాననే గాఢ నమ్మకం నాలో వున్నది.

కంపలగూడెం గ్రా. శ్రీమన్నారాయణ

4

ప్రతి విషయాన్ని నా దనుకొని నా దానినిగా చేసుకో లేకపోవటం నా లోపమా? ఆ సమస్య లోపమా? పరిస్థితులు కారణమా? ఇదే ప్రస్తుతం ముఖ్య సమస్య.

ఇంట్లో చక్కెర లేకపోతే మా ఆవిడ బదులు తెచ్చి ఆ సంగతి చెబితే, బదులు తెచ్చి త్రాగే దానికన్నా అసలు మానెయ్యటం మంచిదని కాఫీమీద దండయాత్ర చేసి దాని చెడ్డను మనసులో అనుభవించి ఛట్టున రేపటినుంచి మానేద్దామనుకుంటా. కానీ కాఫీవేళకు కడుపులో ఎట్లానో వుంటుంది. అప్పుకాదు కదా, వీలైతే అడుక్కొచ్చినా త్రాగా లనిపిస్తుంది. ఒకటి రెండుసార్లు సాహసించి మానేశానుకూడా-కాని పాడు మనసు మళ్ళీ దానికి లొంగక తప్పలేదు.

కొన్ని సమస్యలు క్షణికంగాపుట్టి- నైమిషం, ఘంటికం, దైనికం, మాసికం, వార్షికం తుదకు జీవితసమస్యగా మారిపోయినాయి. స్థిరంగా నిలిచి పోతున్నాయి. ఆ సమస్యలు ఎప్పుడు పరిష్కరించాలో, ఎలా పరిష్కరించాలో, అసలు పరిష్కరించ వీలవుతాయో లేదో అన్నదే అసలు సమస్య.

ఒకసారి స్టాకు మార్కెటుదార్లను పత్రికల్లో ఏకుదామనుకుంటా. ఎంతో ఉద్రేకంతో కాగితం కలం తెస్తా. వ్రాయపోతా. వెంటనే యేమి వ్రాయాలో, ఎలా ప్రారంభించాలో, అసలు నేనెందుకు రాయాలో తోచదు. ఉక్కిరిబిక్కిరై ఆలోచిస్తా. ఎంతమంది కాంగ్రెసు పెద్దలులేరు! ఎంతమంది నాయకులు, మంత్రులులేరు! వాండ్లకు వ్యతిరేకంగా ఎన్ని నిబంధనలు సృష్టించలేదు! ఎన్ని శిక్షలు ఏర్పాటుచెయ్యలేదు! వాటి ఫలితం యేమైంది! ఇంతమందికి చేతకాంది నేనో అల్పుణ్ణి వ్రాస్తే యేం తీరుతుంది? అసలు నేవ్రాసింది ఎవరైనా వేసుకుంటారా? అనేసమస్య బైలుదేరుతుంది.

ఎంతో మందికి నీతిని బోధించి మంచి మార్గంలోకి త్రిప్పుదా మనుకుంటూ, చెప్పవలసిన పద్ధతి, మాటలు, క్రమము, విషయ నిర్ణయము, వ్యక్తుల ఎన్నిక మొదలైనవన్నీ మనసులో ఏర్పాటు చేసుకుంటా. తీరా బైలుదేరే సరికి ఆలోచనలమీద తెరపడుతుంది. అంతే. ఇలాగే అన్నీ.

చాలా రోజులనుండి నా దైనిక సమస్యలను గురించి పత్రికలకు వ్యాసాలు వ్రాసి పంపిద్దామను కుంటున్నా. అనుకోగా అనుకోగా ప్రయత్నించి కాగితం కలం తీసుకున్నా. దేన్ని గురించి వ్రాయాలనే ప్రశ్నవచ్చింది. జీవిత పుటలు తెరిచా. అన్నీ సమస్యలే. అన్నీ నావే. దేన్ని వదలాలి? దేనికి ప్రథమ స్థానం ఇవ్వాలి? దేనికది గొప్పదే. ముఖ్యమైందే. ఇదే ఇప్పటి సమస్య. ఉప్పు దగ్గరనుంచి పప్పువరకు, నా యింటినుంచి ప్రపంచపు హద్దుల వరకు, నేను మొదలు అన్నీ, అందరూ నాకు సమస్యలే. లేచింది మొదలు నిద్రించేవరకు సమస్యలే. తుదకు నిద్రకూడా ఒక సమస్యగా నిలిచింది.

ఆత్మకూరు జి. వి. సుబ్బరామయ్య

5

మైనారిటీ తీరకముందే సంసారం భరించవలసి రావడంచేత సంగీతంలాంటి అభిమానవిద్యను వదలి గుమాస్తా వుద్యోగంతో ప్రారంభమైనది నా జీవితం. బానిసగా ప్రత్యేక గౌరవమును పొందుతూ వుయికవచ్చు స్వంత అభిప్రాయములను చంపుకొని జీతం డబ్బుల కోసం యజమాని యిష్టానికి దాసుడనయి, కాలక్షేపం చేస్తూవున్నా, హృదయంలో మాత్రం ద్వేషించుకుంటూ బయటపడ్డా చాలా కాలానికి.

స్వేచ్ఛగా స్వతంత్రంగా కాలక్షేపం చేస్తున్నా యిప్పుడు ప్రజలతో కలిసి తిరగడమే నావృత్తి. కులతత్వాలు నా స్వేచ్ఛా జీవితానికి మధ్యమధ్య ఆటంకములు అవుతున్నాయి. అయినా యువకులు ఆ తత్వమును పూర్తిగా జీర్ణించుకోలేదు గనుక మైనారిటీకి చెందిన నేను నిరుత్సాహపడనక్కరలేకపోతోంది. మెజారిటీకి చెందిన యువకులు నాతో సహకరిస్తూ ఉత్సాహపరుస్తున్నారు కూడా. అయితే కులతత్వ ప్రచార కారణమును వూహించ లేకుండా వున్నా.

నా వృత్తివల్ల కుటుంబమును ఒడుదొడుకులు లేకుండా పోషించుకుంటున్నా ఆదాయం కుటుంబ పోషణకు సరిపోతుందా అన్నప్రశ్న లేదు. ఉన్నంతలో సంతుష్టి పడటమే నా అలవాటు. సంపాదించేది నేను ఒక్కడనే అయినా సంసారం పెరుగుతూనే వున్నది. ఒకని యిష్టానికి నా మనస్సును విక్రయించ నగత్యం లేకపోయింది గదా అనే ఆనందం సంసార భారమును మరపిస్తూవుంటుంది. రోజంతా పనిచేయాలనే సంకల్పం నాది. తెలివితేటలున్నా లేకపోయినా కృషిచేత సమాజంలో గౌరవం, సొమ్ము సంపాదించ వచ్చునని నా నమ్మకం. నాకేం దురలవాట్లు లేవు. ఆప్తమిత్రుల ప్రోత్సాహంతో మాత్రం అప్పుడప్పుడు సిగరెట్లు ఉపయోగిస్తున్నా.

జీవించడానికి వెంటనే అనువయిన వృత్తి అవలంబించుటచేత నా అభిమానవిద్య అయిన సంగీతము వదలి వేశానన్నమాట. ప్రభుత్వము, సంపన్నులు తల్చుకుంటే యువకుల ఉత్సాహమునుబట్టి అభిమాన విద్యలను ప్రోత్సహించగలరు గదా! జపాను స్వాతంత్ర్యం పొందిన వెంటనే, సంపన్నులయిన జపానీయులు చురుకయిన యువకులను పై విధంగా ఉత్సాహపరుస్తూ తమతమ సంపదను వినియోగించారని వింటాను. మన దేశస్థులుకూడా తమ బాధ్యతను నిర్వహించగలరని ఆశిస్తాను.

ప్రజోపయోగమయిన ప్రభుత్వ ఆదేశములు ప్రజాసహకారములేకనే ఉల్లంఘించబడుతున్నాయంటాను. జాతీయ వాదులలో సమర్థులయిన ఉన్నత విద్యావంతులు మాత్రం ప్రభుత్వోన్నత పదవులుపొంది మిగతా వారందరూ ప్రజల మధ్య వుండి అవినీతినుంచి తప్పించి వారలను క్రమ పద్ధతిని నడపాలి. వామరుల ఉద్దేశములు పై విధంగా వుండటం నేను యెరుగుదును. అయినా ప్రతివాడూ తనకు ఏ ప్రధాని పదవో రావాలని తాపత్రయ పడటం చూస్తున్నాం. ప్రతి స్వల్పవిషయంలో - ప్రజలలో అన్యోన్యత లేకపోవడం విచారకరం.

నాదేశం స్వతంత్రమయినది. నేను స్వతంత్రుడనైనాను. నాకదే పదివేలు.

ఆకివీడు నందిగామ రామశేషగిరిరావు

క్రిందటివారం యీ శీర్షిక కింద ఉత్తమరచనకు 10 రూపాయిలు బహుమానం పొందినవారు: డా॥ ఎం. వి. రామారావు, టెక్కలి.

ఈ వారం ఉత్తమరచన బహుమతి వచ్చేవారం ప్రకటించబడుతుంది-[సం.]



బాంధవ్యం

గోపాలచక్రవర్తి

వాన కురుస్తూవున్న వొకరాత్రి. పదకొండు గం॥ సమయం. రామ్మూర్తి సిగరెట్ పీలుస్తూ మునిస్వామి కళ్ళకొట్టు చూరుక్రింద నిలబడి వున్నాడు. బాటమీద వర్షపునీళ్ళను చీల్చుకుంటూ చప్పుడుచేస్తూ ఎవరో మనుష్యులు వస్తున్నట్టయింది. అతను తలయెత్తి చూశాడు.

మేనకాదేవీ, ఆమెభర్త రామదాసూ ఏకచ్ఛత్రాధిపత్యం క్రింద వస్తున్నారు. రామ్మూర్తి చటుక్కున సిగరెట్ పారేసి ఆమెకు నమస్కరించాడు. ఆమె గొడుగు భర్తకిచ్చి, తాను దగ్గరకువచ్చి 'దీక్షగా, తీవ్రంగా చదవాలని నాతో చెప్పి యిట్లా నిసిరాతిరి వర్షాదేవి సౌందర్యాన్ని చూస్తూ రోడ్లమీద తిరుగుతున్నావా బాబూ' అని ప్రశ్నించింది. రామ్మూర్తి నవ్వాడు. 'ఈ వేళ డాన్స్ కేమి వెళ్లావులే. మా చేసిన్ గారా ముకుందుగారి' అన్న మేనకాదేవిమాటకి అంగీకార సూచకంగా రామ్మూర్తి తల వూపాడు.

ముగ్గురూ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. వాయుదేవుడూ వరుణదేవుడూ సరసాలాడుతున్నారు. బాట కిరువైపులా వున్న వృక్షమూర్తులు వీళ్ళని చూసి నవ్వుతున్నాయి.

* * *

మేనకాదేవి నగరంలోని కళాశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయిని. ఆమె గణితం అత్యద్భుతంగా చెప్పుతుందనీ, క్లిష్టమైన విషయాలనుకూడ సులభంగా విద్యార్థుల మస్తిష్కంలోకి ప్రవహింపచేట్లుచేస్తుందనీ ప్రతీతి. రామ్మూర్తి ఆమె శిష్యుడు. నాల్గవసంవత్సర విద్యార్థుల్లో ప్రథమ శ్రేణికి చెందిన అతనంటే ఆవిడకు ఎంతో యిష్టం. రామ్మూర్తి సంపెంగపూవువాసన వంటివాడు. ఎక్కడవున్నా యితరులను యిట్టే ఆకర్షిస్తాడు. సునిశితమైన మేధస్సుతో సారస్వతంగూర్చి మాట్లాడేవాడూ. ఇతరులను నవ్విస్తూ తాను నవ్వుతూ కావ్యవిమర్శనల పువ్వులు రువ్వేవాడూ, వాల్మీకి మొదలు వాసిలివెస్కీ వరకూ క్షుణ్ణంగా చదివినవాడూ రామ్మూర్తి. తొలిసారి అతన్ని చూసినప్పుడే ఆవిడ జీనియస్ క్రింద జమకట్టేసింది. ప్రపంచంలోకి వచ్చిన తరువాత పద్దెనిమిది హేమంతాలు మాత్రమే చూసిన రామ్మూర్తి. జీవితంలో ఆమెతో అంత సన్నిహిత బాంధవ్యం ఏర్పడుతుందని ఎప్పుడూ అనుకోలేదు. రామ్మూర్తి కష్టమైన సమస్యలు ఏరి, క్లాసులో ఆవిడ ఎదుట పెట్టి ఎట్లా చెయ్యాలో చెప్పమని అడిగేవాడు. మేనకాదేవి శ్రద్ధగా వివరించి చెప్పేది.

ఒకనాటి సాయంకాలం ఆమెగృహానికి మరలుతున్నది. వింతవింత విహాస్యాలు కదులుచున్న సాయంత్రపుగాలి. గులాబీకాంతుల్ని వెదజిమ్ముతూన్న కరిగిపోయే నీరెండ. ఎడాగ్నీ యోగుడివలె పెద్దఅంగలతో నడక ప్రారంభించి రామ్మూర్తి ఆమెను కలుసుకొని 'ఎస్ట్రానమీ' లో ఏవో సందేహాలున్నాయనీ, చెప్పమని అడిగాడు.

ఆమె అప్రయత్నంగా అతని మొహంలోకి చూసింది. పదేళ్ళక్రితం మరణించిన కొడుకు ఆవి

తను జ్ఞాపకమొచ్చాడు. స్నిగ్ధమై, ధవళమై, సహజకోమలమై ప్రకాశించే అతని వదనాన్ని ఆమె మళ్ళీమళ్ళీ చూసింది. మెరిసే విశాల ఫాల భాగం, నల్లని శిరోజాలూ......అదేపోలిక ఆవిడకు గోచరించింది.

అసలు విషయాన్ని మరచి ఇద్దరూ ఏమిటేమిటో మాట్లాడుకుంటూ మేనకాదేవి యింటిని చేరుకున్నారు. సాయంకాలం వెళ్ళిన రామ్మూర్తి రాత్రి పదిగంటలకు ఆవిడతో భోంచేసి గదిని చేరుకున్నాడు.

ఇట్లా తరువాత నాలుగైదుసార్లు సంభవించింది. రామ్మూర్తి మేథమేటిక్స్ మేనకాదేవితో తిరుగుతున్నాడట్రోయ్ అంటూ మధురమైన కథలు ప్రచారంలోకి రావడానికి అట్టేకాలం పట్టలేదు. ఇంతటితో ఆగిపోతే బాగుణ్ణు. కాని అట్లా సంభవించలేదు.

రోజూ రాత్రి పదిగంటలకు రామ్మూర్తి గది వద్దకువెళ్ళి ఆవిడ పిలిచేది. ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటూ మైళ్ళకొలది దూరం నడిచివెళ్ళేవారు. మిణుగురు పురుగుల్నీ, మిణుకుమిణుకుమనే నక్షత్రాల్నీ, చరగోత్రవిభుని చక్రాని మీసాలవలె వున్న చీకటినీ చూస్తూ కారునల్లని నీడలమధ్య యిద్దరూ కూర్చునేవారు. సారస్వతవిషయాల్లో ఆమె మౌనం వహించేది; అతడు గానం చేసేవాడు. వింతవింత విషయాలూ, ఖగోళవిషయాలూ ఆమె చెప్పేప్పుడు అతను శ్రోత.

సూర్యుడు పూర్వపర్వతమ్మీద ఉదయిస్తూవుంటే ఆవిడ స్నానంచేసి తొందరగా రామ్మూర్తి గదికివెళ్ళి అతన్ని వెంటబెట్టుకొని యింటికి కాఫీకి తీసుకువచ్చేది.

ఊళ్లో కొంత అలజడి బయలుదేరింది. రామ్మూర్తీ, మేనకాదేవి వెళ్తూవుంటే వెనకాలే కొంతమంది వెక్కిరించేవారు. రామదాసు ఒకసారి ఆమెనుపిలిచి అతనితో తిరగడం మానెయ్యమనీ, నలుగురూ నవ్వుతున్నారనీ చెప్పాడు. ఆమె వినలేదు. 'అతన్ని జాగ్రత్తగా పరిశీలించండి. బాబిగాడిలా లేడూ? అదే ముఖం. అవే కళ్లు. ఆనోరూ ఎంతపోలిక! రామ్మూర్తి అంటే నాకే విధమైన మలినమైన ఊహాలూ లేవు. నాకు కొడుకువంటివాడు. మీరుకూడా తక్కినవాళ్ళకు మల్లే అపోహాలుపడితే ఏంలాభం. రామ్మూర్తి మెదడులో యింకా స్త్రీపురుష సంబంధం గూర్చి ఆలోచనలు లేనేలేవు. విపరీతంగా, అనర్గళంగా ఎస్మరాల్డ, ఊర్వశి, సలోమి, శాలోమి అంటూ మాట్లాడ్డంతప్ప యథార్థానికి అతను పసిపిల్లవాడు' అని ఆమె చాల చెప్పేది. ఊళ్లో ఎవరైనా మీ కెంతమంది పిల్లలు అని అడిగితే రామ్మూర్తి తన కొడుకని చెప్పేది మేనకాదేవి.

ప్రిన్సిపాల్ ఒకసారి ఆమెను పిలిచి సలహా యిస్తున్నట్టుగా మాట్లాడి రామ్మూర్తితో ఆవిడ తిరుగుతున్నట్టు తనకు ఆకాశ రామన్న లేఖలు వచ్చాయనీ, కొంచెం జాగ్రత్త వహించాల్సిందనీ చెప్పాడు. ఆవిడ ఆడపులివలె గర్జించి కోపంతో బయటకు వచ్చేసింది. ముప్ఫయ్ అయిదేళ్ళ తనకీ పద్దెనిమిది సంవత్సరాల రామ్మూర్తికీ ఎటువంటి సంబంధం కల్పిస్తున్నారు!

ఆమె బలహీనత ఒకొక్కప్పుడు ఆమెకు తెలిసేది. రామ్మూర్తిని ఒక్కరోజు చూడకపోతే ఎందు కావిధంగా బాధపడాలి? అతనితో రాత్రంతా ఆడుకొని ఏ ఒంటిగంటకో యింటికి రావడమేమిటి? కాని మరునాటి ఉదయాన్నే శరత్కాల మేఘంవలె, తరంగ రహిత క్షీరసాగరం వలె, తెల్లగలువవలె ధౌతదుకూలాలతో రోమను చక్రవర్తిలావున్న అతన్ని చూడ్డంతోటే ఆమెకళ్లు చెమ్మగిలేవి. ఎన్ని జన్మాల బాంధవ్యమో యిది!

* * *

యూనివర్సిటీ పరీక్షలైపోయిన తరువాత ఫలితాలు వచ్చేవరకూ మేనకాదేవికి నిద్రపట్టలేదు. విశ్వవిద్యాలయ ప్రథముడుగా రామ్మూర్తి గణితంలో వస్తాడా, రాడా అనేది ఆవిడ భయం. కాని ఆమె రామ్మూర్తి ఘోరంగా ప్రథమంగానే వచ్చాడు. అతని బంగారు ఆశయాలకు అమృత పయస్సు కురిపించిన మేనకాదేవి హృదయం ఆనందంతో కెవ్వుమని కేకవేసింది. అతని గుండె లోతుల్లోని తియ్యని కలలకు నారుపోసి నీరుపోసిన మేనకాదేవి ఆకాశ చుంబిత భవనంలోకి విసిరివేయబడ్డట్టుగా భావించింది. ఆమె శరీరం నదీ ప్రవాహమై ప్రపంచమనే ఆనకట్టను తెంచుకొని సుడులతో వడిగా, వడివడిగా ముందుకు సాగినట్టనిపించింది.

నూతనరాజ్యాంగంలో న్యాయశాఖ

ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య

18వ శతాబ్దానాటి లిబరల్ సాంప్రదాయమే మొట్టమొదట అమెరికా రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడి, ఇప్పటి రాజ్యాంగాలలో న్యాయశాఖ ఆక్రమిస్తున్న ప్రముఖస్థానానికీ, దాని కార్యకలాప విధానాలకూ కారణభూతం అయింది. భారతదేశ నూతనరాజ్యాంగ నిర్మాతలు కూడ స్థూలంగా దానినే అనుసరించారు. లాక్, మాంటేగ్యూలు ఈ తత్వానికి సిద్ధాంత కర్తలు; దీనికి శాస్త్రసమ్మతంగా అధికార పూర్వకమైన విపులీకరణ హామిల్టన్ 'ఫెడరలిస్టు'లో చేశాడు. సమాజవ్యవస్థను సంరక్షించడానికి ప్రభుత్వానికి కొంత అధికారం ఉండాలి; ప్రభుత్వస్థానాలను ఆక్రమించినవారు ఆ అధికారాన్ని దుర్వినియోగం చెయ్యకుండా కట్టుబాట్లు చెయ్యాలి. ఇది రాజకీయాలలో మహాసమస్య. అలాంటి దుర్వినియోగం జరగకుండా చూడడమే రాజ్యాంగం యొక్క మహాశయమని పద్ధెనిమిదో శతాబ్దంలోనూ, ఆ తరవాతా రాజకీయ శాస్త్రజ్ఞులూ, వారి అనుచరులూ వ్రాస్తూవచ్చేరు. ఆ ఆశయ సాధనకు ఉపకరించే సంస్థలలో న్యాయశాఖ ఒకటి. ఆ న్యాయశాఖ శాసనసభలకూ, కార్యనిర్వాహకవర్గానికీ అతీతమై సంపూర్ణస్వాతంత్ర్యం అనుభవిస్తూ, నిర్భయంగా శాసనసభల వద్దనుండీ, కార్యనిర్వాహక వర్గంనుండీ ఏవిధమైన ఉపకారాన్నీ అపేక్షించకుండా పని చెయ్యకలిగినదై ఉండాలి. నూతన రాజ్యాంగం అలాంటి స్వతంత్ర న్యాయశాఖను ఏర్పాటు చేస్తున్నది.

నూతనరాజ్యాంగం పైఏర్పాటులను అనేక విధాలుగా చేస్తున్నది. (1) దేశంలో సుప్రీంకోర్టు లేకుండా చెయ్యడానికి శాసనసభలకు అధికారంలేదు. ప్రతి రాష్ట్రంలోనూ హైకోర్టులు ఉండాలనికూడా రాజ్యాంగంలో అక్షరాలా లేకపోయినా, అవి ఉంటాయనే ప్రాతిపదికమీదే న్యాయశాఖకు సంబంధించిన ఇతర ఏర్పాటులు జరిగినవి. హైకోర్టులు ఉండాలనే నిబంధన అక్షరాలా లేకపోవడంవల్ల శాసనసభలు ఆర్టికల్ 206 ప్రకారం ఇప్పటి హైకోర్టుల పునర్నిర్మాణం చెయ్యడానికీ, సంస్కరించడానికీ తమకు గల అధికారం ఆధారంగా హైకోర్టులను రద్దు చేయవచ్చును. ఈ లోపాన్ని భర్తీచేసి, ప్రతి రాష్ట్రానికీ ఒక హైకోర్టు ఉండాలని విధించడం అవసరం. (2) రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టులో ఒక ఛీఫ్ జస్టిస్, ఇంకా కనీసం ఏడుగురు జడ్జీలు ఉండాలి; హైకోర్టులలో ఒక ఛీఫ్ జస్టిస్, ఇంకా యూనియన్ అధ్యక్షుడు (రాష్ట్రాల శాసనసభలు) నిర్ణయించినంతమంది జడ్జీలూ ఉంటారు. న్యాయస్థానాలు తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించడానికి దానివల్ల వీలు కలుగుతుంది. (3) సుప్రీంకోర్టు జడ్జీలు 65 ఏళ్ళ వయస్సు వచ్చేదాకానూ, హైకోర్టు జడ్జీలు 60 ఏళ్ళ వయస్సు వచ్చేదాకానూ ఆయా ఉద్యోగాలలో ఉండవచ్చును. హైకోర్టు జడ్జీలు కూడా 65 ఏళ్ళదాకా ఉద్యోగం చేసేటట్లు నిర్ణయించడానికి రాష్ట్రశాసనసభలకు అధికారం ఉన్నది. అసలు ఈ తేడా ఎందుకు ఉండాలో అర్థంకావటం లేదు; అందరు జడ్జీలకూ 65 సంవత్సరాల కాలపరిమితిని నిర్ణయించకపోడానికి కారణం కనపడదు. అలాచేస్తే న్యాయశాఖకు ఇంకా కాస్త స్వాతంత్ర్యం ఉండేది. (4) జడ్జీలుగా నియామకం జరిగిన తరవాత వారి జీతాలలో కాని సెలవులు, పెన్షనులు మొదలైనవాటిలో వారి హక్కులలో కాని తగ్గింపులు జరగకూడదనే మామూలు నిబంధన ఉన్నది. శాసనసభలు

న్యాయశాఖ స్వాతంత్ర్యంలో కలుగచేసుకోకుండా ఈ నిబంధన కాపాడుతుంది. ఈ విషయంలో కూడా చిత్తురాజ్యాంగంలో కొన్ని లోపాలు ఉన్నవి. ఈ విషయం రాజ్యాంగ పరిషత్తులో చర్చకు వచ్చినప్పుడు ఆ లోపాలను సవరించాలి. సుప్రీంకోర్టు విషయంలో యూనియన్ పార్లమెంటున్నూ, హైకోర్టుల విషయంలో ఆయారాష్ట్రాల శాసనసభలున్నూ జడ్జీలకు ఎంత జీతం ఇవ్వాలో, సెలవు, పెన్షను మొదలైన వాటిల్లో ఏమే నిబంధనలు ఉండాలో నిర్ణయిస్తవి. ఆ నిర్ణయం జరిగేదాకా వారికి ఇయ్యవలసిన జీతాలు రాజ్యాంగంలోనే విధించబడి ఉన్నవి. కాని ఇక్కడ ఒక పొరపాటు జరిగింది. సుప్రీం కోర్టు జీతాలను తన ఇష్టంవచ్చినంతగా యూనియన్ పార్లమెంటు ఏర్పాటు చెయ్యవచ్చును. కాని హైకోర్టులలో చీఫ్ జస్టిస్ జీతం నాలుగు వేల రూపాయలకున్నూ, మామూలు జడ్జీల జీతం మూడువేల రూపాయలకున్నూ తగ్గకూడదనే నిబంధన ఉన్నది. అంటే రాష్ట్రశాసనసభలు ఆ జీతాలను హెచ్చించడానికి వీలున్నది కాని తగ్గించడానికి వీలులేదు. సుప్రీంకోర్టు విషయంలో ఈలాటి నిబంధన లేదుకనక రాష్ట్రశాసనసభల న్యాయబుద్ధిలో కంటే, యూనియన్ పార్లమెంటు న్యాయబుద్ధిలో రాజ్యాంగనిర్మాతలకు ఎక్కువ నమ్మకం ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ నమ్మకం ఈ విషయంలోనేకాక న్యాయశాఖకు సంబంధించిన ఇతర విషయాలలో కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఈ విషయాన్ని రాజ్యాంగపరిషత్తు తిరిగి పరిశీలించాలి. (5) దుష్ప్రవర్తన కాని, అసామర్థ్యంకాని కారణంగా, ఏ జడ్జీనైనా తొలగించాలని కేంద్రంలోని రెండు శాసనసభలలోని సభ్యులూ అధ్యక్షునికి విజ్ఞప్తి చేస్తే, దాని ననుసరించి అతడు ఆజడ్జీని ఉద్యోగంలోంచి తొలగించవచ్చును. రాష్ట్రగవర్నరుకు కాని, శాసనసభకు కాని హైకోర్టు జడ్జీలను ఉద్యోగంలోంచి తొలగించడానికి అధికారం లేదని గమనించాలి. ఇది మన రాజ్యాంగంలోని అధికార కేంద్రీకరణానికి ఇంకొక ఉదాహరణ. (6) సుప్రీం కోర్టులో కాని హైకోర్టులో కాని ఏజడ్జీనయినా సరే యూనియన్ అధ్యక్షుడే నియమించాలనే నిబంధన ఈ అధికార కేంద్రీకరణానికి మరియొక ఉదాహరణ. హైకోర్టు జడ్జీలను నియమించేటప్పుడు మాత్రం యూనియన్ అధ్యక్షుడు ఆ రాష్ట్ర గవర్నరుతోనూ, ఆ హైకోర్టు చీఫ్ జస్టిస్‌తోనూ సంప్రదించాలి.

లిబరల్ సాంప్రదాయంలో కార్యనిర్వాహక వర్గం అధికార దుర్వినియోగం చెయ్యకుండా న్యాయశాస్త్ర పరమైన పరిపాలన ముఖ్యమైన ఏర్పాటు. కార్యనిర్వాహకవర్గం, న్యాయశాఖ ఒకదానినుండి మరొకటి వేరుగా ఉండటమే కాకుండా కార్యనిర్వాహకవర్గంలో కాని, ఇతర ఉద్యోగాలలో కాని సభ్యులు తమ విధినిర్వహణలో పొరపాటు చేస్తే, వారికి న్యాయస్థానముల యందు విచారణలో కాని, శిక్షలో కాని ప్రత్యేకావరణ చూపించకూడదని దీని అర్థం. దేశంలో ఉండే ప్రతి పౌరునికివలెనే వారికికూడా న్యాయ చట్టములు వర్తిస్తవి; వారి విచారణకూడా మామూలు న్యాయస్థానాలలోనే జరుగుతుంది. ఇది ఆంగ్లో-శాక్సన్ న్యాయపద్ధతి. మనదేశంలో ఈ పద్ధతిని బ్రిటిష్‌వారు పూర్తిగా అనుసరించ లేదు. క్రిమినల్ న్యాయవిషయంలో కార్యనిర్వాహకవర్గం, న్యాయశాఖ కలిసి ఉన్నవి; ఒకే వ్యక్తి అభియోగాన్ని ప్రతిపాదించేవాడూ, తీర్పు చెప్పేవాడూ కూడా అయి ఉన్నాడు. నూతన రాజ్యాంగంలో ఈ పద్ధతి రద్దు కాకపోయినా, రాజ్యాంగ విధాన సూత్రములలో ప్రతి రాష్ట్రంలోనూ, కార్యనిర్వాహకవర్గం, న్యాయశాఖ వేరుగా ఉండాలనే సూత్రం పొందుపరుపబడి ఉన్నది. ఇది వెంటనే జరిగి తీరాలనే నిర్బంధం కారణంగా అంత త్వరలో ఆచరణలోకివచ్చే అవకాశం లేదు.

ఏదైనా ఒకరకమైన శాసనాలను అమలు జరిపే నిమిత్తం ప్రత్యేక న్యాయస్థానాలనూ, విచారణ సంఘాలనూ నియమించడాన్ని నూతన రాజ్యాంగం నిషేధించలేదు. ప్రభుత్వోద్యోగుల విధి నిర్వహణానికి సంబంధించిన ప్రత్యేక శాసనాలూ, న్యాయస్థానాలూ మన దేశంలోకూడా నెలకొనడానికి అవకాశాలులేకపోలేదు. ఇంగ్లండు, అమెరికా సంయుక్త రాష్ట్రములలోకూడా ఈ సంస్థలు విశేషంగా ప్రబలుతున్నవి. సామాజిక సౌఖ్యాభివృద్ధికో సంప్రభుత్వం ఈ కాలంలో నిర్వహిస్తూన్న కర్తవ్యముల

సందర్భంలో ఇది అవసరమైనది. అటువంటి న్యాయస్థానాలు ఇకపైన మనదేశంలో నెలకొన బోతున్నా, తద్వారా న్యాయస్థానాల దృష్టిలో ప్రభుత్వోద్యోగస్థులకు ప్రత్యేకస్థానం ఉండడం లోనూ వింతలేదు. ఈమధ్య ప్రతిరాష్ట్రంలోనూ ప్రజారక్షణ చట్టాలు ప్యాసయినవి. ఈశాసనాల వల్ల వ్యక్తుల స్వాతంత్ర్యములను నిలబెట్టడానికి న్యాయస్థానాలకు గల హక్కులు సంకుచిత మైనవి. అలాంటి నిర్బంధాలను న్యాయస్థానాలపై ప్రయోగించడం విషయంలో కాని, న్యాయస్థానాలు విచారించవలసిన కేసులు ప్రత్యేక విచారణ సంఘాలకు ట్రాన్స్ఫర్ చెయ్యడం విషయంలో కాని నూతనరాజ్యాంగంలో ఏవిధమైన నిషేధాలూ లేవు.

ఒక్క మంచి విషయం ఏమిటంటే, నూతన రాజ్యాంగంలోని 110, 111 ఆర్టికల్‌ల ప్రకారం సుప్రీంకోర్టుకు హైకోర్టుల తీర్పులమీద అప్పీళ్లను విచారించడానికి అధికారం ఉన్నది; 112 ఆర్టికల్ ప్రకారం సుప్రీంకోర్టు మిగతా ఏ కోర్టులలో జరిగిన తీర్పుపైనయినా లేదా ఏ విచారణ సంఘం తీర్పుపైనయినా అప్పీళ్ళను విచారించవచ్చును. అంటే సుప్రీంకోర్టు అప్పీళ్ళను విచారించే అధికారం మామూలు హైకోర్టులకే కాకుండా, రాష్ట్రశాసనసభలు కాని, యూనియన్ పార్లమెంటుకాని ఏర్పరచే ఏ విచారణ సంఘానికైనా కూడా వర్తిస్తుంది. కాని అలా న్యాయాన్ని నిర్ణయించే సంఘాలను కోర్టు అని కాని, విచారణసంఘం అనికాని పిలవకుండా ఇంకో పేరుతో వ్యవహరిస్తే చిక్కువస్తుంది. పరిపాలనాశాఖలే న్యాయాన్ని నిర్ణయించడానికి ఏకైకఅధికారం సంపాదించే ప్రమాదానికి అవకాశం ఉంది. రాజ్యాంగపరిషత్తు ఈ విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి, చిత్తురాజ్యాంగంలో సువ్యక్తంగాలేని విషయాలను సూటిగా నిర్వచించాలి.

రాజ్యాంగానికి విరుద్ధంగా ఉండే శాసనాలను యూనియన్ పార్లమెంటుకాని, రాష్ట్ర శాసనసభలుకాని ప్యాసుచేస్తే, వాటిని రద్దుపరచడానికి న్యాయశాఖకు మన నూతనరాజ్యాంగం ప్రకారం ఇయ్యబడిన అధికారం లిబరల్ సాంప్రదాయాలను అనుసరించే ఉన్నది. దీనివల్ల దేశంలో ప్రతి పౌరుడూ, తనకు న్యాయసమ్మతంగా సంక్రమించిన స్వాతంత్ర్యములను అనుభవించడానికీ, కేంద్రరాష్ట్రశాసనసభలు ఒకరి హక్కులను ఇంకొకరు చెలాయించకుండా ఉండడానికీ ఏర్పాటు జరుగుతుంది. న్యాయశాస్త్ర విషయాలలోనూ, ఇంకా ప్రజాక్షేమానికి సంబంధించిన ఇతర ముఖ్య విషయాలలోనూ, అధ్యక్షుడు సుప్రీం కోర్టు అభిప్రాయాలను కనుక్కోడానికి ఏర్పాటు ఉన్నది. తీర్పుకోసం తనదగ్గరకు రాని వివాదాలను గురించి, కోర్టు తన అభిప్రాయాన్ని వెల్లడించి తీరాలా? అనే విషయం వివాదగ్రస్తమైనది. అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగంలో అలాంటి ఏర్పాటులేదు. నూతన రాజ్యాంగంలో ఇంకా చిత్రమైన ఏర్పాటులు తాత్కాలిక న్యాయాధికారుల నియామకానికి సంబంధించినవి. 106 ఆర్టికల్ ప్రకారం, సుప్రీం కోర్టులో 'కోరం'కు సరిపోయినందరు జడ్జీలు లేనప్పుడు ఛీఫ్ జస్టిస్ తాత్కాలిక జడ్జీలను నియమించవచ్చును. 107వ ఆర్టికల్ ప్రకారం సుప్రీం కోర్టులో రిటైరయిన జడ్జీని కాని, ప్రస్తుతం ఫెడరల్ కోర్టులో రిటైరయిన జడ్జీని కాని సుప్రీం కోర్టులో తాత్కాలికంగా జడ్జీగా నియమించడానికి ఛీఫ్ జస్టిస్‌కు అధికారం ఉన్నది. ఏయే సమయాలలో ఈ అధికారం చెలాయించవచ్చునో, ఆ ఆర్టికల్‌లో లేదు. సుప్రీం కోర్టులో ఒకే అభిప్రాయానికి చెందిన వారందరినీ జడ్జీలుగా నింపడానికి ఛీఫ్‌జస్టిస్‌కు అవకాశం ఉన్నది. ఈ ఆర్టికల్‌ను రాజ్యాంగ పరిషత్తు తిరిగి పరిశీలించి, తీసెయ్యాలి. రాష్ట్రాల హైకోర్టుల విషయంలో 106 ఆర్టికల్ వంటిది లేదు; 107 ఆర్టికల్ వంటిది ఉన్నది. నిజానికి 106 ఆర్టికల్ కంటె 107 ఆర్టికల్ అపాయకరమైనది. న్యాయశాఖకుసంబంధించిన ఏర్పాటులన్నిటినీ రాజ్యాంగ పరిషత్తు జాగ్రత్తగా పరిశీలించవలసిన ఆవశ్యకత ఉందని దీనినిబట్టి తేలుతుంది.

[ఆంగ్లంనుండి అనువాదం]

'జైను లంతే...'

నంబూరి సుబ్బరాజు

నేను రైలు దిగేసరికి పదకొండు కావచ్చింది. స్టేషన్‌నుంచి ఇంటికి మైలుదూరం వుంది. విపరీత ప్రయాణంవల్ల బడలిక ఎక్కువై, గుడ్డలూ గడ్డం తెగమాసి చిరాగ్గావున్నాయ్. పోలీస్ డాగ్ కుర్రాడి నెత్తినిబెట్టి 'ఘటం' ఇంటికి చేరేశా. ఆకలి దహించుకుపోతోంది. నిన్న ప్రొద్దున్న మద్రాసులో తిన్నతిండి. రాత్రి తెల్లవార్లు మెయిల్‌లో కంచి గరుడి సేవ. కూర్చోవడానికే ఖాళీ లేదు. ప్రొద్దున్న గుడివాడలో మళ్లా సరిచూస్తే టిక్కెట్టు,కాఫీకి ఎన్నివిధాలా చూచినా సరిపోలేదు. ఆఖరు స్టేషన్‌లో ఒక స్నేహితుడు కనిపిస్తే వాడి దగ్గర ఒక సిజర్ సిగరెట్టు సంపాదించి మత్తు వదిలించుకొన్నా. ఆకలి దహించుకు పోతోన్నా స్నానం చేయకుండా రెండు మెతుకులు నోట్లో వేసుకోవడానికి ప్రాణం ఒప్పలేదు. స్నానంచేసి, భోజనంచేసి కుంభకర్ణపాత్ర తీసికొన్నాను... తర్వాత మూడింటికి మెలకువచ్చింది. సేఫ్టీ రేజరు తీసికొని గడ్డం శుభ్రపర్చుకొని, బేసిన్‌లో నీళ్ళు పోసి సబ్బుతో ముఖం శుభ్రంగా కడుక్కొని; పంచె అని కేకవేస్తే 'నహీ' అని జవాబువచ్చింది. ఈ వెధవ సంసారం ఎప్పుడూ ఇలాగే తగులడుతూ వుంటుంది. కొట్టుకు సరిపడి బట్టలున్నా కట్టుకోవడాని కెప్పుడూ గుడ్డకరువే. (మహా ఉన్నట్లు) ఇంటిలో ఆడవాళ్ళ పొబ్బిడి లేకపోతే ఇబ్బందులు ఎక్కువే అని ఎన్నిసార్లు చెప్పినా లక్ష్యమేమున్నానా! గట్టిగా మాట్లాడితే కోపాలు తాపాలు. ఇంకా అయితే మహిళాసభలో తీర్మానాలు అని నోరు నొక్కుకొని...దగ్గరగా వెళ్ళి... పోలీస్ డాగ్‌లో బట్టలు మాసిపోయాయి, బజారు పోవాలి బట్టలు తీసియ్యవూ అన్నాను.

ఆదేమిటండీ! ఇప్పుడు చెప్పారు గదా లేవని. సరిగా చూశావా?

అమ్మ నేచచ్చిపోయినట్టుండీ! చూచే చెప్పాను. బట్టలేమీ లేవు. వేళా కోళం అనా! పోని మీరే చూచుకోండి... అవ లేమధ్య బట్టలేమి తీసికొన్నారు. పాపవేగా!

సరే ... నేచూస్తే ... లేనివి కనిపిస్తాయా! అంటూ పెట్టెదగ్గరకు వెళ్లి చూసేసరికి...పద్దెనిమిదేండ్లనాడు పెండ్లికి అత్తారుపెట్టిన మధుపర్కం కనిపించింది. అసి వాడడం లేదు. మనుమలు కలిగేవరకు జాగ్రత్తగావుంచి వాళ్లకి పొత్తిళ్లలో ఉంచాలని ఇంట్లోవాళ్లు భద్రపరిచారు. అది కాస్తా నేను బయటికి తీశా. ఆ కాలంనాటి ఒక ఉత్తరీయం, లాల్చీ కూడా దొరికాయ్. రక్తం పల్చబడిన తరువాత మనిషి రంగొచ్చినట్లు, ఖద్దరుగుడ్డలు చిరిగిపోయేముందు మాంచి తెలుపు వచ్చి మహా అందంగా ఉంటాయ్ ... ఆలోచించకుండా వెంటనే దుస్తులువేసుకొని, పాతపంచె మడతలో దొరికిన పాతసెంటు ఒళ్లంతా రాసుకొని, కంటికీ, కాలికీ జోడు తగిలించి వంకబెత్తం పుచ్చుకొని, విడిచినచొక్కాలు వెదకడం ప్రారంభిస్తే కాస్త నలిగిన ఒక సిజరు సిగరెట్టు కూడా దొరికింది. అది జేబులోవేసుకొని, క్లబ్‌కు వెడదామా, కాలేజీవేపు వెళదామా? అని, బెత్తం త్రిప్పుకొంటూ గుమ్మం దిగి రెండడుగులు ముందుకు వేసేసరికి 'పూజారి' సుబ్బమ్మ ఎదురుగుండా వచ్చి. ఊళ్లోకేమిటి మాష్టారూ! అని పలకరించింది. ప్రాణం నిలువునా పోయింది. ముందుకు అడుగుపడదు. వెనక్కి వెళ్దామా అంటే చూచినవాళ్లు నవ్వుతారు. ముందుకే తెగబడ్డాను... మీరు వెళుతున్నారు కాబోలు, ఇంటిలో కిరసనాయిలు లేదు మరి. అని మాట వినిపించింది. వెళ్లడంలేదు, ఇప్పుడే వస్తాను అని బయలుదేరాను.

* * *

నశ్వరమైన ఐశ్వర్యాన్ని చూచుకొని త్రుళ్లిపడే మానవుడిలా, ఆశ్వీజమాసపు ఐశ్వర్యగాంభీర్యంతో ముదుగుకాల్వ త్రుళ్ళిపడుతూ నేత్రానందం కలుగ జేస్తోంది. నేనూ సిగరెట్టు పీల్చుకొంటూ, బెత్తం

ఊపుకొంటూ కాల్వవరక చూస్తూ పోతున్నాను. సంధ్యాకాంతులలో, పచ్చని నా శరీరంమీద వున్న తెల్లని ఖద్దరువస్త్రములతో మలయ సమీరుడు దోబూచులాడుతుంటే ఒకచోట నిలబడ్డాను. దారేపోయే ఒక పెద్దమనిషి 'చిల్లరేమైనా ఉంటే ఒకపచ్చనోటుకాని ఇప్పిస్తారా!' అన్నాడు. 'షికారొచ్చేవేళ పెద్ద మొత్తాలు జేబులో వేసికొని రావలసిన పనేముంటుంది' అన్నాను మహోదర్జాగా, విశ్వ ఉపాయల ఉద్యోగం దొరుకుతుందేమో అని అయినవాళ్ళని కానివాళ్ళని ఆశ్రయించిన శ్రీమంతుణ్ణయిన నేను... గొల్లోలో ముల్లు బయలు దేరినట్టు మనస్సులో భావపరంపరలు బయలు దేరాయ్ నోరలు పైకెత్తి ఆలోచనలో దిగినా. ఇంతలో 'గుడ్డీవినింగుసార్' అనే ధ్వని కర్ణ రంధ్రాల్లో పడింది. దృష్టి ధ్వనివైపు త్రిప్పాను. 'కళాశాలలో చదువు కుంటున్నాను. చాలపేద వాణ్ణి. తమబోంట్ల సహాయమువలననే చదువు సాగుతోంది.' అని మౌనంగా ఊరుకొన్నాను.

నాగుండె బరువెక్కింది. నా దుస్తులు నేను బ్రతుకున్న రోజుల నాటివి. కట్టుకోను గుడ్డలేక పాత వాటితో బాధపడుతూవున్న నేను, 'అబ్బాయీ! నీవు కష్టపడి చదువుచున్నావ్-పరమ సంతోషం. మరొకప్పుడు కనబడు' అన్నా మహావిశ్వరణవంతుణ్ణయినట్టు.

నెమ్మదిగా గృహోన్ముఖుడనయ్యాను. 'సాయిబా నైజాం నుంచి వచ్చాం. అడ తురకోళ్లు ఇళ్లు తగలెడుతున్రు. మందిని చంపుతున్రు. కట్టుగుడ్డలతో పారివచ్చినమ్ దొరా! తలాకాస్త సాయం జేస్తుండ్ దొరా!' అన్నాడు. నిజంగా నా మీద నాకే అసహ్యంపుట్టింది... దమ్మిడీ సంపాదన లేదు. కొత్త వైధవ్యాలా ఇంటిలో కూర్చుంటున్నాం ...అలా గట్లోయ్ పాపం...చాల ఇబ్బందే పడుతున్నారు. ఈ వంకతో మోసగాళ్లుకూడా ఎక్కువైపోయారు. అదంతా ఎందుకు—మీ నైజాం లొంగిపోయాడు. ఇకమీరు వెళ్లిపోవచ్చు... అయినాతరువాత కనిపించండి-అన్నాను, ఎంతో హాంగుచేస్తూ. 'కిరసనాయిలు'కు డబ్బులు లేక మొఖంచాటు వేసిన నేను,.. ముందుకు రెండు అడుగులువేశా; 'ఏడువకు తల్లీ! దైవమున్నాడు మన పాల' అని ఆకలి బాధతో ఏడుస్తున్న చంటిదాన్ని జోకొట్టుతూ, 'బాబూ! పసిపాప. ఆకటికి తాళలేక ఏడుస్తున్నది. నేను కూటికిమొకం చూచి మూడు దినాలైంది. బాబా! నీ రెక్కల కష్టం ఒక కాని పడేయ్యి బాబూ' అంటూ కన్నీరు త్రిప్పాను ముసలామె. కడుపులో చెయ్యి పెట్టి కలిపినట్టయింది. వికారంపుట్టి కళ్ళుతిరిగాయ్. డబ్బులెందుకోయ్ ఇంటికిరా, ఒకపూట తినిపోదువు గాని అన్నాను! బీడీలుకొని కాల్చుకోవడానికి డబ్బులు లేక ఖాళీ జేబులతోవున్న నేను.

స్నేహితులంతా నా దుస్తులు చూచి నాకేదో లాటరీలో డబ్బువచ్చిందనో; లేక మా బావ మరదులు విభాగాలై పోయారు గనుక, మా అత్తగారు డబ్బుతో, బంగారంతో వచ్చి, మా యింట్లో వైతాయించిందనో మంతనాలు చేస్తుండే వాళ్ళని ఒదిలించుకొని ఇంటికి చేరా, స్తిమిత పడదామని. గుమ్మంలో అడుగుపెట్టీ పెట్టడంతోనే, 'ఏమండీ! చెప్పేదానికేమిటి ఇంత తొందరగా వచ్చారు. ఇంటిలో కిరసనాయిలు లేదు. దీపం వెలిగించాలి. డబ్బు లిచ్చి వెళ్ళి ఉంటే కుర్రవాణ్ణి పంపి తెప్పించే దాన్ని గదా! ఇవాళ కోటా వచ్చిందిట. సరళ్ళా అయిపోతుందేమో!' అని సణుగుడు ప్రారంభం అయింది. నాకూ చాలా చిరాకే పుట్టింది. అయితే భరిస్తున్నావు గనుక భర్త, భరింపబడుతోంది గనుక భార్య అనేపురాణ వాక్యం జ్ఞాపకంవచ్చి ఒళ్ళు చల్లబడింది. కాస్త తమాయించుకొని - 'ఏం చెయ్యమన్నావ్! డబ్బు కోసం వెళ్లా, సరి సర్దుబాటు కాలేదు.' అన్నాను.

మరకెప్పుడూ సర్దుబాటుకాదు.

ఆమాటా నిజమే.

అయితే ఏలా మరి?

ఏలా ఏమిటి?

దీపంలేకుండా వెలాగవుతుంది, పిల్లలున్న కొంప.

చూద్దాంలే.

నా చేసరికి నూనె ఉండొద్దు - బజారు వస్తువా ఏమన్నావా? కంట్రోలు వస్తువు కూడాను.

అయితే కానియ్యి. 'జైనమతం'.

అంటే?

పెందలకడ రెండు మెతుకులు తిని మూడంకె వేయడమే. 'జైను'లంతే. మరి మాటాడను.

జనవాక్యం

సంపాదకునికి ప్రకటనార్థం పంపించిన లేఖలు యీ శీర్షికక్రింద ప్రచురితమవుతాయి. లేఖలు క్లుప్తంగా, కాగితానికి ఒక పక్క వ్రాసి పంపాలి.

ఆహార సమస్య

'తెలుగు స్వతంత్ర' 11-2-49 తేదీ సంచికలోని సంపాదకీయంలో ఆహార సమస్యనుగూర్చి చర్చిస్తూ, కేంద్ర ప్రభుత్వము యీ సమస్యను రాష్ట్ర ప్రభుత్వములమీద త్రోసివేసి వూరుకోనడం ధర్మం కాదని, ఈ సమస్య నెదుర్కొనుటకు తగిన ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వములతో సమాలోచించి ప్రవేశపెట్టవలెనని వ్రాసియున్నారు.

మన మదరాసు రాజధానిలో, ముఖ్యంగా ఆంధ్రప్రాంతంలో, ఆహారధాన్యముల కొరతకు ముఖ్యకారణం, పూర్వము అనగా, ఓ తేక 5 ఏండ్ల పూర్వమువరకు, విస్తారముగా ధాన్యము పండుచున్న భూములన్నియు పొగాకు మళ్ళుగా పరివర్తన చెందుటయే. ఒక యెకరము మీద, ధాన్యముమీదకన్న, పొగాకువల్ల యెన్నోరెట్లు అధికలాభము మన వ్యవసాయదారులకు వచ్చుచున్నది. కావున మన వ్యవసాయదారులందరు పొగాకు సాగుబడి యెక్కువచేశారు. అందువలన పొగాకు కంపెనీలు యెక్కువైనవి. ధాన్యపుకొరత వచ్చినది.

మదరాసు రాజధానిలో, ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలో, ఈ ఆహారధాన్యములకొరత నెదుర్కొనుటకు మార్గము: ప్రభుత్వము పొగాకు పంటను నిషేధించుచు వుత్తర్వు జారీచేయుట లేక ఎక్కువ పన్నులు విధించి పొగాకు పరిశ్రమను బలహీనపరచి నాశనముచేయుట. ఈ పొగాకు పరిశ్రమ నిర్మూలనము, ప్రజలకు కడుపు నిండ ఆహారము దొరుకునట్లుచేసి, మద్యపాన నిషేధముకన్న లాభకారి యగును.

కాకినాడ — పి. యస్. పంత్

నాస్తికవాదం

'తెలుగు స్వతంత్ర' ఫిబ్రవరి 18 వ తేదీ సంచికలో 'సంఘం' అనే పత్రికపై మీరిచ్చిన అభిప్రాయాన్ని చదివాను. 'సంఘం' నేను చదువకపోయినా సమీక్షలో మీరిచ్చిన ఒక అభిప్రాయం చాలా ఆశ్చర్యాన్ని గొల్పింది.

'ఈ రోజుల్లో నాస్తిక తత్త్వప్రచారం అంటే యింకొక తేడా ప్రవేశపెట్టడమే కావచ్చు. ఇంకొక మతం సృష్టించడమే కావచ్చు' అని మీరనటం చాలా విపరీతంగా వుంది. దైవచింతన, కర్మసిద్ధాంతాలతోటి జనసామాన్యం దేవులాడుతున్న రోజులు కాకపోయినా, తమకు కూడూ గుడ్డా దొరకనిదానికి పై సిద్ధాంతాల నన్వయించుకుని సంతృప్తి పొందుతూవున్న జనం యింకా పెద్ద సంఖ్యలోనే వుంది. కేవలం ఆర్థిక కారణాలున్నంతమాత్రాన ప్రజల్లో రాజకీయ చైతన్యం కలుగదన్న సంగతిని మనం గుర్తించుకోవాలి. ప్రజల్లో వున్న మూఢవిశ్వాసాలు కొందరకు నిర్మూలింపబడాలంటే నాస్తికవాద ప్రచారాని కెంతైనా అవసరముంది. అందులోనూ రాజకీయాలకూ మతాలకూ లంకె యేర్పడి రాజకీయాలు కలగాపులగంగా తయారైన మన దేశంలో మతాచారాల్లో మూఢవిశ్వాసాల తీవ్ర

రమాలని సహనశక్తిని వీడి ఆవేశపరులుగా వున్న ప్రజలెందరితోనో నిండివున్న మనదేశంలో ప్రజల్లో ఐకమత్యాన్ని కూర్చటానికి నాస్తికవాద ప్రచారం చాలావరకు వుపయోగిస్తుంది.

ఏలూరు వల్లభనేని నారాయణరావు

ప్రచురణకు పూర్వమే ధరావతు

దేశంలో ప్రజల విజ్ఞానవికాసాలకు ఒక చక్కని సాధనం పత్రిక.

దాదాపు రెండువందల సంవత్సరాల కాలము విదేశీయపాలనలో మన విజ్ఞానవికాసాలన్నీ అణచి పెట్టబడినవి. స్త్రీల స్థితి మరీ ఘోరపతనము పొందినది.

స్వాతంత్ర్యం వచ్చింది. సముద్ధరింపబడ్డాం. స్త్రీల అభివృద్ధికి ఎన్నో వాగ్దానా లొసగిన కాంగ్రెసువారి పరిపాలన వచ్చింది. ఆశతో, స్త్రీజనాభ్యుదయ వాంఛతో, ఒక మాసపత్రికను ప్రచురింపదలచాను. కృష్ణాజిల్లా కలెక్టరువారికి ఒక డిక్లరేషన్–'మహిళ' అనే పేరుతో పంపించాను. ఏ ప్రజాస్వామ్యవాది, ఏ నాగరికుడు ఊహించజాలని సమాధానం శ్రీ కృష్ణాజిల్లా కలెక్టరువారినుండి వచ్చింది. పత్రికా ప్రచురణకు పూర్వమే వెయ్యిరూపాయిలు ధరావతు చెల్లించాలట.

ఇటీవల శ్రీమాన్ రాజగోపాలాచారి గారు 'మనదేశంలో గల పత్రికాస్వాతంత్ర్యం మరే దేశంలో లే' దన్న సుభాషితానికిదే అర్థం కాబోలు. గద్దెనెక్కేనాడు స్త్రీల అభివృద్ధికి సర్వావకాశాలు కల్పిస్తామన్న కాంగ్రెసువారి వాగ్దానాల నిజస్వరూపమా యిది ?

విజయవాడ మేడికొండ కమల

ఒక పునర్విమర్శ

'తెలుగు స్వతంత్ర' 2 వ సంచికలో 'బృహస్పతి' ఉవాచ అంటూ లక్ష్మి శివరావుగారు చేసిన విమర్శకు 29 వ సంచికలో బృహస్పతిగారు 'ఏక్షేం రాస్తున్నాను ?' అంటూ ప్రశ్నించుకుని కొంత గానుకున్నారు. కాని వారు వ్రాసినది లక్ష్మి శివరావుగారికి సమాధానమే కాని (ఇది



పల్లెపాడు ఆశ్రమనివాసిని శ్రీమతి రెంటాల వెంకట సుబ్బమ్మగారు (కృష్ణమ్మగారి ధర్మపత్ని) ఫిబ్రవరి 13 వ తేదీన పరమపదించారు. ఈమె 192 నుండి ఆశ్రమంతోలూ కు ఖద్దరుశాఖకు అంటిపెట్టుకొని ఉండి, ఖద్దరు ఉద్యమానికి జీవితం కైంకర్యంచేసిన సేవాపరాయణ 19 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు; 1932లో విదేశవస్త్రాలు బహిష్కరించవలసిందని ప్రచారం చేసినందుకు శిక్ష అనుభవించారు పదినాళ్లు పనిచేసి గడించే స్థితిలోలేక, గాంధీజాతీయ స్మారకనిధికి తన సర్వస్వమైన బంగారు కమ్మలజతను జమకట్టవలసిందిగా మరణశయ్యపైనుండి చెప్పిన గాంధీభక్తురాలు.

అచ్చంగా శ్రీమతి ల. శి. రావుగారికి సమాధానం కాదంటారు బృహస్పతి) ఆమె వ్రాసిన దానికి సమాధానం కాదు; విషయానికి సమాధానం యివ్వకుండా ఏదో డొంకతిరుగుడుగా వ్రాసుకపోవటం.

'నేను చిత్త వ్రాస్తున్నప్పుడు, చిత్తమీద దండయాత్ర చేయటం స్వతంత్ర పేజీలను చిత్తంతో ముంచటం కాదా?' అని బృహస్పతిగారు అంటున్నారంటే - ఏమనోప్రవృత్తితో లక్ష్మీశివరావుగారు బృహస్పతి రచనలను చిత్తరచనలన్నారో, ఆ మనోప్రవృత్తి ఏర్పడటానికున్న కారణాలను గురించి బృహస్పతిగారు ఆలోచించలేదనీ, ఆలోచనకు కనీసం ప్రయత్నమూ చేయలేదనీ అనిపిస్తుంది.

ఆలోచనాశక్తిగల గొప్పపాటి తెలుగు రచయితలలో బృహస్పతిగారుకూడా ఒకరు కావటం చేతనూ, వస్తున్న ఉత్తమ శ్రేణి పత్రికల్లో స్వతంత్రకూడా ఒకటి కావటంచేతా, వీరిప్రభావం పాఠకులమీద పడక తప్పదు. ఇలాంటప్పుడు స్వతంత్రంలోని రచనలు కమ్యూనిస్టు మతం వైపుకు పాఠకుల దృష్టిని మళ్ళించేవిగావుంటే-కమ్యూనిజం కూడా ఒక మూఢమతమేనని హేతువాద పూర్వకంగా నిరూపించగలిగిన లక్ష్మీశివరావు లాంటి వారికి ఆగ్రహం కలగటం సైజం! మానవ మనస్తత్వ పరిశీలనకు దృష్టి సారించే ఏ రచయితైనా యీపాటి విషయం గ్రహించకపోడు. అంతేకాక లక్ష్మీ శివరావులాంటి మేధావంతమైన విమర్శకులకు, చాలమంది రచయితలకంటే మంచి రచయితగా పేర్కొన దగిన 'బృహస్పతి'గారి రచనలు చిత్తగా కనిపించటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. 'బృహస్పతి'గారు తానే గొప్ప రచయితను అన్నభావం వదిలిస్తే కినుకవహించవలసిన పనిలేదు. సరిగదా తను తెలుసుకోవలసినది చాలావున్నదనీ, తనకంటే తెలిసినవారు అజ్ఞాతంగావుండే వున్నారనీ తెలిసివుండేది.

'లక్ష్మీ శివరావుగారివంటి వాళ్లు చాలామంది వుంటారు'రని బృహస్పతి ఎలా అనగలిగారో తోచనీయదు. అయితే బృహస్పతిలాంటి రచయితలేనా ఆంధ్రంలో లేరువ? రచయితలంతా బృహస్పతులూ కారు; విమర్శకులంతా లక్ష్మీ శివరావులూ కారు. ఈ నగ్నసత్యాన్ని బృహస్పతి విస్మరించి వుండాలి 'ఆవిడకువే ప్రత్యేక రాజకీయ సిద్ధాంతం మీదా అంతే విశ్వాసం లే' దంటారు బృహస్పతి. అయితే ఆవిడ విశ్వాసమే ఓ ప్రత్యేక రాజకీయ సిద్ధాంతంగా ఎందుకు భావించకూడదు? పొగికేకలతో, ఆర్భాటాలతో తమ రాజకీయ సిద్ధాంతాలను చలామణి చేసుకుంటున్న రాజకీయ మేధావుల సిద్ధాంతాలను విమర్శించేందుకు, ఒక సిద్ధాంతాన్ని ఆమె సృష్టించ నక్కరలేదు. ఆమె విమర్శలోనే కొత్త రాజకీయ సిద్ధాంతం వుద్భవించవచ్చు లేదా ఒక కొత్త సిద్ధాంతాన్ని పురస్కరించుకునే ఆమె విమర్శలు బయలుదేరి వుండవచ్చు. తామా మర్చా రాజకీయాల గోలలో ఆమె రాజకీయ సిద్ధాంతం అజ్ఞాతంగా వుండివుండవచ్చు.

గుడివాడ — యం. యస్. చలం

జాతీయభాష

ఈ నెల 12వ తేదీ 'తెలుగు స్వతంత్ర'లోని 'జనవాక్యం'లో శ్రీ కత్తిరిద అయ్యగారి కృష్ణమూర్తిగారు సంస్కృతమే జాతీయభాష అయితే బాగుంటుందని తెలియపరచారు. కాని ప్రస్తుతం మనదేశంలో సంస్కృతము మాట్లాడేవాడు నూటికీ, కోటికీ ఒక్కడైనా లేడు. ఇలాంటి పరిస్థితులలో సంస్కృతమే జాతీయభాష కావటానికి వుత్తగపాటని నా ఉద్దేశ్యము.

విజయవాడ — ఎస్. కె. మోహన్ బాబు

గాంధీ ఫలములు

గాంధీజీ తన జీవితకాలములో అత్యంత ప్రియమైన ఆహారంగా సేవించిన పదార్థములలో వేరుశనగకాయలు ప్రధానమైనవి. మన ప్రియతమ నాయకులు. జాతిపిత పూజ్యబాపూజీ, సాధారణ నిరుపేద శ్రామికులకు సైతము అందుబాటులో నున్న వేరుశనగకాయలను ఆహారంగా సేవించి, కష్టజీవులకందరికి అవకాశముండినను తా మొక్కరే సౌఖ్యము పొందుట భావ్యముకాదని ఆచరణలో రుజువు చేశారు.

కాన అమరజీవి బాపూజీ స్మారక చిహ్నంగా వేరుశనగకాయలను 'గాంధీఫలములు' అని ఇకనుండి ఆంధ్రప్రజానీకమంతా వాడుకలో పెట్టాలని మా విజ్ఞప్తి.

ఆం. రా. రై. కాం. కార్యవర్గ సభ్యులు,
దరువూరి వీరయ్య

ఆం. రా. అంతర్వర్ణ వివాహసంఘ
ప్రధానకార్యదర్శి, ఉడతా వెంకటేశ్వర్లు

ఎడిటరు. 'కర్షక'-బండ్లమూడి శివరామకృష్ణ

కార్యవర్గసభ్యులు, ఆం. రా. వి. కాం.
కె. వి సుబ్బయ్య